సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 6.50
సంపుటి: 18 సంచిక: 333
సోమవారం 23-2-2026
SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | DELHI | CHENNAI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

దక్షిణాఫ్రికాకు దాసోహం
టి20 ప్రపంచకప్ సూపర్‌–8లో 76 పరుగుల తేడాతో భారత్ ఓటమి
10లో

మురికి రాజకీయాలా?
విపక్ష కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ మండిపాటు
6లో

ఖర్చులకు కళ్లెం వేద్దాం
రిటైర్మెంట్‌కు రెడీనా?
- వెల్త్ పేజీల్లో ▶

ఆరోగ్య బీమాలో బ్రేకింగ్ స్కామ్‌!

పచ్చ పార్టీ సేవలో తరిస్తున్న ఇన్సూరెన్స్ కంపెనీ, బ్రోకింగ్ ఏజెన్సీ

వాటికి వైద్యశాఖలో రూ.4 వేల కోట్ల బీమా కాంట్రాక్టు కట్టబెట్టే పన్నాగం

- టెండరు నిబంధనల్లో మార్పులు.. 'సాల్వెన్సీ' షరతు ఎత్తివేత
- బీమా కంపెనీకి రూ.వేల కోట్లు ప్రీమియం రూపంలో మళ్లింపు
- ఒకే ఏజెన్సీకి వివిధ ప్రభుత్వ శాఖల్లో బీమా అమలు బాధ్యతలు
- కమీషన్ కింద రూ.వందల కోట్లు.. అదంతా పెద్దల జేబుల్లోకి!
- అస్మదీయ బ్రోకింగ్ ఏజెన్సీని అడ్డుపెట్టి ప్రభుత్వ పెద్దల పావులు

సాక్షి, అమరావతి: అక్రమార్జనే ధ్యేయంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఆరోగ్య బీమా అమలులో స్కామ్‌కు రంగం సిద్ధమైంది! ఇప్పటికే ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగార్చిన ప్రభుత్వ పెద్దలు బీమా విధానం పేరిట ఇన్సూరెన్స్ కంపెనీలకు నిధులు మళ్లించి భారీ అవినీతికి తెరతీసినట్లు విమర్శలు వస్తున్నాయి. తాజాగా పచ్చ పార్టీ కార్యకర్తల బీమా సేవలో తరిస్తున్న కంపెనీకే వైద్య శాఖలో రూ.నాలుగు వేల కోట్ల విలువైన ఆరోగ్య బీమా కాంట్రాక్ట్‌ను కట్టబెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల అస్మదీయ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ సంస్థ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని ఇన్సూరెన్స్ కంపెనీకి మళ్లించడం, ప్రీమియంపై

మిగతా 2వ పేజీలో

వీఎస్‌ఆర్ వెనుక హెరిటేజ్‌!

టీడీపీ మౌనంతో అందరిలోనూ మరింతగా అనుమానం

- అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి వెనుక శక్తులపై రోహిత్ పవార్ ఆరోపణలు
- రూ.35 కోట్ల విలువయ్యే విమానానికి రూ.265 కోట్ల ఇన్సూరెన్స్ ఎందుకు చేశారు?
- విమానంలో టాయ్‌లెట్ వెనుక పెట్రోల్ క్యాన్లు ఎందుకు పెట్టారు?
- ట్యాంకులో సామర్థ్యానికి మించి ఎందుకు ఫ్యూయల్ నింపారు?
- ప్రమాదంలో బ్లాక్ బాక్స్ కాలిపోవడమేంటి?ఎంత వరకు నిజం?
- ఏ విచారణ జరక్క ముందే వీఎస్‌ఆర్‌కు టీడీపీకి చెందిన కేంద్ర మంత్రి క్లీన్‌చిట్ ఎలా ఇచ్చారు?
- ఎందుకంటే వీఎస్‌ఆర్ వెంచర్స్ విమానాల కొనుగోలుకు నిధులిచ్చింది హెరిటేజ్ ఫిన్‌లీజ్ కాబట్టే
- హెరిటేజ్ ఫిన్‌లీజ్ అనేది సీఎం చంద్రబాబు కుటుంబ సంస్థ
- వీఎస్‌ఆర్ ద్వారా దుబాయ్‌లో రూ.650 కోట్లతో టీడీపీ కీలక నేత లెగసీ విమానం కొనుగోలు
- ఇదే వీఎస్‌ఆర్ విమానాల్లో సీఎం చంద్రబాబు కుటుంబం చక్కర్లు
- అందుకే కేంద్ర మంత్రి రామ్మోహన్ దర్యాప్తు సాగనివ్వడం లేదన్న రోహిత్
- రోహిత్ వ్యాఖ్యల్లో నిజం ఉండటం వల్లే టీడీపీ, హెరిటేజ్ నోరు విప్పడం లేదంటున్న విశ్లేషకులు

సాక్షి, అమరావతి: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంపై ఎన్సీపీ ఎమ్మెల్యే రోహిత్ పవార్ తెలుగుదేశం పార్టీపై అనేక అనుమానాలను లేవనెత్తి 36 గంటలు దాటినా ఆ పార్టీ నోరు మెదపడం లేదు. వీఎస్‌ఆర్ విమానయాన సంస్థ విమానాల కొనుగోళ్లకు హెరిటేజ్ సంస్థ వందల కోట్ల రూపాయలు నిధులు సమకూర్చిందంటూ సాక్ష్యాధారాలతో చూపించినా.. స్టాక్ మార్కెట్‌లో నమోదైన కంపెనీ అయ్యి ఉండి కూడా ఇంత వరకు స్పందనే లేదు. అజిత్ పవార్ మరణం వెనుక పెద్ద కుట్ర ఉందంటూ రోహిత్ పవార్ చేసిన ఆరోపణలపై జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నా టీడీపీ నేతలు కానీ, హెరిటేజ్ సంస్థ కానీ స్పందించక పోవడంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయని రాజకీయ విశ్లేషకులు

మిగతా 3వ పేజీలో ▶

నేటి గ్రుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గ్రుడ్ల రిటైల్ ధర ₹75	ఫారం దగ్గర లైవ్ బర్డ్	115 కిలో	డ్రెస్సడ్ స్కిన్‌తో	206 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	142 కిలో	స్కిన్ లెస్	234 కిలో

Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. మంగళవారం రెండో ఏడాది విద్యార్థులకు పరీక్షలు మొదలవుతాయి. ఒక్క నిమిషం ఆలస్యమైనా హాల్లోకి అనుమతించేది లేదని బోర్డు స్పష్టం చేసింది.

16లో

భారీ ఉగ్ర కుట్ర భగ్నం

లష్కరే తోయిబాకు చెందిన 8 మంది అనుమానిత ఉగ్రవాదులను ఢిల్లీ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వీరిలో ఏడుగురు బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లోకి చొరబడినట్టు నిర్ధారించారు. ఇద్దరిని కోల్‌కతాలో, ఆరుగురిని తమిళనాడులో పట్టుకున్నారు. వారి నుంచి నకిలీ ఆధార్ కార్డులు, సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులు తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. వీరిని బంగ్లా హ్యాండ్లర్ షబీర్ నడిపిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతనికి లష్కరే చీఫ్ హాఫీజ్‌తో సంబంధాలు ఉన్నట్లు వెల్లడించారు. పాకిస్తాన్ నుంచి షబీర్‌కు నిధులు అందుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

6లో

ఇద్దర్ని బలిగొన్న

'పాల'కూట విషం!

రాజమహేంద్రవరంలో కల్తీ పాల కలకలం

- 8 మందికి అస్వస్థత.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స
- కేసుల సంఖ్య మరింత పెరిగే అవకాశం?.. పోలీసుల అదుపులో పాల వ్యాపారి

మృతురాలు తాడి కృష్ణవేణి(ఫైల్)

3లో



దేవ్‌జీ



మల్లా రాజిరెడ్డి

లొంగిపోయిన దేవ్‌జీ!

మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత ఆ పార్టీకి నాయకత్వం వహిస్తున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ అజ్ఞాతం వీడారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన తెలంగాణలోని కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్ఐబీ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆయనతో పాటు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ సహా 16 మంది సహచరులు లొంగిపోయినట్లు తెలిసింది. దేవ్‌జీ, సంగ్రామ్ లొంగిపోయినట్లు తమకు సమాచారం ఉందని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం ప్రకటించగా.. తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులు ధ్రువీకరించలేదు.

2లో

ఎక్స్ఛేంజ్ ఆఫర్ ₹2 500*
గవర్నమెంట్/ కార్పొరేట్ ఆఫర్స్ ₹3 200*
ఎక్స్-షోరూం ధర ₹78 141*
INDIA'S FIRST 5 YEAR WARRANTY *Conditions apply
Hero GoodLife 24 క్యారట్ గోల్డ్ కాయిన్ గెలిచే అవకాశం మరియు ఎన్నో గ్యారంటీ బెనిఫిట్స్ పొందండి#
Hero MotoCorp Ltd. Regd. Office: The Grand Plaza, Plot No.2, Nelson Mandela Road, Vasant Kunj Phase - II, New Delhi - 110070, India. | CIN: L35911DL1984PLC017354 | For further information, contact your nearest Hero MotoCorp authorised outlet or visit us on www.HeroMotoCorp.com. Accessories and features shown may not be a part of standard fitment. Always wear a helmet while riding a two-wheeler. $As per internal benchmarking of 125 cc scooters in India under standard conditions and may vary as per road & riding conditions. World's largest Two-wheeler manufacturer with the highest Two-wheeler unit sales by a single corporate entity globally, for the past 25 years. Data Source: SIAM Certificate. ##As per internal benchmarking of 125cc scooters in India under standard conditions. Actual mileage may vary based on road and riding conditions. #Benefits include Gold Coin/Silver Coin/ OTT Membership. Limited period offer. *Ex-showroom prices are applicable in AP. *T&C apply.
TOLL FREE 1800 266 0018
Authorised Dealers: Guntur: Associated Hero, Ph: 9289922516, Annapurna Motors, Ph: 9289233814, Narasaraopet: Lotus Motor World, Ph: 9289233907, Associate Dealer: Tenali: Ph: 07949293344, Bapatla: Ph: 7273836666, Ponnur: Ph: 07949294496, Sattenapalli: Ph: 07949294498, Cherukupalli: Ph: 07949293345, Also Available At: Vinukonda: Ph: 07949294509, Mangalagiri: Ph: 07949294513, Piduguralla: Ph: 9885988625, Repalle: Ph: 9515320031, Dachepalli: Ph: 9666406417, Santhamaguluru: Ph: 9573115012, Karempudi: Ph: 9440103681, Phirangipuram: Ph: 9705070555, Krosur: Ph: 8985621002, Thullur: Ph: 9666245777, Epuru: Ph: 9133834060.
RS/Hero/02/26

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 2125 9899

క్లుప్తంగా...

టీడీపీ కార్యాలయ భూమి పూజకు అధికారులు

భూమి పూజలో పాల్గొన్న మంత్రులు అనగాని, పార్థసారథికి బొకేలు అందిస్తున్న ఆర్డీఓ గ్లోరియా, తహసీల్దార్ సలీమా

సాక్షి ప్రతినిధి, బాపట్ల : చంద్రబాబు పాలనలో అధికారుల తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. అధికార పార్టీ నేతల ప్రాపకం కోసం వారు నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. ఆదివారం అధికార పార్టీ నేతలు బాపట్లలో టీడీపీ కార్యాలయం నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఇది పూర్తి పార్టీ కార్యక్రమం. దీనికి మంత్రులు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్‌తో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు, పలువురు నేతలు హాజరయ్యారు. అయితే, బాపట్ల ఆర్డీఓ గ్లోరియా, తహసీల్దారు సలీమాతోపాటు గృహనిర్మాణ, ఇతర శాఖలకు చెందిన కొందరు అధికారులు సైతం ఈ కార్యక్రమానికి హాజరుకావడం తీవ్ర విమర్శలకు దారితీసింది. పైగా మంత్రులతో కలిసి అధికారులు ఫొటోలకు ఫోజులిచ్చి వాటిని జిల్లా అధికారుల గ్రూపులో పోస్టుచేయడం చర్చనీయాంశంగా మారింది.

రిటైర్మెంట్ వరకూ సస్పెన్షన్‌లోనే పీవీ సునీల్‌కుమార్
దళిత ఐపీఎస్ అధికారిపై కూటమి ప్రభుత్వ కక్షసాధింపు

సాక్షి, అమరావతి: సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌ను రిటైర్మెంట్ వరకు సస్పెన్షన్‌లోనే ఉంచాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. దళిత వర్గానికి చెందిన డీజీస్థాయి అధికారిపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలను నిస్సిగ్గుగా బయటపెట్టుకుంది. ఆయనపై ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసులు ముగిసేవరకూ లేదా ఆయన రిటైర్మెంట్ తేదీ అంటే ఈ ఏడాది జూన్ 30 వరకు సస్పెన్షన్‌ను పొడిగించింది. చంద్రబాబు ప్రభుత్వం 2024 జూన్‌లో అధికారంలోకి రాగానే సునీల్‌కుమార్‌కు పోస్టింగు ఇవ్వకుండా వెయిటింగ్‌లో పెట్టింది. అనంతరం 2025 మార్చి 2న సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. అప్పటినుంచి ఆ సస్పెన్షన్‌ను పొడిగిస్తూ.. ఇక రిటైర్మెంట్ వరకూ పీవీ సునీల్‌కుమార్ సస్పెన్షన్‌లోనే ఉంటారని స్పష్టం చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

లొంగిపోయిన దేవ్‌జీ

రాజిరెడ్డి సహా 16 మందితో కలిసి ఆయుధాలు వీడిన మావో అగ్రనేత

- తెలంగాణలోని కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్ఐబీ పోలీసుల ఎదుట లొంగుబాటు
- దీనిపై తమకు సమాచారం ఉందన్న ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం
- అయితే ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించని తెలంగాణ పోలీసులు
- కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ లక్ష్యం ఇక నెరవేరినట్లేనని చర్చ



రాజిరెడ్డి (ఫైల్)

కోరుట్ల/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీ అగ్రనేత, నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత ఆ పార్టీకి నాయకత్వం వహిస్తున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ ఎట్టకేలకు అజ్ఞాతం వీడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన తెలంగాణలోని కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్ఐబీ పోలీసుల ఎదుట లొంగిపోయారని విశ్వసనీయంగా తెలిసింది. ఆయనతోపాటు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్‌సంగ్రామ్ సహా 16 మంది సహచరులు లొంగిపోయినట్టు సమాచారం. ఇదే విషయాన్ని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం, ఆ రాష్ట్ర హోం మంత్రి విజయ్‌శర్మ ఆదివారం రాయ్‌పూర్‌లో మీడియా సమావేశంలో వెల్లడించారు. దేవ్‌జీ, సంగ్రామ్ లొంగిపోయినట్లు తమకు సమాచారం ఉందన్నారు. అయితే ఈ విషయంపై తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు అధికారికంగా వెల్లడించలేదు. కాగా, దేవ్‌జీ లొంగుబాటు వార్తల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న ఆపరేషన్ కగార్–2 లక్ష్యం ఇక నెరవేరినట్లేనన్న చర్చ నడుస్తోంది. తిప్పిరి తిరుపతి స్వస్థలం తెలంగాణలోని జగిత్యాల జిల్లా కోరుట్ల కాగా, రాజిరెడ్డి పెద్దపల్లి జిల్లాలోని మంథనికి చెందినవారు.

మా ప్రభుత్వానికి భారీ విజయం: ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం

'కేంద్ర హోంమంత్రి అమిత్ షా అనుసరించిన రణనీతి, ఛత్తీస్‌గఢ్ సీఎం అవలంబించిన విధానాల కారణంగా మావోయిస్టు పార్టీ మనుగడ అంతిమ దశకు చేరుకుంది. దేవ్‌జీ, సంగ్రామ్‌లు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని గడ్చిరోలి, అబూజ్‌మడ్ అడవుల్లో అనేక ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఇద్దరు అగ్రనేతల లొంగుబాటు మా ప్రభుత్వానికి భారీ విజయం. కానీ వారిద్దరి కంటే మరో సీనియర్ నేత (ముప్పాళ్ల లక్ష్మణరావు) ఇంకా అజ్ఞాతంలో ఉన్నారు. అయితే ఆయన వయోభారంతో ఉన్నారు. ఆయన ఎక్కడ ఉన్నారనే అంశంపై మాకు స్పష్టత లేదు. అగ్ర నాయకత్వంలో మరో నేత (మిసిర్ బెస్రా) జార్ఖండ్‌లో ఉన్నారు. అజ్ఞాతంలో ఉన్న ఇంకొందరు సాయుధ మావోయిస్టుల విషయంలో ఎలా ముందుకెళ్లాలనే అంశంపై చర్చ జరుగుతోంది. ఇప్పటికే కర్రెగుట్టల్లో భద్రతా దళాలు పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఈ ఆపరేషన్‌తో మాకు సత్ఫలితాలు వస్తున్నాయి. కర్రెగుట్టల్లో మావోయిస్టులు అమర్చిన 89 ఐఈడీలను నిర్వీర్యం చేశాం. మారిన పరిస్థితులను గుర్తించి మిగిలిన వారు కూడా లొంగిపోతే మంచిది. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే నెల 31 నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తాం'అని ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్‌శర్మ చెప్పారు.

స్వీట్లు పంచుతున్న తిప్పిరి తిరుపతి తమ్ముడు గంగాధర్, ఆయన కూతురు సుమ

మా కల నిజమైంది
తిరుపతి సోదరుడి కుమార్తె సుమ

తిరుపతి లొంగుబాటు వార్త తెలియగానే ఆయన సోదరుడు గంగాధర్, ఆయన కుమార్తె సుమ, ఇతర బంధువులు స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. 'పెద్దనాన్న లొంగిపోవాలని ఎన్నో లేఖలు రాశాను. మా ఆవేదనను పెద్దనాన్న అర్థం చేసుకున్నారు. ఏళ్ల తరబడి అడవుల్లో ఉండి అణగారిన వర్గాల అభ్యున్నతికి పనిచేసిన ఆయన.. మా కోసం ఉద్యమాన్ని వీడి లొంగిపోయి వస్తున్నారన్న విషయం తెలియడంతో మా కల నిజమైందని సంబరపడుతున్నాం'అని సుమ చెప్పారు. అలాగే తిరుపతితో కలిసి కోరుట్ల జూనియర్ కళాశాలలో చదువుకున్న బక్కయ్య సైతం హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థి దశ నుంచి విప్లవంలోకి..

పదో తరగతిలో ఉన్నప్పుడే రాడికల్ విద్యార్థి సంఘం వైపు ఆకర్షితుడైన తిరుపతి

పోలీసు నిఘా పెరగడంతో అజ్ఞాతంలోకి.. ఉద్యమంలోనే సహచరితో పెళ్లి

కోరుట్లలోని తిప్పిరి తిరుపతి పాత ఇల్లు

కోరుట్ల: అణచివేతకు ఎదురొడ్డి.. భూస్వాముల దమనకాండను నిలదీసి.. అణగారిన వర్గాల్లో విప్లవ జ్వాలలు రగిలించిన తిప్పిరి తిరుపతి అలియాసదేవ్‌జీ రాడికల్ విద్యార్థి సంఘం నాయకుడి నుంచి మావో అగ్రనేతగా ఎదిగారు. కోరుట్లలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తిరుపతి ఈ ప్రాంతంలో సామాన్య ప్రజానీకం భూస్వాముల అణచివేతపై చిన్నప్పటి నుంచే తిరుగుబావుటా ఎగురవేశారు. 1981లో పదో తరగతి నుంచే ఆయన రాడికల్ విద్యార్థి సంఘం వైపు ఆకర్షితులయ్యారు. ఆర్ఎస్‌యూ క్రియాశీల సభ్యుడిగా పనిచేశారు. కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివే సమయంలో విద్యార్థుల్లో విప్లవ భావాలను నూరిపోయడంలో కీలకపాత్ర పోషించారు. ఆ సమయంలో ఏబీవీపీ, ఆర్ఎస్‌యూ విద్యార్థి సంఘాల మధ్య గొడవలు, దాడులు తీవ్రమయ్యాయి. పోలీసులు రాడికల్ విద్యార్థి సంఘం నాయకులపై నిఘా పెంచారు. ఇంటర్ పాసైన తిరుపతి 1983–84 సమయంలో కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాలలో డిగ్రీలో చేరారు. అక్కడ ఆర్ఎస్‌యూ కార్యకలాపాల విస్తరణకు ప్రయత్నిస్తున్న క్రమంలో పోలీసుల నిఘా పెరగడంతో 1984 చివర్లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

ఉద్యమ సహచరితో పెళ్లి..

తిప్పిరి తిరుపతి సహచరి సృజన (ఫైల్)

డిగ్రీ చదువుతున్న సమయంలో అజ్ఞాతంలోకి వెళ్లిన తిరుపతి కుటుంబంలో పెద్దవారు. తమ్ముడు వెంకటి చనిపోగా చిన్నతమ్ముడు గంగాధర్ కోరుట్లలోనే ఉన్నారు. ఆ సమయంలో కోరుట్ల అంబేడ్కర్‌నగర్‌లో చిన్నప్పుడే పెళ్లి చేసే సంప్రదాయం ఉండటంతో తిరుపతి తమ్ముళ్లకు చిన్ననాడే వివాహాలు అయ్యాయి. కానీ విప్లవబాట పట్టిన తిరుపతికి మాత్రం పెళ్లి కాలేదు. అజ్ఞాతంలోకి వెళ్లాక మహారాష్ట్రలో మావో ఉద్యమానికి ఊపిరిపోసే పనిలో నిమగ్నమైన క్రమంలో అదే ప్రాంతానికి చెందిన దళ కమాండర్ సృజనను ఆయన వివాహం చేసుకున్నారు. సృజన 2019లో గడ్చిరోలిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు.

గిరాయిపల్లి ఒగ్గు కథ పాత్రధారి..

వరంగల్‌లోని నాటి రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీ (ప్రస్తుత ఎన్ఐటీ)కి చెందిన నలుగురు విద్యార్థులు 1975లో సాయుధ రైతాంగ పోరాట నిర్మాణంలో పాలుపంచుకున్న క్రమంలో మెదక్ జిల్లా గిరాయిపల్లి వద్ద పోలీసులు వారిని చిత్రహింసలకు గురిచేసి చంపేశారు. ఈ ఘటనపై గద్దర్ రచించి పాడిన మల్లన్న, బీరప్ప, కొమురన్న ఒగ్గు కథ ప్రచారంలో తిరుపతి చురుకుగా పాల్గొన్నారు. 1982–83లో గిరాయిపల్లి ఒగ్గుకథను కోరుట్ల జూనియర్ కళాశాల మైదానంలో ప్రదర్శించగా ఒగ్గు కథలో బీరప్ప పాత్రను తిరుపతి పోషించారు. ఈ కథ వినేందుకు కోరుట్లవాసులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఆ సమయంలో పల్లెల్లో విప్లవ భావాలను రగిలించడంలో గిరాయిపల్లి ఒగ్గు కథకు కీలకపాత్ర పోషించింది. ఈ సభ అనంతరం నుంచి తిరుపతిపై పోలీసుల నిర్బంధం పెరిగింది.

ఒకే ఒక్క ఫొటో...

తిరుపతి అజ్ఞాతంలోకి వెళ్లే ముందే తన ఆనవాళ్లు దొరకకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. ఇంట్లోని ఫొటోలు, కోరుట్ల జూనియర్ కళాశాల, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలోని ఫొటోలు ఎవరికీ చిక్కకుండా చేశారు. ఆయన అజ్ఞాతంలోకి వెళ్లినప్పటి నుంచి పోలీసులకు ఫొటోలు దొరకలేదు. దీంతో ఆయన ఆనవాళ్లు తెలుసుకోవడం కష్టంగా మారింది. మావోయిస్టుగా వివిధ హోదాల్లో కొనసాగిన సమయంలోనూ ఆయన ఫొటోలేవీ బయటకు రాలేదు. 1995లో దండకారణ్యంలో జరిగిన ఓ ప్లీనరీ సమావేశానికి హాజరైనప్పుడు ఒకరు తీసిన ఓ ఫొటోనే పోలీసులకు దొరికింది. ఇప్పటికీ ఆయన ఆనవాళ్ల కోసం ఆ ఫొటోనే అందుబాటులో ఉంది.

ఆరోగ్య బీమాలో బ్రేకింగ్ స్కామ్!

మొదటి పేజీ తరువాయి

భారీ మొత్తంలో కమీషన్ బ్రోకర్ ఏజెన్సీకి చెల్లించడం, ఏజెన్సీ నుంచి పెద్దలకు ముడుపులు చేరవేసేలా పావులు కదుపుతున్నారు. ఈ దోపిడీ పరంపరతో భారీ కుంభకోణానికి తెర తీసినట్లు విశ్వసనీయ సమాచారం.

అంతటా అస్మదీయ బ్రోకర్ ఏజెన్సీ..

ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల హెల్త్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా అమలులో ప్రభుత్వ పెద్దల అస్మదీయ బ్రోకర్ సంస్థ చక్రం తిప్పుతోంది. పచ్చ పార్టీ కార్యకర్తలకు బీమా సేవలు అందించే ఇన్సూరెన్స్ కంపెనీ, పార్టీకి మధ్య ఓ సంస్థ బ్రోకింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. ఈ సంస్థ గతేడాది కోటి మంది కార్యకర్తలకు రూ.5 లక్షల చొప్పున ప్రమాద బీమా కోసం తక్కువ మొత్తం ప్రీమియం చెల్లించేలా ఓ ఇన్సూరెన్స్ కంపెనీతో ఒప్పందం కుదిర్చింది. ప్రస్తుతం ఆ బ్రోకర్ ఏజెన్సీ ద్వారానే వివిధ శాఖల్లో బీమా అమలు స్కామ్‌ను ప్రభుత్వ పెద్దలు అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతేడాది విద్యుత్ శాఖలో ట్రాన్స్‌కో ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ అమలు కోసం ప్రభుత్వం టెండర్లు పిలిచింది. రూ.100 కోట్ల విలువైన ఈ టెండర్‌ను తొలుత పచ్చ పార్టీ సేవలో తరిస్తున్న ఇన్సూరెన్స్ కంపెనీ, బ్రోకర్ ఏజెన్సీకి కట్టబెట్టే ప్రయత్నం చేశారు. అయితే సాల్వెన్సీ నిబంధన, ప్రమాణాల కారణంగా ఆ బిడ్లు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో కోరినంత కమీషన్ ఇచ్చేలా డీల్ కుదుర్చుకుని మరో ఇన్సూరెన్స్ కంపెనీకి అడ్డదారుల్లో కాంట్రాక్టు ముట్టజెప్పారు. కాంట్రాక్టు దక్కించుకున్న బీమా సంస్థ నుంచి కమీషన్‌లు వసూలు చేసేందుకు టెండర్ల సమయంలో తిరస్కరణకు గురైన అస్మదీయ బ్రోకర్ ఏజెన్సీని మళ్లీ రంగంలోకి దించారు. ఇన్సూరెన్స్ సంస్థకు, ఉద్యోగులకు మధ్య సమన్వయం కోసం టెండర్ల దశలో అనర్హతకు గురైన ఏజెన్సీని నియమించారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని బీమా నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు ఇప్పటికే అస్మదీయ ఏజెన్సీకి విజయవాడలోని థర్మల్ పవర్ స్టేషన్ ప్రమాద బీమాలో 15 శాతం వాటాను నామినేషన్ ప్రాతిపదికన ఇచ్చేశారు. 2024–25, 2025–26లో ఇదే ప్రాతిపదికన ఎంపిక చేశారు. భవిష్యత్‌లో ఇబ్బందులు వస్తాయనే భయంతో విజయవాడతో పాటు మరో థర్మల్ పవర్ స్టేషన్‌కు 2026–27లో బ్రోకింగ్ ఏజెన్సీల ఎంపికకు టెయిలర్ మేడ్ నిబంధనలతో ఇటీవల టెండర్ పిలిచారు. ఇలా ప్రభుత్వ శాఖల్లో బీమా కార్యకలాపాలన్నింటిలో బ్రోకర్ ఏజెన్సీ ద్వారా దోపిడీకి పాల్పడుతున్నారు.



statutory auditor certificates, audited financial statements reflecting solvency margins or board approved under taking confirming compliance with IRDAI solvency regulations.)
3. Solvency requirements will be exempted if relevant orders/circulars of IRDAI or Government of India are submitted.

పచ్చ పార్టీ బీమా సేవలో తరిస్తున్న కంపెనీకి మేలు చేసేందుకు వైద్యశాఖ బీమా టెండర్‌లో సాల్వెన్సీ నిబంధనకు మినహాయింపు

సాల్వెన్సీ నిబంధన ఎత్తివేత

వైద్య శాఖలో బీమా టెండర్‌ను ఎలాగైనా సరే పచ్చ పార్టీకి బీమా అందిస్తున్న ప్రైవేట్ కంపెనీకే కట్టబెట్టాలనే లక్ష్యంతో టెండర్ నిబంధనల్లో మార్పులు తెచ్చినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో అస్మదీయ బ్రోకర్ ఏజెన్సీ కీలక పాత్ర పోషిస్తోంది. పచ్చ పార్టీకి బీమా సేవలు అందిస్తున్న సంస్థ సాల్వెన్సీ నిబంధనతో ట్రాన్స్‌కో టెండర్‌లో వైదొలగింది. దీంతో వైద్య శాఖ బీమా టెండర్‌లో ప్రీ బిడ్ అనంతరం సాల్వెన్సీ షరతులో మెలిక పెట్టారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు సమర్పిస్తే సాల్వెన్సీ నుంచి మినహాయింపు ఇస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.42 కోట్ల మంది పేద, మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య సంరక్షణతో చెలగాటమాడుతూ రూ.వేల కోట్ల విలువైన కాంట్రాక్టు విషయంలో సాల్వెన్సీ నిబంధన నుంచి మినహాయింపు ఇస్తామని పేర్కొనడం విస్మయం కలిగిస్తోంది. ప్రభుత్వం తీరుపై పలు ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలు సైతం అభ్యంతరం తెలపడం గమనార్హం. భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ నిబంధనల ప్రకారం ప్రతి బీమా సంస్థ కనీసం 150 శాతం సాల్వెన్సీ రేషియోను నిరంతరం కొనసాగించాలి. ఉదాహరణకు ఒక సంస్థ చెల్లించాల్సిన క్లెయిమ్‌ల విలువ రూ.100 అనుకుంటే.. ఆ సంస్థ వద్ద కనీసం రూ.150 విలువైన ఆస్తులు సిద్ధంగా ఉండాలి. అయితే ప్రభుత్వ పెద్దలు ఎంపిక చేసుకున్న బీమా సంస్థ సాల్వెన్సీ రేషియో లోటులో ఉండటం గమనార్హం. దీంతో వ్యూహాత్మకంగా వ్యవహరించి టెండర్ నిబంధనల్లో మార్పులు చేసినట్లు స్పష్టమవుతోంది.

'లడ్డూ'పై బాబు సర్కారు ఏకసభ్య కమిటీ.. నేడు 'సుప్రీం'లో విచారణ

- ప్రతివాదిగా సీఎం చంద్రబాబు
- ఏకసభ్య కమిటీ నియామకాన్ని సవాల్ చేస్తూ కేంద్ర మాజీ మంత్రి సుబ్రహ్మణ్య స్వామి 'పిల్'



సాక్షి, న్యూఢిల్లీ: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలిసిందంటూ సీఎం హోదాలో చంద్రబాబు రాజకీయ దురుద్దేశాలతో నిరాధార ఆరోపణలు చేయడం... దీనిపై స్వయంగా సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఏర్పాటైన సీబీఐ సిట్ ఇచ్చిన నివేదికను పక్కనపెట్టి, సొంత విచారణకు చంద్రబాబు ఏకసభ్య కమిటీని నియమించటాన్ని సవాల్ చేస్తూ బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సుబ్రహ్మణ్యస్వామి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) సోమవారం సర్వోన్నత న్యాయస్థానంలో విచారణకు రానుంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తి జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించనుంది.

సీఎం అబద్ధాలు ప్రచారం చేశారు

రాజకీయ దురుద్దేశాలతో ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేకుండా సీఎం చంద్రబాబు అబద్ధాలు ప్రచారం చేశారని, భక్తుల మనోభావాలను దెబ్బ తీశారని తన పిటిషన్‌లో సుబ్రహ్మణ్య స్వామి తీవ్రంగా ఆక్షేపించారు. దీనిపై రాజకీయ కుట్రలు, వాస్తవాలను వెలికి తీసేందుకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ లేదా స్వతంత్ర నిపుణుల కమిటీతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని అభ్యర్థించారు.

స్వయంగా 'సుప్రీం' పర్యవేక్షిస్తున్నా ఏకసభ్య కమిటీనా..?

లడ్డూ ప్రసాదం విషయంలో నిగ్గు తేల్చేందుకు స్వయంగా సుప్రీంకోర్టు ఇప్పటికే జోక్యం చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో సీబీఐ సిట్ విచారణ కొనసాగుతుండగా.. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రిటైర్డ్ ఐఏఎస్ దినేష్ కుమార్‌తో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయడం పట్ల సుబ్రహ్మణ్యస్వామి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమేనని, న్యాయ ప్రక్రియను పక్కదోవ పట్టించే యత్నమని పిటిషన్‌లో నివేదించారు.

కుట్ర బెడిసికొట్టడంతో కమిటీ పన్నాగం!

శ్రీవారి లడ్డూ ప్రసాదంలో ఎలాంటి జంతు కొవ్వు కలవలేదని ఇప్పటికే ప్రతిష్టాత్మక ఎన్‌డీఆర్ఐ, ఎన్‌డీడీబీ లాబ్‌లు స్పష్టం చేయగా సీబీఐ దర్యాప్తులోనూ అదే విషయం స్పష్టమైంది. దీనిపై సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌లో ఏ ఒక్క వైఎస్సార్‌సీపీ నేత పేరును ప్రస్తావించలేదు. దీంతో చంద్రబాబు దుష్ప్రచారం బెడిసికొట్టడంతో మరో కొత్త కుతంత్రానికి తెర తీశారు. తమకు అనుకూలంగా నివేదిక ఇప్పించుకోవాలనే రాజకీయ కుట్రతో దినేష్ కుమార్ కమిటీని నియమించారు.

బాబు సర్కారుపై 'సుప్రీం' ఘాటు వ్యాఖ్యలు..

చంద్రబాబు సర్కారు దేవుడిని సైతం రాజకీయాలకు వాడుకోవడంపై సుప్రీంకోర్టు ఇప్పటికే తీవ్ర అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 'కనీసం దేవుడినైనా మీ రాజకీయాలకు దూరంగా ఉంచండి..' అంటూ చంద్రబాబునుద్దేశించి గతంలో సర్వోన్నత న్యాయస్థానం ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబును ప్రతివాదిగా చేర్చడం, ఏకంగా సుప్రీంకోర్టునే ధిక్కరిస్తూ చంద్రబాబు సర్కారు తాజాగా ఏకసభ్య కమిటీని నియమించడంపై దాఖలైన పిటిషన్ నేడు విచారణకు రానుండటం సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

స్వామి పిటిషన్‌లో ఆరుగురు ప్రతివాదులు వీరే..

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వం
- చంద్రబాబు (ఏపీ సీఎం)
- సిట్ (రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన దర్యాప్తు బందం)
- సీబీఐ (కేంద్ర దర్యాప్తు సంస్థ)
- టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానం)



రెడ్‌బుక్ వర్కవుట్ కాక ఎల్లోబుక్ తెరిచారన్న మాట!

ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళం తొలగేనా..?

2026లో సిద్ధమైన బదిలీ ప్రక్రియ ● సమగ్ర విధానంపై ఉపాధ్యాయుల్లో అనుమానాలు
గతేడాది మొత్తం ప్రక్రియ గందరగోళం ● అస్పష్టతలను తొలగించకుండానే పదోన్నతులకు సిద్ధమైన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: గతేడాది చోటుచేసుకున్న అస్పష్టత కొనసాగుతున్న నేపథ్యంలోనే తాజాగా పాఠశాల విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయుల బదిలీల రెగ్యులేషన్ చట్టం–2025 ప్రకారం బదిలీలు పదోన్నతులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటికే జిల్లాల నుంచి ఉపాధ్యాయులు సీనియారిటీ జాబితాలను సిద్ధం చేశారు. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టీఐఎస్), లీప్ యాప్ వివరాల ఆధారంగా ఈ జాబితాలను రూపొందించారు. టీఐఎస్, లీప్ యాప్ డేటా ఆధారంగా రూపొందించిన జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ కొనసాగుతోంది. ఫిర్యాదుల పరిశీలనకు డీఈవో నేతృత్వంలో గ్రీవెన్స్ కమిటీలు ఏర్పాటు చేయగా, ఈ వారంలో తొలి తాత్కాలిక జాబితా విడుదల చేసి, మార్చి 5, 15న సవరణ జాబితాలు, మార్చి 30 నాటికి తుది జాబితా ప్రకటించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది జరిగిన బదిలీలకు సంబంధించి అపరిష్కృత అంశాలపై విద్యాశాఖ ఎలాంటి నిర్ణయం ప్రకటించకపోవడంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొత్త బదిలీల చట్టం ప్రకారం చేపట్టిన అస్తవ్యస్థ బదిలీలతో ఇప్పటికే బోధన కుంటుపడుతుండడం గమనార్హం.

అపరిష్కృత అంశాలు..

- గత ఏడాది మే, జూన్‌లలో 68 వేల మంది టీచర్లను బదిలీ చేశారు.
- వీరిలో 4,477 మందికి పదోన్నతులతో కూడిన బదిలీలు కల్పించారు.
- అయితే, ఏడాది పూర్తయ్యి, కొత్త బదిలీల ప్రక్రియ ప్రారంభమైనా వారిలో 17 వేల మందికి పైగా ఉపాధ్యాయులు రిలీవర్లు లేక ఇంకా పాత స్థానాల్లోనే డెప్యుటేషన్లపై కొనసాగుతున్నారు.
- సాంకేతికంగా వీరంతా బదిలీ అయిన కొత్త పాఠశాలల్లో రిపోర్టు చేసినా, ఇంకా పాత పోస్టులోనే ఉన్నారు.
- డీఎస్సీ–2025 ప్రక్రియ పూర్తయ్యి కొత్త టీచర్లు వస్తే సమస్య పరిష్కారమవుతుందని ఇప్పటి దాకా చెప్పుకొచ్చారు, అయితే, కొత్త టీచర్లు వచ్చారు గాని బదిలీ ఉపాధ్యాయులు కదిలే పరిస్థితి లేకపోయింది.
- ప్రత్యేకంగా 9,600 మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో 'ఒక తరగతి–ఒక టీచర్ విధానం అమలు చేస్తామని ప్రకటించినా, నియమితులైన ఉపాధ్యాయులు రిలీవర్లు లేక పాత స్కూళ్లలోనే ఉండిపోవడంతో అనేక చోట్ల హెచ్ఎంలే ఒక్కరే పాఠశాలను నడిపే పరిస్థితి ఏర్పడింది.

- గతేడాది 3–5 తరగతులకు సబ్జెక్టు టీచర్ విధానాన్ని రద్దు చేశారు. దీంతో హైస్కూళ్లల్లో మిగులు స్కూల్ అసిస్టెంట్లను బలవంతంగా పీఎస్ హెచ్ఎంలుగా సర్దుబాటు చేశారు. ఇలా 4,800 మందిని పంపించారు. తొలుత వీరి కేడర్‌ను పీఎస్ హెచ్ఎం/ఎస్ఏగా ఇచ్చారు. అనంతరం టీఐఎస్‌లో పీఎస్ హెచ్ఎంగా మార్చడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమైంది. దీంతో దిగొచ్చిన విద్యాశాఖ తిరిగి ఎస్ఏను కూడా చేర్చింది. ఈ ఏడాది చేపట్టే బదిలీల్లో వీరికి అవకాశం ఇవ్వడం లేదని తెలుస్తోంది.
- అయితే, గతేడాది తమను బలవంతంగా సర్దుబాటు మాత్రమే చేశారని, తమను కూడా పరిగణనలోకి తీసుకున్న తర్వాతే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.
- చట్ట ప్రకారం మూడేళ్ల సర్వీసు ఉంటేనే దరఖాస్తు పరిశీలనకు అవకాశం ఉంటుంది. మరి టీపీఎస్ హెచ్ఎంల విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.
- గతేడాది చేపట్టిన గందరగోళ బదిలీల్లో దాదాపు 6,428 మంది మిగులుగా తేలారు. హేతుబద్ధీకరణ, ఉపాధ్యాయుల సర్దుబాటు అనంతరం 2,754 మందిని క్లస్టర్ మొబలైజ్ టీచర్లుగా ప్రకటించారు. మరో 3,674 మందిని హెచ్‌వోడీ పూల్‌లో ఉంచారు. ప్రస్తుత పదోన్నతులు, బదిలీల్లో తమను పరిగణనలోకి తీసుకోవాలని వీరు డిమాండ్ చేస్తున్నారు.

వీఎస్‌ఆర్ వెనుక హెరిటేజ్!

▶ మొదటి పేజీ తరువాయి

వ్యాఖ్యానిస్తున్నారు. సీఎం చంద్రబాబు నామినేట్ చేసిన కె.రామ్మోహన్‌నాయుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా రాజీనామా చేస్తేనే విచారణ పారదర్శకంగా జరుగుతుందంటూ రోహిత్ పవార్ చేసిన డిమాండ్ సహేతుకమైనదేనని స్పష్టం చేస్తున్నారు. నైతికతకు కట్టుబడి రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయక పోవడాన్ని తప్పు పడుతున్నారు. నేరుగా తెలుగుదేశం పార్టీ నాయకుల పేర్లు ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి, కోడలు నారా బ్రాహ్మిణల ఫోటోలను ప్రదర్శిస్తూ రోహిత్ పవార్ తీవ్ర ఆరోపణలు చేసినా, పార్టీ స్పందించక పోవడంపై ఆ పార్టీ శ్రేణుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. వీఎస్ఆర్ వెంచర్స్‌తో హెరిటేజ్ ఫిన్‌లీజ్ 2023లో కుదుర్చుకున్న ఒప్పందం గురించి రోహిత్ మీడియాకు పూసగుచ్చినట్లు వివరించిన విషయం తెలిసిందే.

వీఎస్ఆర్ విమానం

రోహిత్ డిమాండ్లన్నీ సహేతుకమే అంటున్న విశ్లేషకులు

- విమాన ప్రమాదంలో ఒక రాష్ట్రానికి చెందిన ఉపముఖ్యమంత్రి చనిపోతే ఇంత వరకు వీఎస్ఆర్ సంస్థ యజమాని వీకే సింగ్‌ను అరెస్ట్ చేయలేదని, డైరెక్టర్లు విదేశాలకు పారిపోవడానికి సహకరించారని, దీని వెనుక రామ్మోహన్ నాయుడు ఉన్నారంటూ రోహిత్ పవార్ తీవ్ర ఆరోపణలే చేశారు. రూ.35 కోట్ల విలువైన విమానానికి రూ.265 కోట్ల బీమా చేయించడం, టాయిలెట్ వెనుక లగేజ్ పెట్టే ప్రాంతంలో పెట్రోల్ క్యాన్లను ఉంచడం, విమానంలో సామర్థ్యానికి మించి ఫ్యూయల్ నింపడం, ప్రమాదం తర్వాత తీవ్ర పేలుళ్లు జరగడం, 1,100 డిగ్రీల వేడిలో ఉన్నా కాలిపోవడానికి అవకాశం లేని బ్లాక్ బాక్స్ కాలిపోయిందని చెప్పడం.. ఇవన్నీ చూస్తుంటే ఇందులో కుట్ర ఉన్నదని రోహిత్ పవార్ చెప్పడంలో ఎలాంటి సందేహం లేదని విమానయాన రంగ నిపుణులు, రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.
- సీఎం చంద్రబాబు కుటుంబ సంస్థ హెరిటేజ్ ఫిన్‌లీజ్ వీఎస్ఆర్ సంస్థకు రూ.వందల కోట్లలో ఫండింగ్ చేయడం, కంపెనీ వెనుక టీడీపీ కీలక నేతలు ఉండటం వల్లే 2016లో కేవలం రూ.10 కోట్ల టర్నోవర్‌తో ఉన్న వీఎస్ఆర్ కంపెనీ ఇప్పుడు రూ.500 కోట్లకు చేరుకుందని రోహిత్ ఆధారాలతో చెబుతుంటే టీడీపీ నేతలు, హెరిటేజ్ సంబంధికులు ఎందుకు బదులివ్వడం లేదని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.
- వీఆర్ఎస్‌ను వెనకేసుకు రావడానికి టీడీపీ ముఖ్యులు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌తో ఉన్న సన్నిహిత సంబంధాలే కారణమని, అందువల్లే తక్షణం ఆయన్ను కేంద్ర మంత్రి పదవి నుంచి తప్పించి, ఈ ప్రమాదంపై కుట్ర కోణంలో దర్యాప్తు జరిపించాలని రోహిత్ పవార్ డిమాండ్ చేయడం సహేతుకమేనని.. ఆ దిశగా ఎందుకు చర్యలు చేపట్టడం లేదని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

విమానాల కొనుగోళ్లకు టీడీపీ నిధులు

వీఎస్ఆర్ వెంచర్స్ విమానాల కొనుగోళ్లకు హెరిటేజ్ సంస్థతో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన నేతలు కూడా నేరుగా నిధులు సమకూర్చినట్లు రోహిత్ పవార్ ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్ అనుబంధ సంస్థ హెరిటేజ్ ఫిన్‌లీజ్ ద్వారా వీఆర్ఎస్‌కు రూ.200 నుంచి రూ.300 కోట్ల వరకు ఫండింగ్ జరిగినట్లు తమకు సమాచారం ఉందంటూ రోహిత్ ఆరోపించారు. టీడీపీకి చెందిన కీలక వ్యక్తి రూ.650 కోట్లతో దుబాయ్‌లో వీఆర్ఎస్ ద్వారా లెగసీ విమానం కొనుగోలు చేశారని.. దాన్ని దుబాయ్‌లో పార్క్ చేశారని, ఏడాది క్రితం రాజస్తాన్‌లో జరిగిన వీఎస్ఆర్ కంపెనీ డైరెక్టర్ రోహిత్ సింగ్ ఫంక్షన్‌కు టీడీపీలోని ప్రముఖ నేతలు హాజరయ్యారని, ఇలా ఒకటి, రెండు కాదు..అనేక ఆర్థిక పరమైన వ్యవహారాలు వీఎస్ఆర్–టీడీపీ నేతల మధ్య ఉన్న విషయాన్ని రోహిత్ పవార్ బహిరంగ పరిచారు. ఈ నేపథ్యంలో దుబాయ్‌లో విమానాలు కొనుగోలు చేసిందెవరని జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు కూడా వీఎస్ఆర్ కంపెనీతో సన్నిహిత సంబంధాలున్నాయని, అందువల్లే దర్యాప్తు పూర్తి కాకుండానే ఆ కంపెనీకి క్లీన్ చిట్ ఇస్తూ మాట్లాడటమే కాకుండా ఉద్దేశ పూర్వకంగా దర్యాప్తును ఆలస్యం చేస్తున్నారని రోహిత్ ఎత్తి చూపారు. తక్షణమే రామ్మోహన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

ఆ విమానాల్లోనే తిరుగుతున్న బాబు కుటుంబం

చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక నారా కుటుంబమంతా ప్రత్యేక విమానాల్లో చక్కర్లు కొడుతుండటం తెలిసిందే. ఈ విమానాలన్నీ వీఎస్ఆర్ ఏవియేషన్ సమకూరుస్తున్నవే. ఇదే విషయాన్ని ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ డేటాను పరిశీలిస్తే స్పష్టమవుతోంది. చంద్రబాబు సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి ఆయన కుటుంబం హైదరాబాద్, ఢిల్లీ, పూణే, బెంగళూరు ఇలా ఎక్కడకు వెళ్లాలన్నా వీఎస్ఆర్ విమాన సర్వీసులనే వినియోగిస్తున్నారు.

వీఎస్ఆర్ వెంచర్స్..

వీఎస్సార్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ చార్టర్ ఫ్లైట్ కంపెనీ. 2011లో ఢిల్లీ కేంద్రంగా ఈ సంస్థను విజయ్ కుమార్ సింగ్ (వీకే సింగ్) స్థాపించారు. ఆయన కుమారుడు రోహిత్ సింగ్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. 2014లో నాన్ షెడ్యూల్డ్ విమాన సర్వీసులను నడపడానికి అనుమతి లభించింది. ఈ లైసెన్స్‌ను 2028 వరకు పొడిగించారు. ప్రస్తుతం ఈ సంస్థ లీయర్ జెట్ 45/45 ఎక్స్ ఆర్ వంటి విమానాలతో పాటు ఎయిర్ అంబులెన్స్, ఏవియేషన్ కన్సల్టెన్సీ సేవలను అందిస్తోంది. ఇటీవల మహారాష్ట్రలో వీఎస్సార్ లియర్ జెట్ కూలిపోవడం వల్లే ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతి చెందిన విషయం తెలిసిందే.

హెరిటేజ్ ఫిన్‌లీజ్..

హెరిటేజ్ అనుబంధ సంస్థగా పాడి రైతులకు రుణాలను ఇచ్చే లక్ష్యంతో 1996 డిసెంబర్ 23న హైదరాబాద్ కేంద్రంగా హెరిటేజ్ ఫిన్ లీజ్ సంస్థను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ సంస్థలో నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి, అక్కిరాజు చంద్రమౌళి, ఎం.సాంబశివరావు, కొల్లి దుర్గాప్రసాదరావు, భూదర్ కుమార్ కరుటూరి, కొంపెల్ల వెంకటేశ్వర్లు, నర్రావుల నాగేశ్వరరావులు డైరెక్టర్లుగా ఉన్నారు. రైతుల కోసం ఉద్దేశించిన ఈ సంస్థ వందల కోట్ల రూపాయలు వీఎస్ఆర్ విమానయాన సంస్థకు దారి మళ్లించడం చర్చనీయాంశంగా మారింది.

ఈ ప్రశ్నలకు బదులేదీ?

- రూ.35 కోట్ల విలువయ్యే విమానానికి రూ.265 కోట్ల ఇన్స్యూరెన్స్ ఎందుకు చేశారు? వాస్తవానికి ప్రమాదానికి గురైన అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం పాతది కావడంతో మార్కెట్‌లో రూ.15–20 కోట్లు కూడా చేయదని నిపుణులు చెబుతున్నారు. మరి ఏ ఉద్దేశంతో అన్ని రెట్లు ఎక్కువ విలువతో ఇన్స్యూరెన్స్ చేశారు?
- విమానంలో టాయ్‌లెట్ వెనుక పెట్రోల్ క్యాన్లు ఎందుకు పెట్టారు? ఒక వీవీఐపీ ప్రయాణిస్తున్న విమానంలో పెట్రోల్ క్యాన్‌లు ఎలా వచ్చాయి? మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ప్రయాణించే ఆ విమానం బయలుదేరే ముందు ఆ విమాన సిబ్బంది ఎవరూ వాటిని గమనించలేదా? అసలవి అక్కడికి ఎలా వచ్చాయి? ఎవరు తెచ్చిపెట్టారు? ఈ విషయంపై దర్యాప్తు జరిగిందా?
- ట్యాంకులో సామర్థ్యానికి మించి ఎందుకు ఫ్యూయల్ నింపారు? ఏ విమానానికి ఎంత మేర ఇంధనం నింపాలనేది డీజీసీఏ నిబంధనల్లో కీలకం. వాటిని పాటించకుండా ఆ విమానంలో సామర్థ్యానికి మించి ఇంధనం నింపడంలో ఉద్దేశం ఏమిటి? సామర్థ్యానికి మించి విమానాల్లో ఇంధనం నింపితే ఎంతటి ప్రమాదమో వారికి తెలియదా?
- ఎంత వేడినైనా తట్టుకునే బ్లాక్ బాక్స్ ప్రమాదంలో కాలిపోవడమేంటి? ఏదైనా విమాన ప్రమాదం చోటుచేసుకున్నప్పుడు.. ఆ ప్రమాదం తాలూకు గుట్టు విప్పేదే బ్లాక్ బాక్స్. ప్రమాదానికి ముందు విమాన పైలట్ల మాటలన్నీ ఇందులో రికార్డు అయి ఉంటాయి. వాటి ద్వారా ప్రమాదానికి గల కారణాలపై ఒక అంచనాకు రావచ్చు. అందుకే ఇంత కీలకమైన బ్లాక్ బాక్స్‌ను అత్యున్నత ప్రమాణాలతో తయారు చేస్తారు. ప్రమాదం ఎంత తీవ్రంగా జరిగినా ఈ బ్లాక్ బాక్స్ దెబ్బ తినకుండా ఉండటమే దీని ప్రత్యేకత. ఎంత వేడినైనా, మంచునైనా తట్టుకునే సామర్థ్యం దీనికి ఉంటుంది. అలాంటి బ్లాక్ బాక్స్ ఈ ప్రమాదంలో కాలిపోయిందని చెప్పడం ఎంత వరకు నిజం? తద్వారా ఏదో దాస్తున్నారని, నిజాన్ని సమాధి చేస్తున్నారని ఇట్టే తెలియడం లేదా?
- ఏ విచారణ జరక్క ముందే వీఎస్ఆర్ వెంచర్స్‌కు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఎలా క్లీన్ చిట్ ఇచ్చారు? ఒక విమాన ప్రమాదం జరిగిన తర్వాత వివిధ కోణాల్లో దర్యాప్తు జరుగుతుంది. వివిధ శాఖలు దర్యాప్తులో భాగమవుతాయి. అందునా ఆ విమాన ప్రమాదంలో మృతి చెందింది మామూలు వ్యక్తి కాదు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం. ఈ క్రమంలో ఒక కేంద్ర మంత్రిగా అత్యంత బాధ్యతాయుత స్థానంలో ఉన్న టీడీపీ నేత రామ్మోహన్ నాయుడు.. ఆ విమానయాన కంపెనీ వీఎస్ఆర్ తప్పు లేదని ఏకపక్షంగా ఎలా ప్రకటిస్తారు? ఏ ఆధారంతో ఆయన ఈ ప్రకటన చేశారు? అంటే దర్యాప్తు సంస్థ ఆయన ఆలోచనలకు అనుగుణంగా వ్యవహరించాలని చెప్పడం కాదా? ఎందుకోసం ఇలా తొందరపాటుతో ప్రకటన చేశారు? ఎవరి కోసం చేశారు? వీఎస్ఆర్‌ను ఎందుకు వెనకేసుకొస్తున్నారు?

క్లుప్తంగా...

విస్తరణ అధికారుల సమస్యలపై పోరాటం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వ్యవసాయ విస్తరణ అధికారుల ప్రధాన సమస్యలైన జాబ్ చార్ట్, ఏఈవో హోదా మార్పుపై పోరాడుతున్నామని ఏపీ జేఏసీ చైర్మన్, రాష్ట్ర ఎన్జీవో సంఘ అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ చెప్పారు. వ్యవసాయ విస్తరణ అధికారుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఎన్జీవో హోమ్‌లో ఆదివారం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలన్నీ దశల వారీగా పరిష్కారమవుతాయన్నారు. అనంతరం వ్యవసాయ విస్తరణ అధికారుల టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర కోశాధికారి భారతి ప్రసాద్, రాష్ట్ర ఏఈఓ సంఘ అధ్యక్షుడు డి.వేణు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ టీచర్ల క్రమబద్ధీకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

కృష్ణలంక (విజయవాడ తూర్పు): కేజీబీవీ టీచర్ల సర్వీసు క్రమబద్ధీకరణ, మినిమం టైమ్ స్కేల్ అమలు పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి అన్నారు. విజయవాడలో కేజీబీవీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ గోపీమూర్తి మాట్లాడుతూ.. కేజీబీవీ టీచర్లు విద్యా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి తగిన గుర్తింపు, భద్రత కల్పించకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా కె.విజయగౌరి, అధ్యక్షులుగా జి.శ్రీరేఖ, ప్రధాన కార్యదర్శిగా తేజేశ్వరి, ట్రెజరర్‌గా మాధవి ఎన్నికయ్యారు.

ఏపీటీఏజీఎస్ఏ నూతన కమిటీ ఏకగ్రీవం



కృష్ణలంక (విజయవాడ తూర్పు): ఏపీ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీస్ అసోసియేషన్ (ఏపీటీఏజీఎస్ఏ) నూతన కమిటీ ఏకగ్రీవమైంది. ఆదివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కాజా రాజ కుమార్, ప్రధాన కార్యదర్శిగా డి.జె.సంపత్ రావును ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులు సైతం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీపీటీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.కిషోర్‌కుమార్, ఏపీజీఈఏ స్టేట్ సెక్రటరీ అండ్ అబ్జర్వర్ జీఎం రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కాలుష్య నియంత్రణ'లో కమీషన్ల వేట

- బయోవ్యర్థాల ప్లాంట్ల కేటాయింపులో పీసీబీ బరితెగింపు
- సీపీసీబీ ఆదేశాలకు విరుద్ధంగా రెండుప్లాంట్ల నిర్వహణ కాంట్రాక్టులు
- నామినేషన్ విధానంలో ట్రిమెక్స్, గోదావరి బయో సంస్థలకు ఇచ్చేందుకు తీర్మానం
- చైర్మన్, అధికారుల తీరుపై అనుమానాలు

సాక్షి, అమరావతి: కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) కమీషన్లతో కలుషితమవుతోందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కావాల్సిన వారికి కాంట్రాక్టులు కట్టబెట్టేందుకు నిబంధనలను ఏమాత్రం పట్టించుకోవడంలేదు. రాష్ట్రంలోని రెండు బయో వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ల నిర్వహణ కాంట్రాక్టులు ఇచ్చేందుకు నిబంధనలకు తిలోదకాలిచ్చింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ఆదేశాలను సైతం పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా నామినేషన్ విధానంలో తమకు కావాల్సిన సంస్థలకు కాంట్రాక్టు ఇచ్చేందుకు బోర్డు తీర్మానం కూడా చేసేసింది. విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాల్లో బయో వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ల నిర్వహణ కాంట్రాక్టును ట్రిమెక్స్ ఎనర్జీ, గోదావరి బయో ఇండస్ట్రీస్ సంస్థలకు అప్పగించాలని గతనెల 13న జరిగిన పీసీబీ సమావేశంలో తీర్మానించారు. గతంలోనే ఈ ప్లాంట్లు ఏర్పాటైనా వాటి నిర్వహణ కాంట్రాక్టును ఇచ్చేందుకు గ్యాప్ ఎనాలసిస్ స్టడీ చేయాలని సీపీసీబీ సూచించింది. దీంతో పీసీబీ ఆ స్టడీ చేయించి 2025లో సీపీసీబీకి నివేదిక పంపింది. దాన్ని పరిశీలించిన సీపీసీబీ బయో వేస్ట్ నిర్వహణ అత్యంత జాగ్రత్తగా చేయాల్సిన పని కావడంతో టెండర్ల ప్రక్రియ ద్వారా అనుభవం ఉన్న కంపెనీలను ఎంపిక చేయాలని సూచించింది. టెండర్లు పిలిస్తే తమకు కావాల్సిన కంపెనీలకు కాంట్రాక్టు ఇవ్వడం సాధ్యం కాదనే ఉద్దేశంతో నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇవ్వాలని పీసీబీ నిర్ణయించింది. ఇందుకోసం ప్రతిపాదనలు తయారు చేసి బోర్డు సమావేశంలో ఆమోదించింది. ప్రస్తుతం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఉమ్మడిగా బయో వేస్ట్‌ను సేకరణను సేకరిస్తుండగా దాన్ని విడగొట్టి కొత్తగా విజయనగరం జిల్లాకు ప్రత్యేక కాంట్రాక్టును ట్రిమెక్స్ కంపెనీకి ఇవ్వనుంది. తూర్పుగోదావరి జిల్లాలో ప్రస్తుతం బయో వేస్ట్‌ను సేకరిస్తున్న కంపెనీకి పక్కనపెట్టి గోదావరి బయో ఇండస్ట్రీస్ కంపెనీని కాంట్రాక్టు ఇవ్వాలని నిర్ణయించింది. బోర్డు తీర్మానం కూడా చేయడంతో త్వరలో వారికి త్వరలో అధికారికంగా కాంట్రాక్టులు ఇవ్వనుంది.

ఆ సంస్థలతో కుమ్మక్కవడంతోనే !

నిర్వహణ కాంట్రాక్టు కోసం ఆ కంపెనీలు పీసీబీ చైర్మన్‌తో కుమ్మక్కయినట్లు ఆరోపణలున్నాయి. అందుకే సీపీసీబీ సూచనలు కూడా పట్టించుకోకుండా టెండర్లు లేకుండా నామినేషన్ల పద్ధతిలో అత్యంత కీలకమైన ప్లాంట్ల నిర్వహణను ఆ సంస్థలకు కట్టబెడుతున్నట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో పీసీబీలోని కొందరు ఉన్నతాధికారులు కూడా చైర్మన్‌కు అండగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్లాంట్ల అప్పగింతతో భారీగా కమీషన్లు దండుకునేందుకు అంతా సిద్ధం చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. పీసీబీ ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ శాఖ పరిధిలో ఉన్నా పీసీబీ చైర్మన్ చంద్రబాబుకు బాగా సన్నిహితమైన వ్యక్తి కావడం గమనార్హం.

ప్రజారోగ్యం పోయినా.. కమీషన్లే కావాలి

బయో వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ల నిర్వహణ అత్యంత సంక్లిష్ట ప్రక్రియ. వీటివల్ల ఆ ప్రాంతంలో పర్యావరణం తీవ్రంగా ప్రభావితమవుతుంది. బయో వ్యర్థాలను కాల్చినప్పుడు ప్రమాదకరమైన డయాక్సిన్స్ వంటి వాయువులు విడుదలవుతాయి. వాటిని నియంత్రించే హై స్టాండర్డ్ ఎయిర్ పొల్యూషన్ కంట్రోల్ సిస్టమ్స్ ఉండాలి. అందుకే ఎన్‌జీటీ, కేంద్ర పర్యావరణశాఖ, సీపీసీబీ.. సరైన సామర్థ్యం ఉన్న కంపెనీలకు అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నాకే అనుమతి ఇస్తుంది. లేకపోతే ఆయా ప్రాంతాల్లో ప్రజారోగ్యం తీవ్రంగా దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలో సీపీసీబీ విజయనగరం, తూర్పుగోదావరి ప్లాంట్ల నిర్వహణ కాంట్రాక్టులు ఇచ్చేందుకు సీపీసీబీ ఇచ్చిన పలు స్పష్టమైన మార్గదర్శకాలను పీసీబీ బుట్టదాఖలు చేసింది. ప్రజల ఆరోగ్యం పోయినా, పర్యావరణం నాశనమైనా సరే.. తమకు కమీషన్లు ఇచ్చే సంస్థలకే కాంట్రాక్టులు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసింది.

పని ఒత్తిడి పెంచి ప్రాణాలు తీస్తున్నారు

- గ్రామ, వార్డు సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీల ఆందోళన

పటమట (విజయవాడ తూర్పు): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేల భారంతో తాము వెట్టిచాకిరీ చేయాల్సి వస్తోందని, పని ఒత్తిడి పెంచుతూ ఉద్యోగులు ప్రాణాలు తీస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు ప్లానింగ్ రెగ్యులరైజేషన్ సెక్రటరీలు (డబ్ల్యూపీఆర్ఎస్) ఆందోళన వ్యక్తం చేశారు. డబ్ల్యూపీఆర్ఎస్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులకు సరైన సర్వీస్ రూల్స్ లేకపోవటంతో ప్రమోషన్లు, వేతనాల వ్యవహారాల్లో జాప్యం జరుగుతోందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న సచివాలయాల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గౌరవ అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ టౌన్‌ప్లానింగ్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్లానింగ్, రెగ్యులరైజేషన్స్ సెక్రటరీల ప్రమోషన్ చానల్ చేయటానికి సర్వీస్ రూల్స్ సవరించి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 390 టీపీబీఓ పోస్టులు డబ్ల్యూపీఆర్ఎస్ ద్వారా భర్తీ చేయటానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. వారికి ట్రేసర్ పేస్కేల్ వర్తింపచేసేలా కృషి చేస్తామన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు యు.నవీన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పెద్దలు ఉన్నతాధికారులతో సంప్రదించి తమకు సబార్డినేట్ సర్వీస్ రూల్స్ వర్తింపచేసేలా కృషి చేయాలని కోరారు. సచివాలయాల సెక్రటరీలు ఎవరూ కూడా పనిఒత్తిడితో ప్రాణాలు కోల్పోవద్దని, విధి నిర్వహణలో సమస్యలుంటే ఉన్నతాధికారులు, తమ తోటి ఉద్యోగులు, అసోసియేషన్ సభ్యులను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు, అమరావతి జేఏసీ రాష్ట్ర కోశాధికారి టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇద్దర్ని బలిగొన్న 'పాల'కూట విషం!

రాజమహేంద్రవరంలో కల్తీ పాల కలకలం

సాక్షి, రాజమహేంద్రవరం: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగర శివారు లాలాచెరువు పరిధిలోని చౌడేశ్వరి నగర్, వెంకటేశ్వర నగర్‌లో కల్తీపాలు తాగి పలువురు అస్వస్థతకు గురైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. చౌడేశ్వరినగర్‌కు చెందిన తాడి కృష్ణవేణి (85), కనకరత్నం (70) మృతి చెందినట్లు తెలుస్తోంది. మరో 8 మంది ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో వృద్ధులు, చిన్నారులున్నారు. ఒక్కసారిగా మూత్రం బంద్ కావడం, వాంతులు కావడం వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. వీరిలో మూడేళ్ల చిన్నారికి డయాలసిస్ చేస్తున్నారు. మరో ఇద్దరు ప్రైవేటు ఆస్పత్రుల్లో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురితోపాటు, కొంతమంది చిన్నారులకు డయేరియా, కిడ్నీ ఫెయిలైన సమస్యలు తలెత్తినట్టు వైద్యాధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ప్రాంతాల్లో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పరీక్షలు నిర్వహించారు. వారికి సరఫరా అవుతున్న పాల వల్లే ఈ సమస్య తలెత్తిందని గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబాలకు పాలు పోస్తున్న కోరుకొండ మండలం నరసాపురం గ్రామానికి చెందిన గణేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి.. ఎవరు సరఫరా చేస్తున్నారు.. ఎన్ని ఇళ్లకు పాలు అందజేస్తున్నారు.. ఎవరి ఆధ్వర్యంలో సరఫరా జరుగుతోంది.. ఏయే గ్రామాల నుంచి రాజమహేంద్రవరానికి పాలు వస్తున్నాయనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. గణేష్ రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో 150కి పైగా ఇళ్లలో పాలు పోస్తున్నట్టు తెలిసింది. ప్రజలు అస్వస్థతకు గురైన కాలనీల్లో వైద్యాధికారులు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేసున్నట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. చికిత్స పొందుతున్న వారి పరిస్థితి నిలకడగా ఉందని, అక్కడ పరిస్థితులను లోతుగా పరిశీలిస్తున్నామని చెప్పారు.

చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి

మూత్రం నిలిచి.. వాంతులతో ప్రారంభమై..

రాజమహేంద్రవరంలో అనూరియా (మూత్రం ఆగిపోవడం) కేసులు రావడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్ ప్రాంతాలకు చెందిన నలుగురు వ్యక్తులు అనూరియా లక్షణాలతో స్థానిక కిమ్స్ ఆస్పత్రిలో చేరారు. వెంటనే ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ జిల్లా సర్వైలెన్స్ అధికారికి సమాచారం అందించడంతో అత్యవసరంగా విచారణ ప్రారంభించారు. కిమ్స్ ఆస్పత్రిని డీఎంహెచ్‌వో, జిల్లా సర్వైలెన్స్ అధికారి, జిల్లా ఎపిడమాలజిస్ట్‌తో పాటు ఎపిడమిక్ సెల్ బృందం బాధితులను పరిశీలించింది. వైద్యుల ప్రాథమిక నివేదికలు, కుటుంబ సభ్యుల వివరాలు, కేసు హిస్టరీ ఆధారంగా ఆకస్మికంగా మూత్రపిండాలు వైఫల్యం చెందినట్టు అనుమానం వ్యక్తమవుతోందని అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయి విచారణలో బాధితులందరూ ఒకే పాల విక్రేత నుంచి పాలు కొనుగోలు చేసి వినియోగించినట్టు గుర్తించామన్నారు. ఇటువంటి మరో నలుగురు బాధితులను ఇతర ప్రైవేటు ఆస్పత్రుల్లో గుర్తించారు. పరిస్థితి విషమంగా ఉన్న కొంతమందిని కాకినాడ ఆస్పత్రికి కూడా తరలించారు. బాధితులందరూ 60 సంవత్సరాలు పైబడిన వారు కాగా.. చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్ ప్రాంతాల్లోని నాలుగు కుటుంబాలకు చెందిన వారుగా గుర్తించారు. అధికారులు స్థానికంగా పాలు, నీళ్ల నమూనాలు సేకరించారు. దీనిపై నివేదిక వచ్చిన తరువాత ఏం జరిగిందనే విషయమై స్పష్టత వస్తుందని చెబుతున్నారు.

5 రోజుల్లో 12 మంది బాధితులు?

చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్, రెవెన్యూ కాలనీ పరిసర ప్రాంతాల్లో కల్తీ పాలు తాగి గడచిన 5 రోజుల్లో సుమారు 12 మంది ఆస్పత్రుల పాలైనట్టు తెలిసింది. కేసుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అనధికారిక సమాచారం. లాలాచెరువు, హౌసింగ్ బోర్డ్ కాలనీ, చౌడేశ్వరి నగర్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

ల్యాబ్‌కు నమూనాలు

కల్తీ పాలతో ఇద్దరు మృతి చెందడం, పలువురు అస్వస్థతకు గురవడంతో అధికారులను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అప్రమత్తం చేశారు. ఆహారం, నీరు, మల నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు, ఫోరెన్సిక్ పరిశీలనకు పంపించారు. అనుమానిత పాల వనరును ఫుడ్ సేఫ్టీ అధికారి పరిశీలించి చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిని జిల్లా యంత్రాంగం పర్యవేక్షిస్తోంది.

2న అంగన్‌వాడీల మహాధర్నా

ప్రకటించిన మూడు యూనియన్లు

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 23 నుంచి 27 వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ అనుబంధ మూడు యూనియన్లకు చెందిన నాయకులు ప్రకటించారు. మార్చి 2న విజయవాడలో అంగన్‌వాడీల మహాధర్నా నిర్వహిస్తామని వెల్లడించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ), ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ), ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ (ఐఎఫ్‌టీయూ), హెల్పర్స్ యూనియన్‌ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కె.సుబ్బరావమ్మ, జె.లలితమ్మ, వీఆర్ జ్యోతి విజయవాడలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గతంలో నిర్వహించిన సమ్మె సమయంలో డిమాండ్స్ అంగీకరిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ తుంగలో తొక్కిందన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం నెలకు రూ.20వేలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 1819 మినీ వర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని, గ్రాట్యూటీ అమలుకు గైడ్‌లైన్స్ రూపొందించాలని డిమాండ్ చేశారు.

స్నేహితుడే హంతకుడు

ఆర్థిక లావాదేవీలతోనే రచయిత బొగ్గుల శ్రీనివాస్ హత్య.. నలుగురి అరెస్ట్

కూసుమంచి: ఈనెల 14న మృతి చెందిన ఏపీకి చెందిన రచయిత బొగ్గుల శ్రీనివాస్ కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. శ్రీనివాస్‌ది హత్యగా తేల్చి నిందితులను అరెస్ట్ చేసినట్లు ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆదివారం చెప్పారు. నంద్యాల జిల్లా అల్లూరు గ్రామానికి చెందిన గొల్ల అలియాస్ బొగ్గుల శ్రీనివాస్ హైదరాబాద్‌లో ఉంటూ రచయితగా, యూట్యూబర్‌గా కొనసాగుతున్నాడు. ఆయనకు పల్నాడు జిల్లా పాకాలపాడు గ్రామానికి చెందిన మేకల వేణుమాధవ్ రెడ్డి పరిచయం అయ్యాడు. వేణుమాధవ్ హైదరాబాద్‌లో మేకా ప్రాజెక్టు పేరుతో సబ్ కాంట్రాక్టర్‌గా చేస్తున్నాడు. శ్రీనివాస్‌కు బొగ్గుల బీబీక్యూ పేరున జీఎస్టీ లైసెన్స్ ఉన్నట్లు వేణుమాధవ్ తెలుసుకున్నాడు. జీఎస్టీ లైసెన్స్ ఉన్నందున ఫేక్ ఇన్వాయిస్ అండ్ సేల్స్ ఫైల్ చేసి లాభాలు పొందవచ్చని, లాభాల్లో సగం వాటా ఇస్తానని వేణుమాధవ్ చెప్పగా శ్రీనివాస్ అంగీకరించాడు. 2022–25 వరకు లైసెన్స్‌పై రూ.90 లక్షల ఆదాయం రాగా సగం వాటాగా రూ.45 లక్షలు శ్రీనివాస్‌కు చెల్లించాల్సి ఉండగా రూ.15 లక్షలు ఇచ్చాడు. మిగిలిన రూ.30 లక్షలు చెల్లించలేదు. జీఎస్టీ లైసెన్స్ దుర్వినియోగం చేశారంటూ అధికారులు లైసెన్స్ రద్దు చేశారు. దీంతో శ్రీనివాస్ తన లైసెన్స్‌ను పునరుద్ధరింపజేయాలని, తనకు రావాల్సిన రూ.30 లక్షలు చెల్లించాలని వేణుమాధవ్‌పై ఒత్తిడి చేశాడు. దీంతో లైసెన్స్ పునరుద్ధరణకు చెల్లించాల్సిన రూ.కోటితోపాటు శ్రీనివాస్‌కు చెల్లించాల్సిన రూ.30 లక్షలు ఇవ్వకుండా ఆయన హత్యకు కుట్ర పన్నాడు.

రూ.5 లక్షల సుపారీ

శ్రీనివాస్‌ను హత్య చేసేందుకు వేణుమాధవ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చెందిన పోకల కోటేశ్వరరావుకు రూ. 5 లక్షల సుపారీ ఇచ్చాడు. అతడి ద్వారా అదే గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ హఫీజ్, కొత్తగూడెం వాసి డ్రైవర్ ఎండీ అజ్మత్ ఆలీ ఖాన్ పరిచయమయ్యారు. ఈ క్రమంలో వేణుమాధవ్.. శ్రీనివాస్‌ను కలిసి జీఎస్టీ పెనాల్టీ చెల్లిస్తానని, విజయవాడ వెళ్దామని నమ్మించి 13న రాత్రి తన కారులో ఎక్కించుకున్నాడు. నకిరేకల్ నుంచి జనగామ వెళ్లే రూట్‌లోకి కారు తీసుకెళ్లి జన సంచారం లేని ప్రాంతంలో అందరూ కలిసి శ్రీనివాస్‌పై కత్తులు, ఇనుపరాడ్లతో దాడిచేసి హత్య చేశారు. ఆ తర్వాత పాలేరు రిజర్వాయర్ వద్దకు వచ్చారు. మిగిలిన వారు కారు దిగిపోగా.. అజ్మత్ ఆలీ కారును ప్రమాదంగా చిత్రీకరించేందుకు రిజర్వాయర్‌లోకి దించాడు. కారు కొంత భాగం మునగగా అజ్మత్ ఆలీ ఒడ్డుకు చేరి అక్కడి నుంచి పరారయ్యాడు. శ్రీనివాస్ మృతదేహంపై గాయాలు ఉండటంతో ఇది ప్రమాదం కాదని భావించి కూసుమంచి పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్‌చేశారు.

“ ఎవరైతే బంధనాలను విప్పుకోవాలనుకుంటున్నారో, దుఃఖం నుండి ముక్తి పొందాలనుకుంటున్నారో, వారు తమ మనస్సును వశపరచుకోండి. తమ మనస్సు వశంలోకి జారుకోకండి.

– ఎస్.ఎన్. గోయెంకా

సాక్షి

సోమవారం, 23 ఫిబ్రవరి 2026

ముత్యాలూ సజ్జలూ

అమ్మ పాలేరుకు అన్నం పెడుతుంది. కూర పెడుతుంది. అంత పచ్చడి కూడా! తిన్నంత తింటే విసుక్కోకుండా పెడుతుంది. కాని మజ్జిగ మాత్రం పోయదు. అప్పుడే హైస్కూలుకు వచ్చిన కొడుకు ‘ఎందుకమ్మా మజ్జిగ పోయవు’ అంటే జవాబు చెప్పదు. పాలేరు ఇంట్లోకి రాకూడదు. బయటే కూచోవాలి. తినాలి. వెళ్లిపోవాలి – మజ్జిగ ముఖం చూడకుండా! ఇంట్లో కుండ నిండా మజ్జిగే! అమ్మ ఇరుగూ పొరుగుకు ఇస్తుంది. ఎండనబడి వచ్చిన వాళ్లకు ఇస్తుంది. పాలేరుకు తప్ప. అప్పటికి పాలేరు కులం ఏమిటో మూలం ఏమిటో కొడుకుకు తెలియదు. ‘ఎందుకమ్మా మజ్జిగ పోయవు?’... ‘పోయకూడదు నాయనా... పోస్తే వెన్నలో పురుగులు పడతాయి’. పాలేరుకు మజ్జిగ పోస్తే వెన్నలో పురుగులు పడతాయా? చూద్దాం అని అమ్మ లేనప్పుడు పాలేరు బెదిరిపోతున్నా కొడుకు అతని కంచెంలో మజ్జిగ వొంపేశాడు. మరికొన్ని రోజులకు అమ్మ వెన్న కాచి నెయ్యి చేస్తోంది. కొడుకు తొంగి తొంగి చూస్తున్నాడు. ‘ఏమిట్రా?’... ‘పురుగులేమైనా పట్టాయేమోనని’... పకపకా నవ్వాడు.

ఒక పిల్లాడిది అడవి దాపు పల్లె. స్కూలుకు చాలా దూరం నుంచి నడుచుకుంటూ వస్తాడు. రెండు చేతులు, రెండు కాళ్లు... పుస్తకాలున్నాయా... లేవు... నోట్‌బుక్కులు... అయ్యబాబోయ్. అయ్యవారు దయదలిచి పాతవేవో సంపాదించి ఇస్తారు. నోట్‌బుక్కులు మాత్రం కొనుక్కోవాల్సిందే! పిల్లాడి దగ్గర అడవి ఉంది తప్ప డబ్బులు లేవు. ప్రతి సంవత్సరం బడి తెరిచాక నోటు బుక్కుల కోసం ఆ పిల్లాడు ఒకటే పని చేస్తాడు. రోజూ అడవికి వెళ్లి రేగుపండ్లు కోసి సంచీ నిండా వేసుకొని వస్తాడు. స్కూల్లో ఆ రేగుపండ్లకు మారుబేరం పెడతాడు. గుప్పెడు రేగుపండ్లు ఇస్తే పిల్లలు తమ నోటు బుక్కులో సెంటర్ పిన్ను దగ్గర ఒక టావు తీసి ఇవ్వాలి. రేగుపండ్లు ఖాళీ అయ్యే కొద్దీ టావులు పోగవుతాయి. ఇంకేమిటి? రేగుపండ్ల నోట్‌బుక్ తయార్!

కానుకలు అందరూ ఇస్తారు. పుచ్చుకుంటారు. కాని కొన్ని కానుకలు జీవితాంతం వెంటాడుతాయి. ఆ టీచరు పాఠాలు చెప్తుంటే ఒక ముసలామె మనవణ్ణి చేత్తో పట్టుకుని వచ్చి బడిలో వదిలింది. ‘ఈ ముసలి ప్రాణం తప్ప వీడికి ఎవరూ లేరు టీచరమ్మా! నాలుగు అక్షరాలు నేర్పించు’... ఆ టీచరు పిల్లాడిని దగ్గరగా పొదువుకుంది. తల నిమిరింది. పాఠాలు ఏం చెప్పిందో కాని తన బాక్స్‌లోని నాలుగు మెతుకులు పెట్టింది. ఆకుకూరలమ్మే ముసలామె తన మనవడికి టీచరమ్మ దొరికినందుకు ఎంతో సంతోషపడింది. మనవడు మాత్రం సిగ్గుతో ఎక్కువ మాట్లాడేవాడు కాదు. అప్పుడు ‘టీచర్స్ డే’ వచ్చింది. స్కూల్లో అందరూ టీచరమ్మకు గ్రీటింగ్ కార్డులు, ఆపిల్స్, గులాబీ పూలు ఇస్తున్నారు. అందరూ వెళ్లిపోయాక ఆ పిల్లాడు ఒక్కడే మిగిలాడు. ఏదో కానుక తెచ్చినట్టే ఉన్నాడు. ‘ఏంట్రా అది?.. ఇవ్వు’... చాలా బిడియపడుతూ వీపు వెనుక ఉన్న చేతిని ముందుకు సాచాడు. ఆకుకూర! వాడి చిట్టిచేతిలో జీవస్పందన వంటి పచ్చటి ఆకుకూర గుచ్ఛం!

జీవితాల్లో గాలికిపోయే ఊకలాంటి ఘటనలు ఎన్నో జరుగుతాయి. కొన్ని ఇలా స్వాతిచినుకుల్లా రాలి, కుదురును కదిలించి, ముత్యాలుగా మారతాయి. వాటిని సాహిత్యంగా చేసినప్పుడు మిలమిలమని మెరుస్తూ వేల చేతులు మారి అదే అనుభూతితో తాకుతాయి. ‘నేను రాసింది ఏ.ఐ.కి ఫీడ్ చేస్తాను. అది వెంటనే అర్థం చేసుకొని విడమర్చిందంటే రాసింది సాహిత్యం కాదని చించేస్తాను’ అన్నాడు రచయిత గురుచరణ్‌దాస్. సరళరేఖలు, తెలిసిన గీతలు టక్కున తెలిసిపోతాయి. ఏ.ఐ.కి చిటికెలో పని. కాని సాహిత్యం సరళం కాదు... ఉపరితలమూ కాదు. అది స్పందనల పరావర్తనలు పడే పెరడు. భావోద్వేగాలు నర్తించే ఎరీనా. తుది ఘట్టాన సాక్షాత్కారాలను ఒసగే యుద్ధ క్షేత్రం. సాహిత్యం మనిషికొక అర్థం... మనసుకొక తాత్పర్యం. అంతేతప్ప ఏ.ఐ. చెప్పే మూసకట్టు చిలకజోస్యం కాదు.

రాసినదంతా ఏ.ఐ. దగ్గర ఉంది! రాయవలసినదంతా మనిషి వద్ద ఉంది!! మనిషి రాయకపోతే ఏం చేసినాగాని ఏ.ఐ. పైన చెప్పిన మూడు ఘటనలను సృష్టించలేదు. అవి మనిషికే తెలుసు. మనిషి చెయ్యే వాటిని రాయాలి. ఇప్పుడు ఎక్కడ చూసినా ఏ.ఐ. మీద చర్చ జరుగుతోంది. రచన, ప్రచురణల్లో ఏ.ఐ. పాత్ర ఏమిటనేది శోధనగా ఉంది. ఏ సాంకేతికతైనా సృజనకు సాయం మాత్రమే! అదే సృజన కాబోదు. రచయితలు జీవన పేటికల మీటలు నొక్కినంత కాలం ముత్యాలకు కొదవలేదు. సజ్జలతో సరిపెడదామనుకుంటే ఏ.ఐ. ఉంది పదండి!!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.షష్ఠి ప.10.03 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** భరణి సా.5.35 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** ఉ.4.04 నుండి 5.34 వరకు, తదుపరి తె.4.46 నుండి 6.16 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.35 నుండి 1.20 వరకు, తదుపరి ప.2.52 నుండి 3.35 వరకు, **అమృత ఘడియలు:** ప.1.01 నుండి 2.33 వరకు.

సూర్యోదయం : 6.28
సూర్యాస్తమయం : 5.59
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

ఆర్మీ

ఒక యువకుడు ఆర్మీలోకి వచ్చాడంటే, ఇక అతడు వ్యక్తి కాదు. ఆర్మీ అనే శక్తిలో భాగం. అతడు తన వ్యక్తిత్వంతో, అత్యంత అసాధారణమైన శౌర్యంతో సైనిక దళానికి బలం అవుతాడు. తోటి సైనికుల నమ్మకం, ఆత్మవిశ్వాసం అవుతాడు. ఆర్మీకి ముందడుగు అవుతాడు.

– నిర్మల్ చందర్ విజ్, రిటైర్డ్ ఆర్మీ చీఫ్

మార్చే శక్తి

మనం అందరం కూడా ఒకరి జీవితాన్ని మార్చగల శక్తి సామర్థ్యాలతో జన్మించి ఉంటాం. ఆ సామర్థ్యాన్ని వృథా కానివ్వకూడదు. ఈ రోజు నా దగ్గర ఉన్నదానిని పంచుకునే గుణాన్ని నేను కలిగి ఉన్నందుకు కూడా నన్ను నేను అదృష్టవంతురాలిగా భావిస్తున్నాను.

– టీనా అంబానీ, మాజీ నటి

నాన్న..!

నా తండ్రి అకాల మరణం తర్వాత, నా కలల్ని కాదనుకుని, పాటల రచయితగా ఆయన వారసత్వాన్ని అందుకున్నాను. అప్పుడు గానీ నాన్న గొప్పతనం ఏమిటో నేను గ్రహించలేకపోయాను. ఆయన వదిలి వెళ్లిన పనిని పూర్తి చేయటానికే నేనిక్కడ ఉన్నాను.

– వయలార్ శరత్ చంద్ర, గీత రచయిత

బిజినెస్



నా బిజినెస్ ఫిలాసఫీ: ఏ పరిస్థితుల్లోనూ అప్పుల ఉచ్చులో పడొద్దు; మార్కెట్ మార్పులను అంచనా వేస్తుండు; సంస్థలో కుటుంబ వాతావరణాన్ని ప్రవేశపెట్టు; అన్నిటి కంటే ముందు... అత్యుత్తమమైన వ్యక్తులనే నియమించుకుని, మంచి టీమ్‌ను ఏర్పాటు చేసుకో!

– జే మెహతా, బిజినెస్‌మేన్

‘ఆకలి’

మా గ్రామంలో ప్రాథమిక సౌకర్యాలు లేకపోవటం నన్ను నిరుత్సాహపరచలేదు. సరికదా, అది నా దృఢ సంకల్పానికి ఆజ్యం పోసింది. మంచి భవిష్యత్తు కోసం నాలోని ‘ఆకలి’ని సజీవంగా ఉంచింది. ఆశయం నెరవేరాలంటే ఆ ఆకలిని చల్లారనివ్వకూడదు.

– హితేశ్ దోషీ, ‘వారీ ఎనర్జీస్’ ఛైర్మన్

ఒకే వ్యక్తిగా..!

టీమ్‌లోని అందరూ వివిధ ప్రావీణ్యాలు గల ఒకే వ్యక్తిగా ఉండాలి! ఒకే వ్యక్తిగా ఉన్నా కూడా... అసమానమైన ఆలోచనలు, అనితర సామర్థ్యం, సాటిలేని పట్టుదల కలిగి ఉండాలి. అప్పుడు మాత్రమే టీమ్ విజయం సాధించగలదు.

– సునీల్ కాంత్ ముంజల్, బిజినెస్‌మేన్

ఎలాంటి ఒప్పందాలు మేలు?

విశ్లేషణ

డా॥ తమ్మా కోటిరెడ్డి

ఆర్థిక సార్వభౌమాధికారం, దీర్ఘకాల పోటీతత్వాన్ని పెంపొందించుకోవడానికి కొన్ని ముఖ్య దేశాలతో భారత్ వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకోవాలి. ప్రస్తుతం 13 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ), 6 ప్రాధాన్యతా వాణిజ్య ఒప్పందాలు అమలులో ఉన్నాయి. దశలవారీగా దిగుమతి సుంకాల తగ్గింపు; ఇతర దేశాల ద్వారా భారత్‌లోకి ప్రవేశిస్తున్న చైనా వస్తు ప్రవాహాన్ని అరికట్టడం; ఆహార ప్రాసెసింగ్, ఐటీ, టెక్స్‌టైల్స్, ఫార్మా, రసాయనాల విషయంలో భారత్‌కు ఉన్న పోటీతత్వాన్ని నిలుపుకోవడం; రైతులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు రక్షణ లాంటి అంశాల విషయంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఆ యా వాణిజ్య ఒప్పందాలు భారత్‌కు మిశ్రమ ఫలితాలను అందించాయి. భారత్ – ఆసియాన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల భారత్‌కు వాణిజ్య లోటు అధికమైంది. దక్షిణ కొరియా విషయంలో భారత్ నుండి ఎగుమతుల కన్నా కొరియా నుండి దిగుమతులు అధికంగా ఉన్నాయి. జపాన్, ఎస్ఏఎఫ్‌టీఏలో ఒప్పందాలు పరిమిత ప్రయోజనాలనే అందించాయి. అయితే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియాలతో ఒప్పందాలు వాణిజ్యపరంగా ప్రయోజనాన్ని కల్పించాయి.

ఎదురయ్యే పరిణామాలు

సంబంధిత లెజిస్లేటివ్, న్యాయపరమైన ప్రక్రియ పూర్తయిన తర్వాత యూకేతో జరిగిన వాణిజ్య ఒప్పందం అమల్లోకి వస్తుంది. అటు ఈయూ కౌన్సిల్, యూరోపియన్ పార్లమెంట్; ఇటు భారత పార్లమెంటు ఆమోదం తర్వాత యూరోపియన్ యూనియన్ (ఈయూ)తో జరిగిన ఒప్పందం ఖరారవుతుంది. భారత్ – అమెరికా వాణిజ్య ఒప్పందం కొంత సమయం తీసుకొనే అవకాశం ఉంది. ఒప్పందాలు ఖరారయ్యే సమయంలో కొన్ని వ్యూహాత్మక సవాళ్లను భారత్ ఎదుర్కోవచ్చు. ఆ యా దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వలన దిగుమతుల పెరుగుదలతో పాటు, సున్నితమైన రంగాలలో ఉపాధి నష్టాన్ని భారత్ చవిచూడవచ్చు. దిగుమతి సుంకాలు తగ్గించనప్పటికీ ఉత్పత్తుల సర్టిఫికేషన్, పర్యావరణ, శ్రామిక ప్రమాణాలు, శానిటరీ, ఫైటో శానిటరీ అంశాలు భారత్‌కు సమస్యగా పరిణమించే అవకాశాలు ఉన్నాయి.

వ్యవసాయ సబ్సిడీలు ఆ యా దేశాలలో అధికంగా ఉన్నందువలన భారత రైతులు నష్టపోయే అవకాశం ఉంది. అందుకే ఈయూ, యూకే నుండి డైరీ ఉత్పత్తులు, ప్రాసెస్డ్ ఫుడ్ దిగుమతులను నిరోధించే విధంగా భారత్ ఒప్పందం చేసుకోవాలి. ఈయూ చివరి నిమిషంలో ‘వాతావరణ అనుసంధాన వాణిజ్య నియమాలకు’ పట్టుబట్టే అవకాశం ఉంది. తద్వారా భారత్ నుండి ఎగుమతయ్యే సిమెంటు, ఉక్కు, అల్యూమినియంపై ‘కార్బన్ ట్యాక్స్’ పడి, ఆ యా ఉత్పత్తుల విషయంలో పోటీతత్వం తగ్గుతుంది. అమెరికా కూడా ఒప్పందం సమయంలో డిజిటల్ వాణిజ్య సరళీకరణ, పటిష్ఠమైన మేధా సంబంధిత హక్కులు, వ్యవసాయం, మెడికల్ డివైజెస్‌కు సంబంధించిన డిమాండ్లు తెచ్చే అవకాశం ఉంది. భారత్ కూడా ఫార్మా రంగం, హెచ్–1 బి వీసాల సరళీకరణ లాంటి అంశాలు లేవనెత్తవచ్చు.

◆ పశ్చిమ దేశాల మార్కెట్‌లతో పాటు చైనాపై అధికంగా ఆధారపడేకన్నా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలతో వాణిజ్య సంబంధాలను మెరుగుపరచుకోవడానికి భారత దేశం ప్రయత్నించాలి.

చేరకపోవడమే సముచితం

చైనా కేంద్ర బిందువుగా ‘ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం’ (ఆర్‌సీఈపీ) ఏర్పాటయింది. ఆస్ట్రేలియా, చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఆసియాన్ దేశాలు, న్యూజిలాండ్ ఇందులో సభ్య దేశాలు. దీని ఏర్పాటుకు సంబంధించిన చర్చలలో భారత్ పాల్గొన్నప్పటికీ, ఒప్పందం సమయంలో సభ్యత్వం పొందడాన్ని విరమించుకొంది. ఈ ఒప్పందం వలన రైతులు, ఎంఎస్ఎంఈ సంస్థలకు నష్టం కలుగుతుందనీ, వాణిజ్య లోటు అధికమవుతుందనీ, ప్రాంతీయ వాణిజ్యంలో చైనా ఆధిపత్యం ఉంటుందనీ భారత్ భావించింది. డైరీ, వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి ప్రపంచ మార్కెట్‌లో న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలతో భారత్ పోటీ ఎదుర్కొంటోంది. ఒప్పందం వలన గోధుమ, పామాయిల్, మిల్క్ పౌడర్ లాంటి ఉత్పత్తులు చౌకగా భారత్‌లోకి దిగుమతి అయినట్లయితే రైతులు నష్టపోయేవారు.

ఆ యా దేశాలు అవలంబించే డంపింగ్‌ను నియంత్రించడానికి సరిపోను రక్షణ వలయం విషయంలో భారత్ వెనుకబడి ఉంది. రసాయనాలు, యంత్రాలు, ఉక్కు, ఎలక్ట్రానిక్స్, ఆట వస్తువులు చైనా నుండి భారత్ మార్కెట్‌లోకి ప్రవేశించే అవకాశం ఎక్కువ. చౌకధరలకు ఉత్పత్తులు మార్కెట్‌లో లభ్యమయినప్పుడు ఆ యా రంగాలకు సంబంధించిన పరిశ్రమలు తీవ్ర నష్టాన్ని చవిచూస్తాయి. ఈ ఒప్పందంలో భారత్ భాగం కాకపోవడాన్ని సమర్థవంతమైన నిర్ణయంగా చూడాలి.

ఏ వ్యూహం అవసరం?

పశ్చిమ దేశాల మార్కెట్‌లతో పాటు చైనాపై అధికంగా ఆధారపడే కన్నా ఫార్మల్ అగ్రిమెంట్స్ లేకపోయినప్పటికీ కొన్ని దేశాలతో భారత్ వాణిజ్య సంబంధాలను మెరుగుపరచుకోవాలి. ఆఫ్రికా ప్రస్తుత జనాభా 1.4 బిలియన్లు కాగా 2050 నాటికి 2.5 బిలియన్లకు చేరుతుందని అంచనా. ఆఫ్రికాలోని కెన్యా, నైజీరియా, ఈజిప్ట్, దక్షిణాఫ్రికాలతో వాణిజ్య ఒప్పందాలకు భారత్ ప్రయత్నించాలి. ఆఫ్రికాతో ఒప్పందం కారణంగా ఆహార భద్రత, శక్తి, ఖనిజాలు, అవస్థాపనా సౌకర్యాల ప్రాజెక్టులు, ఫార్మా రంగంలో భారత్‌కు వ్యూహాత్మక ప్రయోజనాలు కలుగుతాయి. వాణిజ్యపరమైన అడ్డంకులు తక్కువగా ఉండటంతో పాటు ఆఫ్రికా వృద్ధి రేటు అధికంగా ఉండటాన్ని గమనించవచ్చు.

భారత్ ఉత్పత్తులకు స్థిరమైన డిమాండ్ ఉన్న మిడిల్ ఈస్ట్‌లోని యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్‌లతో వాణిజ్య సంబంధాలను మెరుగు పరచుకోవడానికి ప్రయత్నించాలి. ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులు, టెక్స్‌టైల్స్, ఆభరణాలు, ఫార్మా, ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులు, మెషినరీ, హ్యాండీక్రాఫ్ట్స్, ఆయుర్వేదిక్, హెర్బల్, వెల్‌నెస్ ఉత్పత్తులకు ఆ యా మార్కెట్‌లలో డిమాండ్ ఉంది.

లాటిన్ అమెరికాలోని బ్రెజిల్, మెక్సికో, చిలీ, పెరూ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు అవసరం. ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్, ఇనుము, ఉక్కు, టెక్స్‌టైల్స్ ఉత్పత్తులకు బ్రెజిల్‌లో డిమాండ్ అధికం. మొత్తంగా లాటిన్ అమెరికా మార్కెట్‌లోనే వీటికి డిమాండ్ అధికంగా ఉన్నందువలన భారత్‌కు వాణిజ్యపరంగా లాభదాయకంగా ఉంటుంది. చిలీ, పెరూ, మెక్సికోతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కొరకు చర్చలు జరుగుతున్న సమయంలో భారత్ వేగంగా స్పందించడం ద్వారా ఒప్పందాలను ఖరారు చేసుకోవాలి. తక్కువ దిగుమతి సుంకం, మార్కెట్ లభ్యత కారణంగా భారత్ ఎగుమతులు పెరుగుతాయి.

‘స్మార్ట్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని’ అవలంబించడం ద్వారా వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌లపై దృష్టి సారించాలి. అత్యంత సరళీకరణ ఒప్పందాలు వాణిజ్య లోటు పెరుగుదలకు దారి తీస్తాయి. వస్తువులకు సంబంధించిన ఒప్పందాల వలన పరిమిత ప్రయోజనాలే సిద్ధిస్తాయి కనుక తయారీ, సేవలకు సంబంధించిన ఒప్పందాలపై భారత్ భవిష్యత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలి. వాణిజ్య ఒప్పందాల ద్వారా అధిక ప్రయోజనాలు పొందాలంటే శ్రామిక మార్కెట్లు, లాజిస్టిక్స్, తయారీ రంగం, సేవల వాణిజ్యం, మౌలిక సౌకర్యాల రంగాలలో సంస్కరణలు అవసరం.

వ్యాసకర్త వైస్ ఛాన్స్‌లర్ (ఇన్‌ఛార్జి), ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, హైదరాబాద్

ఆశను కూల్చే ఆయుధం ఏదీ లేదు!

అసమాన సమాజం ఎప్పుడూ అభద్రతా భావనలోనే ఉంటుంది. అందుకే, దానికి అక్షరాలంటే తెగని భయం. ప్రతీ మనిషికి ఒకే విలువ అనే ఆలోచనే దానికి కంపరం కలిగిస్తుంది. ప్రతీ వ్యవస్థ ప్రజాతంత్రం కాగలదనే ధైర్యమే దానికి వణుకు పుట్టిస్తుంది. అలా దశాబ్దాలుగా ఈ దోపిడీ సంఘాన్ని పీడిస్తున్న కల పేరు జాక్ లండన్ ‘ఉక్కుపాదం.’ ఉక్కుపాదానిది శాశ్వతమైన ఉక్కబోత. శ్రమశక్తి ఎప్పుడు చైతన్యం పొందుతుందో అనే బెంగ. ఎన్నిరకాల ముసుగులు ధరించినా ఇంకా ఏదో బెదురు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ దేశం మీదా అజమాయిషీ చేస్తుంది. దాడులు చేస్తూ పెత్తనం కోసం యుద్ధోన్మాదాన్ని ప్రేరేపిస్తుంది. ఇన్ని చేస్తున్నా కూడా నిత్యం అది అసంతృప్తిలో రగులుతూనే ఉంటుంది. ఉక్కుపాదానికి తెలుసు ఎప్పటికైనా తన పీచమణచగలిగేది ఒక్క ఉక్కు పిడికిలి మాత్రమే అని. అందుకే, అది ముందునుంచే జాగ్రత్త పడుతుంది. అణగారిన వర్గాలు ఏకం కాకుండా జిత్తులెన్నయినా కనిపెడుతుంది. తన అజమాయిషీ చలాయించడం కోసం, అక్రమ సంపాదన ఆస్తిపాస్తులు కాపాడుకోవడం కోసం ఎంతటి విధ్వంసానికయినా తెగిస్తుంది. అదంతా ఈ నవలలో పాఠకుడికి కనిపిస్తుంది.

జాక్ లండన్ ‘ఉక్కుపాదం’... అవడానికి కాల్పనిక నవల అయినా కూడా, సమాజంలోని వాస్తవికతను స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. అనేక రకాల ఆడంబరమైన అబద్ధాలకు, అసంబద్ధ కట్టుకథలకు ఆలవాలమైన అమెరికన్ సాహిత్యంలో ‘ఉక్కుపాదం’ నవల ఒక ఉప్పెన. ఆధిపత్య వ్యవస్థపై కార్మిక కొరడా. ఇందులోని కథానాయకుడు ఎర్నెస్ట్ ఎవర్హార్డ్ కల్పిత పాత్ర కాదు. సకల జనుల హితం కోసం జీవితాంతం రాజీలేని కృషి చేసిన అనేకమంది ప్రజాపక్ష మేధావులు, ప్రశ్నించే బుద్ధిజీవులకి ప్రతి రూపం. దశాబ్దాల క్రితమే ఈసరికే అనేక సార్లు ‘ఉక్కుపాదం’ తెలుగులో ప్రచురించబడింది. మరి, మళ్ళీ మళ్ళీ ఎందుకు చదవా లనే ప్రశ్న సహజంగానే వస్తుంది. నిజానికి ఇది కేవలం సాహితీ సంబంధమైన గ్రంథం కాదు. నిర్దిష్టమైన భావజాల క్రియాశీలతకు భవిష్యత్తు రూపం. మరి అటువంటి పుస్తకం ఈ తరానికి ఎంత వరకు అందుబాటులో ఉందనేదే అసలు ప్రశ్న. ఎప్పటికంటే ఎక్కువగా పేట్రేగిపోతున్న ఉక్కు పాదపు ఆగడాల్ని గురించిన చర్చను చేపట్టడం ఇప్పుడున్న స్థితిలో చాలా కీలకం.

కులతత్వం, మతోన్మాదం, మద్యం, మాదక ద్రవ్యాలు యువతను ప్రలోభ పెడుతున్నాయి. కార్పొరేట్ విద్య, సినిమాలు, మొబైల్ ఫోన్‌లు సరేసరి. ఇలాంటి సమయంలో అంతా బానే ఉందన్న ఆధిపత్య ప్రచారాన్ని అడ్డుకోవడమే అభ్యుదయ వాదుల కర్తవ్యం. ఎన్ని ఉద్యమాలు వచ్చినా ఏమీకాదనే అక్రమార్కుల అత్యాశను చీల్చి చెండాడటమే ప్రగతిశీల శక్తుల ప్రధాన లక్ష్యం. అందుకే, ‘ఉక్కుపాదం’ గూర్చి ఈ చిత్రణ. ఓ ఆశను పెంపొందించే ప్రేరణ. పుస్తకం చదవడం అంటే భావాలతో చేసే అక్షర కార్యాచరణ అని అర్థం. సమసమాజ స్థాపనే దీని అంతిమ పరమార్థం. అందులో భాగమే ఈ అసంపూర్ణ ‘ఉక్కుపాదం’ కథ. ‘అంటరాని వసంతం’ లాగానే ఇది కూడా అర్ధంతరంగా ఆగింది. అందులో రూతు, ఇందులో ఎవిస్. ఇద్దరూ స్త్రీలే. ఇరువురివీ చెదిరిన జ్ఞాపకాలే! చెలరేగిన స్మృతుల సంఘర్షణలే!!

అలా ఆలోచనల్లో ఆగిన పోరాటాలన్నీ మనిషి కోసం ఆచరణలో కచ్చితంగా మునుముందుకే సాగుతాయి. పీడితుల పక్షాన నినదించే జనస్వరాలు ఒక్కోసారి బలహీనం కావొచ్చు. కానీ, భవిష్యత్తు మానవాళి ప్రస్థానంలో తప్పక బలోపేతం అవుతాయి. అంతిమంగా అసంఖ్యాక, అజరామర విజయగాథలవుతాయి.

– గౌరవ్

అంతరిక్షానికి ఎగసి...

వైజ్ఞానిక వేగుచుక్కలు-38

మధ్యతరగతి సర్దుబాటు పరిస్థితుల్లోంచి ఎగిసిన రాకెట్ లాంటి వ్యక్తి కల్పన. ఆమె ఎప్పటికీ అంతరిక్షంలో వన్నెతగ్గని మెరుపుతార! సాహసం, తెగువ, క్రమశిక్షణ, పట్టుదల కల్పనను పరిపూర్ణ వ్యక్తిగా నిలిపాయి. నేటి యువతకు కలకాలం స్ఫూర్తినివ్వగల అద్భుతమైన వ్యక్తిత్వం ఆమెది. మనమంతా ఆనందించే ఒక సంఘటన 2004 ఆగస్టు 4న ‘నాసా’ తన కొత్త కంప్యూటర్‌కు కల్పనా చావ్లా స్మృత్యర్థం ‘కేసీ’ (ఓఇ) అని నామకరణం చేయడం! 2003 ఫిబ్రవరి 1న అమెరికా అంతరిక్ష నౌక ‘కొలంబియా’ ప్రమాదానికి లోనై పేలిపోయింది. అందులోని ఏడుగురు వ్యోమగాములు మరణించారు. అందులో ఫ్లైట్ ఇంజనీర్, మిషన్ స్పెషలిస్ట్ కల్పనా చావ్లా కూడా ఒకరు. అంతరిక్షంలో ప్రయాణం చేసిన మొదటి భారతీయ మహిళ కల్పనా చావ్లా. ఆమె పేరున కంప్యూటర్ రావడం ఎవరికైనా ఆనందదాయకమే!

కల్పనా చావ్లా

హర్యానాలోని కర్నాల్ పట్టణంలో బనారసీ లాల్, సంగీతా చావ్లా దంపతులకు నాలుగవ సంతానంగా కల్పన 1962 మార్చి 17న జన్మించారు. డ్రాయింగ్ క్లాసులో విమానం బొమ్మలు వేయడం చిన్నారి కల్పనకు తగని మక్కువ. చండీగఢ్‌లోని పంజాబ్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పట్టా పొందింది. ఏరోస్పేస్ విభాగంలో అగ్రగామిగా నిలిచి అమెరికా నుంచి ఆహ్వానం అందుకుంది. 1988లో కొలరాడో యూనివర్సిటీ నుంచి ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ పొందింది. అదే ఏడాది ‘నాసా’ పరిశోధనా విభాగంలో చేరింది. స్పేస్ షటిల్‌లోని కాక్‌పిట్‌లో లోపాలు కనుగొనడం, ప్రమాదాల్లో బతికి బట్ట కట్టడం వంటి అంశాల్లో నిపుణురాలైంది. 1997 నవంబరు 19 నుంచి డిసెంబరు 5 వరకు భూమి చుట్టూ 252 సార్లు తిరిగింది.

1998 జనవరి నాటికి షటిల్‌కు సంబంధించిన సిబ్బంది నాయకురాలిగా, పరికరాలకు పర్యవేక్షకురాలిగా ఎదిగారు. 2003 జనవరి 17న కొలంబియా అంతరిక్షయానం ప్రారంభించినప్పుడు కల్పనా చావ్లా అందులో నిపుణురాలిగా ఉన్నారు. అంతకుముందు మన దేశం నుంచి కొంతమంది బాల బాలికలను ‘నాసా’ కార్యక్రమానికి తాను ఖర్చు భరించి ఆహ్వానించింది. అంతే కాదు కొలంబియా అంతరిక్ష నౌక నుంచి పంజాబ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఇ–మెయిల్ ద్వారా ఎంతో స్ఫూర్తినిచ్చే సందేశాన్ని పంపింది.

ప్రమాదానికి లోనైన కొలంబియా ప్రయాణానికి ముందు ‘డూయింగ్ ఇట్ ఎగైన్ ఈజ్ లైక్ ఎ డ్రీమ్, ఎ గుడ్ డ్రీమ్ ఒన్స్ ఎగైన్’ అన్నారు. ఆమె జీవన గమనంలోని ప్రారంభం, కొనసాగింపు, ముగింపులు కూడా ఒక అద్భుతమైన రీతిలో సాగి మనందరికీ నిత్యస్ఫూర్తిగా మారాయి.

– డా॥ నాగసూరి వేణుగోపాల్ । ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

పెరిగిన విశ్వాసం

డేటా పాయింట్

నగర భారతీయుల కంటే గ్రామీణ భారతీయులు ఆర్థికంగా మరింత ఆత్మవిశ్వాసంతో ఉన్నట్టు ‘రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా’ నిర్వహించిన ‘కన్జ్యూమర్ కాన్ఫిడెన్స్ సర్వే’ తెలియజేస్తోంది. తమ పరిస్థితి గతంలో కంటే తగ్గింది/క్షీణించింది అన్నవారి కంటే, మెరుగైంది/పెరిగింది అన్నవారి శాతం ఎక్కువ.

అంశాల వారీగా సర్వేలో తమ ఆర్థిక స్థితి గురించి గ్రామీణ భారతీయుల స్పందన ఇలా ఉంది...



మనసు విశాలమైతే...

జ్యోతిర్మయం

జీవితంలో అనేక కష్టాలను ఎదుర్కొన్న ఒక వ్యాపారవేత్త ఓ గౌరవనీయమైన ఆధ్యాత్మిక గురువు వద్దకు వెళ్లి తన పరిస్థితి గురించి చెప్పి తెగ బాధపడ్డాడు. ‘గురువుగారూ! నా జీవితంలో అంతా ముగిసిపోయింది. ఏదీ సరిగ్గా లేదు. నేననుకున్నట్లు ఏదీ లేదు. ఇటువంటి స్థితిని ఎలా అధిగమించాలి’ అని అడిగాడు. అంతట గురువు ‘చింతించకు! నేను నీకు ఒక మందు ఇస్తాను’ అంటూ ఒక గ్లాసులో నీరు తీసుకొని, దానిలో నాలుగు చెంచాల ఉప్పు కలిపి వ్యాపారవేత్తకు ఇచ్చి దానిని తాగమన్నారు. గురువుగారిచ్చారు కదా అని అది తాగిన వ్యాపారవేత్తకు వికారం కలిగి నీటిని ఉమ్మివేసాడు. ‘మరీ ఇంత ఉప్పు నీటినెలా తాగనూ... ఆ మాటకొస్తే నేనే కాదు, ఎవరూ తాగలేరు’ అన్నాడు వ్యాపారవేత్త.

‘అలాగా! సరే నాతో రా’ అంటూ అతనిని అక్కడికి దగ్గరలో ఉన్న ఒక కొలను వద్దకు తీసుకెళ్ళారు గురువుగారు. కొలనులో నాలుగు చెంచాల ఉప్పు వేసి అందులో నుంచి ఓ గ్లాసెడు నీటినిచ్చి తాగమన్నారు గురువు. వ్యాపారవేత్త తాగాడు. ‘ఇప్పుడు నీరెలా ఉంది’ అని అడిగారు గురువుగారు. ‘బాగుందండీ’ అన్నాడు వ్యాపారవేత్త. పైగా రుచిగానూ ఉందని గ్లాసుడు నీరూ తాగేశాడు. ‘ఔనా! నేనందులోనూ అదే 4 చెంచాల ఉప్పును వేశానుగా, అటువంటప్పుడు ఎలా రుచిగా ఉంటుంది’ అని అడిగారు గురువుగారు. ‘గురువుగారూ! మీరు నన్ను ఆట పట్టించకండి. మొదట్లో ఓ గ్లాసెడు నీటిలో ఉప్పు కలిపి తాగించారు. అది వికారం కలిగించింది. ఇదేమో పెద్ద కొలను... అందులో నాలుగు చెంచాల ఉప్పు ఏ మూలకు? అందుకే నాకు వికారం కలగలేదు’ అన్నాడు వ్యాపారవేత్త. అప్పుడు గురువు గారు ‘నీ మనస్సును ఓ గ్లాసెడు నీటిలా ఎందుకు ఉంచుకోవడం? దానిని ఒక కొలనులా ఉంచుకో... అప్పుడు ఎదురయ్యే చింతలన్నీ ఉప్పులా కరిగిపోయినా నీకే ఇబ్బందీ ఉండదు. ఒత్తిడి ఉండదు. జీవితం దేన్నయినా అధిగమించగలదు. జీవితంలో అడుగడుగుకీ ఎంత ఒత్తిడి ఎదురైనా, ఏ బాధ వచ్చినా అవి నిన్నేమీ చేయలేవు’ అని ధైర్యం చెప్పారు. దీంతో తత్త్వం బోధపడిన వ్యాపారి ఆనందంగా ఇంటికి చేరుకున్నాడు.

– యామిజాల జగదీశ్

ముచ్చటైన మరో మూడు పక్షులు

శేషాచల అడవుల్లో గుర్తించిన గరుడ అట్లాస్ బృందం

తిరుపతి ప్రాంతంలో ఇప్పటివరకు 274 పక్షిజాతుల గుర్తింపు

తిరుపతి సిటీ: తిరుపతి శేషాచల అడవుల్లో తిరుపతి నేచర్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ సహకారంతో మరో మూడు అరుదైన పక్షి జాతుల్ని గుర్తించినట్టు గరుడ అట్లాస్ బృందం ఆదివారం వెల్లడించింది. తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐజర్) బృందంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 50 మంది పరిశోధకులు పక్షిజాతుల గణన, వాటి వైవిధ్యం, మనుగడ, జీవన విధానంపై ప్రత్యేక సర్వే చేపట్టారు. 2022లో ఏర్పడిన తిరుపతి బర్డ్ అట్లాస్ ఇటీవల గరుడ అట్లాస్‌గా పేరు మార్చుకుని తిరుపతి పరిసర ప్రాంతాల్లోనూ, శేషాచల అడవుల్లోనూ సంచరించే పక్షిజాతుల డేటాను సేకరించేందుకు శ్రీకారం చుట్టింది. విడతల వారీగా అటవీ ప్రాంతాలలో సర్వే చేపట్టి అరుదైన పక్షి జాతులను గరుడ అట్లాస్ బృందాలు కెమెరాల్లో బంధిస్తున్నాయి. తిరుపతి ప్రాంతంలో తొలిసారిగా పసుపు చెంప పిట్ట (ఇండియన్ ఎల్లో టిట్) అనే అరుదైన పక్షిని కనిపెట్టామని గరుడ అట్లాస్ ప్రతినిధులు చెప్పారు. వీటితో పాటు పసుపు గొంతు బుల్‌బుల్ పిట్ట (ఎల్లో థ్రోటెడ్ బుల్‌బుల్), లీసెర్ విజిలింగ్ డక్ బేబీ వంటి అరుదైన పక్షిజాతులు తిరుపతి ప్రాంతంలో ఉండటం విశేషమన్నారు. కొండలపై నివసించే రాప్టర్ ఐన్ షాహీన్ ఫాల్కన్ పక్షులు సైతం తిరుమల ఘాట్ రోడ్డులో ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడం హర్షణీయమని తెలిపారు.


పసుపు చెంప పిట్ట
పసుపు గొంతు బుల్‌బుల్ పిట్ట
లీసెర్ విజిలింగ్ డక్ బేబీ

ఇప్పటివరకు 274 పక్షిజాతుల గుర్తింపు

మానవ సమాజంతో పక్షి జాతుల అనుబంధాన్ని బలోపేతం చేసేందుకు ఈ సర్వే చేపట్టినట్లు ఐజర్ బృందంలో పరిశోధకుడైన హరీష్ పేర్కొన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తమ బృందాలు ఇప్పటివరకు తిరుపతి పరిసర ప్రాంతాల్లో 55 వేల పక్షుల గమనాలను పరిశీలించాయని చెప్పారు. ఇందులో 274 పక్షిజాతులు ప్రకృతిలో మమేకమై ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 5 ఎడిషన్లలో పక్షి జాతుల డేటాను సేకరించామని, వాటిని పూర్తి స్థాయిలో మ్యాపింగ్ చేశామని తెలిపారు. ఆయన వెంట పుష్యామిత్ర, టీఎన్ఎస్ ప్రతినిధి పి రామచంద్రారెడ్డి తదితరులున్నారు.

క్లుప్తంగా...

సరుకు రవాణాలో విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) 2025–26 ఆర్థిక సంవత్సరంలో 327 రోజుల్లోనే 80.08 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేసి రికార్డు సృష్టించింది. గతంలో ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి పోర్టుకు 350 రోజులకు పైగా సమయం పట్టేది. అధికారుల వ్యూహాత్మక కృషి, అత్యాధునిక నిర్వహణ సామర్థ్యమే ఈ విజయానికి కారణమని పోర్టు ఇన్‌చార్జ్ చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యమైన 90 మిలియన్ మెట్రిక్ టన్నులను ముందుగానే చేరుకుంటామన్నారు. ఈ ఘనతకు కారణమైన సిబ్బంది, స్టేక్ హోల్డర్లను డా.అంగముత్తు అభినందించారు.

చేనేతకు కేటాయింపులు లేకపోవడం విచారకరం

సాక్షి, అమరావతి: రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి తగిన కేటాయింపులు లేకపోవడం విచారకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను ఆదివారం మీడియాకు విడుదల చేశారు. ఏళ్ల తరబడి చేనేత కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు పేరుకుపోయాయని లేఖలో పేర్కొన్నారు. అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడిన నేతన్నల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వకుండా అధికారులు మెలికలు పెడుతున్నారన్నారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత, జౌళి రంగానికి తగిన కేటాయింపులు చేసి నేతన్నల ఆత్మహత్యలను నివారించాలని, చేనేతల బకాయిల చెల్లింపునకు చర్యలు చేపట్టాలని ఆ లేఖలో కోరారు.

మార్చిలో అందుబాటులోకి తిరుమల ఫుడ్ ల్యాబ్

సాక్షి, అమరావతి: తిరుమలలో అత్యాధునిక ఫుడ్ ల్యాబొరేటరీ సేవలు మార్చిలో అందుబాటులోకి వస్తాయని వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.25 కోట్లతో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఏర్పాటు చేస్తున్న ఈ ల్యాబ్‌లో ప్రసాదాల తయారీకి వాడే ముడిపదార్థాల నాణ్యత పరీక్షలు చేపడతారన్నారు. ఫ్రాన్స్ నుంచి ఈ–టంగ్ అండ్ ఈ–నోస్ మిషన్లను రూ.3.5 కోట్ల వ్యయంతో సమకూరుస్తున్నట్టు వివరించారు. ఇవి నెయ్యి నాణ్యతలో అత్యంత సూక్ష్మ స్థాయిలో లోపం ఉన్నా గుర్తిస్తాయన్నారు.

మే 10 నుంచి 'మోదకొండమ్మ' ఉత్సవాలు

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్య దైవం, పాడేరులోని మోదకొండమ్మ తల్లి ఉత్సవాలకు ముహూర్తం ఖరారైంది. తెలుగు రాష్ట్రాల్లో రెండో అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన ఈ వేడుకలను ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. ఆదివారం పాడేరు ఎమ్మెల్యే, ఆలయ కమిటీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అధ్యక్షతన జరిగిన భక్తుల సమావేశంలో జాతర తేదీలను అధికారికంగా ప్రకటించారు. ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఈ ఏడాది మే 10, 11, 12 తేదీలలో మూడు రోజుల పాటు జాతర మహోత్సవాలు జరగనున్నాయి. ఈ ప్రతిపాదనను సమావేశానికి హాజరైన పెద్దలందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. కాగా ఈ ఏడాది కూడా ఉత్సవాల నిర్వహణ అధ్యక్షుడిగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును భక్తులు, పెద్దలు తిరిగి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని, జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

సర్కారు తీరు వల్లే సంక్షోభంలో 'చేనేత'

- ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి
- 'చేనేత గర్జన'లో ఐక్య కార్యాచరణ కమిటీ నేతల డిమాండ్
- ఏటా రూ.25 వేల సాయం హామీ ఏమైందని నిలదీత
- అర్హత ఉన్నప్పటికీ ఎందుకు పింఛన్లు ఇవ్వడం లేదని మండిపాటు
- నేత కార్మికుల నినాదాలతో దద్దరిల్లిన మంగళగిరి
- ఆలయం నుంచి నేతన్న విగ్రహం వరకు మహా ప్రదర్శన

దేవస్థానం నుంచి ర్యాలీగా వస్తున్న చేనేత నాయకులు, కార్మికులు

మంగళగిరి టౌన్ : చేనేత పరిశ్రమను చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని, ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు మండిపడ్డారు. తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన చేనేత కార్మికులు ఆదివారం గుంటూరు జిల్లా మంగళగిరిలో 'చేనేత గర్జన' పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. దేవస్థానం వద్ద నుంచి మొదలైన మహా ప్రదర్శన మెయిన్ బజార్, గౌతమ బుద్ధ రోడ్, ఎన్ఆర్ఐ హాస్పిటల్ మీదుగా నేతన్న సర్కిల్ వరకు సాగింది. అక్కడ నేతన్న విగ్రహానికి నూలు దండలు వేసి నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సభలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద ఉపాధి కల్పన రంగాల్లో ఒకటైన చేనేత రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, నేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నిమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఇప్పుడు ఇలా రోడ్డుపైకి వచ్చామని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి కనీసం రూ.25 వేల కోట్లు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.115 కోట్లు మాత్రమే కేటాయించడం చిన్నచూపు చూడడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకం కింద ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం అందించిందని, ఈ ప్రభుత్వం ఆ మేరకు కూడా సాయం చేయడం లేదన్నారు. కమిటీ కో కన్వీనర్లు పిల్లలమర్రి బాలకృష్ణ, బండారు ఆనంద ప్రసాద్‌లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేనేతలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్లాడుతున్నా, ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడం దురదృష్టకరం అన్నారు. కాగా, భారీగా తరలి వచ్చిన నేత కార్మికుల నినాదాలతో మంగళగిరి పట్టణం దద్దరిల్లింది. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు దుర్గారావు, రమేష్, కృష్ణప్రసాద్, మాచర్ల మోహన్, రామనాథం పూర్ణచంద్రరావు, అప్పారావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఇవీ నేతన్నల డిమాండ్లు

- చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాలి.
- రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం రూ.2 వేల కోట్లు కేటాయించడంతోపాటు సకాలంలో ఆ నిధులు విడుదల చేయాలి.
- ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ మేరకు చేనేత కార్మికులకు ఏటా రూ.25 వేలు బకాయిలు సహా వెంటనే ఇవ్వాలి.
- హ్యాండ్‌లూమ్‌కు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌కు 500 యూనిట్లు ఉచిత విద్యుత్‌పై వెంటనే ఆదేశాలివ్వాలి.
- మరణించిన చేనేత కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- ప్రభుత్వ సంస్థలు చేనేత వస్త్రాలను వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలి.
- ప్రతి చేనేత కుటుంబానికి మూడు సెంట్ల భూమిని కేటాయించి హౌస్ కమ్ షెడ్లు నిర్మించాలి.
- చేనేత కార్మికులకు పెన్షన్ల మంజూరులో జాప్యం నివారించాలి.
- చేనేత సహకార సంఘాల పాలక మండళ్లకు వెంటనే ఎన్నికలు జరపాలి. చేనేతకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి.
- కేంద్ర స్థాయిలో హ్యాండ్‌లూమ్ బోర్డును పునరుద్ధరించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

'సీమ' ప్రాజెక్టులపై రాజీపడే ప్రసక్తేలేదు

- ప్రజలతో కలిసి ఐక్య పోరాటాలు చేస్తాం
- తెలంగాణ సీఎం కోసం చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్ పనులు ఆపేయడం దుర్మార్గం
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఆయనెందుకు మాట్లాడటంలేదు?
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో ఎస్వీ మోహన్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, శ్రీదేవి

జల గళం

కర్నూలు (టౌన్) : రాయలసీమ ప్రాంత ప్రయోజనాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని, ప్రజలతో కలిసి ఐక్య పోరాటాలు చేస్తామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి తేల్చిచెప్పారు. భవిష్యత్తులో కరువు ముప్పును నివారించాలంటే రాయలసీమ ఎత్తిపోతల పథకమే ఈ ప్రాంతానికి శరణ్యమన్నారు. కర్నూలులో ఆదివారం ఆయన పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితో కలిసి మీడియాతో మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముందుచూపుతో పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు పెంచి సీమలోని ప్రతి రిజర్వాయర్‌ను నింపే అవకాశం కల్పించారని సతీష్‌రెడ్డి గుర్తుచేశారు. అలాగే, ఆయన కుమారుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాయలసీమలో కరువులేకుండా చేసేందుకు శ్రీశైలం రిజర్వాయర్‌లో 800 అడుగుల నీటిమట్టం నుంచే పోతిరెడ్డిపాడు ద్వారా నీరు తీసుకునేలా రాయలసీమ ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

రాష్ట్ర ప్రయోజనాలను బాబు తాకట్టు పెట్టడం దుర్మార్గం..

రాయలసీమను ఆదుకునేది రాయలసీమ ఎత్తిపోతల పథకమే. వైఎస్ జగన్ హయాంలో 80 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను చంద్రబాబు పూర్తిచేయకుండా తెలంగాణకు తాకట్టు పెట్టారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి క్లోజ్డ్ మీటింగ్‌లో చంద్రబాబును ఒప్పించి రాయలసీమలో ఎత్తిపోతల పథకాన్ని ఆపేశానని అసెంబ్లీలో ప్రకటించారు. దీనిపై చంద్రబాబు ఇప్పటివరకు మాట్లాడలేదు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టడం దుర్మార్గం. గతంలోనూ చంద్రబాబు తన పాలనలో సీమ ప్రాజెక్టులను పట్టించుకోలేదు. కర్నూలు జిల్లాలో గుండ్రేవుల ప్రాజెక్టును పూర్తిచేస్తేనే ఈ ప్రాంతానికి మేలు జరుగుతుంది.

మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు సిగ్గుచేటు..

ఇక మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం సిగ్గుచేటు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్న చంద్రబాబును వెంకన్నస్వామి క్షమించబోరు. ఇప్పటికే హెరిటేజ్ సంస్థ షేర్ రూ.654 నుంచి రూ.352కు పడిపోవడంతో ఆ సంస్థకు రూ.2,700 కోట్ల నష్టం వచ్చిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. నిజానికి.. వైఎస్ జగన్ హయాంలో నిర్మించిన ఇళ్ల ప్రారంభోత్సవాల్లో చంద్రబాబు కాళ్లకు బూట్లు వేసుకుని వెంకటేశ్వరస్వామి చిత్రపటంతో పూజలు చేశారు. అలాగే, కృష్ణా పుష్కరాల సమయంలోనూ అనేక ఆలయాలు కూల్చారు. ఈ సమావేశంలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, కంగాటి శ్రీదేవి కూడా మాట్లాడారు.

అబుల్ కలాం ఆజాద్‌కు వైఎస్సార్‌సీపీ ఘన నివాళి

అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, అమరావతి: స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ మొదటి విద్యా శాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఘనంగా నివాళులర్పించింది. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నేతలు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యా శాఖా మంత్రిగా దేశానికి ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. లౌకిక జాతీయవాదాన్ని బలంగా సమర్థించారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో వైఎస్ జగన్ హయాంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఎ.నారాయణమూర్తి, ఎస్ఈసీ మెంబర్ షేక్ మెహబూబ్, ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, బొందిలి విభాగం అధ్యక్షుడు సింగ్, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.సాయిబాబు, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి పాల్గొన్నారు.

అప్పులకు లెక్కలు చెప్పే దమ్ముందా?

- చంద్రబాబు ప్రభుత్వానికి ఎమ్మెల్సీ కుంభా రవిబాబు సవాల్
- 20 నెలల్లోనే రాష్ట్ర అప్పులు రూ.3.28 లక్షల కోట్లకు పైమాటే
- ఆదాయ వృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే అట్టడుగున నిలిపారు

సాక్షి, విశాఖపట్నం: చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో చేసిన అప్పులకు లెక్కలు చెప్పాలని, ఏయే రంగాలకు ఎంతెంత ఖర్చు చేశారో చెప్పే దమ్ముందా? అని వైఎస్సార్‌సీపీ నేత, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు సవాల్ విసిరారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం రెవెన్యూ వృద్ధిలో దేశంలోనే అట్టడుగు స్థానంలో ఉందని కాగ్ లెక్కలు చెబుతుంటే.. 11.09 శాతం జీఎస్‌డీపీ వృద్ధి సాధించామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పడం ప్రజలను మోసగించడమేనని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేసిన చంద్రబాబు.. ఆ నెపాన్ని గత వైఎస్సార్‌సీపీ పాలన పైకి నెట్టే ప్రయత్నం చేయడం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2019–24 మధ్య చేసిన అప్పు కేవలం రూ.3.31 లక్షల కోట్లు అయితే, చంద్రబాబు ప్రభుత్వం 20 నెలల్లోనే రూ.3.28 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని దివాళా తీయించే పరిస్థితికి తీసుకొచ్చిందని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ 2.75 లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేయడమే కాకుండా రాష్ట్రంలో 15 వేల సచివాయాలు నిర్మించడంతో పాటు 1.36 లక్షల మంది యువతకు శాశ్వత ఉద్యోగాలు కల్పించిందన్నారు. నాడు–నేడు కింద 17,710 ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారని, 10,795 రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలిచారని చెప్పారు. పోర్టులు, మెడికల్ కాలేజీలు.. తదితర నిర్మాణాలతో నిజమైన సంపద సృష్టించారని వివరించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ కూటమి ప్రభుత్వం విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, నిరుద్యోగులు, రైతులు, వ్యాపారులు.. అన్ని వర్గాల ప్రజలను నిలువునా ముంచిందని మండిపడ్డారు.

పరకామణి కేసులో కొత్త కుట్రలు

- సీఎం చంద్రబాబుపై భూమన ధ్వజం
- కోర్టు పరిధిలో ఉన్న కేసును తిరగదోడి అవినీతిపరుడైన అధికారితో వేధించే కుతంత్రం
- న్యాయస్థానాలంటే లెక్కలేదా బాబూ?
- కల్తీ మూలాలన్నీ మీ దగ్గరే..

సాక్షి ప్రతినిధి, తిరుపతి: న్యాయస్థానం పరిధిలో ఉన్న పరకామణి కేసును రాజకీయ వేధింపులే లక్ష్యంగా సీఎం చంద్రబాబు మళ్లీ తెరపైకి తెస్తున్నారని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు రాజకీయ ఉనికి కోసం దైవత్వాన్ని, న్యాయ వ్యవస్థను అపహాస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అపచారాలు చేస్తూ ఎదుటివారిపై నెట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ధ్వజమెత్తారు. లడ్డూ ప్రసాదంలో ఎలాంటి జంతుకొవ్వు లేదని, వైఎస్సార్‌సీపీకి దీంతో సంబంధం లేదని సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఏర్పాటైన సీబీఐ సిట్ తేల్చి చెప్పినా మళ్లీ అబద్ధాలకు తెర తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వన్ మ్యాన్ కమిషన్ వేయడం చట్టవ్యతిరేకమే కాదు.. సుప్రీం కోర్టును ధిక్కరించడం, అవహేళన చేయడమేనని, చంద్రబాబుకు న్యాయస్థానం మొట్టికాయలు వేయడం ఖాయమని స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి మూలాలు చంద్రబాబు సొంత సంస్థలైన హెరిటేజ్, ఇందాపూర్ డెయిరీల దగ్గరే ఉన్నాయని తేల్చి చెప్పారు. చంద్రబాబు చేసిన పాపాల వల్లే నాడు అలిపిరిలో క్లైమోర్ మైన్స్ పేలాయని ఎందుకు అనుకోకూడదని ప్రశ్నించారు. ఆదివారం తిరుపతిలో క్యాంపు కార్యాలయంలో మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి భూమన మీడియాతో మాట్లాడారు.

- పరకామణి కేసుకు సంబంధించి సీఐడీ సిట్ నివేదిక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వద్ద ఉంటే మళ్లీ తిరగదోడి కొత్త కేసు బనాయించాలన్న ఆలోచన ఎందుకు? అత్యంత అవినీతిపరుడైన ఓ డీఎస్పీకి విచారణ బాధ్యతలు అప్పగించనున్నట్లు మాకు సమాచారం ఉంది.
- లడ్డూ సువాసన రావడానికి 2018లోనే ఫ్లేవర్డ్ ఫీని రోజుకు 975 కేజీల చొప్పున రూ.5 కోట్ల విలువైన నెయ్యి ఎందుకు కొన్నారు చంద్రబాబూ? లడ్డూపై సువాసన రావడానికి నెయ్యి అద్దారు అంటే మీ హయాంలో కల్తీ నెయ్యి వాడారు అనే కదా అర్థం? అధికారంలోకి వచ్చిన వెంటనే లడ్డూ నాణ్యత పెంచడానికి శ్యామలరావును ఈవోగా నియమిస్తూ రెండో ఫైలుపై సంతకం చేశానని చెబుతున్న చంద్రబాబు.. అదే శ్యామలరావును 20 నెలలు గడవకముందే ఎందుకు పంపించేశారు?
- ఏడు కొండలు కోసం 746 జీవో తెచ్చి 352 కి.మీ. పరిధి అంతా తిరుమల క్షేత్రం అని నిర్ణయించిందే వైఎస్ రాజశేఖరరెడ్డి అయితే.. 2009 ఎన్నికల సభలో అదే జీవో 746ని రద్దు చేస్తామని మైనార్టీల సభలో మాట్లాడిన వ్యక్తి మీరు కాదా చంద్రబాబూ?
- తాను శాంతపరుడినని చెప్పుకొనే చంద్రబాబు గతాన్ని మర్చిపోవద్దు. ఎన్టీఆర్ అభిమాని మల్లెల బాబ్జీ, సీఎం సెక్రటరీ రాఘవేంద్రరావు, కాపులకు అత్యంత ప్రీతిపాత్రుడైన వంగవీటి రంగా మరణాల వెనుక మీ హస్తం ఉందన్న ఆరోపణలు ఎదుర్కోలేదా?
- రాష్ట్రంలో పోలీసులకు రెండేళ్లుగా సరెండర్ లీవులు, ప్రమోషన్లు, టీఏలు లేవు. ముద్దాయిలను కోర్టులకు తీసుకెళ్లడానికి తమ దగ్గర వాహనాలు లేవని డీజీపీ ప్రకటించడం దారుణం. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలతో 130 మంది సీఐలు వీఆర్‌లో ఉన్నారు.

సంక్షోభంలో వ్యవసాయం.. ఆర్థిక వ్యవస్థ కుదేలు

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాగిరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోందని, దీని వల్ల గ్రామీణ ఆర్థికవ్యవస్థ కుదేలవుతోందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాగిరెడ్డి చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదాయం లెక్కలు చూస్తేనే ఇది అర్థమవుతోందన్నారు. ఆయన ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థ మీద ఆధారపడిన రాష్ట్రం ఇప్పుడు వ్యవసాయ సంక్షోభంతో పూర్తిగా తిరోగమనంలో వెళ్తోందని చెప్పారు. తగ్గిపోయిన పన్ను వసూళ్లే ఇందుకు నిదర్శమన్నారు. రెండురోజుల కిందట తమ పార్టీ అధినేత వైఎస్ జగన్.. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు బడ్జెట్లో ఎలా ఉందనే అంశంపై ప్రెస్‌మీట్‌లో మాట్లాడారని గుర్తుచేశారు. ఆయన మాట్లాడిన వాటిపై ప్రభుత్వం నుంచి స్పందనలేకపోవడంతో ఆయన మాట్లాడినవన్నీ నిజమేనని తేలిపోయిందని చెప్పారు. 'పంటలకు మద్దతు ధరలు లేకపోవడం, ఉత్పత్తి తగ్గిపోవడం, మార్కెటింగ్ లేక వ్యవసాయం సంక్షోభంలోకి వెళుతోంది. ఇలాంటి ప్రధాన కారణాలను పక్కనబెట్టి బడ్జెట్ అంచనాలు పెంచుకుంటూ పోవడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదు. రైతుకు పెట్టుబడి ఖర్చు పెరిగినా దిగుబడి పెరగలేదు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. వైఎస్సార్, జగన్ పాలనలో రాయలసీమ ఇప్పటికే హార్టీకల్చర్ హబ్‌గా మారింది. వైఎస్సార్ విద్యుత్ బకాయిలు రద్దుచేసి ఉచిత విద్యుత్ ఇచ్చారు. మళ్లీ వైఎస్ జగన్ హయాంలోనే పగలు 9 గంటల విద్యుత్ ఇచ్చారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చింది వైఎస్సార్, జగన్ మాత్రమే. పూలు, పండ్ల ఉత్పత్తిలో రాష్ట్రంలో రాయలసీమ జిల్లాలదే అగ్రస్థానం. గతేడాది సంక్షోభం మొదలైందే రాయలసీమ ప్రాంతంలో హార్టీకల్చర్ పంటల నుంచి. మార్కెటింగ్ మీద దృష్టిపెట్టకపోవడమే ఇందుకు కారణం. రాష్ట్రంలో రూరల్ ఎకానమీ బలహీనంగా ఉంది. రైతులు, వ్యవసాయ కార్మికుల దగ్గర డబ్బులు ఉంటేనే గ్రామీణ ప్రాంతాల్లో చిన్న వ్యాపారులు బాగుంటారు' అని పేర్కొన్నారు. ఈ 20 నెలల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా ఎకరం భూమి ధర పెరగలేదని, దీనికి వ్యవసాయ సంక్షోభమే కారణమని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం వ్యవసాయ సంక్షోభంపై దృష్టిసారించాలని నాగిరెడ్డి కోరారు.

మానవత్వంతో పనిచేసేది డాక్ సేవకులే..!

గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో సీఎం చంద్రబాబు

హాజరైన కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, పెమ్మసాని

సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

పట్నంబజారు/నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): ఎంత టెక్నాలజీ వచ్చినా మానవత్వంతో పనిచేసేది డాక్ సేవకులేనని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. డాక్ సేవకులు లేకపోతే గ్రామీణ ప్రాంతంలో లాజిస్టిక్ వ్యవస్థ ఉండదని పేర్కొన్నారు. గుంటూరు నగర శివారులోని శ్రీసత్యసాయి స్పిరిచ్యువల్ సిటీలో ఆదివారం జరిగిన ఏపీ గ్రామీణ డాక్‌సేవక్ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్ సేవకులకు 150 ఏళ్ల చరిత్ర ఉందని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో పరోక్షంగా కీలకంగా పనిచేశారన్నారు. గతంలో లెటర్లు, మనీ ఆర్డర్ల కోసం పోస్ట్‌మెన్ ఎప్పుడు వస్తారా అని ఎదురుచూసే వాళ్లమని గుర్తుచేసుకున్నారు. భారతదేశం నంబర్–1 స్థానంలో ఉండాలంటే డాక్ సేవకుల పాత్ర కూడా కీలకమన్నారు. మెషిన్లు, ఏఐ ద్వారా ఏ పనైనా జరుగుతుందిగానీ మనిషి ఇచ్చే హ్యూమన్ టచ్‌ని మాత్రం డాక్ సేవకులు మాత్రమే ఇవ్వగలరని చెప్పారు. డాక్ సేవకులకు ఎలక్ట్రిక్ సైకిల్ ఇవ్వాలని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాని కోరుతున్నట్లు తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఏఐ సదస్సులో దేశం పరువు పోగొట్టేలా యూత్ కాంగ్రెస్ నేతలు అర్ధనగ్న ప్రదర్శనలు చేయడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ముఖ్య అతిథి, కేంద్ర కమ్యూనికేషన్‌ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ... తమ కుటుంబానికి ఏపీతో అవినాభావ సంబంధం ఉందని.. విశాఖకు సమీపంలో ఉన్న సింధియా గ్రామంతో తమ కుటుంబానికి సత్సంబంధాలున్నట్టు చెప్పారు. బాగా పనిచేసిన జీడీఎస్ సేవలను గుర్తిస్తామన్నారు. అనంతరం పోస్టల్ సేవల్లో ప్రతిభ కనపరిచిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ సమ్మేళనంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్లశాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమ ఉపాధ్యాయుల నిరసన గర్జన

నిరసనలో పాల్గొన్న ఉపాధ్యాయులు

పార్వతీపురం రూరల్: ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులపై అధికారుల ఒత్తిడి, వేధింపులను నిరసిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం వినూత్న నిరసన చేపట్టారు. తమ సమస్యలను ప్రభుత్వానికి విన్నవిస్తూ ఐటీడీఏ కార్యాలయం వద్ద గళమెత్తారు. సాంకేతిక కారణాల వల్ల యాప్‌లో హాజరు నమోదు చేయడం ఆలస్యమైందన్న నెపంతో 21 మంది హెచ్ఎంలకు మెమోలు జారీ చేయడంపై గర్జించారు. అధికారుల నిరంకుశ వైఖరికి నిరసనగా, జారీ చేసిన మెమోలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న ఐటీడీఏ కార్యాలయం వద్ద రాత్రి బస నిర్వహిస్తామన్నారు.

యూనియన్ బ్యాంక్ Union Bank of India
జోనల్ ఆఫీస్
విజయవాడ, 3వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్.అప్పారావు వీధి, వన్‌టౌన్, విజయవాడ-520001

విజయవాడ జోన్‌లో కంప్యూటర్లు, కంప్యూటర్ పెరిఫెరల్స్ మరియు యూపీఎస్ వ్యవస్థల AMC కోసం టెండర్ ప్రకటన

విజయవాడ జోన్ పరిధిలోని వివిధ శాఖలు / కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఐటీ ఆస్తులు (కంప్యూటర్లు మరియు పెరిఫెరల్స్) మరియు యుపియస్ వ్యవస్థల వార్షిక నిర్వహణ ఒప్పందం (AMC) కోసం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా – జోనల్ కార్యాలయం, విజయవాడ (జోనల్ కంప్యూటర్ సెల్–ZCC) ద్వారా అర్హత గల సంస్థల నుండి Sealed టెండర్లు ఆహ్వానించబడుతున్నాయి. ఈ AMC ఒప్పందం కాలపరిమితి 01-04-2026 నుండి 31-03-2027 వరకు ఉంటుంది. వివరాల కోసం మా బ్యాంక్ వెబ్‌సైట్ https://www.unionbankofindia.bank.in/en/common/tenders-empanelment లేదా ప్రభుత్వ ఈ టెండర్ పోర్టల్ https://eprocure.gov.in/epublish/app ను సందర్శించవలసిందిగా కోరడమైనది లేదా జోనల్ కార్యాలయం విజయవాడ నందు సంప్రదించవచ్చును.
సం/- (జోనల్ మేనేజర్)

వందలసార్లు చార్జ్ చేసినా... అస్సలు తగ్గని సామర్థ్యం!

జింక్ అయాన్ బ్యాటరీ ఆవిష్కరణ • నీటి ఆధారిత మూలకాలతో తయారీ

మనం ప్రస్తుతం వాడుతున్న బ్యాటరీలన్నీ మండే స్వభావమున్న రసాయనాలతో తయారు చేసినవే. వాటికి పూర్తి భిన్నంగా నీటి ఆధారిత అణువులతో రూపొందిన వినూత్న జింక్ అయాన్ బ్యాటరీని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మెటీరియల్స్ (సీఈఎన్ఎస్) పరిశోధకులు అభివృద్ధి చేశారు. దీంతో పునరుద్పాతక ఇంధన నిల్వ మరింత భద్రంగా, చవగ్గా, విశ్వసనీయంగా మారనుంది. ఈ విధానంలో తయారైన జింక్ అయాన్ బ్యాటరీని 500 సార్లు చార్జ్ చేసి వాడాక కూడా అచ్చం కొత్తదాని మాదిరిగా ఏకంగా 98 శాతం సామర్థ్యంతో పని చేస్తోందని పరిశోధకులు వెల్లడించారు! సౌర ఫలకాలు, విండ్ టర్బైన్ల నుంచి తయారైన విద్యుత్‌ను నిల్వచేసేందుకు దోహదపడే జింక్ భూమిపై చవగ్గా, సులభంగా, విస్తారంగా లభిస్తుంది. బ్యాటరీలో జింక్ ఒకవైపు పొరగా పనికొస్తుంది. మరోవైపు క్యాథోడ్‌గా ఏ మూలకాన్ని వాడాలనేది ఇన్నాళ్లూ సమస్యగానే మిగిలిపోయింది. ఈ సవాలుకు మాలిబ్డినం డైసల్ఫైడ్‌తో సీఈఎన్ఎస్ శాస్త్రవేత్తలు పరిష్కారం చూపారు. మాలిబ్డినం, సల్ఫర్‌లతో దాన్ని తయారుచేశారు. సల్ఫర్ నుంచి అత్యంత పల్చటి పొరలను అభివృద్ధి చేశారు. అవి శక్తిని నిల్వ చేసుకోవడమే గాక నిరంతరాయంగా సరఫరా కూడా చేయగలవని నిరూపించారు. నియంత్రిత వేడి వ్యవస్థ విధానం ద్వారా దీన్ని సుసాధ్యంచేశారు. దీంతో బ్యాటరీని చార్జ్ చేసినప్పుడు శక్తి సులభంగా లోపలికి వెళ్లడమే గాక అంతే సులభంగా డిశ్చార్జ్ అవుతోంది. భద్రమైన, అత్యంత సుస్థిరమైన ఆపరేటింగ్ పరిమితి అయిన 0.2–1.3 ఓల్ట్ స్థాయిని శాస్త్రవేత్తలు సాధించారు. తద్వారా బ్యాటరీ పాడవకుండా వందలసార్లు చార్జ్ చేసుకుని వాడుకోవచ్చు. చార్జింగ్ అనంతరం వాడే క్రమంలో కేవలం 0.3 శాతం శక్తి మాత్రమే వృథాగా పోతోంది. మిగతాదంతా బ్యాటరీలోనే నిల్వ ఉంటోంది. ఇలా 99.7 శాతం 'కొలంబిక్ ఎఫీషియెన్సీ' సాధించడం విశేషం. ఈ కాయిన్–సెల్ నమూనా బ్యాటరీని ఎల్‌సీడీ టైమర్‌కు చార్జింగ్ పెట్టడం ద్వారా వాణిజ్య స్థాయిలో విజయవంతంగా పరీక్షించారు. ఈ పరిశోధన వివరాలు అమెరికా కెమికల్ సొసైటీ 'ఎనర్జీ అండ్ ఫ్యూయల్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

– న్యూఢిల్లీ

నేటి పాత స్మార్ట్‌ఫోన్లే... రేపటి ఫైటర్ జెట్లు!

ఫోన్ల నుంచి అరుదైన మూలకాల వెలికితీతకు యత్నాలు

కొత్త ఫోన్ కొనగానే పాతదానిని చెత్త ఫోన్ అంటూ చెత్తబుట్టలో పడేయడం చాలామందికి అలవాటు. కానీ ఆ పాత ఫోన్‌లో 'రేర్ ఎర్త్ ఎలిమెంట్స్'గా పిలిచే అత్యంత విలువైన భూ అయస్కాంత మూలకాలు అత్యంత సూక్ష్మపరిమాణంలో ఉంటాయి. వాటిని విదేశాల నుంచి వేలాది కోట్లు వెచ్చించి దిగుమతి చేసుకునే బదులు ఈ పాత ఫోన్ల నుంచే సంగ్రహిస్తే? కేంద్రం ఇప్పుడు సరిగ్గా ఇలాంటి ఆలోచనే చేస్తోంది. తద్వారా లక్షల కోట్ల విదేశీమారక ద్రవ్యం ఆదా అవుతుందని భావిస్తోంది! ''టన్ను ముడిఖనిజం నుంచి కేవలం ఒక ట్రెండు కిలోల కోబాల్ట్ మాత్రమే తీయగలం. అదే టన్ను పాత బ్యాటరీల నుంచి ఏకంగా 50 నుంచి 80 కేజీల దాకా సమీకరించవచ్చు. పైగా ముడి ఖనిజ కోబాల్ట్ కంటే ఇది 40 ఎక్కువ గాఢత కలిగి ఉంటుంది'' అని గ్రేటర్ నోయిడా కేంద్రంగా పని చేసే లిథియం–అయాన్ బ్యాటరీ తయారీ సంస్థ 'లోహం' రీసైక్లింగ్ హెడ్ సయ్యద్ గజన్‌ఫర్ అబ్బాస్ సాఫ్వీ చెప్పారు. ''ఇప్పటికే ఎంతో శ్రమించి తయారుచేసిన స్మార్ట్‌ఫోన్ వంటి ఈ–వేస్ట్‌లో ఎంతో విలువైన ఖనిజాలుంటాయి. వాటిపై భారత్ ఇప్పటిదాకా సరైన దృష్టి సారించలేదు'' అని ఈ–వేస్ట్ మేనేజ్‌మెంట్, లిథియం–అయాన్ బ్యాటరీ కంపెనీ అట్టెరో సహ వ్యవస్థాపకుడు నితిన్ గుప్తా చెప్పారు. యుద్ధ విమానాలు అత్యంత తేలిగ్గా, అత్యంత దృఢంగా ఉండటానికి నియోడైమియం వంటి ఈ మూలకాలే కారణం. వాటిలో ఇంధనం ప్రవాహాలు, రెక్కల కదలికలు, కాక్‌పిట్‌కు కరెంటు సరఫరా చేసే జనరేటర్లను పర్యవేక్షించే సెన్సార్లకు అవే శక్తినందిస్తాయి. ''భారత్ ప్రస్తుతం ఈ–వేస్ట్‌ను విదేశాలకు అనవసరంగా ఎగుమతి చేస్తోంది. అలాగాక భారత్‌లోనే భారీగా శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. తద్వారా ఈ–వేస్ట్‌లోని భూ అయస్కాంత మూలకాలను సంగ్రహించి యుద్ధ విమానాల తయారీకి సద్వినియోగం చేసుకోవచ్చు. అత్యంత అరుదైన ఖనిజాల కోసం చైనా వంటి ప్రత్యర్థి దేశాలపై ఆధారపడే దురవస్థ తొలగుతుంది'' అని ముంబై కేంద్రంగా పనిచేసే శుద్ధ సాంకేతిక సంస్థ 'లీకో' సీఈవో గౌరవ్ దోల్వానీ అన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

అంతర్జాతీయ వేడుకలో మురికి రాజకీయాలా?

- కాంగ్రెస్‌పై మోదీ మండిపాటు
- ఏఐ సదస్సులో టీ–షర్టులు విప్పి నిరసనపై ఆగ్రహం
- మీరట్‌లో రూ.12,930 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం

ఆదివారం మీరట్‌లో మెట్రో, నమో భారత్ రైళ్లకు జెండా ఊపుతున్న మోదీ

మీరట్: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ఆ పార్టీ కార్యకర్తలు టీ–షర్టులు విప్పేసి నిరసన తెలపడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గొప్పగా నిర్వహించిన అంతర్జాతీయ కార్యక్రమాన్ని మురికి రాజకీయాలకు, సిగ్గుమాలిన రాజకీయాలకు కాంగ్రెస్ వేదికగా మార్చుకుందని మండిపడ్డారు. మోదీ ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో పర్యటించారు. రూ.12,930 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. మీరట్ మెట్రో రైలుకు పచ్చజెండా ఊపారు. నమో భారత్ రైలును ప్రారంభించారు. మెట్రో రైలులో ప్రయాణించారు. రైలులో విద్యార్థులతో, ప్రయాణికులతో ముచ్చటించారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. కాంగ్రెస్ తీరును తప్పుపట్టారు. సిద్ధాంతపరంగా ఆ పార్టీ దారుణంగా పతనమైందని మోదీ విమర్శించారు. ''కాంగ్రెస్ అన్ని హద్దులూ అతిక్రమించింది. ఆ పార్టీ ప్రవర్తనను దేశవ్యాప్తంగా అందరూ ఆక్షేపిస్తున్నారు. చేసిన తప్పుకు సిగ్గుపడాల్సింది పోయి టీ–షర్టులు విప్పేసి దేశాన్ని కించపర్చిన వారిని కాంగ్రెస్ నాయకులు ఆకాశానికి ఎత్తేస్తున్నారు'' అంటూ ధ్వజమెత్తారు. ఆ ఘటనను ఖండించిన ఇతర విపక్షాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. ఆయా పార్టీలు సత్యం పక్షాన, దేశ ప్రతిష్ట పక్షాన నిలిచాయని ప్రశంసించారు.

సొంత దేశాన్ని కించపరుస్తారా?

''దేశాన్ని అభివృద్ధి చేసుకోవడమే లక్ష్యంగా పౌరులు నిరంతరం శ్రమిస్తున్నారు. కానీ మన దేశం విజయాలు సాధిస్తుండడాన్ని కొన్ని పార్టీలు తట్టుకోలేకపోతున్నాయి. 80కిపైగా దేశాల ప్రతినిధులు, 20 దేశాల అధినేతలు పాల్గొన్న సదస్సులో చొక్కాలు విప్పేసి నిరసన తెలపడం సమంజసమేనా? కాంగ్రెస్ నిజస్వరూపం అందరికీ తెలుసు. చొక్కాలు విప్పి నగ్నంగా మరోసారి బహిర్గతం చేసుకోవాల్సిన అవసరమేమిటి? కాంగ్రెస్ దుస్థితిని నేతల చేష్టలను బట్టి అర్థం చేసుకోవచ్చు. సొంతదేశాన్నే కించపర్చే స్థాయికి దిగజారారు. ఒక ఊళ్లో పెళ్లి జరిగితే ఊరి వాళ్లంతా కలిసి దాన్ని వైభవంగా నిర్వహిస్తారు. వచ్చిన అతిథులు సంతృప్తిగా తిరిగి వెళ్తారు. మన దేశంలో మనం నిర్వహించుకొనే కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోవాల్సిన అవసరం లేదా? కాంగ్రెస్ నేతలు మోదీని ద్వేషించవచ్చు. నా సమాధిని తవ్వాలని అనుకోవచ్చు. నా తల్లిని దూషించవచ్చు. బీజేపీని, ఎన్డీయేను వ్యతిరేకించవచ్చు. వారి రాజకీయాలకు అది అవసరం కావొచ్చు. దాన్ని అర్థం చేసుకోగలం, సహించగలం. కానీ ఏఐ సదస్సు బీజేపీ కార్యక్రమం కాదని కాంగ్రెస్ గుర్తుంచుకోవాలి. అక్కడ బీజేపీ నేతలెవరూ లేరు. అది ప్రభుత్వ కార్యక్రమం. దేశ ప్రతిష్టను దెబ్బతీయడం సహించరాని విషయం'' అన్నారు.

మహిళలను ముందు పెట్టి రాజకీయమా?

కాంగ్రెస్ తీరుతో పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా జరగడం లేదని మోదీ ఆక్షేపించారు. ''కాంగ్రెస్ సభ్యులు సృష్టిస్తున్న అలజడి కారణంగా ఆ పార్టీ మిత్రపక్షాలకు సభలో మాట్లాడే అవకాశం రావడం లేదు. ఫిబ్రవరి 4న లోక్‌సభలో ప్రధాని స్థానాన్ని కాంగ్రెస్ సభ్యులు చుట్టుముట్టి నినాదాలు చేయడం, బ్యానర్లు ప్రదర్శించడం సిగ్గుచేటు. వాళ్లు నిజంగా ప్రధాని స్థానంలో కూర్చోవాలనుకుంటే ముందు ప్రజల హృదయాలు గెల్చుకోవాలి. మహిళా ఎంపీలను ప్రధాని స్థానం వద్దకు పంపి నినాదాలు చేయిస్తే ప్రధాని అయిపోతారా? మహిళలను ముందు పెట్టి రాజకీయం చేయడమేమిటి? మీలో చేవ చచ్చిపోయిందా? కాంగ్రెస్ ఈ దేశానికి పెద్ద భారంగా మారింది. నీచ రాజకీయాలు చేయొద్దని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలకు గతంలోనే సూచించా. అభివృద్ధి గురించి మాట్లాడాలని చెప్పా. అయినా బుద్ధి మార్చుకోవడం లేదు'' అంటూ దుయ్యబట్టారు. బీజేపీ ప్రభుత్వానికి దేశ అభివృద్ధి, ప్రజల సౌభాగ్యమే ముఖ్యమన్నారు. ''యూపీ ప్రగతికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. దశాబ్దాల క్రితం అరాచకానికి మారుపేరుగా ఉన్న యూపీ ఇప్పుడు అభివృద్ధి బాటలో పరుగులు తీస్తోంది'' అని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అత్యంత వేగవంతమైన మీరట్ మెట్రో

ఢిల్లీ–మీరట్ నడుమ 82 కిలోమీటర్ల రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టం (ఆర్ఆర్‌టీఎస్)లో మిగతా మార్గాలతో పాటు 23 కిలోమీటర్ల మీరట్ మెట్రోను ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించారు. ఇది దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రోగా చెబుతున్నారు. ఢిల్లీలో సరాయ్ కాలేఖాన్, న్యూ అశోక్‌నగర్ మధ్య 5 కిలోమీటర్ల మార్గాన్ని, మీరట్ సౌత్ నుంచి మోదీపురం దాకా 21 కిలోమీటర్ల మార్గాన్ని, మీరట్ సౌత్ నుంచి శతాబ్దినగర్ స్టేషన్ దాకా మెట్రో సెక్షన్‌ను ప్రారంభించారు. దీంతో ఢిల్లీ నుంచి మీరట్ వరకు ప్రయాణం గంటలోపే పూర్తవుతుంది. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఈ రైలుమార్గాన్ని అభివృద్ధి చేశారు. అలాగే మీరట్ సౌత్ నుంచి మోదీపురం దాకా మెట్రో రైలును ప్రారంభించారు. ఈ మార్గం పొడవు 23 కిలోమీటర్లు. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో మెట్రో రైలు ప్రయాణిస్తుంది. మీరట్ సౌత్ నుంచి మోదీపురానికి 30 నిమిషాల్లోపే చేరుకోవచ్చు.

ముగ్గురు జైషే ముష్కరులు హతం

జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కిష్టవార్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు జైషే మొహమ్మద్ ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ కాల్పుల్లో వారు దాక్కున్న ఇల్లు మంటల్లో చిక్కుకుంది. దాంతో మృతదేహాలు గుర్తుపట్టలేని రీతిలో కాలిపోయాయని అధికారులు వెల్లడించారు. వారిలో ఒకరిని సైపుల్లాగా ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. అతడు జైషే మొహమ్మద్ కమాండర్‌గా పని చేస్తున్నాడు. ఐదేళ్ల క్రితం పాకిస్తాన్ నుంచి జమ్మూకశ్మీర్‌లోకి ప్రవేశించాడు. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో చురుగ్గా కార్యకలాపాలు సాగిస్తున్నాడు. భద్రతా సిబ్బందిపై జరిగిన పలు దాడుల్లో సైపుల్లా హస్తముంది. పలు మార్లు భద్రతా సిబ్బందితో జరిగిన ఎన్‌కౌంటర్లలో తృటిలో తప్పించుకున్నాడు. ఆదివారం నాటి ఎదురు కాల్పుల్లో మరణించిన మిగతా ఇద్దరు ముష్కరులు ఎవరన్నది గుర్తించాల్సి ఉంది. ఘటనా స్థలంలో రెండు ఏకే–47 తుపాకులు సహా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. కిష్టవార్‌లో ఉగ్రవాదులు మాటువేసినట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో వెంటనే రంగంలోకి దిగామని, జమ్మూకశ్మీర్ పోలీసులతో కలిసి ఉమ్మడి ఆపరేషన్ చేపట్టామని తెలిపారు. ముష్కరులు ఉన్న ఇంటిని గుర్తించి అక్కడికి చేరుకోగా, వారు తమపై కాల్పులు జరిపారని పేర్కొన్నారు. ఆత్మరక్షణ కోసం ఎదురు కాల్పులు ప్రారంభించగా, వారు హతమైనట్లు స్పష్టంచేశారు.

ఆ సదస్సు టర్నింగ్ పాయింట్

- ఏఐ రంగంలో భారత్ అద్భుత విజయాలు
- వాటిని చూసి అధినేతలు ఆశ్చర్యపోయారు
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో భారత్ సాధించిన విజయాలు చూసి ప్రపంచ దేశాల అధినేతలు ఆశ్చర్యపోయారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సును కీలక టర్నింగ్ పాయింట్‌గా పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏఐ శక్తిని ఎలా వినియోగించుకోవాలో దిశా నిర్దేశం చేయడానికి సదస్సు తోడ్పడుతుందని తెలిపారు. 'మన్ కీ బాత్'లో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం దేశ ప్రజలనుద్దేశించి రేడియోలో ప్రసంగించారు. సదస్సుకు ప్రపంచ దేశాల అధినేతలు, పారిశ్రామిక వర్గాలు, సీఈఓలు, ఐఏ స్టార్టప్ రంగం ప్రతినిధులు, నవీన ఆవిష్కర్తలు హాజరయ్యారని గుర్తుచేశారు. ''సదస్సులో ప్రధానంగా రెండు అంశాలు దేశాధినేతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. వారు అమూల్ పాల కేంద్రాన్ని సందర్శించారు. రైతులు తమ పాడి పశువులను ఏఐ టెక్నాలజీతో నిరంతరం గమనించే తీరు పరిశీలించామన్నారు. మన ప్రాచీన గ్రంథాలు, విజ్ఞానం, రాతప్రతులను ఏఐ టెక్నాలజీతో పరిరక్షిస్తున్న తీరు, వాటిని నేటి తరానికి అందిస్తున్న వైనాన్ని చూసి ఆశ్చర్యపడ్డారు. సదస్సులో మూడు 'మేడిన్ ఇండియా' ఏఐ మోడల్స్ విడుదల చేశాం'' అని వివరించారు.

డిజిటల్ మోసాలతో జాగ్రత్త

ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మోదీ సూచించారు. ''ప్రధానంగా వృద్ధులు ఈ మోసాల బారిన పడుతుండటం ఆందోళనకరం. బ్యాంకుల కేవైసీ ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలి'' అన్నారు. టీ20 క్రికెట్ ప్రపంచ కప్‌లో విదేశాల తరఫున భారతీయ మూలాలున్న ఆటగాళ్లు చాలామంది ఆడుతుండటం పట్ల ప్రధాని హర్షం వెలిబుచ్చారు. ''భారతీయులు ఎక్కడికి వెళ్లినా తమ మూలాలు మర్చిపోరు. భారతీయతకు ఇదొక హాల్‌మార్క్. తాము నివసిస్తున్న దేశాల అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారు. బానిసత్వ గుర్తులను శరవేగంగా వదిలించుకుంటున్నాం. భారతీయ సంస్కృతిని సూచించే చిహ్నాల విలువను గుర్తించడం మొదలైంది. ఈ దిశగా రాష్ట్రపతి భవన్ ముఖ్యమైన కార్యక్రమం నిర్వహిస్తోంది. సోమవారం రాజాజీ ఉత్సవ్ జరుగనుంది. రాష్ట్రపతి భవన్‌లో బ్రిటిష్ ఆర్కిటెక్ట్ ఎడ్విన్ లూటెన్స్ విగ్రహం స్థానంలో స్వతంత్ర భారత తొలి భారత గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.

పరీక్షలంటే భయమొద్దు

విద్యార్థులంటే పరీక్షల యోధులని మోదీ అన్నారు. ''మీరు త్వరలో పరీక్షలు రాయనున్నారు. మార్కుల ఆధారంగా సత్తాను లెక్కగట్టలేరని తెలుసుకోండి. మీ ప్రతిభకు అవొక్కటే ఆధారం కాదు. పరీక్షల గురించి ఎన్నో సందేహాలుంటాయి. అలాగని ఆందోళన వద్దు మిమ్మల్ని మీరు విశ్వసించండి. చదివింది మనసుపెట్టి పరీక్షల్లో రాయండి'' అని వారికి సూచించారు. కేరళ కుంభమేళాగా పిలిచే మామంగం సంప్రదాయాన్ని మోదీ ప్రస్తావించారు. ఈ వేడుక 250 ఏళ్లకు ఒకసారి జరుగుతుంది. పలు రాష్ట్రాల్లో రైతులు సాధించిన విజయాల గురించి కూడా ప్రధాని మాట్లాడారు.

భారీ ఉగ్ర కుట్ర భగ్నం!

8 మంది లష్కరే ఉగ్రవాదుల అరెస్టు

- పశ్చిమబెంగాల్, తమిళనాడుల్లో అదుపులోకి
- వీరిని నడిపిస్తున్నది బంగ్లా హ్యాండ్లర్ షబీర్
- అతనికి లష్కరే చీఫ్ హాఫీజ్‌తో సంబంధాలు

ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్న అనుమానిత లష్కరే ఉగ్రవాదులు

న్యూఢిల్లీ: దేశంలో చాపకింద నీరుగా విస్తరిస్తున్న లష్కరే తోయిబాకు చెందిన 8 మంది అనుమానిత ఉగ్రవాదులను ఢిల్లీ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వీరిలో ఏడుగురు బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లోకి చొరబడినట్టు నిర్ధారించారు. వారినుంచి తప్పుడు గుర్తింపు పత్రాలు, నకిలీ ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. నేరమయ సమాచారమున్న 10 మొబైళ్లు, 16 సిమ్ కార్డులు, 25 క్రెడిట్/డెబిట్ కార్డులు, ఐదు పాయింట్ ఆఫ్ సేల్ మెషీన్లు, బంగ్లాదేశీ పాస్‌పోర్టులను కూడా స్వాధీనం చేసుకున్నారు. హతమైన కశ్మీర్ ఉగ్రవాది బుర్హాన్ వనీ ఫొటోతో ఢిల్లీలోని జన్‌పథ్ మెట్రో స్టేషన్ సహా పలుచోట్ల ఉగ్రవాద అనుకూల నినాదాలతో పోస్టర్లు వెలుగు చూడటంతో సీఐఎస్ఎఫ్ అధికారి ఒకరు ఫిబ్రవరి 8న ఫిర్యాదు చేయడం తెలిసిందే. దీనిపై లోతుగా దర్యాప్తు చేయడంతో పశ్చిమబెంగాల్, తమిళనాడులో నక్కిన 8 మంది లష్కరే ముష్కరుల గుట్టు రట్టయింది. పాకిస్తాన్‌లోని లష్కరే ఉగ్రసంస్థ, పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐతో బంగ్లాదేశ్‌లోని తీవ్రవాద గ్రూప్‌లతో సంబంధాలున్న ఈ నెట్‌వర్క్‌ను విజయవంతంగా ఛేదించినట్టు ఢిల్లీ పోలీసులు ఆదివారం ప్రకటించారు. త్వరలో మరిన్ని అరెస్టులు జరగవచ్చని తెలిపారు.

తిహార్ జైలు నుంచి పారిపోయి..

ఎనిమిది మంది ఉగ్రవాదుల్లో ఇద్దరిని పశ్చిమబెంగాల్‌లో పట్టుకున్నారు. కోల్‌కతాలోని మాల్దాలో ఉమర్ ఫరూక్ (31)తో పాటు రూబివుల్ ఇస్లాం (31) అనే బంగ్లాదేశీని అరెస్టు చేశారు. తమిళనాడులో తిరుప్పూర్‌లో వస్త్ర పరిశ్రమల్లో పని చేస్తున్న మొహమ్మద్ మిజానూర్ రెహ్మాన్ (22), మొహమ్మద్ సఫాయత్ హుస్సేన్ (34), మొహమ్మద్ జహీదుల్ ఇస్లాం (40), మొహమ్మద్ లితోన్ (40), మొహమ్మద్ ఉజాల్ (27), ఉమర్ (32)లను అరెస్ట్‌చేశారు. వీరంతా బంగ్లాదేశ్‌లోని బొగురా జిల్లాకు చెందినవారు. ఈ 8 మంది బంగ్లాదేశ్ నుంచి పనిచేసే షబీర్ అహ్మద్ లోన్ అలియాస్ రజా అలియాస్ కశ్మీరీ అనే లష్కరే ఉగ్రవాది ఆధ్వర్యంలో పని చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. శ్రీనగర్‌లోని కన్గన్ ప్రాంతానికి చెందిన షబీర్‌ను ఏకే–47 రైఫిల్, గ్రనేడ్లు, పేలుడు పదార్థాలను కలిగి ఉన్నందుకు 2007లో ఢిల్లీ పోలీసులు అరెస్ట్‌చేశారు. 2018లో అతను తిహార్ జైలు నుంచి బెయిల్‌పై బయటికొచ్చి బంగ్లాదేశ్‌కు పారిపోయాడు. అక్కడి నుంచే పాకిస్తాన్‌లోని లష్కరే చీఫ్, ముంబై దాడుల సూత్రధారి హాఫీజ్ సయీద్‌తో సంబంధం నెరుపుతున్నట్టు ఢిల్లీ పోలీసులు ఆదివారం వెల్లడించారు. లష్కరే సీనియర్ కమాండర్ జకీవుర్ రెహ్మాన్ లఖ్వీతోనూ అతను టచ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది.

ఐఎస్ఐ నుంచి నిధులు

పాకిస్తాన్ ఐఎస్ఐ నుంచి షబీర్‌కు నిధులు అందుతున్నట్లు ఢిల్లీ పోలీసులు గుర్తించారు. బంగ్లా నుంచి భారత్‌లోకి చొరబడ్డ స్లీపర్ సెల్స్‌ను అతను పర్యవేక్షిస్తున్నట్టు ఢిల్లీ అదనపు పోలీస్ కమిషనర్ ప్రమోద్ కుష్వాహ తెలిపారు. కోల్‌కతాలో అరెస్టయిన ఫరూక్‌తో షబీర్ 2025లో పరిచయం చేసుకుని ఉగ్రవాదంలోకి దింపాడు. భారత్‌లోని ప్రధాన ప్రాంతాల వీడియోలు తీసి పంపాలని, బంగ్లా నుంచి వచ్చి స్థిరపడిన వారిని ఉగ్రవాదంలోకి లాగాలని ఫరూక్‌ను ఆదేశించాడు. తర్వాత రూబివుల్, ఫరూక్ కలిసి ఢిల్లీ, కోల్‌కతాలో ఉగ్రవాద అనుకూల పోస్టర్లు అంటించారు. భారత్‌లో కీలక ప్రాంతాల్లో దాడులకు ఆయుధాలు, పేలుడు పదార్థాల సమీకరణలో ఈ 8 మంది నిమగ్నమైనట్టు పోలీసులు తెలిపారు. బషీర్‌పై 2011లో ఢిల్లీలో మనీ లాండరింగ్ కేసు కూడా నమోదైంది.

బీజేపీలో చేరిన భూపేన్ బోరా

గువాహటి: అస్సాంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. పీసీసీ మాజీ అధ్యక్షుడు భూపేన్ కుమార్ బోరా ఆదివారం అధికార బీజేపీలో చేరారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు దిలీప్ సైకియా ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన గంటల వ్యవధిలోనే బోరాకు కీలక పదవి లభించింది. స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో స్థానం కల్పించారు. కాంగ్రెస్ నేతలు సంజూ బోరా, రాజేశ్‌కుమార్ జోషీ, కంగన్ దాస్, గగన్‌చంద్ర బోరాతోపాటు మరికొందరు నాయకులు, కార్యకర్తలు సైతం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. భూపేన్ కుమార్ బోరా ఈ నెల 16వ తేదీన కాంగ్రెస్‌కు రాజీనామా సమర్పించారు. రాహుల్ గాంధీ సహా పలు సీనియర్ నేతలు బోరాతో మాట్లాడి బుజ్జగించినా ఆయన మనసు మార్చుకోలేదు. అస్సాంలో త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

భారత్-అమెరికా చర్చలు రీ షెడ్యూల్

న్యూఢిల్లీ: మధ్యంతర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం విధివిధానాలను పూర్తిస్థాయిలో ఖరారు చేయడానికి భారత్, అమెరికా మధ్య జరగాల్సిన చర్చలను రీ షెడ్యూల్ చేయాలని ఇరుదేశాలు తాజాగా నిర్ణయించాయి. ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లు చెల్లవంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నాయి. భారత్, అమెరికా సంధానకర్తల మధ్య సోమవారం నుంచి వాషింగ్టన్‌లో చర్చలు జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలపై ట్రంప్ 15 శాతం సుంకాలు విధించడం తెలిసిందే.

యూఎస్ పట్టభద్రుల్లో హిందువులే ఎక్కువ

ప్రతి 10 మందిలో ఏడుగురు పట్టభద్రులు • స్థానిక అమెరికన్లలో పది మందిలో నలుగురే

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికాలో ఎక్కువ మంది ఉన్నత విద్యావంతులు, పట్టభద్రులు ఏ మతస్థులో తెలుసా? అందరూ అనుకుంటున్నట్లు క్రైస్తవులు కాదు. హిందువులే అగ్రస్థానంలో ఉన్నారు. వాషింగ్టన్‌కు చెందిన ప్యూ రీసెర్చ్ సెంటర్ తాజాగా ఈ విషయం వెల్లడించింది. నాలుగేళ్ల కాలేజీ డిగ్రీ పూర్తిచేసిన పట్టభద్రులు ఏ మతానికి చెందిన వారన్న దానిపై 2023–24 రిలీజియస్ ల్యాండ్‌స్కేప్ స్టడీ (ఆర్ఎల్ఎస్) పేరిట ఈ సంస్థ విస్తృతంగా అధ్యయనం చేసింది. ఉన్నత విద్యావంతుల్లో అగ్రస్థానంలో హిందువులు, ఆ తర్వాతి స్థానంలో యూదులున్నట్లు తన నివేదికలో పేర్కొంది.

- అమెరికాలో ప్రతి 10 మంది హిందువుల్లో కనీసం ఏడుగురు బ్యాచిలర్స్ డిగ్రీ లేదా ఉన్నత విద్య అభ్యసించారు. అంటే 70 శాతం శాతం మంది ఉన్నత విద్యావంతులే. యూదుల్లో ఈ సంఖ్య 65 శాతం.
- స్థానిక అమెరికన్లలో కేవలం 35 శాతం మంది ఉన్నత విద్య అభ్యసించారు.
- ఇతర మతస్థులు సగటు కంటే కొద్దిగా పైస్థానంలో నిలిచారు. వీరిలో ముస్లింలు, బౌద్ధులు, ఆర్థోడాక్స్ క్రైస్తవులున్నారు. ఆయా మతస్థుల్లో ప్రతి పది మందిలో కనీసం నలుగురు బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తిచేశారు. ప్రొటెస్టంట్ క్రైస్తవులు కూడా ఈ జాబితాలో నిలిచారు.
- ఎవెలాంజికల్ ప్రొటెస్టంట్లు, క్యాథలిక్స్ సగటు కంటే దిగువ స్థాయిలో ఉన్నారు. వీరు చాలా వరకు నల్లజాతివారే.
- మొత్తం స్థానిక అమెరికా జనాభాలో పరిశీలిస్తే ప్రతి పది మందిలో నలుగురు మాత్రమే బ్యాచిలర్స్ డిగ్రీ అభ్యసించారు.
- అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం విషయంలో మతాల మధ్య చాలా వ్యత్యాసాలు ఉన్నట్లు తెలుస్తోంది.
- వలసలు, తద్వారా స్థానిక జనాభా స్థితిగతుల్లో మార్పులు రావడమే ఈ వ్యత్యాసాలకు కారణమని ప్యూ రీసెర్చ్ సెంటర్ తమ నివేదికలో అభిప్రాయపడింది. హిందువులు, ముస్లింలు, బౌద్ధులు చాలావరకు ఇతర దేశాల అమెరికాకు వలసవచ్చినవారే కావడం గమనార్హం. వీరు ఉన్నత విద్య లేదా ఉద్యోగాల కోసం, జీవనోపాధి కోసం వచ్చారు.
- అమెరికాలో ఉద్యోగాల కోసం భారతీయులు అధికంగా తరలివస్తున్నారు. ఇందుకు హెచ్–1బీ వీసాలు వారికి తోడ్పడుతున్నాయి. ఈ వీసాలో అత్యధికంగా ప్రయోజనం పొందుతున్నది భారతీయులే కావడం గమనార్హం. అమెరికాలో టెక్నాలజీ, ఆరోగ్య సంరక్షణ, విద్యా రంగాలను భారతీయులు ప్రభావితం చేస్తున్నారు.

నేడు న్యూయార్క్‌కు విమానాలు రద్దు

న్యూయార్క్: అమెరికా తూర్పు తీరాన్ని మంచు తుపాను ముంచెత్తే అవకాశం ఉండటంతో ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. న్యూయార్క్, నేవార్క్ నగరాలకు సోమవారం విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సోమ, మంగళవారాల్లో తుపాను నేపథ్యంలో ముందు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. న్యూయార్క్ నగరంలో, లాంగ్ ఐలాండ్‌తో సహా చుట్టుపక్కల సోమవారం తీవ్రమైన హిమపాతం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. 2017 తర్వాత నగరంలో మంచు తుపాను హెచ్చరిక జారీ కావడం ఇదే తొలిసారి!

ట్రంప్ ఎస్టేట్‌లో సాయుధుడి చొరబాటు

హతమార్చిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు • ఫ్లోరిడాలో ఘటన

వాషింగ్టన్: అమెరికాలో ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చెందిన మార్–ఎ–లాగో రిసార్ట్‌లోకి ఆదివారం ఉదయం సాయుధుడు చొరబడటం కలకలం రేపింది. ఆ సమయంలో ట్రంప్ భవనంలో లేరు. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ఆ ఆగంతకుడిని వెంటనే హతమార్చారు. ఆగంతకుడు ఉత్తర గేటు ద్వారా రిసార్ట్ ఆవరణలోకి చొరబడ్డాడు. లొంగిపోవాలని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు హెచ్చరించినా అతను వారికే గన్ గురిపెట్టాడు. దాంతో అతన్ని కాల్చి చంపారు. అతన్ని నార్త్ కరోలినాకు చెందిన 21 ఏళ్ల ఆస్టిన్ మార్టిన్‌గా గుర్తించారు. అతని వద్ద పెట్రోల్ డబ్బా, గన్ దొరికాయి. కొద్ది రోజులుగా ఆస్టిన్ కన్పించడం లేదని అతని కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ట్రంప్ వారాంతాల్లో ఈ రిసార్టుకు వస్తుంటారు. ఈ ఆదివారం ట్రంప్ దంపతులు వైట్‌హౌస్‌కే పరిమితమయ్యారు.

సాక్షి
గుంటూరు
సోమవారం । 23 । ఫిబ్రవరి । 2026

సుబ్బారాయుడి సేవలో ఆర్టీసీ ఎండీ

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని ఆర్టీసీ ఎండీ బాల సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు. తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 540.30 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 20,207 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

తిరుమలకు కూరగాయలు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): తిరుమల శ్రీవారి సన్నిధిలో నిత్యాన్నదానానికి ఐసీఏఐ విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో పది టన్నుల కూరగాయలను పంపించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహరి (మంగళ)
గుంటూరు	6.27	5.17
నరసరావుపేట	6.21	5.14
బాపట్ల	6.19	5.12

న్యూస్‌రీల్

ఐశ్వర్యాంబికగా బగళాముఖి

కర్లపాలెం: పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో వేంచేసియున్న బగళాముఖి అమ్మవారు ఆదివారం ఐశ్వర్యాంబిక అలంకారంలో పూజలందుకుని భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేశారు. పూలు, పండ్లు, పసుపు కుంకుమలు అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అమరావతిని సందర్శించిన ఒడిశా ప్రతినిధులు

అమరావతి: ఒడిశా రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 37 మంది ప్రతినిధులు ఆదివారం అమరావతిని సందర్శించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అంతర రాష్ట్రీయ యువ సమ్మేళనానికి హాజరైన వారు అమరావతిని సందర్శించారు. తొలుత ధ్యానబుద్ధ విగ్రహం, అమరేశ్వర ఆలయం, మ్యూజియంలను తిలకించారు. గుంటూరు మై భారత్ కేంద్ర జిల్లా ఉప సంచాలకులు దేవిరెడ్డి కిరణ్మయి మాట్లాడుతూ ఐక్యత, సమగ్రతను పెంపొందించే లక్ష్యంతో సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. చారిత్రక, పర్యాటక పరంగా ఎంతో ఘన చరిత్ర కలిగిన అమరావతిని సందర్శించడం సంతోషంగా ఉందని ఒడిశా ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. జనచైతన్య సమితి వ్యవస్థాపకులు దాసరి విజయ్‌బాబు, కోఆర్డినేటర్ వేలితోటి అనిల్ కుమార్, కెనరా బ్యాంక్ అధికారి బెజవాడ జయరావు, మై భారత్ అకౌంట్స్ అండ్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ వద్దాది పృథ్వీ, పేస్ సొసైటీ సెక్రటరీ పారుపల్లి రమేష్, షేక్ సుభాని, లియాకత్ అలీ పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై ప్రతిష్ఠా మహోత్సవాలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరంలో ఉన్న విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్నజీయర్ స్వామి వారి స్వీయ పర్యవేక్షణలో ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు ప్రతిష్ఠా మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. శ్రీభూనీల సమేత వైకుంఠనాథ పెరుమాళ్, శ్రీ లక్ష్మీ హయగ్రీవస్వామి, శ్రీ యోగాంజనేయ స్వామి వార్ల ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా తొలిరోజు సాయంత్రం శ్రీ విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురారోపణ, సామూహిక ఉపనయనాలు నిర్వహించామని తెలిపారు. రెండవ రోజు ఆదివారం ఉదయం అగ్ని ప్రతిష్ఠ, యంత్ర స్థాపన, పంచగవ్య స్నపనం, అనంతరం సామూహిక ఉపనయనాలు, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద గోష్ఠితో కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

పరీక్ష.. పకడ్బందీగా..

- నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలు
- విద్యార్థులు హాల్ టికెట్‌తో వస్తే చాలు
- ఉదయం 8.30 నుంచి కేంద్రాల్లోకి అనుమతి
- 9 గంటల తరువాత లోనికి అనుమతి ఉండదు
- విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి
- జిల్లాలో 87 కేంద్రాల్లో 1,347 సీసీ కెమెరాలతో నిఘా
- పరీక్షలకు హాజరు కానున్న 68,898 మంది విద్యార్థులు

పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు గుంటూరు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్ విద్య ఆర్ఐవో జి.సునీత చెప్పారు. శనివారం సాంబశివపేటలోని ఆర్ఐవో కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో సునీత మాట్లాడుతూ... ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఎటువంటి తప్పిదాలకు, పొరపాట్లకు ఆస్కారం లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసి 87 పరీక్ష కేంద్రాలలో 68,898 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం వారు 35,485, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 32,184 మందితోపాటు గతంలో పరీక్షల్లో తప్పిన విద్యార్థులు మరో 1,229 మంది ఉన్నారని చెప్పారు.

మొబైల్ ఫ్రీ జోన్లుగా..

ఇంటర్ పరీక్ష కేంద్రాలను మొబైల్ ఫ్రీ జోన్లుగా ప్రకటించిన దృష్ట్యా విద్యార్థులతోపాటు విధుల్లో ఉన్న చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు సహా అధికారుల వద్ద సైతం సెల్‌ఫోన్లు ఉండవని చెప్పారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పరీక్ష కేంద్రానికి రావాలని, వెంట ఎటువంటి సామగ్రి తీసుకురాకూడదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల నుంచి అధికారులకు సమాచారాన్ని చేరవేసేందుకు చీఫ్ సూపరింటెండెంట్ల వద్ద బేసిక్ మోడల్ ఫోన్ ఉంటుందని చెప్పారు.

మాట్లాడుతున్న ఆర్ఐవో సునీత

8.30 గంటల నుంచి అనుమతి

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయని గుర్తుచేశారు. విద్యార్థులు గంట ముందుగా ఆయా కేంద్రాలకు చేరుకోవాలని ఆర్ఐవో సునీత సూచించారు. విద్యార్థులను ఉదయం 8.30 నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తామని, 9 గంటల తరువాత అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు.

హాల్ టికెట్ ఇలా పొందొచ్చు..

ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు రాస్తున్న విద్యార్థులు bie.ap.gov.in సైట్‌కు లాగిన్ అయ్యి, టెన్త్ హాల్ టిక్కెట్ నంబరు ఎంటర్ చేసి హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకోవచ్చు. సీనియర్ ఇంటర్ విద్యార్థులు ప్రథమ సంవత్సర హాల్ టికెట్ నంబరు, ఆధార్, పుట్టిన తేదీ వివరాలతో హాల్ టిక్కెట్ పొందవచ్చన్నారు. అదే విధంగా మనమిత్ర వాట్సాప్ నంబరు 95523 00009 కు 'ఏజీ' అని మెసేజ్ పంపడం ద్వారా హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. వెబ్‌సైట్, వాట్సాప్ ద్వారా హాల్ టికెట్లు పొందిన విద్యార్థులు తమ వ్యక్తిగత వివరాలతోపాటు పరీక్షల షెడ్యూల్, సబ్జెక్టుల వివరాలను సరి చూసుకోవాలని తెలిపారు. హాల్ టికెట్‌పై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకం, కళాశాల స్టాంప్ అవసరం లేకుండా నేరుగా పరీక్షలు రాసేందుకు హాజరు కావచ్చునని పేర్కొన్నారు. హాల్ టిక్కెట్‌పై ఇచ్చిన పరీక్ష కేంద్రానికి ముందుగానే స్వయంగా వెళ్లి పరిశీలించుకోవాలని సూచించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద సెంటర్ కోడ్, పేరు వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామన్నారు. జ్ఞానభూమి సైట్‌లో సెంటర్ కోడ్ నమోదు చేయడం ద్వారా తమ ఇంటి నుంచి పరీక్ష కేంద్రానికి గల దూరం, రూట్ మ్యాప్ తెలుసుకోవచ్చునని సూచించారు.

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మంగళగిరి టౌన్: మంగళాద్రిలోని శ్రీ లక్ష్మీ నరసింహుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆదివారం శ్రీ స్వామి వారు పెండ్లికుమారుని అలంకారంలో దర్శనమిచ్చారు. వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున స్వామివారి తీర్థ బిందె తీసుకురావడం, ప్రాతఃకాలార్చన, స్వామివారు, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెను చేశారు. అనంతరం తీర్థ గోష్ఠి పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి వారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవాన్ని ఆలయ ఈవో కె. సునీల్‌కుమార్ పర్యవేక్షించారు. పెండ్లికుమారుడి ఉత్సవానికి మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ప్రతినిధులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. గాలిగోపురంతోపాటు పరిసరాలు విద్యుద్దీపాలతో విరాజిల్లుతున్నాయి.

పెళ్లి కుమారుని అలంకారంలో స్వామి వారు

గ్రామోత్సవంలో శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారు

25న చలో విజయవాడను విజయవంతం చేయాలి

పోస్టర్లు విడుదల చేస్తున్న జోసఫ్ సుధీర్‌బాబు, ఎస్టీయూ నాయకులు

ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు గత ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీల అమలు కోరుతూ ఎస్టీయూ చేపట్టిన దశలవారీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ నెల 25వ తేదీన తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో చలో విజయవాడ పోస్టర్లు విడుదల చేశారు. సుధీర్‌బాబు మాట్లాడుతూ 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించడంతోపాటు పీఆర్సీ నివేదిక వచ్చేలోపు 30 శాతం మధ్యంతర భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ పునరుద్ధరణ, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్స్ బకాయిలు చెల్లించాలన్నారు. ధర్నాకు జిల్లాలోని ఉపాధ్యాయులందరూ పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ బాజీ, వై.శ్యాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ ఖాజావలి, జె.గురుబ్రహ్మం, వి.శ్రీనివాసరావు, ఎంపీ సుబ్బారావు, సద్గుణరావు, జోసఫ్, వెంకయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల చేతివాటం?

- బైకు చోరీలకు పాల్పడుతూ చిక్కిన వైనం
- పేర్లు బయటపెట్టని పోలీసులు
- నాయకుల ఒత్తిడికి పోలీసులు తలొగ్గారంటున్న బాధితులు

మార్టూరు: బైకుల వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుల పేర్లు పోలీసులు నాయకుల ఒత్తిళ్లకు లోనై బయట పెట్టడం లేదంటూ బాధితులు ఆరోపిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... కొన్ని నెలలుగా బాపట్ల జిల్లా యద్దనపూడి మండలంలో డజన్ల కొద్దీ ద్విచక్ర వాహనాలు, నీటి మోటార్లు, సిలిండర్లు, సైకిళ్లు తదితర వస్తువులు వరుస చోరీలకు గురవుతున్నాయి. చాలామంది యద్దనపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఎటువంటి ఫలితం కనిపించలేదు. మరి కొంతమంది బాధితులు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండబోదని పోలీసుల వద్దకు కూడా రాలేదు. ఈ క్రమంలో పోలీసుల విచారణలో భాగంగా ఆదివారం ఉదయం నలుగురు వ్యక్తులను చోరీలకు సంబంధించిన నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారిలో మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తలు సైతం ఉండటం గమనార్హం. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్లోనే కూర్చొని నిందితుల పేర్లు పోలీసులు బయటకు చెప్పకుండా అడ్డుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. మీడియా ప్రతినిధులకు సైతం వారి పేర్లను బహిర్గతం చేయవద్దని సదరు నాయకులు బెదిరింపులకు పాల్పడటం గమనార్హం. ఈ విషయమై ఎస్ఐ రత్నకుమారిని మీడియా ప్రతినిధులు వివరణ కోరగా కొందరు నిందితులను అదుపులోకి తీసుకొన్న మాట నిజమేనని, త్వరలో వివరాలు వెల్లడిస్తామని చెప్పడం గమనార్హం.

బాధితుల ఆగ్రహం

చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామానికి చెందిన షేక్ కరీం బాషా అనే వ్యక్తికి చెందిన బైకు మండలంలోని సురవరపుపల్లి గ్రామంలో ఉంచగా చోరీకి గురైన విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మీడియాకు సమాచారం ఇచ్చారు. నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారనే సమాచారం తెలుసుకున్న పూనూరు గ్రామానికి చెందిన సుమారు ఆరుగురు బాధితులు దీనిపై పోలీసులు కేసులు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చోరీలకు పాల్పడింది తమ గ్రామానికి చెందిన వ్యక్తులే అనే సంగతి తెలుసుకొని వారిపై కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు. పోలీసులు నాయకుల అడుగులకు మడుగులు ఒత్తుతూ వివరాలు బహిర్గతం చేయకుండా ఇలా చేయడం మండిపడుతున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

గోవా పర్యాటక విధానం ఆదర్శం

గోవా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తదితరులు

బాపట్ల: జిల్లాలో తీర ప్రాంత పర్యాటక రంగ అభివృద్ధి లక్ష్యంగా మూడు రోజులపాటు గోవాలో అధ్యయన పర్యటన చేపట్టిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ బృందం శనివారం పర్యటనను ముగించింది. ఈ సందర్భంగా బృందం గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. దేశంలో గోవాను ప్రముఖ పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దిన విధానంపై కలెక్టర్ బృందం హర్షం వ్యక్తం చేసింది. పర్యటన సందర్భంగా అక్కడి అధికారులు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపింది. ముఖ్యమంత్రిని సత్కరించి, శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని జ్ఞాపికగా అందజేసింది. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ రూపొందించిన కాఫీ టేబుల్ పుస్తకాన్ని ముఖ్యమంత్రికి అందించింది. గోవా పర్యాటక విధాన పుస్తకాన్ని కలెక్టర్ బృందానికి ముఖ్యమంత్రి అందించారు. సముద్ర తీర ప్రాంతాల అభివృద్ధిలో తీర ప్రాంత నియంత్రణ మండలి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ముఖ్యమంత్రి సూచించారు. నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, భవిష్యత్తులో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తవని పేర్కొన్నారు. గోవా పర్యటనలో పొందిన అనుభవాలను బాపట్ల తీర ప్రాంత అభివృద్ధిలో అమలు చేస్తామని కలెక్టర్ బృందం వెల్లడించింది. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ జి. రఘునాథరెడ్డి, తహసీల్దార్ కె. గోపికృష్ణ, ఎంపీడీవో ఎం. రాజేష్ బాబు, జిల్లా పర్యాటక అధికారి అలీ అస్గర్ షేక్, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ప్రాజెక్టు మేనేజర్లు శివ శరణ్, షేక్ సజిత్ పాల్గొన్నారు.

వంతెనపై పచ్చ వంచన

- వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మాణానికి ముందస్తు చర్యలు.. సింహభాగం పూర్తి
- రెండు పర్యాయాలు జరిగిన సంయుక్త తనిఖీలు
- చొరవ చూపిన అప్పటి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి
- చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక గుంటూరుకు నిధులు మళ్లింపు
- వైఫల్యాన్ని కప్పిపుచ్చుకొనేందుకు స్థానిక ఎమ్మెల్యే పాట్లు

చంద్రబాబు ఎన్నికలకు ముందు మాట్లాడే మాటలకు, గెలిచాక ఆయన వైఖరికి పొంతన ఉండదని మరోమారు రుజువైంది. ఎమ్మెల్యేలు కూడా ఆయన తరహాలోనే వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చీరాల ఫైరాఫీసు గేటు వద్ద ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్ పై ఆర్ఓబీ (రోడ్డు ఓవర్ బ్రిడ్జి) నిర్మాణానికి సంబంధించి స్థానిక ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెబుతున్న మాటలు కూడా టీడీపీ వైఖరికి నిదర్శనంగా నిలుస్తున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.

చీరాల అర్బన్: స్థానికంగా మంజూరైన ఆర్ఓబీ నిధులు చంద్రబాబు ప్రభుత్వం వచ్చాకే గుంటూరుకు తరలాయి. అప్పుడు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యలు ఆ నిధులు గుంటూరు తరలిపోకుండా ఏం చర్యలు చేపట్టారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తాజాగా మళ్లీ ఆర్ఓబీ మంజూరైనట్లు తెలిసిందని, అందుకు సంబంధించిన పనులు ఎప్పటి నుంచి మొదలుపెడతారో తెలపాలని స్పీకర్ ద్వారా సంబంధిత మంత్రిని అడుగుతున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య అసెంబ్లీలో మాట్లాడటం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడమేనని అంటున్నారు.

తాజా పరిస్థితి ఇదీ...

రైల్వే శాఖ తాజాగా ప్రకటించిన తొలి జాబితాలో చీరాల ఆర్ఓబీ పేరు లేదని ఆర్ అండ్ బీ అధికారులు చెప్పడం విస్మయానికి గురి చేస్తోంది.

నాడు భేష్

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబులు ఫైరాఫీసు గేటు వద్ద ఆర్ఓబీ ఏర్పాటుకు ప్రత్యేక దృష్టి సారించారు. ఆ క్రమంలో బలరాం ప్రభుత్వ అధికారంతోపాటు తన వ్యక్తిగత పరిచయాలను కూడా వినియోగించారు. దీంతో ఒకటికి, రెండు పర్యాయాలు పలు శాఖల అధికారులతో సంయుక్త తనిఖీలు కూడా జరిపించారు. నిర్మాణ పనులకు సంబంధించిన ముందస్తు కార్యాచరణ దాదాపు పూర్తయింది. నిధులు మంజూరయ్యాయి. ఆ క్రమంలో ఎన్నికలు వచ్చాయి.

ఫైరాఫీస్ గేటు వద్ద ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్

జిల్లాలో అధికారిక గణాంకాల ప్రకారం 50 ఎల్‌సీలు (లెవల్ క్రాసింగ్‌లు)ఉన్నాయి. అందులో మొదటి విడతగా 24 లెవల్ క్రాసింగ్‌లకు సంబంధించిన ఆర్ఓబీ, ఆర్‌యూబీ, ఎఫ్ఓబీల నిర్మాణాలు చేపట్టాలని రైల్వేశాఖ భావిస్తున్నట్లు స్థానిక అధికారులు చెప్తున్నారు.

కనీసం తనిఖీ జరిగిందా?

ఆర్ఓబీ నిర్మాణానికి ముందస్తుగా రైల్వే, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, మున్సిపల్, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించిన జాయింట్ తనిఖీ జరగాలి. లోటుపాట్లు అధ్యయనం చేయాలి. తుది నివేదిక ఆధారంగా నిర్మాణ పనులు జరగాలి. అదంతా ఏమీ లేకుండానే అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆర్ఓబీ నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో తెలపాలని కోరడం గమనార్హం.

నిధుల మళ్లింపు

ఎన్నికల అనంతరం చంద్రబాబు ప్రభుత్వం కొలువు తీరిన కొద్ది రోజులకే చీరాల ఆర్ఓబీపై గుంటూరు టీడీపీ నేత కన్నుపడింది. ముందుగా పల్నాడు జిల్లాలోని ఓ ఆర్ఓబీకి సంబంధించిన నిధులను మళ్లింపునకు ఆ నేత ప్రయత్నించారు. ఆ ప్రాంత ప్రజాప్రతినిధులు అడ్డుకున్నారని అప్పట్లో ప్రచారం జరిగింది. ఈ క్రమంలో చీరాల ఆర్ఓబీ నిధుల మళ్లింపునకు గుంటూరు నేత ప్రయత్నాన్ని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అడ్డుకోలేదు. ఇప్పుడు ఆ నిధులు గుంటూరుకు తరలి వెళ్లాయని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి.

తొలి జాబితాలో పేరు లేదు

మాకు అందిన సమాచారం ప్రకారం బాపట్ల జిల్లాలో మొత్తం 50 రైల్వే లెవల్ క్రాసింగ్‌లున్నాయి. అందులో ఆర్ఓబీ, ఆర్‌యూబీ, ఎఫ్ఓబీల కోసం ఆయా ప్రాంతాల స్థితిగతులను ప్రామాణికంగా తీసుకుని నిర్మాణాలు చేపడతారు. అందుకుగాను 24 లెవల్ క్రాసింగ్‌లను తొలి జాబితాలో పేర్కొన్నారు. ఆ జాబితాలో చీరాల ఆర్ఓబీ లేదు. రెండో జాబితాలో ఉండొచ్చని భావిస్తున్నాం. ఆ సమయంలో ముందస్తుగా రైల్వే, ఆర్అండ్‌బీ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ తదితర శాఖలకు సంబంధించిన ప్రతినిధులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ ఇప్పటికి జరగలేదు.

– ఎం. నళిని, డీఈ, ఆర్అండ్‌బీ, చీరాల

తాగునీటి సమస్యకు అధికారుల 'నకిలీ' పరిష్కారం

రొంపిచర్ల: తమ గ్రామంలో ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించమని గ్రామస్తులు వేడుకుంటే పీజీఆర్ఎస్ నుంచి పరిష్కరించేశామని ఫోన్ రావటంతో అర్జీదారుడు అవాక్కయ్యారు. మండలంలోని అన్నవరం గ్రామంలో తాగునీటి సమస్యతో గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గ్రామానికి చెందిన పచ్చవ రామారావు స్థానికులతో కలిసి సీఎం, డిప్యూటీ సీఎం, ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీపీవోలకు రిజిస్టర్ పోస్టులో వినతిపత్రాన్ని పంపారు. ఈ సమస్య పీజీఆర్ఎస్‌లో కూడా నమోదైంది. ఇటీవల పీజీఆర్ఎస్ యాప్‌లో నమోదైన సమస్య పరిష్కారం అయిందంటూ ఫోన్ రావటంతో రామారావు అవాక్కయ్యారు. మరోమారు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

లాకర్‌లో పెట్టిన బంగారం మాయం

తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేసిన బ్యాంకు మేనేజర్

తాడికొండ: బ్యాంక్ సేఫ్ లాకర్‌లో పెట్టిన బంగారు నగలు మాయమైన ఘటన తుళ్లూరు మండలం వెంకటపాలెం యూనియన్ బ్యాంకులో జరిగింది. దీనిపై బ్యాంకు మేనేజర్ భుక్యా వీరానాయక్ నాయక్ ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు వివరాల ప్రకారం ఈనెల 2వ తేదీన బ్యాంక్ సేఫ్ లాకర్‌లో ఉంచిన బంగారు నగల ప్యాకెట్లను తనిఖీ చేయగా 2 పౌచ్‌లలో ఉన్న బంగారు నగలు కనిపించలేదని, వాటి మొత్తం నికర బరువు 328 గ్రాములు కలిగి ఉన్నట్లు, ప్రాథమిక అంతర్గత తనిఖీ, సీసీటీవీ ఫుటేజ్ పరిశీలనలో, అదే బ్రాంచ్‌లో పనిచేసే బ్యాంక్ ఉద్యోగి అనుమతి లేకుండా సేఫ్ లాకర్ తాళం చెవి తీసుకొని లాకర్ ఉన్న పై రెండు బంగారు పౌచ్‌లు తీసుకెళ్లినట్లు నిర్ధారించుకున్నారు. అనంతరం 21వ తేదీ, శనివారం తుళ్ళూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

25న త్రిచక్ర స్కూటర్ల మంజూరుకు ఇంటర్వ్యూలు

నెహ్రూనగర్: మూడు చక్రాల స్కూటర్ల మంజూరుకు ఈ నెల 25న ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎన్.వెంకటరవణప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గుంటూరు జిల్లా శారీరక విభిన్న ప్రతిభావంతులు మూడు చక్రాల స్కూటర్లు మంజూరుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని, వారు మాత్రమే ఇంటర్వ్యూలకు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్ ఒకటో లైన్‌లో ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా ఎంపిక కమిటి నిర్వహించే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని కోరారు.

ఉయ్యాలవాడకు ఘన నివాళి

నరసరావుపేట: తొలి తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని ఆదివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఆర్‌టీఓ జి.సంజీవకుమార్ నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బ్రిటిషు వారి రైతువారి వ్యవస్థ అమలు, పాలెగాళ్ల హక్కులు రద్దు, రైతులపై అధిక పన్నులు నేపథ్యంలో నరసింహారెడ్డి ఐదు వేలమంది రైతులతో కలిసి 1846లో తిరుగుబాటు ప్రారంభించారని పేర్కొన్నారు.

రెండు లారీల ఢీ.. ఒకరు దుర్మరణం

మృతుడిది గుంటూరు జిల్లా నందివెలుగు

సింగరాయకొండ: ముందు వెళ్తున్న కంటైనర్ లారీ ఒక్కసారిగా నెమ్మది కావడంతో ఆ వెనుకాల వేగంగా పుచ్చకాయ లోడుతో వచ్చిన లారీ బలంగా ఢీకొంది. దీంతో మినీ వ్యాన్ డ్రైవర్ ఇగ్గోలు వెంకట సుబ్బారావు (35) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదివారం తెల్లవారు జామున జాతీయ రహదారి కందుకూరు ఫ్లయి ఓవర్‌పై జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మినీ లారీ ముందు భాగం పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు పుచ్చకాయలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. మృతి చెందిన సుబ్బారావుది గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని నందివెలుగు. సంఘటన స్థలాన్ని ఎస్సై మహేంద్ర పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చెరుకుపల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం కావూరులో చోటుచేసుకుంది. మండలంలోని జొన్నలగడ్డవారిపాలెంకు చెందిన మొవ్వ ముత్యాలరావు(45) తన ద్విచక్ర వాహనంపై చందోలు వైపు నుంచి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో జొన్నలగడ్డ వారిపాలెం వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్ర గాయాల పాలైన ముత్యాలరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న చెరుకుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు స్పందన

ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న తులసి విష్ణుప్రసాద్, శ్రీకాంత్‌బాబు, పవన్‌శాస్త్రి, సాయిరామకృష్ణ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా), ఈ–అభ్యాస్ అకాడమీ సంయుక్తంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన 'సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (శాట్) – లెవెల్ టు ఒలింపియాడ్ ప్రతిభా పరీక్షకు విశేష స్పందన లభించినట్లు అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు కొలసాని తులసి విష్ణు ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని కెవిడీ హైస్కూల్లో పరీక్ష పత్రాలను ఆవిష్కరించారు. విష్ణుప్రసాద్ మాట్లాడుతూ ఈ–అభ్యాస్ అకాడమీ సహకారంతో 'శాట్' ఒలింపియాడ్ ప్రతిభ పరీక్ష రెండు దశల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. హైస్కూల్ స్థాయి విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విశ్లేషణాత్మక నైపుణ్యం, తార్కిక ఆలోచనలను ప్రోత్సహిస్తూ గ్లోబల్ విద్యార్థులుగా రాణించేందుకు అపుస్మా జాతీయస్థాయిలో కృషి చేస్తోందని తెలిపారు. ఈ–అభ్యాస్ అకాడమీ చైర్మన్ డాక్టర్ భువనగిరి ఫణి పవన్‌శాస్త్రి, సీఈఓ బి.సాయి రామకృష్ణ మాట్లాడుతూ జనవరి 18న రాష్ట్రంలోని 125కు పైగా అపుస్మా అనుబంధ పాఠశాల్లో నిర్వహించిన శాట్ ఒలింపియాడ్ తొలి దశ పరీక్షకు 15వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రతి తరగతి నుంచి 1,2,3 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రెండవ దశ ప్రతిభ పరీక్ష నిర్వహించామని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 కేంద్రాల్లో ఆరువేల మందికి పైగా విద్యార్థులకు శాట్ ఒలింపియాడ్ పరీక్షను 'ఓఎంఆర్' విధానంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెండవ దశలో రాష్ట్రస్థాయిలో 1,2,3 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మార్చి 8న గుంటూరులో జరగనున్న బహుమతి ప్రదానోత్సవంలో నగదు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర నాయకులు కె.శ్రీకాంత్‌బాబు, విజ్‌డమ్ రవి, చైతన్య సాంబిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాయుడు చక్రనాగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పాపారావు

ఎన్నికల అధికారి కోటయ్య నుంచి నియామక పత్రం అందుకుంటున్న వేంపాటి పాపారావు

కొరిటిపాడు(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడుగా వేంపాటి పాపారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నామినేషన్లు దాఖలు చేసిన నలుగురు సభ్యులతో సంఘం సభ్యులు చర్చలు జరిపారు. దీంతో బీసీహెచ్ నాగులు, కె.నాగేశ్వరరావు, ఎ.కోటయ్యలు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో సంఘం జిల్లా అధ్యక్షుడుగా పాపారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అలాగే సంఘం అసోసియేట్ అధ్యక్షుడుగా జె.మునిబాబు, గౌరవాధ్యక్షుడుగా బీసీహెచ్ నాగులు, కార్యవర్గ సభ్యులుగా కె.నాగేశ్వరరావు, ఎ.కోటయ్య, జె.ఏడుకొండలు, పి.నరసింహనాయుడు, ఎస్.భాస్కరబాబు, షాదిక్ బాషా, షేక్ మహబూబ్ సుభానిలు ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డీఎస్ కోటయ్య వ్యవహరించారు. నూతన అధ్యక్షుడు పాపారావు మాట్లాడుతూ ప్రభుత్వ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. పూర్తిస్థాయి కమిటీని త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు బి.శ్రీనివాసరావు, వి.ప్రసన్నాంజనేయ కుమార్, ప్రభుత్వ వాహన డ్రైవర్లు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన పాపారావును పలువురు ప్రభుత్వ వాహన డ్రైవర్లు కలిసి అభినందనలు తెలిపారు.

పెళ్లి పేరుతో మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాంబశివరావు

తెనాలిరూరల్: మ్యాట్రిమోని వెబ్‌సైట్ ద్వారా పరిచయమై వివాహం చేసుకుంటానని నమ్మబలికి పెద్ద మొత్తంలో నగదు కాజేసి మోసం చేసిన నిందితుడిని తెనాలి త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం సీఐ ఎస్.సాంబశివరావు వెల్లడించిన వివరాల ప్రకారం.. పట్టణంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న మహిళకు కొల్లిపర మండలం కొత్తూరులంక గ్రామానికి చెందిన అరవపల్లి వంశీ మ్యాట్రిమోనీ సైట్ ద్వారా ఈనెల 2వ తేదీన పరిచయమయ్యాడు. తనకు వివాహమై విడాకులు తీసుకున్నానని తిరిగి వివాహం చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు ఆమెను నమ్మించాడు. మహిళ ఇంటికి కూడా వచ్చి ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి వివాహానికి ఒప్పించాడు. తదుపరి టిప్పర్ కొనుగోలుకు నగదు కావాలని నమ్మించి, వివిధ మార్గాలలో లోను తీసుకునేలా ప్రేరేపించి ఆమె నుంచి రూ. 12.20 లక్షలు వసూలు చేశాడు. వివాహం చేసుకోనున్నట్లు నమ్మించి ఈనెల 8న శారీరకంగా లోబరుచుకున్నాడు. మరింత నగదు కావాలంటూ ఆమెపై ఒత్తిడి పెంచడంతో ఇవ్వలేనని తేల్చి చెప్పింది. దీంతో ఆమెను కొట్టి, చంపుతానని బెదిరించి, వివాహానికి నిరాకరించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. సమావేశంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నాయనమ్మకు అంత్యక్రియలు నిర్వహించిన మనుమరాలు

నాయనమ్మకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న సునీత

మంగళగిరి టౌన్: చిన్నతనంలోనే కన్నతల్లి దూరమైనా అన్నీ తానై, ఏ లోటు రానీకుండా ఆ చిన్నారిని కన్న కూతురు కంటే మిన్నగా చూసుకుందా నాయనమ్మ. ఆదివారం ఆ వృద్ధురాలు చనిపోవడంతో అంత్యక్రియలు నిర్వహించి, రుణం తీర్చుకుంది మనుమరాలు. సేకరించిన వివరాల ప్రకారం.. గుంటూరు నగరంలోని గుజ్జనగుండ్లకు చెందిన వృద్ధురాలు పాశం లక్ష్మమ్మ (88)కు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొడుకు శ్రీనివాసరావు, కోడలు సుశీల కుటుంబ కలహాల నేపథ్యంలో గత మూడు దశాబ్దాల క్రితం విడిపోయి వేరువేరుగా జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె కాగా, కుమారుడిని తల్లి సుశీల తన వెంట తీసుకుని వెళ్లిపోగా.. ఏడాది వయసు కలిగిన చిన్నారి సునీతను భర్తవద్దనే వదిలి పెట్టింది. దీంతో నాయనమ్మ లక్ష్మమ్మ సునీతను పెంచి పెద్దచేసింది. అదేవిధంగా మంగళగిరి రూరల్ యర్రబాలెంకు చెందిన నాగరాజుతో వివాహం జరిపించింది. ఏడేళ్ల క్రితం కుమారుడు శ్రీనివాసరావు మృతిచెందడంతో వృద్ధురాలు లక్ష్మమ్మ యర్రబాలెంలోని తన మనవరాలి వద్దనే ఉంటోంది. ఈక్రమంలో వృద్ధాప్యంతో బాధపడుతున్న లక్ష్మమ్మ శనివారం రాత్రి తుదిశ్వాస విడిచింది. తనను చిన్నతనం నుంచి కన్నతల్లికంటే మిన్నగా చూసుకున్న నాయనమ్మ లక్ష్మమ్మకు అశ్రునయనాలతో సునీత అంత్యక్రియలు నిర్వహించి ఆమె రుణాన్ని తీర్చుకుంది.

ఏపీ జేఏసీ పల్నాడు జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఐక్యతను ప్రదర్శిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నేతలు

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (ఏపీ జేఏసీ) పల్నాడు జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రకాష్‌నగర్‌లోని ఎన్‌జీఓ హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా చైర్మన్‌గా మర్లపాటి రామకృష్ణ, కో–చైర్మన్‌లుగా ఎస్.మురారి, కెఎస్‌కె షరీఫ్, బి.సంపత్‌బాబు, ఏ.ఏమండీ, వైస్ చైర్మన్‌లుగా ఎస్.సుబ్బారావు, ఉబేద్ బేగ్, పిఐజే మరియరాజు, ఎం.రామయ్య, జనరల్ సెక్రటరీగా ఎం.మోహనరావు, జాయింట్ సెక్రటరీలుగా కె.ప్రతాప్‌కుమార్, సి.సి.ఆదెయ్య, ఎస్ కొండయ్య, ఏ.ఆంజనేయులు షేక్.కమల్‌బాషా, కె.బ్రహ్మయ్య, కోశాధికారిగా కె.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్‌జీఓ సంఘం ఉపాధ్యక్షుడు ఎస్.రాజశేఖర్ పాల్గొన్నారు. పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలని, 30 శాతం డీఏ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పెన్షనర్ల అడిషనల్ క్వాంటం పెంచాలని కోరారు. ఉద్యోగ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ చేపట్టే కార్యాచరణను విజయవంతం చేస్తామని జిల్లా కమిటీ ప్రకటించింది.

'సమర శంఖారావం' జయప్రదం చేయండి

ఎస్టీయూ పిలుపు

సమర శంఖారావం పోస్టర్లు విడుదల చేస్తున్న సంఘం నేతలు

నరసరావుపేట ఈస్ట్: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరుతూ ఎస్టీయూ చేపట్టిన దశల వారీ ఆందోళనలో భాగంగా ఈనెల 25వ తేదీన చేపట్టిన చలో విజయవాడ సమర శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్టీయూ కార్యాలయంలో సమర శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు ఎల్.వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని, అప్పటి వరకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.34వేల కోట్లతో పాటు నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు యు.చంద్రజిత్‌యాదవ్, ఎం.వెంకటకోటయ్య, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.అనిల్, రాష్ట్ర మహిళా కన్వీనర్ పి.సుశీల, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.ఏమండీ, ఆర్థిక కార్యదర్శి షేక్.మహబూబ్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనలో రాజీలేని పోరాటం

పల్నాడు ఏపీ జేఏసీ కో–చైర్మన్ బెజ్జం సంపత్‌బాబు

యడ్లపాడు: ఏడు దశాబ్దాల ఐక్య పోరాట స్ఫూర్తితో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలపై పల్నాడు గడ్డపై నుంచి ఉద్యమిస్తామని ఏపీ జేఏసీ కో–చైర్మన్ బెజ్జం సంపత్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, అలాగే మెమో 57ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిటీని వేయకపోవడం దారుణమని, వెంటనే 30శాతం ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ఏడేళ్లుగా నిలిచిపోయిన కారుణ్య నియామకాలపై ఆయన ప్రత్యేకంగా స్పందిస్తూ, సుమారు 900 ఉపాధ్యాయ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన చెందారు. అర్థరహితమైన జీవోలను పక్కనపెట్టి, ప్రభుత్వం స్పెషల్‌డ్రైవ్ ద్వారా కలెక్టర్ పూల్‌లో తక్షణమే వారికి నియామకాలు జరిపి ఆదుకోవాలని తన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిరస్మరణీయుడు

ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: దివంగత మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్రోద్యమ స్ఫూర్తి ప్రదాత అని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. ఆదివారం గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆజాద్ వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా సేవలందించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ తన రచనల ద్వారా యువతలో స్వాతంత్ర్య ఉద్యమ చైతన్య స్ఫూర్తిని కలిగించారని అన్నారు. ఆయన మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూలతో కలిసి స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని తన పుస్తకాలు, రచనల ద్వారా యువతను చైతన్యపరిచి స్వాతంత్ర పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించారని వెల్లడించారు. పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ కరిముల్లా, వర్కింగ్ అధ్యక్షులు అచ్చి శివకోటి, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ మహబూబ్ బాషా, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి నెలటూరి సురేష్, మాజీ కౌన్సిలర్ షేక్ మీరావలి, బీసీ సెల్ అధ్యక్షులు మర్రిపూడి రాంబాబు, విద్యార్థి విభాగ అధ్యక్షులు మనీంద్రరెడ్డి, బాదుగున్నల శ్రీను, చందు పాల్గొన్నారు.

మీ సేవల మనుగడ కాపాడాలి

- ఏపీ మీసేవ నిర్వాహకుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాము
- జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర నాయకులతో నూతన కమిటీ నాయకులు

నరసరావుపేట: మీ సేవల మనుగడను కాపాడాలని ఏపీ మీసేవ ఆపరేటర్ల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పోరుమామిళ్ల రాము ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం పాతూరులోని గీతామందిర్‌లో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. గత 25ఏళ్లుగా ప్రజలకు మీసేవల ద్వారా ప్రభుత్వసేవలు అందిస్తూ చాలీచాలని ఆదాయంతో బతుకుతున్న ఆపరేటర్లకు భరోసానిస్తూ ప్రభుత్వం మీ సేవల మనుగడను కాపాడాలని కోరారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అప్పటి యువగళం పాదయాత్రలో సమస్యలను వివరించగా తాము అధికారంలోకి రాగానే మీ సేవలకు మళ్లీ పూర్వవైభవం తీసుకొస్తామని, ఆపరేటర్ల సమస్యలు పరిష్కరిస్తామని మాట ఇచ్చారని, ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతున్నా మీ సేవ కేంద్రాల మనుగడ ప్రశ్నార్థకంగానే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం ఏపీ మీసేవ నిర్వాహకుల వెల్ఫేర్ అసోసియేషన్ పల్నాడు జిల్లా నూతన కమిటీని స్టేట్ అధ్యక్షులు పోరుమామిళ్ల రాము ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా గట్టుపల్లి మహేష్, ఉపాధ్యక్షులుగా కొత్త శేషగిరిరావు గౌరవ అధ్యక్షులుగా కొమ్ము ప్రకాష్, దాసరి రాజశేఖర్, వేల్పూరు గణపతి, ప్రధాన కార్యదర్శిగా జలసూత్రం హరిబాబు, కార్యదర్శిగా రాయుడు సతీష్, నూలి శ్రీను, కాట్ల రామాంజనేయులు, మహిళా కార్యదర్శి గాదె శాంత కుమారి ఎన్నికయ్యారు. స్టేట్ కమిటీ సెక్రటరీ బుచ్చిబాబు, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ విజేత దుర్గి

నగరం: గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరం బాల ఏసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం నిర్వహించారు. పోటీల్లో దుర్గి జడ్పీహైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలవగా, నగరం బాల ఏసు ఇంగ్లిష్ మీడియం స్కూల్ రన్నర్స్‌గా నిలిచింది. దూళిపాళ్ళ జడ్పీహైస్కూల్, శేకూరు జడ్పీహైస్కూల్ టీమ్‌లు వరుసగా మూడవ, నాల్గవ స్థానాలలో నిలిచాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఏపీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఇ.శివశంకర్, గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ వై.శ్రీనివాసరావు, నంబూరు స్టేట్ బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్ కమిటీ సభ్యుడు బి.నర్సయ్య, స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ సునా, ప్రిన్సిపాల్ సిస్టర్ సజీవా, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ NH-16 చిలకలూరిపేట దగ్గర DTCP ప్లాట్స్ (ఆఫర్) బ్యాంక్ లోను సౌకర్యం కలదు. బుకింగ్స్ జరుగుతున్నవి. సంప్ర: 8801545629, 9398873045

BUILDINGS FOR SALE

■ 80 bed Hospital building for sale in old club road, Guntur, 5 storied With cellar, 15000sq ft built in area, contact 9394101911, 9346119595.

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టు లో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం ✆ 83338 33368

WANTED

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు సీనియర్ సివిల్ ఇంజనీర్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 50,000/- నుండి 60,000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: సివిల్ ఇంజనీరింగ్ వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8978480429

■ Wanted B or D Pharmacy Candidates to work in a Pharmacy in Guntur City. PCI Registration mandatory. 6300975241

■ Wanted B.Com or MBA Candidates to work as an Accountant in Medical distribution firm in Guntur City. Contact : 6300975241

■ గుంటూరు బస్‌స్టాండ్ ఎదురు Office నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Qul: 10th-డిగ్రీ, జీతం: 8500 - 9000/- టైం: 9.00 AM- 5.30 P.M. ✆99893 98775

■ Saripudi Suzuki, Guntur - Hiring Managers, Cashier, CRM, CRE's and Service Advisors, Both freshers and experienced candidates can apply. Attractive Salary + incentives. Interview on 23-02-2026. ✆ 7799960199, 149

■ ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు ఆఫీస్ స్టాఫ్ లేడీ టెలికాలర్స్, లేడీ మేనేజర్స్ జీతం+ ఇన్సెంటివ్స్ కలవు. సంప్ర: 9398873045, 8801545629

■ మెస్ ఇన్‌ఛార్జ్‌లు కావలెను. కనీసం మూడు సంవత్సరములు హోటల్ మరియు కాలేజ్ మెస్‌లో పనిచేసిన అనుభవం ఉండాలి. వంటకు ఉపయోగించే ఆధునిక పరికరాలు అయిన గ్యాస్ స్టీమ్ తరిగే పరికరాలు గ్రైండర్‌లు చపాతి తయారీ యంత్రాలు వాడటం తెలిసి ఉండాలి. పనిచేయు ప్రదేశం: గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి జీతము: 25,000/- వరకు ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్. 8978480435

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం:17K.Ph:9640648899, 9848999184.

■ డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు, ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొని కొవ్వొత్తులు, పెన్సిల్స్ తయారు చేసి మాకు ఇవ్వండి. వీక్లీ పేమెంట్. 9640729906.

■ శ్రీ లక్ష్మీహోంకేర్ సంస్థ Hyd నందు వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీ కేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు, కావలెను. జీ: 18,000 to 30,000. రూం+మీల్స్ ఫ్రీ. 9347148051

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (ఒక్కరోజు)
ప్రతి అదనపు లైను రూ. 100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ పత్రికలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటి నిజానిజాలను పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం పంపాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాం. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేసేవారు, పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

చలో విజయవాడను జయప్రదం చేయాలి

తాడేపల్లి రూరల్: ఈనెల 24వ తేదీన తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి మున్సిపల్ కార్మికులు తరలిరావాలని సీఐటీయూ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం నులకపేటలో మున్సిపల్ కార్మికులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. పై సమస్యల సాధన కోసం మంగళవారం విజయవాడలో జరిగే ధర్నాకు మున్సిపల్ కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు సువార్త, శివమ్మ, రాంబాబు, సంతోషం, నాగేశ్వరరావు, అనూష, వలి తదితరులు పాల్గొన్నారు.

26న తిరునామాల ప్రతిష్ట

ఫిరంగిపురం: మండల పరిధి రేపూడి గ్రామంలోని సచివాలయం సమీపంలో శ్రీవెంకటేశ్వర స్వామి తిరునామాలు, పాదాల ప్రతిష్టను గురువారం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. వివాహాది శుభకార్యాల సమయంలో తిరుపతి వెంకటేశ్వరుడికి ఎదురు నడిచి వెళ్లి పాదాలు, తిరునామాల వద్ద విశేష పూజలు నిర్వహించేందుకు గ్రామస్తుల సహకారంతో వైఖానస ఆగమోక్తంగా ప్రతిష్ట నిర్వహిస్తారన్నారు. ఆగమ పండితులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ, దీవి.కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో ఆగమోక్తంగా విశేష పూజలు, హోమాలు ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించి అన్నదానం నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రయాణికులకు తీవ్ర గాయాలు

తాడేపల్లి రూరల్: ఉండవల్లిలో సీడ్ యాక్సెస్ ప్రారంభమయ్యే ప్రాంతంలో ఓ ఆటోడ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగి ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి తాళ్లాయపాలెం శైవక్షేత్రం వరకు ఆటోలో డ్రైవర్‌తో సహా ఐదుగురు ప్రయాణిస్తున్నారు. ఉండవల్లి కృష్ణానది ఎగువ ప్రాంతంలో అమరావతి కరకట్ట దిగగానే సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభమయ్యే దగ్గర ఆటో డ్రైవర్ అతి వేగంగా ఆటో నడపడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడడంతో నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారికి 108 సిబ్బంది ప్రథమ చికిత్స నిర్వహించి విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం

దుగ్గిరాల: విద్యావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాల జెండా చెట్టు సెంటర్ వద్ద మౌలానా వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలాం సేవలను కొనియాడారు. కార్యక్రమంలో షేక్.రషీద్, షేక్ జుల్ ఫకర్ ఆలీ, షేక్ ఖుద్దుస్, షేక్ ఫైదా, సయ్యద్ మక్బూల్, సయ్యద్ గౌస్ బాజీ, బులుసుపాటి యేల్యేశ్వరరావు, కుర్ర కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏసు శ్రమలతో మానవాళికి విముక్తి

తెనాలి: ఏసుక్రీస్తు శిలువ శ్రమలు అనుభవించడం ద్వారా పాప మానవాళికి పాప విముక్తి కలిగిందని దైవజనులు, ఆనందన్న హెల్పింగ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ బ్రదర్ ఆనందన్న చెప్పారు. ఇస్లాంపేటలోని ఏసయ్య ప్రార్థనా కొండ చర్చిలో ఆదివారం (శ్రమల దినాలు) ప్రత్యేక ఆరాధన కూడిక ఘనంగా నిర్వహించారు. సిలువ గీతాలు ఆలపించారు. ఏప్రిల్ 4వ తేదీ వరకు ప్రతి రాత్రి 8 -9 గంటలకు చర్చిలోఈ శిలువ ధ్యానాల కూడికలు జరుగుతాయని తెలిపారు.

కేఎల్‌యూలో స్కిల్ పలావర్ ప్రారంభం

నిపుణుల ద్వారా మెళకువలు నేర్చుకుంటున్న కేఎల్‌యూ విద్యార్థులు

విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తున్న ఆచార్యులు

తాడేపల్లి రూరల్: స్థానిక కేఎల్ యూనివర్సిటీలో స్కిల్ పలావర్‌లో భాగంగా శనివారం రాత్రి నుంచి నిర్మాణాత్మక ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాస హ్యాకథాన్‌ను ఘనంగా ప్రారంభించారు. స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేఎల్‌యూ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరంలోని రెండు సెమిస్టరలలో విస్తరించి ఉన్న నిర్మానాత్మక, ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాస హ్యాకథాన్ చొరవ అయిన స్కిల్ పలావర్ మూడో దశను విజయంతంగా నిర్వహించామని తెలిపారు. ఈనెల 21 నుంచి 22 వరకు మూడో దశ మొదటి స్లాట్ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. సిస్కో నుంచి జి.అనిల్‌కుమార్ గుగ్గిల్లా ద్వారా కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ సవాల్-1, ఈ-42 లైట్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ నుంచి కె.తరుణ్ ద్వారా డీబాగ్ డ్రైవ్ షోడౌన్, హెచ్అండ్ఎం గ్రూప్ నుంచి సైనాథ్ జమాల్పూర్ ద్వారా సైబర్ స్కోప్, అనలిటిక్స్ ఫర్ డిఫెన్స్, ఐబీఎం నుంచి పలాచర్ల తత్తమ్మ దొర ద్వారా కౌడ్ చాలెంజ్-1, ఇండియన్ సర్వసర్స్ నుంచి డి.సాయిసతీష్ ద్వారా సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, లాయిడ్ టెక్నాలజీ సెంటర్ నుంచి రామ్‌సాగర్‌తో ఎన్ఎల్‌సీ ఇన్నేవేటర్స్ హ్యాక్, మ్యాంగో డీబీ నుంచి ఆదిత్య దువాతో డేటా డ్రైవెన్ ఎమోషన్, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ నుంచి డాక్టర్ బీబీఎం కృష్ణకాంత్‌తో డీప్‌హాక్ 2025, రెస్‌మెడ్ నుంచి రుషికేశ్వర్ రెడ్డి, లక్కంతో క్లౌడ్ క్యూ బిల్డ్ థాన్, సినాప్సిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి పూర్ణచంద్రారెడ్డితో ఇంటిగ్రిటెక్ థాన్, తదితరులు వివిధ ప్రముఖ ఐటీ సంస్థలలో పనిచేస్తున్న ప్రముఖ పరిశ్రమ నిపుణులు సమీక్షకులుగా నిర్వహించారని తెలిపారు. కార్యక్రమం వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ వెంకట్రామ్ మార్గదర్శకత్వంలో నిర్వహించారు. కార్యక్రమానికి స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, విభాగ అధిపతులు, డొమైన్ స్పాక్‌లకు దిశా నిర్దేశం చేశారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.రాజేష్ నాయకత్వం వహించారు.

విజయ సాధనకు సవాళ్లు ఎదుర్కోవాలి

తాడికొండ: జీవితంలో ముందుకు సాగాలంటే విద్యార్థి దశలో ఎదురయ్యే సవాళ్లు, సమస్యలను ఎదుర్కొని ముందుకు సాగాలని అర్జున అవార్డు గ్రహీత, అథ్లెటిక్ జ్యోతి యర్రాజీ అన్నారు. వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో ఘనంగా ముగిసిన విటోపియా-2026 వార్షిక క్రీడా పోటీల బహుమతి ప్రదానోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చి ఆసియాన్ గేమ్స్‌లో స్వర్ణం సాధించే స్థాయికి ఎదిగే క్రమంలో అనేక ఒడిదుకులు ఎదురైనా మనో ధైర్యంతో నిలబడ్డానని ఆమె వివరించారు. సమస్యలు లేని జీవితం ఉండదని, ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడలను అంతర్భాగం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఉదయం జరిగిన 5 కిలో మీటర్ల మారథాన్‌లో పాల్గొని విద్యార్థులను ఉత్తేజపరిచారు. విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.అరుల్మోళివర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పటు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలలో పాలుపంచుకోవడం అవసరమని పేర్కొన్నారు. అథ్లెటిక్ జ్యోతి యర్రాజీని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు తమ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వర్సిటీలో సాయంత్రం జరిగిన ప్రో-షోలో మోహన భోగరాజు, అబ్దుల్ వాహబ్ బ్యాండ్, డీజే నోటోరియస్ సంగీత విభావరీలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, డాక్టర్ ఎస్.గోపికృష్ణన్ (విటోపియా కన్వీనర్), డాక్టర్ ఖాదీర్ పాషా (స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్), విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేస్తున్న అర్జున అవార్డు గ్రహీత, అథ్లెటిక్ జ్యోతి యర్రాజీ

• వనమా బాల వజ్రబాబుకు కృతజ్ఞతలు

గుంటూరు జిల్లా ఇంటిలెక్చువల్ ఫోరం కార్యదర్శిగా ఎన్నికైన షేక్ రహంతుల్లా, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శిగా ఎన్నికైన ముక్కెర శివకృష్ణలు ఆదివారం తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం, శాలువాలతో వనమాను సత్కరించారు. తమపై నమ్మకంతో పార్టీ పదవులు ఇచ్చినందుకు కష్టపడి పనిచేసి 2029లో పార్టీ విజయానికి తమవంతు పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల ముఖ్య నాయకులు మల్లంపాటి రాఘవరెడ్డి, లోకేష్ రెడ్డి, గోల్డ్‌బాబు, గుంటి రఘువరన్, షేక్ అజీస్, రంజిత్, జర్జీష్, ఉండవల్లి నరసింహరావు, బాషా తదితరులు పాల్గొనారు.

– తాడికొండ

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని రాజన్న ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓ నిరుపేద కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. 14వ వార్డులో దుగ్గిపోగు విక్టోరియా(70) ఆదివారం మృతిచెందారు. ఆమె అంత్యక్రియల నిమిత్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 14వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షులు దొడ్డ ఎలీషా వారి కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి విక్టోరియా భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలోతాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ చిలుకోటి మధు, బోయపల్లి రాజు, మార్కు, అజయ్, కె.ఉమాకాంత్, బి.రవి, రాజేషన్ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు ఇమ్మానియేలు, రవి, కట్టెపోగు ప్రశాంత్, కుక్కమళ్ల శేషు, విజయ్, చక్రవర్తి, చిన్ని మల్లవరపు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో కలుషిత నీరు

దుగ్గిరాల: దుగ్గిరాలలో ఇంటి కుళాయిల నుంచి కలుషిత నీరు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం దుగ్గిరాల గ్రామంలోని ఓ ఇంట్లో ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి వస్తున్న నీరు రంగుమారి కనిపించింది. ట్యాంక్‌ను శుభ్రం చేసిన అనంతరం కూడా అదే విధంగా రంగు నీరు వస్తోందని స్థానికులు వాపోయారు. కనీస అవసరాలకు పంచాయతీ కుళాయిల నీళ్లు అందడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏసీసీ కార్మికుల ఆకలి కేకలు

తాడేపల్లి రూరల్: ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను నాయకులు సుభాని, గువరయ్య, నవనీతమ్మలతో కలిసి ప్రారంభించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు గత 446 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నా ప్రభుత్వంలో స్పందన రాలేదని విమర్శించారు. ఇచ్చిన హామీ ప్రకారం మంత్రి నారా లోకేష్ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. కార్మికులు ఐక్యంగా సమస్య పోరాడడం అభినందనీయమని పేర్కొన్నారు. దీక్షలో అంకయ్య, ఖాసిం, దామవరపు నాగేశ్వరరావు, సాంబశివరావు, సూర్యప్రకాష్ కూర్చొన్నారు. కార్యక్రమంలో ఆశీర్వాదం, బాషా తదితరులు పాల్గొన్నారు.

దీక్షా శిబిరంలో కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

శ్రీఆంజనేయం ధ్యాన యోగ మండలికి అరుదైన గౌరవం

తెనాలి: తెనాలి వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన ఆవరణలో కిషోర్ గురూజీతో 21 ఏళ్లక్రితం ఆరంభించిన శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి సంస్థకు ప్రతిష్టాకరమైన గౌరవం లభించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన సర్ సీవీ రామన్ అకాడమి 38వ ఉగాది మహోత్సవంలో సువర్ణ ఘంటా కంకణ, గోల్డ్ మెడల్ అవార్డు, ఏపీ ఉత్తమ యోగ టీచర్ అవార్డును కిషోర్ గురూజీకి ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. అంబికా దర్బార్ సంస్థ అధినేత అంబికా కృష్ణ, రుద్రాక్ష వైభవం, ఆధ్యాత్మిక పీఠం గురువులు శ్రీకృష్ణ చాముండేశ్వరి ముఖ్య అతిథిగా, ప్రవచనం అంద చేసినారు. కిషోర్ గురూజీ స్వయంగానూ, తమ శిష్యబృందంతో అష్టాంగ యోగ నమస్కారములు ప్రదర్శించారు.

ఘనంగా మహా సుదర్శన హోమం

తెనాలి: ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్, తెనాలి ఆధ్వర్యంలో హయగ్రీవస్వామికి విశేష పూజలు నిర్వహించి, విద్యార్థులకు ఉచితంగా పూజా పెన్నులు అందించడం హర్షణీయమని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి అన్నారు. శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్, తెనాలి ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ రావు పేటలోశ్రీ మహా సుదర్శనహోమం శనివారం నుంచి జరుగుతోంది. ఆదివారం కార్యక్రమాల్లో భాగంగా హయగ్రీవ స్వామికి విశేష పూజలు చేశారు. మురళీకాంత్ వి.దాసరి మాట్లాడుతూ ట్రస్ట్ చేపట్టిన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. నిర్వాహకులు కిరణ్ కుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ట్రస్టు ఆధ్వర్యంలో నారాయణ అష్టాక్షరి దివ్య క్షేత్రం నిర్మించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నేత పసుపులేటి త్రిమూర్తి మాట్లాడుతూ ట్రస్ట్ చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, మదుపల్లి చంద్రశేఖర్, జంజం రామారావు, గుడివాడ బాలకష్ణ,రొంపిచర్ల సురేష్, మాజేటి వెంకటేష్, గోలి సోమశేఖర్, బచ్చు లీలా ప్రసాదరావు, మద్దు హరీష్, గార్లపాటి అశోక్, సంకీర్తన బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మురళీకాంత్ వి.దాసరి

ఘంటసాల సంగీత విభావరి



తెనాలి: తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వైద్యకళాశాలకు చెందిన పూర్వవిద్యార్థులు డాక్టర్ కె.పురుషోత్తమరావు, ఇతర వైద్యుల ఆధ్వర్యాన తెనాలిలో ఆదివారం రాత్రి 'మన ఘంటసాల' సంగీత విభావరిని నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఘంటసాల వెంకటేశ్వరరావు గానం చేసిన పాటలను పలువురు గాయకులు ఆలపించారు. డాక్టర్ కె.పురుషోత్తమరావుతో పాటు, జి.హరికృష్ణ, మల్లిక తదితర గాయకులు గానం చేశారు. రవి బృందం వాయిద్య సహకారం అందించారు.

తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలి

తెనాలి అర్బన్: తెలుగు భాషపై అందరూ మక్కువ పెంచుకోవాలని వ్యాపారి ఈదర వెంకట పూర్ణచంద్ పేర్కొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు పీటీ అవధాని ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం – తెలుగు వారం కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం తెనాలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా తెలుగు తరగతులకు హాజరు కావాలని సూచించారు. పీటీ అవధాని మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి వారం తెలుగు సూక్తులు, సామెతలు, శ్లోకాలు, పద్యాలు, దేశభక్తి గేయాలు నేర్పిస్తున్నారన్నారు. అనంతరం వేమన శతకం పుస్తకాలను పంపిణీ చేశారు.

వేమన శతకం పుస్తకాలు అందుకున్న చిన్నారులతో పూర్ణచంద్, అవధాని

సేవా ధృక్పథంతో వైద్యసేవలు అందించాలి

తాడేపల్లి రూరల్: వైద్య రంగంలో అధిక ఫీజులు చెల్లించలేక చాలా మంది బాధితులు వైద్యం చేయించుకోకుండా తుదిశ్వాస విడుస్తున్నారని.. కొత్తగా డాక్టర్లు అయిన వారు సేవా ధృక్పథంతో, తక్కువ ఫీజులతో వైద్యసేవలు అందించాలని విజయవాడ ప్రభుత్వ హాస్పిటల్ మాజీ సూపరింటెండెంట్ కుర్రా శివశంకరరావు అన్నారు. ఆదివారం ఉండవల్లి గ్రామంలో డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ శ్రీహర్షిత ఆధ్వర్యంలో శ్రీ అంజనాద్రి పాలి క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శివశంకరరావు మాట్లాడుతూ.. వైద్య వృత్తిలో ఉన్నవారందరూ పట్టణాలకు తరలివెళ్లి కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్నారని, ఇటువంటి ఆసుపత్రులను ప్రజలకు అందుబాటులో ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. నామమాత్రపు ఫీజులతో తమ సొంత ఊరిలోని ప్రజలకు వైద్యం చేయాలని ఆలోచించిన వైద్యులు, భార్యాభర్తలు పవన్‌కుమార్, శ్రీహర్షితను అందరూ అభినందించాలని అన్నారు. కార్యక్రమంలో మేకల హనుమంతరావు, కుర్రా చెన్నకేశవరావు, పలువురు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

పాలి క్లినిక్‌ను ప్రారంభిస్తున్న కుర్రా శివశంకరరావు

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ సీఎస్ఈ-2 ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం తాడేపల్లి రూరల్‌లోని పలు ప్రాంతాల్లో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ నాగమణి మాట్లాడుతూ.. ప్రస్తుతం గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, నివారణకు టీకా తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వలంటీర్లు బృందాలుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి క్యాన్సర్‌పై అవగాహన కలిస్తూ హెచ్‌పీవీ టీకా తీసుకోవాలని అవగాహన కలిపించారు. ప్రాథమిక ఉప కేంద్రంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో సెంథినీ సిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో రక్తపోటు, మధుమేహం, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యశిబిరంలో తమ అమూల్యమైన సేవలు అందించిన డాక్టర్ ఎన్.అనిల్‌కుమార్, డాక్టర్ అహ్మద్ పాషా, డాక్టర్ కొంగల కిరణ్‌కుమార్, కొంగల ధనరాజ్‌లకు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమానికి ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్ సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమం నిర్వహించి, పాల్గొన్న వారిని విభాగాధిపతి డాక్టర్ బి.తిరుపతి రెడ్డి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, మార్కెటింగ్ మేనేజర్స్ జి.మురళీకృష్ణ, కె.భీమయ్య తదితరులు అభినందించారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు 'హ్యాపీ సండే'

మంగళగిరి టౌన్: విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించి సంతోషం అందించే లక్ష్యంతో ఆనంద ఆదివారం (హ్యాపీ సండే) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్‌బాషా పేర్కొన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ కళాశాలలో ఆదివారం హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అలీమ్‌బాషా మాట్లాడుతూ.. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే కాకుండా సమాజంలో ఐక్యతను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. హ్యాపీ సండే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల భావితరాల భవిష్యత్తుపైనే సమాజ భవిష్యత్తు ఆధారపడి ఉందని వివరించారు. అనంతరం విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉదయం వ్యాయామాలు, యోగా కార్యక్రమాలు నిర్వహించి చిన్నారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ఎంటీఎంసీ అధికారులు, సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు

ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

తాడికొండ: తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రతిష్టా మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తన స్వగ్రామంలో నిర్మించిన ఈ ప్రతిష్టా మహోత్సవానికి పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు కుటుంబ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానం ప్రతిష్టా మహోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవంలో శంకరరావు సతీమణి నంబూరు వసంత కుమారి, కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల రాకతో గ్రామంలో కొత్త కళ సంతరించుకుంది.

కంఠ శివాచార్య స్వామి జయంతి

తెనాలి: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఓంకారేశ్వర స్వామి దేవస్థానం ఆదివారం విశిష్ట ఆధ్యాత్మిక కార్యక్రమానికి వేదికై ంది. జగద్గురు శ్రీ కంఠ శివాచార్య స్వామి జయంతి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి గురుమండలార్చన, వేదిక అర్చన, రుద్ర హోమం, పూర్ణా హుతి కార్యక్రమాలను శైవాగమ పండితులు మామిళ్ళపల్లి మృత్యుంజయప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ శివాలయాలకు చెందిన శైవాగతం అర్చకులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో హరిప్రసాద్, ఆది శైవ సంఘీయులు, అర్చకుడు స్వర్ణకుమార్ శర్మ, దేవదాయ శాఖ ఈవో అవుతు శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

శైవాగతం అర్చకులకు సత్కారం

ఆకట్టుకున్న విలువిద్య ప్రదర్శన

వల్లభాపురం(కొల్లిపర): వల్లభాపురం గ్రామంలోని వినాయక స్వామి దేవాలయం 114వ వార్షికోత్సవ సంబరాలల్లో భాగంగా ఆదివారం ఆలయ ధర్మకర్త అచ్యుత ఇందుశేఖర్ ఆధ్వర్యంలో విలువిద్య ప్రదర్శనలో ఇటీవల జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు పొందిన ఆరుష్‌రెడ్డి ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించిన విలువిద్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి.

CHANGE OF NAME

I.GORREMUTCHU SHIMILA SIKINDAR (Old Name), D/o SIKINDAR, residing at Door No.4-2/6, Vetamari Hospital Nowluru Village, Mangalagiri Mandal, Guntur Dsitrict-522503, AP., I have changed my name as (New Name) SASKIA MILANA ROSEN D/0 SIKINDAR, Hereafter my name is known as (New Name) SASKIA MILANA ROSEN, D/o. SIKINDAR.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)

Office mail : sakshigntadvt@gmail.com

భయపడినట్లే జరిగింది. గ్రూప్ దశలో మూడు చిన్న జట్లతో పాటు పాకిస్తాన్‌లాంటి బలహీన టీమ్‌పై గెలిచినా భారత జట్టు ప్రదర్శనపై ఎక్కడో కొంత సందేహం. తమ స్థాయికి తగ్గ ఆట కనబర్చడం లేదని, ప్రత్యర్థులను పూర్తిగా తొక్కేసే విధంగా సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించడంలేదని అనిపించింది. బలమైన ప్రత్యర్థి ఎదురైతే ఇలాంటి ఆటతో ఇబ్బంది తప్పదని సందేహం వచ్చింది. చివరకు దక్షిణాఫ్రికా మన బలహీనతలను బాగా గుర్తించి దెబ్బ కొట్టింది. అహ్మదాబాద్ మైదానంలో ఎంత భారీ స్కోరు అయినా ఛేదన సులువు అని రికార్డులు చెబుతుండటంతో టాస్ గెలిచి దక్షిణాఫ్రికా **బ్యాటింగ్ ఎంచుకోవడం తప్పు చేసినట్లుగా మ్యాచ్‌కు ముందు చర్చ మొదలైంది.** కానీ ఈ టోర్నీలో ఇప్పటికే ఇక్కడ మూడు మ్యాచ్‌లు ఆడిన సఫారీలు పిచ్‌ను సరిగ్గా అంచనా వేశారు. భారీ స్కోరు సాధించి కాపాడుకోగలమని నమ్మారు. పదునైన బౌలింగ్‌తో భారత్‌ను ఏ దశలోనూ కోలుకోనీయకుండా పడగొట్టారు. 2024 టి20 ప్రపంచకప్ ఫైనల్లో ఓటమికి వరల్డ్ కప్ వేదికపైనే ప్రతీకారం తీర్చుకున్నారు. గత మ్యాచ్‌లలో ఒకరు విఫలమైనా... మన జట్టును ఆదుకునేందుకు మరొకరు సిద్ధమయ్యారు. ఈసారి అంతా సమష్టి వైఫల్యమే. చివర్లో శివమ్ దూబే మెరుపులు కూడా ఒక లాంఛనం మాత్రమే. ఈ ఓటమి అనుభవంతో భారత్ తర్వాతి మ్యాచ్‌లకు ఎలాంటి వ్యూహంతో **ఆడుతుందో చూడాలి.**

దక్షిణాఫ్రికాకు దాసోహం

సూపర్-8 తొలి పోరులో భారత్ ఓటమి

- 76 పరుగులతో దక్షిణాఫ్రికా ఘన విజయం
- రాణించిన మిల్లర్, యాన్సెన్
- టీమిండియా సమష్టి వైఫల్యం
- గురువారం జింబాబ్వేతో తర్వాతి మ్యాచ్

భారత కెప్టెన్ సూర్యకుమార్ వికెట్ తీశాక దక్షిణాఫ్రికా ఆటగాళ్ల సంబరం

అహ్మదాబాద్: టి20 ప్రపంచకప్‌లో భారత్ వరుస విజయాల జైత్రయాత్రకు బ్రేక్ పడింది. 2024 టి20 ప్రపంచకప్ టోర్నీ నుంచి మొదలు పెడితే వరుసగా 13 మ్యాచ్‌లు నెగ్గిన భారత్ గెలుపు పరుగు ఎట్టకేలకు ఆగింది. 'సూపర్-8' దశలో భాగంగా ఆదివారం జరిగిన గ్రూప్-1 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 76 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డేవిడ్ మిల్లర్ (35 బంతుల్లో 63; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించగా, బ్రెవిస్ (29 బంతుల్లో 45; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) అండగా నిలిచాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 51 బంతుల్లోనే 97 పరుగులు జోడించగా, చివర్లో ట్రిస్టన్ స్టబ్స్ (24 బంతుల్లో 44 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) దూకుడు ప్రదర్శించాడు. అనంతరం భారత్ 18.5 ఓవర్లలో 111 పరుగులకే కుప్పకూలింది. శివమ్ దూబే (37 బంతుల్లో 42; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. మార్కో యాన్సెన్ (4/22) భారత్‌ను దెబ్బ తీయగా, కేశవ్ మహరాజ్‌కు 3 వికెట్లు దక్కాయి. భారత్ తమ తర్వాతి సూపర్ ఎయిట్స్ మ్యాచ్‌లో గురువారం చెన్నైలో జింబాబ్వేతో తలపడుతుంది.

కీలక భాగస్వామ్యం...

బుమ్రా, అర్ష్‌దీప్ పదునైన బౌలింగ్ కారణంగా దక్షిణాఫ్రికాకు శుభారంభం దక్కలేదు. బుమ్రా తన వరుస ఓవర్లలో డికాక్ (6), రికెల్టన్ (7)లను వెనక్కి పంపించగా, ఈ రెండు వికెట్ల మధ్య ఓవర్లో మార్క్‌రమ్ (4)ను అర్ష్‌దీప్ అవుట్ చేశాడు. దాంతో సఫారీ టీమ్ 20/3తో కష్టాల్లో పడింది. ఈ స్థితిలో బ్రెవిస్, మిల్లర్ కలిసి దూకుడుగా ఆడుతూ జట్టును ఆదుకున్నారు. పవర్‌ప్లేలో జట్టు 41 పరుగులు చేసింది. ఆరు బంతుల వ్యవధిలో నాలుగు ఫోర్లు బాది మిల్లర్ జోరు ప్రదర్శించగా, వరుణ్ ఓవర్లో బ్రెవిస్ వరుసగా 4, 6 కొట్టాడు. అదే ఓవర్లో మిల్లర్ కూడా సిక్స్ బాదడంతో 17 పరుగులు వచ్చాయి. దూబే ఓవర్లోనూ ఫోర్, సిక్స్ బాదిన బ్రెవిస్ అతని తర్వాతి ఓవర్లో అవుట్ కావడంతో ఎట్టకేలకు భారీ భాగస్వామ్యానికి తెర పడింది. మరోవైపు 26 బంతుల్లో మిల్లర్ హాఫ్ సెంచరీ పూర్తయింది. 15 ఓవర్ల తర్వాత 144/4తో సఫారీ జట్టు 200 స్కోరుపై కన్నేసింది. అయితే ఇక్కడ ప్రత్యర్థిని కట్టడి చేయడంలో టీమిండియా సఫలమైంది. బుమ్రా చక్కటి


మిల్లర్

బౌలింగ్‌తో తన రెండు ఓవర్లలో 8 పరుగులే ఇవ్వడంతో 16-19 మధ్య మొత్తం 23 పరుగులే రాగా, దక్షిణాఫ్రికా 3 వికెట్లు కూడా చేజార్చుకుంది. కానీ పాండ్యా వేసిన ఆఖరి ఓవర్లో స్టబ్స్ ఫోర్, 2 సిక్స్‌లు సహా 20 పరుగులు రాబట్టాడు.

టపటపా...

భారీ ఛేదనలో ఏ దశలోనూ భారత్ గెలిచేలా కనిపించలేదు. తొలి ఓవర్లోనే ఇషాన్ కిషన్ (0) అవుటైన తర్వాత తర్వాతి ఓవర్ తొలి బంతికే తిలక్ వర్మ (1) వెనుదిరిగాడు. ఎట్టకేలకు వరల్డ్ కప్‌లో ఖాతా తెరిచిన అభిషేక్ శర్మ (15) కూడా క్రీజ్‌లో ఉన్నంతసేపు తడబడ్డాడు. 6 ఓవర్లు ముగిసేసరికి జట్టు స్కోరు 31/3. బ్యాటింగ్‌లో ముందుగా వచ్చిన వాషింగ్టన్ సుందర్ (11) ప్రభావం చూపలేకపోగా, కెప్టెన్ సూర్యకుమార్ (22 బంతుల్లో 18; 2 ఫోర్లు) ఇన్నింగ్స్ కూడా పేలవంగా ముగిసింది. హార్దిక్ పాండ్యా (18), రింకూ సింగ్ (0) ఒకే స్కోరు వద్ద అవుట్ కావడంతో భారత్ గెలుపు ఆశలు కోల్పోయింది. 30 బంతుల్లో సరిగ్గా 100 పరుగులు చేయాల్సిన స్థితిలో దూబే కొంత ధాటిని ప్రదర్శించాడు. అతను మూడు సిక్స్‌లతో గెలుపు అంతరాన్ని తగ్గించగలిగాడు!

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (సి) పాండ్యా (బి) అర్ష్‌దీప్ 4; డికాక్ (బి) బుమ్రా 6; రికెల్టన్ (సి) దూబే (బి) బుమ్రా 7; బ్రెవిస్ (సి) అభిషేక్ (బి) దూబే 45; మిల్లర్ (సి) తిలక్ (బి) వరుణ్ 63; స్టబ్స్ (నాటౌట్) 44; యాన్సెన్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 2; బాష్ (సి) అండ్ (బి) బుమ్రా 5; రబాడ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 187. వికెట్ల పతనం:** 1-10, 2-12, 3-20, 4-117, 5-152, 6-158, 7-167. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-28-2, బుమ్రా 4-0-15-3, వరుణ్ 4-0-47-1, సుందర్ 2-0-17-0, పాండ్యా 4-0-45-0, దూబే 2-0-32-1. **భారత్ ఇన్నింగ్స్:** ఇషాన్ కిషన్ (సి) రికెల్టన్ (బి) మార్క్‌రమ్ 0; అభిషేక్ (సి) బాష్ (బి) యాన్సెన్ 15; తిలక్ (సి) డికాక్ (బి) యాన్సెన్ 1; సూర్యకుమార్ (సి) బ్రెవిస్ (బి) బాష్ 18; సుందర్ (సి) డికాక్ (బి) బాష్ 11; దూబే (సి) ఎన్‌గిడి (బి) యాన్సెన్ 42; పాండ్యా (సి) స్టబ్స్ (బి) మహరాజ్ 18; రింకూ (సి) స్టబ్స్ (బి) మహరాజ్ 0; అర్ష్‌దీప్ (సి) స్టబ్స్ (బి) మహరాజ్ 1; వరుణ్ (నాటౌట్) 0; బుమ్రా (సి) మార్క్‌రమ్ (బి) యాన్సెన్ 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (18.5 ఓవర్లలో ఆలౌట్) 111. వికెట్ల పతనం:** 1-0, 2-5, 3-26, 4-43, 5-51, 6-86, 7-86, 8-88, 9-111, 10-111. **బౌలింగ్:** మార్క్‌రమ్ 1-0-5-1, యాన్సెన్ 3.5-0-22-4, రబాడ 4-0-32-0, ఎన్‌గిడి 4-0-15-0, మహరాజ్ 3-0-24-3, బాష్ 3-0-12-2.

76 పరుగుల పరంగా టి20 ప్రపంచకప్ చరిత్రలో భారత జట్టుకిదే అతిపెద్ద ఓటమి.

33 టి20 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా బుమ్రా గుర్తింపు పొందాడు. 32 వికెట్లతో అశ్విన్ పేరిట ఉన్న రికార్డును బుమ్రా 33 వికెట్లతో బద్దలు కొట్టాడు.

2 2022 టి20 ప్రపంచకప్ సెమీఫైనల్లో ఓటమి తర్వాత భారత జట్టు ఐసీసీ పరిమిత ఓవర్ల (వన్డే, టి20) టోర్నీల్లో మొత్తం 29 మ్యాచ్‌లు ఆడింది. 2 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఆ రెండు పరాజయాలు అహ్మదాబాద్ (2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్) వేదికపైనే వచ్చాయి.

టి20 ప్రపంచకప్‌లో నేడు

వెస్టిండీస్ X జింబాబ్వే

వేదిక: ముంబై; రాత్రి 7 గంటల నుంచి

స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మ్యాచ్‌లో సుందర్ పిచాయ్...

భారత పర్యటనలో ఉన్న గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఆదివారం భారత్, దక్షిణాఫ్రికా మ్యాచ్‌కు అతిథిగా హాజరయ్యారు. మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్‌తో కలిసి ఆయన టి20 వరల్డ్ కప్ ట్రోఫీని మైదానంలోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత కామెంటరీ బాక్స్‌లో కూడా రవిశాస్త్రితో ఆయన ముచ్చటించారు. క్రికెట్‌కు తాను వీరాభిమానినని, 80వ దశకంలో భారత మ్యాచ్‌లను చూస్తూ నాటి ఆటగాళ్లకు అభిమానిగా మారానని సుందర్ గుర్తు చేసుకున్నారు. ఐసీసీ 'గ్లోబల్ పార్ట్‌నర్స్'లో ఒకటిగా ఉన్న గూగుల్ సంస్థ వరల్డ్ కప్ స్పాన్సర్‌గా కూడా వ్యవహరిస్తోంది.

విల్ జాక్స్

స్పిన్‌కు ఎదురొడ్డి... స్పిన్‌తోనే పడగొట్టి...

- 'సూపర్-8'లో ఇంగ్లండ్ బోణీ
- శ్రీలంకపై 51 పరుగులతో గెలుపు
- మెరిసిన జాక్స్, సాల్ట్, ఆర్చర్

సాల్ట్

పల్లెకెలె: సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన ఇంగ్లండ్ జట్టు టి20 ప్రపంచకప్ 'సూపర్-8'లో శుభారంభం చేసింది. ఆదివారం గ్రూప్-2లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 51 పరుగుల తేడాతో ఆతిథ్య శ్రీలంకను బోల్తా కొట్టించింది. గ్రూప్ దశలో పడుతూ లేస్తూ సాగిన ఇంగ్లండ్... 'సూపర్ ఎయిట్'లో సాధికారిక విజయం ఖాతాలో వేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (40 బంతుల్లో 62; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. జోస్ బట్లర్ (7), జాకబ్ బెథెల్ (3), టామ్ బాంటన్ (6), కెప్టెన్ హ్యారీ బ్రూక్ (14), స్యామ్ కరన్ (11), డాసన్ (6) విఫలమయ్యారు. స్పిన్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ (21; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. సొంతగడ్డపై శ్రీలంక బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ఇంగ్లండ్ బ్యాటర్లు పూర్తిగా తడబడ్డారు. ఒక్క సాల్ట్ తప్ప మిగిలిన వాళ్లెవరూ భారీ షాట్‌లు ఆడలేకపోయారు. లంక బౌలర్లలో లెఫ్టార్మ్ స్పిన్నర్ దునిత్ వెల్లలాగె 3 వికెట్లు పడగొట్టగా... మధుషనక, తీక్షణ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో శ్రీలంక పూర్తిగా తడబడింది. 16.4 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ షనక (24 బంతుల్లో 30; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఒక్కడే పోరాడగా... తక్కిన వాళ్లంతా విఫలమయ్యారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విల్ జాక్స్ 3 వికెట్లు తీయగా... ఆర్చర్, డాసన్, ఆదిల్ రషీద్ తలా రెండు వికెట్లు పడగొట్టారు.

షనక

సాల్ట్ ఒక్కడే...

ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ సాల్ట్ ఒక్కడే దూకుడు కనబర్చాడు. లంక బౌలర్ల ధాటికి సహచర బ్యాటర్లంతా పెవిలియన్‌కు చేరుతున్నా... సాల్ట్ మాత్రం తనదైన శైలిలో షాట్‌లు ఆడాడు. వరల్డ్‌కప్ తొలి పోరులో నేపాల్ చేతిలో 'చావుతప్పి కన్ను లొట్టబోయినట్లు' గెలిచిన ఇంగ్లండ్...'సూపర్ -8'లోనూ అలాంటి అనుభవమే చవిచూసేలా కనిపించింది. అయితే సాల్ట్ మెరుపులకు బౌలర్ల సహకారం తోడవడంతో ... ఇంగ్లండ్ పని సులువైంది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో 15 బౌండరీలు మాత్రమే నమోదైతే... శ్రీలంక కేవలం 12 బౌండరీలకే పరిమితమైంది.

పవర్ ప్లేలోనే 34/5...

ఓ మాదిరి లక్ష్యఛేదనలో లంక తడబడింది. ఇంగ్లండ్ బౌలర్లు ఆర్చర్, జాక్స్ ధాటికి... ఆరు ఓవర్లు ముగిసేసరికి 34/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. నిసాంక (9), కమిల్ (6), కుశాల్ మెండిస్ (4), పవన్ రత్నాయకే (0), దునిత్ వెల్లలాగె (10) ఇలా ఒకరి తర్వాత ఒకరు పెవిలియన్‌కు వరుస కట్టారు. కెప్టెన్ షనక కాస్త పోరాడే ప్రయత్నం చేసినా... ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి వికెట్ల పతనం అలాగే కొనసాగింది. దీంతో శ్రీలంక లక్ష్యానికి దూరంగా నిలిచిపోయింది. తదుపరి 'సూపర్-8' మ్యాచ్‌ల్లో మంగళవారం పాకిస్తాన్‌తో ఇంగ్లండ్; బుధవారం న్యూజిలాండ్‌తో శ్రీలంక తలపడతాయి.

భారత్‌కే ఆసియా రైజింగ్ స్టార్స్ టైటిల్

ఫైనల్లో 46 పరుగులతో బంగ్లాదేశ్ 'ఎ' జట్టుపై జయభేరి ● రాణించిన తేజల్, రాధ, ప్రేమ

బ్యాంకాక్: రాధ యాదవ్ సారథ్యంలోని భారత్ 'ఎ' మహిళల జట్టు ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టి20 టోర్నీలోవిజేతగా నిలిచింది. ఆదివారం ఇక్కడ జరిగిన ఫైనల్లో భారత బ్యాటర్లకంటే బౌలర్లే సమష్టిగా కూల్చేసి ప్రత్యర్థిని చిత్తు చేశారు. దీంతో భారత్ 'ఎ' 46 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ 'ఎ' జట్టుపై ఘనవిజయం సాధించింది. టాస్ నెగ్గిన భారత అమ్మాయిలు ఫైనల్ ఒత్తిడిని దృష్టిలో ఉంచుకొని ముందుగా బ్యాటింగ్ చేశారు. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 134 పరుగులు సాధించారు. నిజానికి బ్యాటర్లంతా తడబడ్డారు. ఓపెనర్లు నందిని కశ్యప్ (8), వృంద (19) సహా అనుష్క (8), మిన్ను మణి (0) ఇలా టాప్-4 బ్యాటర్లు 44 పరుగులకే పెవిలియన్ చేరారు. ఈ దశలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తేజల్ హసబ్నిస్ (34 బంతుల్లో 51 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగింది. కెప్టెన్ రాధా యాదవ్ (30 బంతుల్లో 36; 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి ఐదో వికెట్‌కు 69 పరుగులు జోడించి జట్టును ఆదుకుంది. భారత ఇన్నింగ్స్‌ను ఫాహిమా ఖాతూన్ (4/25) అద్భుతంగా కట్టడి చేసింది. అయితే బంగ్లాకు నిర్దేశించిన 135 పరుగుల లక్ష్యం కష్టమైంది కానేకాదు. కానీ భారత బౌలర్లు ప్రేమ రావత్ (3/12), తనూజ కన్వార్ (2/11), సోనియా (2/21), సైమా (1/11), రాధ (1/16), మిన్ను మణి (1/17) కలసికట్టుగా బంగ్లా భరతం పట్టారు. కనీసం ప్రత్యర్థి జట్టును వంద పరుగులైనా చేయనీకుండా చావుదెబ్బ కొట్టారు. దీంతో బంగ్లాదేశ్ 'ఎ' 19.1 ఓవర్లలో 88 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ షమీమా సుల్తానా (20) చేసిన పరుగులే ఇన్నింగ్స్ టాప్‌స్కోరు! ఇంకో ముగ్గురు... షర్మిన్ సుల్తానా (18), కెప్టెన్ ఫాహిమా ఖాతూన్ (14), సాదియా (10) రెండంకెల స్కోర్లు చేయగలిగారు. మిగతా వారంతా సింగిల్ డిజిట్లకే అవుటయ్యారు.

మెయిన్ 'డ్రా'కు రామ్-జీవన్ జోడీ

న్యూఢిల్లీ: దుబాయ్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్ విభాగంలో రామ్‌కుమార్ రామనాథన్-జీవన్ నెడుంజెళియన్ (భారత్) జోడీ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. ఆదివారం దుబాయ్‌లో జరిగిన క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో రామ్‌కుమార్-జీవన్ ద్వయం 6-4, 7-6 (7/4)తో కారోల్ డ్రెజెవ్‌స్కీ-పీటర్ మతుజెవ్‌స్కీ (పోలాండ్) జంటను ఓడించింది. 82 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ ఏడు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సర్వీస్‌లో 42 పాయింట్లు, రెండో సర్వీస్‌లో ఎనిమిది పాయింట్లు సాధించింది. తమ సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోకుండా, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. క్వాలిఫయింగ్ తొలి రౌండ్ మ్యాచ్‌లో రామ్-జీవన్ 6-5, 7-6 (7/4) స్కోరుతోనే భారత్‌కే చెందిన అనిరుధ్ చంద్రశేఖర్-విజయ్ సుందర్ ప్రశాంత్‌లపై గెలుపొందడం విశేషం. డబుల్స్ మెయిన్ 'డ్రా'లో యూకీ బాంబ్రీ (భారత్)-గొరాన్సన్ (స్వీడన్); శ్రీరామ్ బాలాజీ (భారత్)-ఒబెర్‌లీట్నెర్ (ఆస్ట్రియా) జోడీలు కూడా ఉన్నాయి.

ఈసారి 'షూటౌట్'లో...

ప్రో హాకీ లీగ్‌లో భారత్‌కు వరుసగా ఆరో పరాజయం

ఆదిత్య అర్జున్

హోబర్ట్: వేదిక మారినా... ప్రత్యర్థులు మారినా... కెప్టెన్సీ మారినా... తాజా సీజన్‌లో భారత పురుషుల హాకీ జట్టు ఆటతీరు మాత్రం మారడంలేదు. ప్రొ లీగ్ రెండో అంచె పోటీల్లో భాగంగా ఆస్ట్రేలియాకు వచ్చిన భారత హాకీ జట్టుకు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. భారత్ వేదికగా జరిగిన తొలి అంచె పోటీల్లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన టీమిండియా... ఆస్ట్రేలియా గడ్డపై ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓటమి పాలైంది. ఆదివారం జరిగిన సీజన్ ఆరో మ్యాచ్‌లో హార్దిక్ సింగ్ సారథ్యంలోని టీమిండియా 'షూటౌట్'లో 4-5 గోల్స్ తేడాతో పరాజయాన్ని చవిచూసింది. నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 2-2తో సమంగా నిలిచాయి. దాంతో విజేతను నిర్ణయించేందుకు 'షూటౌట్'ను నిర్వహించారు. 'షూటౌట్'లో ఆస్ట్రేలియా తరఫున టిమ్ బ్రాండ్, లియామ్ హెండర్సన్, టిమ్ హోవర్డ్, జాక్ వెల్చ్, టామ్ క్రెయిగ్ గోల్స్ చేశారు. భారత్ తరఫున శిలానంద్ లాక్రా, మణిందర్ సింగ్, రాజ్‌కుమార్ పాల్, జుగ్‌రాజ్ సింగ్ గోల్స్ సాధించగా... ఆదిత్య అర్జున్ తీసుకున్న చివరిదైన ఐదో షాట్‌ను ఆస్ట్రేలియా గోల్‌కీపర్ జేడ్ స్నోడెన్ అడ్డుకోవడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. అంతకుముందు నిర్ణీత సమయంలో భారత్ తరఫున అమిత్ రోహిదాస్ (15వ నిమిషంలో), జుగ్‌రాజ్ సింగ్ (43వ నిమిషంలో) ఒక్కో గోల్ చేయగా... ఆస్ట్రేలియా జట్టుకు జోయెల్ రింటాలా (47వ, 56వ నిమిషంలో) రెండు గోల్స్ అందించాడు. స్పెయిన్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో 0-2తో ఓడిన భారత్ ఈ మ్యాచ్‌లో మెరుగైన ఆటతీరు కనబరిచింది. ఒక దశలో 2-0తో ఆధిక్యంలోకి వెళ్లి తొలి విజయం దిశగా సాగిపోయింది. అయితే చివర్లో తప్పిదాలు చేసి తొమ్మిది నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ సమర్పించుకుంది. మ్యాచ్‌లో లభించిన రెండు పెనాల్టీ కార్నర్‌లను భారత్ సద్వినియోగం చేసుకుంది. మరోవైపు ఆస్ట్రేలియా ఏకంగా 14 పెనాల్టీ కార్నర్‌లు సంపాదించినా... రెండింటిని మాత్రమే లక్ష్యానికి చేర్చింది. 'షూటౌట్'లో ఓడినందుకు భారత జట్టుకు ఒక్క పాయింట్... ఆస్ట్రేలియాకు రెండు పాయింట్లు లభించాయి. నిర్ణీత సమయంలో విజయం సాధిస్తే మూడు పాయింట్లు దక్కుతాయి. సోమవారం విశ్రాంతి దినం. మంగళవారం జరిగే మ్యాచ్‌లో స్పెయిన్ జట్టుతో భారత్ ఆడుతుంది. మొత్తం తొమ్మిది జట్లు పోటీపడుతున్న ప్రొ లీగ్‌లో భారత జట్టు ఆరు మ్యాచ్‌లు ఆడి ఒక్క పాయింట్‌తో ఎనిమిదో స్థానంలో ఉంది.

సింగిల్స్ రన్నరప్ వైష్ణవి

బెంగళూరు: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ-100 బెంగళూరు ఓపెన్‌లో భారత క్రీడాకారిణి వైష్ణవి అడ్కర్ రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో మహారాష్ట్రకు చెందిన వైష్ణవి 0-6, 1-6తో ప్రపంచ 124వ ర్యాంకర్ హనీ వాండెవింకెల్ (బెల్జియం) చేతిలో ఓడిపోయింది. 56 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో వైష్ణవి ఒక్క గేమ్ మాత్రమే గెలిచింది. తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయింది. విజేత వాండెవింకెల్‌కు 15,239 డాలర్ల (రూ. 13 లక్షల 82 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 100 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ వైష్ణవికి 8,147 డాలర్ల (రూ. 7 లక్షల 39 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 65 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 690వ ర్యాంక్‌లో ఉన్న వైష్ణవి ఈ టోర్నీలో 'వైల్డ్ కార్డు'తో బరిలోకి దిగింది. ఫైనల్ చేరే క్రమంలో ఈ పుణే అమ్మాయి తనకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న ముగ్గురు క్రీడాకారిణులను ఓడించింది. వైష్ణవి ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 220వ ర్యాంకర్ మాయ్ హొంటామా (జపాన్)పై, క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 148వ ర్యాంకర్ టేలా ప్రెస్టన్ (ఆస్ట్రేలియా)పై, సెమీఫైనల్లో ప్రపంచ 126వ ర్యాంకర్ లాన్లానా (థాయ్‌లాండ్)లపై సంచలన విజయాలు సాధించింది. తద్వారా 2009లో పట్టాయా ఓపెన్‌లో సానియా మీర్జా ఫైనల్ చేరిన తర్వాత... డబ్ల్యూ-100 లెవెల్ టోర్నీలో సింగిల్స్ టైటిల్ పోరుకు చేరిన రెండో భారతీయ క్రీడాకారిణిగా వైష్ణవి గుర్తింపు పొందింది.

Tenth Class English Model Paper

THIRD LANGUAGE - ENGLISH

Class: X **Max. Marks : 100** **Time: 3 hrs 15 min**

Instructions:

1. The question paper has 34 questions in three sections (A, B & C)
2. Answer all the questions on a separate answer book supplied to you.
3. 15 minutes is allotted exclusively for reading the question paper and 3.00 hours for writing the answers.
4. Answer all the questions of SECTION - B (Grammar & Vocabulary) in the same order at one place in your answer book.

SECTION - A (READING COMPREHENSION)

Questions (1 - 5):

Read the following passage carefully.

We, who were outlaws not so long ago, have today been given the rare privilege to be host to the nations of the world on our own soil. We thank all of our distinguished international guests for having come to take possession with the people of our country of what is, after all, a common victory for justice, for peace, for human dignity. We have, at last, achieved our political emancipation. We pledge ourselves to liberate all our people from the continuing bondage of poverty, deprivation, suffering, gender and other discrimination. Never, never, and never again shall it be that this beautiful land will again experience the oppression of one by another. The sun shall never set on so glorious a human achievement. Let freedom reign. God bless Africa! **(Nelson Mandela , Long Walk To Freedom)**

Now, answer the following questions **5×2 = 10M**

1. **Who were once treated as outlaws but are now hosting the nations of the world?**
2. **What do the people pledge to liberate themselves from after achieving political emancipation?**
3. **What rare privilege has been given to the people?**
   A) To travel around the world
   B) To host the nations of the world on their own soil
   C) To rule countries
4. **The victory mentioned in the passage is for -**
   A) Wealth and power B) War and revenge
   C) Justice, peace, and human dignity
5. **The people promise that their land will never again experience -**
   A) Foreign visits
   B) Oppression of one by another
   C) Political meetings

Questions (6-10):

Read the following stanza carefully.

A dime, another ball, is worthless. Now
He senses first responsibility
In a world of possessions. People will take
Balls, balls will be lost always, little boy.
And no one buys a ball back.Money is external.
He is learning, well behind his desperate eyes,
The epistemology of loss, how to stand up
Knowing what every man must one day know
And most know many days, how to stand up.
(The Ball Poem)

Now, answer the following questions **5×1 = 5M**

6. **What is the boy beginning to understand when he loses his ball?**
7. **Why does the poet say that money is external?**
8. **What does the lost ball symbolize in the poem?**
   A) loss and responsibility
   B) Childhood memories
   C) A simple toy
9. **What is the boy learning behind his desperate eyes?**
   A) How to earn money
   B) The value of toys
   C) The epistemology of loss
10. **What must every man learn one day, according to the poem?**
    A) How to earn money
    B) How to stand up after loss
    C) How to buy new things

Questions (11 - 15):

Read the following passage carefully.

The flames of the sacred fire slowly died down. Everyone was gone. Ramlal turned to Bholi and said, "But what about you, no one will ever marry you now. What shall we do with you?" And Sulekha said in a voice that was calm and steady, "Don't you worry, Pitaji! In your old age I will serve you and Mother and I will teach in the same school where I learnt so much. Isn't that right, Ma'am?" The teacher had all along stood in a corner, watching the drama. "Yes, Bholi, of course," she replied. And in her smiling eyes was the light of a deep satisfaction that an artist feels when contemplating the completion of her masterpiece. **(Bholi)**

Now choose the right answer **5×1 = 5M**

11. **What happened to the sacred fire at the beginning of the passage?**
    A) It burned brightly
    B) It was put out by rain
    C) The flames slowly died down
12. **Why did Ramlal worry about Bholi?**
    A) She failed in her exams
    B) No one would marry her
    C) She wanted to leave home
13. **What decision did Bholi make about her future?**
    A) She would go to another village
    B) She would marry
    C) She would serve her parents and become a teacher
14. **Who stood in a corner watching the drama?**
    A) The teacher
    B) Sulekha
    C) The village head
15. **The teacher felt deep satisfaction like an artist because -**
    A) The marriage was completed
    B) Bholi showed courage and confidence
    C) The guests praised her
16. **Study the following Tree Diagram carefully.**



Now answer the following **5×1 = 5 M**

i) What is the Chart about?
ii) What is the difference between a Countable Noun and an Uncountable Noun?
iii) Which type of noun names a particular person, place, or thing?
   A) Common Noun B) Proper Noun
   C) Collective Noun
iv) Which of the following is a Collective Noun?
   A) Apple B) Team C) Love
v) Choose the True Statement
   A) Abstract Noun denotes names of people.
   B) Concrete Noun is not countable noun.
   C) 'India'is an example for Proper Noun

(Question :17)

Read the following passage carefully.

Maruthi was a cheerful school boy, but he was often careless about rules. He came late to school, forgot his homework, and ignored instructions during games. One day, during a school picnic near a river, the English teacher strictly warned the students not to go close to the water without permission. While playing, Maruthi noticed that one of his friends was about to slip on the wet rocks near the riverbank. Remembering the teacher's words, he quickly called out and pulled his friend back to safety. At that moment, he realized that discipline is not punishment but protection.

The incident deeply changed Maruthi. He understood that rules are made to save lives and build responsibility. From that day onward, he became punctual, completed his work on time, and followed every instruction sincerely. His teachers appreciated his transformation, and his classmates began to respect him. Maruthi recognized that discipline always saves life and helps a person grow into a better and wiser individual.

Now, arrange the following jumbled sentences into a meaningful order. **5×1 = 5M**

a. Maruthi saved his friend from slipping into the water.
b. From that day, he became a sincere and disciplined student.
c. Maruthi was a careless school boy who did not follow rules.
d. He realized that discipline always saves life.
e. One day, during a picnic, his teacher warned everyone to stay away from the river.

SECTION - B : GRAMMAR & VOCABULARY

18. **Combine the sentences using the relative pronouns in the brackets.** **2M**
    He visited a zoo. It was very old. (which)

Continued on next page..

19. Change the following sentence into 'passive voice' 2M

Is the chef preparing the dinner?

20. Change the following into Reported Speech 2M

Mother said to her son, "Who is your favorite Teacher?"

21. Fill in the blanks with suitable prepositions given in brackets 2×1 = 2M

(i) The dog is loyal …… its owner (of, to, for)

(ii) She is famous ……. kindness and honesty. (of, to, for)

22. Edit the following passage. 4×1 = 4M

Self-confidence is the belief in one's own abilities **but** (a) strengths. It helps a person face challenges with **courageous** (b) and determination. A self-confident individual trusts his or her decisions and **learnt** (c) from mistakes without fear. With positive thinking and practice, self-confidence grows, leading **of** (d) success, happiness, and a strong, independent personality.

23. Fill in the blanks with suitable articles. 2×1 = 2M

(i) My brother is ……….. MBBS student .

(ii) The more you write , ___ better you grasp.

24. Change the following into Reported action in the past using 'would/used to' 2×1 = 2M

(i) When I was a girl I played basketball.

(ii) Ashok went to the park every evening after school hours.

25. Rewrite the sentences into a single sentence using Noun-modifiers. 2×1 = 2M

(i) Padma read a story. The story is interesting and inspiring.

(ii) He built a house. The house was spacious and modern.

26. Give a suitable advice for the situation given below. 2×1 = 2M

Your teammate, Ravi gets nervous before every competition. Advise him to stay calm and work more.

27. Read the following and write the synonyms of the underlined words, choosing the words from the box. 4×1 = 4M

Butchery, apart, leave, lining, relatives, crying

"Of those who, overcome by death, **depart** (a) from life, a father cannot save his son, nor **kinsmen** (b) their relations. Mark! while relatives are looking on and **lamenting** (c) deeply, one by one mortals are carried off, like an ox that is led to the **slaughter**. (d)

28. Read the following paragraph and write the antonyms of the underlined words. 4×1 = 4M

Let me put it more **clearly,** (a) since no one will **believe** (b) that a thirteen-year-old girl is completely **alone** (c) in the world. And I'm not. I have **loving** (d) parents and a sixteen-year-old sister, and there are about thirty people I can call friends.

29. Fill in the blanks with the right form of words given in the brackets. 2×1 = 2M

I ..... (a) (inherit, inherited, inheriting) my land, always had the greatest respect for your father and your late mother. The Lomovs and the Chubukovs have always had the most .... (b) (friend, friendly, friendship) , and I might almost say the most affectionate, regard for each other

30. Complete the words with correct prefixes and suffixes given in the brackets. 2×1 = 2M

(i) The structure they created formed the basis of one of the harshest, most .... (un, in) humane, societies the world has ever known.

(ii) The fiercely independ………. people of Coorg are possibly of Greek or Arabic descent. (ent /ant)

31. Find the wrongly spelt word and write the correct spelling 2×1 = 2M

(i) scripture enlightenment procesion compass

(ii) Excited assistence inauguration absolutely

32. Read the following dictionary entry of the word given below.

Conscience n/?kɒn??ns/ The inner sense of right and wrong that guides a person's thoughts and actions. It makes a person feel guilty when they do something wrong and satisfied when they do something right. SYN moral sense, inner voice, sense of right and wrong, principles OPP immorality, dishonesty, shamelessness, corruption

Answer the following questions **2×1 = 2M**

(i) What part of speech is the word 'conscience' ?

(ii) What is the antonym of the word 'conscience' ?

33. Use the following expressions in sentences of your own. 2×1 = 2M

(i) Idiomatic expression : pushed to our limits

(ii) Phrasal verb : Reach out to

34. Match the following. 4 × ½ = 2 M

Part - A	Part - B
1. heart breaking	( ) a) speak without focus
2. Plunge in	( ) b) submit
3. Hand in	( ) c) attracted
4. Caught my eye	( ) d) emotional pain

ANSWERS

1. The people of the country who were previously oppressed and treated as outlaws.
2. They pledge to liberate themselves from poverty, deprivation, suffering, gender discrimination, and other forms of discrimination.
3. B) To host the nations of the world on their own soil
4. C) Justice, peace, and human dignity
5. B) Oppression of one by another
6. He is beginning to understand responsibility and the pain of loss in a world of possessions.
7. The poet says money is external because it cannot replace the emotional value of the lost ball or remove the feeling of loss.
8. A) loss and responsibility
9. C) The epistemology of loss
10. B) How to stand up after loss
11. C) The flames slowly died dow
12. B) No one would marry her
13. C) She would serve her parents and become a teacher
14. A) The teacher
15. B) Bholi showed courage and confidence
16. i. The chart is about types Nouns
    ii. A Countable Noun can be counted (e.g., book, car, pencil), while an Uncountable Noun cannot be counted (e.g., water, sugar, music).
    iii. B (iv) B (v) C

17.

1	2	3	4	5
c	e	a	d	b

18. He visited the zoo which was very old.
19. Is the dinner being prepared by the chef ?
20. Mother asked her son Who his Favorite Teacher was.
21. (i) to; (ii) for
22. (a) and'; (b) courage; (c) learns; (d) to
23. (i) an; (ii) the
24. (i) When I was a girl I used to play basketball.
    (ii) Ashok would go to the park every evening after school hours.
25. (i) Padma read an interesting and inspiring story.
    (ii) He built a spacious and modern house.
26. My dear Ravi, you should stay calm and work more before every competition.
27. (a) leave; (b) relatives; (c) crying; (d) butchery
28. (a) unclearly; (b) doubt; (c) together; (d) hating
29. (a) inherited; (b) friendly
30. (i) in- (ii) - ent
31. (i) procession; (ii) assistance
32. (i) noun; (ii) immorality
33. (i) The difficult project pushed us to our limits.
    (ii) Please reach out to me if you need help.
34. 1. D; 2. A; 3. B; 4. C

B.S.Padmavathy,
SA- English
ZPHS Motakatla,
Annamayya District

Daily Quiz

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. The third tier of government :
A. Village Panchayats
B. State govt.
C. Local self-government
D. Zila Parishad

2. Hindi is the mother tongue of only about :
A. 60% B. 30%
C. 40% D. 50%

3. Besides Hindi, there are ______ other languages recognised by the Constitution.
A. 21 B. 24
C. 12 D. 31

4. Recognised as the national language:
A. Hindi
B. English
C. Tamil
D. None of these

5. Who has the power to make laws on the 'residuary' subjects?
A. State Government
B. President
C. Union Government
D. Chief Minister

సహజయోగం బ్రహ్మచైతన్యమైన వేళ...

భారతదేశం పుణ్యభూమి, ధర్మభూమి, యోగభూమి. ఈ గడ్డపైన ఎందరో ఋషులు, మహా ఋషులు, అవతార మూర్తులు, ఆధ్యాత్మిక గురువులు జన్మించారు. అలాంటి ఆధ్యాత్మిక గురువులలో అంతర్జాతీయంగా గుర్తింపు, మన్ననలను పొందిన పరమపూజ్య శ్రీ మాతాజీగా పిలువబడే శ్రీమతి నిర్మలా దేవి శ్రీ వాత్సవ ఒకరు. ఆమె కారణ జన్మురాలని ఆమెను గురించి తెలిసిన ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారు.

పరమపూజ్య శ్రీ మాతాజీ నిర్మలా దేవి కేవలం ఒక ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదు. సర్వ మానవ సౌభ్రాతృత్వం, సర్వ మత, సర్వధర్మ సంస్థాపనకోసం ఊరూరా తిరిగి, విదేశాలలో పర్యటించి తాను నమ్మిన సత్యాన్ని, ధర్మాన్ని స్వయంగా ఆచరించి చూపించిన ఆత్మసాక్షాత్కార గురువు. ప్రవక్తలందరూ చెప్పిన ధర్మాలన్నీ ఒకచెట్టుకు పూసిన పువ్వులే అయినప్పటికీ, ఎవరికి తోచిన పువ్వును వారు కోసుకుని వివిధ మతాలను స్థాపించుకుని, వాటి ప్రవక్తలు ప్రవచించిన మూల సూత్రాలను పక్కదారి పట్టిస్తున్న సమయంలో శ్రీ మాతాజీ నిర్మలాదేవి అటువంటి వాటి నుండి వాస్తవాన్ని, అసలు సత్యాన్ని సహజ యోగం ద్వారా బహిర్గత పరచారు.

పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలా దేవి 1970 మే 5 వ తేదీన తన స్వీయ తపోశక్తి ద్వారా 'సహజయోగ' ని ఆవిష్కరించారు. తనలో నిద్రాణ స్థితిలో వున్న కుండలినీ శక్తిని జాగృతి చేసి సహస్రార చక్రం తెరిచి తద్వారా తన లోని ఆ భగవత్ శక్తి అయిన కుండలినీ శక్తిని బాహ్యపరంగా వున్న పరమాత్మ ప్రేమైక శక్తి అయిన పరమ చైతన్యంతో అనుసంధానం చేయడం ద్వారా ఆత్మ సాక్షాత్కార స్వీయ అనుభూతిని సాధించారు. 'సహ' అంటే మనతో 'జ' అంటే జన్మించిన శక్తి, యోగ అంటే బాహ్యపరంగా వున్న శక్తితో కలయిక అని అర్థం. ఆ విధంగా మనలోని కుండలినీ శక్తి బాహ్యపరంగా విశ్వవ్యాపిత భగవత్ శక్తితో ఏకీకరణ పొందినప్పుడు మనం కూడా ఆ పరమాత్మ దివ్య శక్తిలో ఓ భాగమైపోతాము.

పరమచైతన్యం లేక బ్రహ్మ చైతన్యం అంటే విశ్వవ్యాపితమైన పరమాత్మ ప్రేమ శక్తి మాత్రమే. విశ్వాన్నంతటిని, సకల చరాచర జీవులను, నడిపించే భగవత్ శక్తి. మానవ మేధస్సుకు అతీతమైనది.

ఆత్మ సాక్షాత్కారం పొంది ప్రతినిత్యం సహజయోగ సాధన చేస్తున్నవారి సహస్రార చక్రం పూర్తిగా వికసించి, మన అంతర్గత సూక్ష్మ శరీర వ్యవస్థలో ఉన్న 7 చక్రాలు తెరుచుకుని బ్రహ్మ చైతన్యంలో అంతర్భాగాలైన అధిష్టాన దేవతలు మేల్కొనబడి మనకు తమ ఆశీర్వచనాలు అందచేస్తారు. సదాశివుని అర్ధాంగి అయిన ఆదిశక్తి ఆయన చుట్టూ పరివేష్టించి ఓ చల్లటి మేఘం లాగా ఆవృతమై వుంటుంది. అదే బ్రహ్మ చైతన్యం. పరమచైతన్య శక్తిగా పిలువబడుతున్న ఆ శక్తియే పరమాత్మ అయిన సదాశివుని ఇచ్ఛాశక్తి. ఆ శక్తియే విశ్వాన్ని సృష్టించింది. భూమి మీద వున్న జీవజాలం మీద,మానవుల మీద తన పరమ చైతన్య శక్తిని వెదజల్లుతుంది. మనల్ని అంతర్గతంగా బలోపేతం చేస్తుంది, పోషిస్తుంది. మనలో ప్రేమ శక్తిగా అంకురిస్తుంది.

అందుకే ఆత్మసాక్షాత్కారం పొంది సహజయోగ సాధన చేస్తున్న వారందరూ ఈ భగవంతుని ప్రేమ శక్తిని తన చుట్టూ ఉన్న పదిమందికీ పంచడానికి కృషి చేస్తారు. కుల, మత, జాతి, ప్రాంత, వయసు, లింగ భేదాలు లేకుండా ఎవరైనా, ఎప్పుడైనా అతి సునాయాసంగా ఆచరించగలిగే ఈ సహజ యోగం దైనందిన జీవితంలో మనం ఎదుర్కొనే

శారీరిక, మానసిక, భౌతిక, ఆధ్యాత్మిక సమస్యలన్నిటికీ చక్కటి పరిష్కారం. మనిషి ఎన్నో ఏళ్లనుండి, ఎన్నో జన్మలనుండి అన్వేషిస్తున్న 'సత్యాన్ని' సహజయోగ ధ్యానం ద్వారా ఆవిష్కరించి ఎటువంటి స్వార్థచింతన లేకుండా మానవాళికి శ్రీ మాతాజీ నిర్మలా దేవి అందించారు.

సహజయోగం ద్వారా వారిని భగవంతుని శక్తితో అనుసంధానపరచి తమ కష్టాలను, సమస్యలను ధ్యానం ద్వారా తమను తాము ఎలా సమతుల్యంలో ఉంచుకోవాలో, ఎలా తమ సమస్యలను తమంతట తాము పరిష్కరించుకోవాలో తెలుసుకుని ఎంతో ఆనందంగా ఉంటున్నారు. ఇలా కోరుకున్న ప్రతి ఒక్కరిలో సరైన పరివర్తన తీసుకురాగలిగే 'నవ సమాజ నిర్మాణం', 'వసుధైక కుటుంబం', 'సర్వమానవ సౌభాతృత్వం' 'ద్వేష రహిత, ప్రేమ పూరిత సమాజం' ఏర్పడటం సుసాధ్యమే అని తాను స్థాపించిన సహజయోగం ద్వారా శ్రీ మాతాజీ నిర్మలా దేవి ఆచరించి నిరూపించారు. శ్రీమతి నిర్మలాదేవి తన జన్మ సార్థకం చేసుకుని 2011 వ సంవత్సరం, ఫిబ్రవరి 23వ తేదీన తన సాకార రూపాన్ని చాలించుకుని నిరాకారం లోనికి వెళ్ళిపోయిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా సహజ యోగ ధ్యానకేంద్రాలలో ప్రతిఏటా ఫిబ్రవరి 23వ తేదీన 'బ్రహ్మ చైతన్య దినోత్సవం' గా జరుపుకుంటున్నారు.

– డా. పి. రాకేష్,
సహజ యోగ సాధకులు

(నేడు అంతర్జాతీయ బ్రహ్మచైతన్య దినోత్సవం)

● తాత్త్వికథ

తిండి గింజల దొంగలు

ఒక ఊర్లో ఓ జమీందారు ఉండేవాడు. పదిమందికీ సహాయం చేయాలనే తపన కలిగిన వాడు. తను సంపాదించిన దాంట్లో కొద్ది మొత్తం పక్కన పెట్టి పేదవారికి లేదనకుండా ఆదుకునేవాడు. దాంతో అతడికి ఆ చుట్టుపక్కల గ్రామాల్లో చాలా మంచివాడనే పేరు వచ్చింది.

కొన్ని రోజుల తర్వాత ఆ ఊరి కొండ వెనుక ఉన్న గ్రామంలో ఒక రైతు ఉన్నాడని, అతడు చాలా మంచివాడని తెలుసుకున్నాడు. ఆ రైతు గురించి ఎంతో గొప్పగా ప్రచారం జరుగుతుండటంతో ఆ రైతును చూడాలన్న కుతూహలం జమీందారుకు కల్గింది.

తమ తోటలోని తియ్యటి మామిడి పండ్లను సంచిలో పెట్టుకుని సేవకుడిని తోడు చేసుకుని బయలుదేరాడు. రైతుకు అంత మంచి పేరు రావడానికి కారణం ఏమై ఉంటుందోనని ఆలోచన చేస్తూ నడవసాగాడు. చిన్నగా కొండ దాటి రైతు ఉన్న గ్రామం చేరాడు. అప్పటికే రాత్రి ఒంటిగంట అయ్యింది.

అది వరి నూర్పిడికి సిద్ధంగా ఉన్న కాలం. రైతు తన పొలం వద్ద నార మంచం మీద పడుకుని ఉన్నాడు. రైతు పొలంలోకి నలుగురు దొంగలు దూరి ఉన్నారు. వారు వడ్లను మూటల్లోకి నింపుకుంటున్నారు. దొంగల అలికిడికి రైతు లేచి కూర్చున్నాడు. అప్పటికే దొంగలు వడ్లతో నింపిన రెండు మూటలను కట్టి పక్కన పెట్టి ఉన్నారు.



రైతు లేచింది చూసి దొంగలు పరిగెత్తబోయారు. వెంటనే రైతు ''ఎందుకు పరిగెత్తుతున్నారు, పరిగెత్తకండి. నేను మీ దగ్గరకు రాను. ఉన్నచోటు నుంచి అంగుళం కూడా కదలను. ఇక్కడే మంచం దగ్గరే ఉంటాను. కడుపుకు లేకనే కదా మీరు దొంగతనం చేస్తున్నారు. ఎన్ని మూటల వడ్లు కావాలో తీసుకెళ్ళండి. నేను మీ జోలికి రాను, ఎవ్వరికీ ఫిర్యాదు చేయను' అని గట్టిగా అరిచి చెబుతున్నాడు. అయినా దొంగలు వినలేదు. ఎక్కడివక్కడ పారేసి పరుగులు తీస్తూ పారిపోయారు.

'అయ్యో... ఎంత పాపం చేశాను. నేను నిద్ర లేచిన దానివల్ల కదా వాళ్ళు వడ్లు ఎత్తుకుని వెళ్లలేకపోయారు. ఎంతో ఆకలైతే కానీ తిండిగింజల దొంగతనానికి రారు. వారి నోటికాడ కూడు తీసినాను కదా' అని ఏడుస్తూ కూర్చున్నాడు. అదంతా కళ్ళారా చూసిన జమీందారు చలించిపోయాడు.

'నేను సంపాదించిన దాంట్లో కొంత మాత్రమే పేదలకు పెడుతున్నాను. ఈ రైతు చూడు, తనకి చెడ్డ చేసే వాళ్ళ మంచి కూడా కోరుతున్నాడు. వారి ఆకలికేకల గురించి ఆలోచిస్తున్నాడు. ఇది కదా మానవత్వమంటే. ఇది కదా మంచితనమంటే' అనుకుంటూ ఆ రైతుకు నమస్కరించి తను తెచ్చిన పండ్లు అతడి చేతికిచ్చి వెనుదిరిగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

● మంచి మాట

వివేకం... మంచి చెడుల విచక్షణ



నేటి సమాచార యుగంలో మనకు జ్ఞానం లభిస్తోంది గానీ వివేకం కరువవుతోంది. ఏది మన అభ్యున్నతికి తోడ్పడుతుంది, ఏది మనల్ని పతనానికి నడిపిస్తుంది అని తర్కించగలిగే శక్తే వివేకం. క్షీర నీర న్యాయం ప్రకారం పాల నుండి నీటిని వేరు చేసే హంస వలె, మనిషి లోకంలోని అసత్యాల నుండి సత్యాన్ని గ్రహించగలగడమే వివేక జ్ఞానం.

మనం ప్రతిరోజూ ఎన్నో బాహ్య ఆకర్షణలకు లోనవుతుంటాం. తాత్కాలిక సుఖాల కోసం శాశ్వతమైన విలువలను వదులుకోవడం అవివేకం. ఒక పనిని ప్రారంభించే ముందు 'ఇది నా ఎదుగుదలకు తోడ్పడుతుందా? దీనివల్ల సమాజానికి మేలు జరుగుతుందా?' అని ప్రశ్నించుకోవడమే వివేకవంతమైన జీవనం. కోపం వచ్చినప్పుడు ఆవేశంతో నిర్ణయం తీసుకోకుండా, పరిణామాలను యోచించడం వివేక లక్షణం. వివేకం ఉన్న మనిషి ఇతరుల విమర్శలకు కృంగిపోడు, పొగడ్తలకు పొంగిపోడు. ఈ విచక్షణా జ్ఞానం మనిషిని స్థితప్రజ్ఞుడిగా మారుస్తుంది. అది మనలోని అంతర్వాణిని వినేలా చేస్తుంది. మాయా జగత్తులో సత్యం నిగూఢంగా ఉంటుంది; దానిని వెలికితీసే దీపమే మన వివేకం.

వివేకం అంటే కేవలం లౌకిక విద్యల ద్వారా ప్రాప్తించే తెలివితేటలు కావు; అది నిత్యానిత్య వస్తు వివేకం. అనగా ఏది శాశ్వతం, ఏది అశాశ్వతం అన్న సత్యాన్ని వేరు చేసి చూడగలిగే దివ్య ప్రజ్ఞ.

ఉపనిషత్తులు చెప్పినట్లు 'శ్రేయస్సు', 'ప్రేయస్సు' అనే రెండు మార్గాలు మనిషి ముందు ఉంటాయి. చూడటానికి ఆకర్షణీయంగా ఉండి తక్షణ తృప్తిని ఇచ్చేది ప్రేయస్సు; అంతిమంగా మేలు చేసేది శ్రేయస్సు. వివేకవంతుడు ఎప్పుడూ శ్రేయస్సునే ఎంచుకుంటాడు. వివేకం లేని జ్ఞానం భారమవుతుంది; వివేకం ఉన్న మౌనం కూడా శక్తివంతమవుతుంది. మన ఆలోచనల్లో స్పష్టత, నిర్ణయాల్లో ధైర్యం రావాలంటే వివేకం తోడవ్వాలి. ఇది మనల్ని అంధకారం నుండి జ్యోతి వైపు నడిపిస్తుంది. నిరంతర సాధన, సత్సంగం ద్వారా ఈ వివేకాన్ని పదును పెట్టుకోవచ్చు. వివేకమే మన ప్రయాణానికి దిక్సూచి, మన ఆత్మకు అసలైన వెలుగు.

వైదిక ఇతిహాసాలలో వివేకానికి నిదర్శనంగా భగవద్గీతలోని అర్జునుడిని గమనించవచ్చు. యుద్ధరంగంలో విషాదానికి లోనైన పార్థుడికి కృష్ణ పరమాత్మ వివేకాన్ని ప్రసాదించారు. దేహం నశ్వరమని, ఆత్మ శాశ్వతమని బోధించడం ద్వారా ధర్మం పట్ల అతడికి ఉన్న సందిగ్ధతను తొలగించారు. వివేకం ఉన్న చోట భయం ఉండదు; ఎందుకంటే ఆ వ్యక్తికి ఫలితం కంటే కర్తవ్యం గొప్పదని తెలుస్తుంది. అలాగే రామాయణంలో విభీషణుడు రావణుడి వైభవాన్ని చూసి మోసపోకుండా, రాముడి వైపు ధర్మం ఉందని గుర్తించడం ఆయన వివేకానికి నిదర్శనం. అహంకారం మన కళ్లకు కమ్మే పొరలను తొలగించి, సత్యాన్ని దర్శింపజేసే దివ్య నేత్రం వివేకం. అశాశ్వతమైన భోగాల కంటే శాశ్వతమైన ధర్మమే మిన్న అని గ్రహించడమే మానవత్వపు అసలైన విజయం.

సార్వజనిక ధర్మం అందించిన ఈ వివేక మార్గం వ్యక్తిని పరిపూర్ణ మనీషిగా తీర్చిదిద్దుతుంది. మాయాప్రపంచంలో చిక్కుకోకుండా సత్యపథంలో సాగడమే మన లక్ష్యం కావాలి. మన బుద్ధి వివేకంతో ప్రకాశించినప్పుడు జీవితంలో సవాళ్లు మాయమై అవకాశాలు కనిపిస్తాయి. బాహ్య ప్రపంచం కన్నా మన అంతరంగంలో ఉన్న విచక్షణా శక్తిని నమ్ముకోవడం నేర్చుకోవాలి. వివేకమే ధర్మం, వివేకమే విజయం. సర్వం ప్రజ్ఞామయం!

– కె. భాస్కర్ గుప్తా
వ్యక్తిత్వ వికాస నిపుణులు

సాక్షి సినిమా

అభిమానులకు అంకితం

– అల్లు అర్జున్

కొచ్చి వేదికగా జరిగిన 70వ ఫిల్మ్ ఫేర్ సౌత్ అవార్డుల ప్రదానోత్సవంలో 'పుష్ప 2: ది రూల్' సినిమా హవా కనిపించింది. తెలుగులో ఉత్తమ చిత్రంగా 'పుష్ప 2: ది రూల్'కు అవార్డు రాగా, ఈ చిత్రంలోని నటనకుగాను అల్లు అర్జున్ ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నారు. ఇదే చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా సుకుమార్, సంగీత దర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్స్‌గా రామకృష్ణ–మౌనికలకు అవార్డులు దక్కాయి. ''ఫిల్మ్‌ఫేర్ అవార్డును స్వీకరించడం చాలా సంతోషంగా ఉంది. నాపై ఎనలేని ప్రేమ చూపిస్తున్న నా అభిమానులకు ఈ అవార్డును అంకితం చేస్తున్నాను'' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు అల్లు అర్జున్. ఇక '35: చిన్న కథ కాదు' సినిమాలోని నటనకు గాను ఉత్తమ నటిగా నివేదా థామస్ అవార్డు అందుకున్నారు. ఇదిలా ఉంటే... అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'పుష్ప 2: ది రూల్' బ్లాక్ బస్టర్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించగా, సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ పతాకాలపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. 2024 డిసెంబరు 5న విడుదలైన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 1800 కోట్ల వసూళ్లను రాబట్టింది.

జై హనుమాన్ ఆరంభం

● 'జై హనుమాన్' ప్రారంభోత్సవంలో ఓ దృశ్యం

''హనుమంతుడి మౌనం ఓటమి కాదు... ఒక లక్ష్యంతో కూడిన నిశ్చలత... సమయం వచ్చినప్పుడు వెలుగులోకి వచ్చే అపార శక్తిని ప్రతిబింబిస్తుంది. అచంచల భక్తి, విశ్వాసం, శాశ్వత బలానికి నివాళిగా ఈ సినిమా నిలుస్తుంది'' అంటూ 'జై హనుమాన్' గురించి యూనిట్ పేర్కొంది. హనుమంతుడిగా రిషబ్ శెట్టి లీడ్ రోల్‌లో ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం 'జై హనుమాన్'. విజయనగరంలోని హంపిలోని ఆంజనేయుడి జన్మస్థలం అంజనాద్రి బెట్టలో ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ఆరంభమైంది. పాన్–ఇండియన్ బ్లాక్‌బస్టర్ మూవీ 'హనుమాన్'కి సీక్వెల్‌గా ప్రశాంత్ వర్మ 'జై హనుమాన్'ని తెరకెక్కించనున్నారు. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది తదుపరి అధ్యాయం. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి భూషణ్ కుమార్ క్లాప్ కొట్టగా, అనిల్ తడాని కెమెరా స్విచ్చాన్ చేశారు. 'హనుమాన్' హీరో తేజ సజ్జా గౌరవ దర్శకత్వం వహించారు. అనిల్ తడాని, భూషణ్ కుమార్, నవీన్ ఎర్నేని, రవిశంకర్ కలిసి ప్రశాంత్ వర్మకు స్క్రిప్ట్‌ను అందజేశారు. ''కలియుగం నేపథ్యంలో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎపిక్ మూవీ 'జై హనుమాన్'. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం. కీరవాణి, కెమెరా: ఎస్. తిరునావుక్కరసు.

ఆరా ఆఫ్ ఉస్తాద్

● హరీష్ శంకర్, దేవిశ్రీప్రసాద్, చంద్రబోస్

పవన్ కల్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన తాజా సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'. శ్రీలీల, రాశీ ఖన్నా ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం మార్చి 26న రిలీజ్ కానుంది. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్‌లో 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పాట లిరికల్ వీడియో లాంచ్ ఈవెంట్‌ను యూనిట్ నిర్వహించింది. ఈ ఈవెంట్‌లో దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ– ''పవన్ కల్యాణ్‌గారి అభిమానులు కోరుకునే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు. ''గబ్బర్ సింగ్' సినిమాలోని 'ఆకాశం అమ్మాయైతే..' పాటకు నేను, దేవీ, హరీష్‌గార్లు కలిసి వర్క్ చేశాం. ఇప్పుడు మళ్లీ ఈ పాటతో మీ ముందుకు వచ్చాం'' అని తెలిపారు చంద్రబోస్. ''ఆరా ఆఫ్ ఉస్తాద్' నాకు ప్రత్యేకమైన పాట. మైత్రీ మూవీ మేకర్స్ నా హోమ్ బ్యానర్ వంటిది. ఈ నిర్మాతలకు సినిమా అంటే ఎంతో తపన'' అన్నారు దేవిశ్రీ ప్రసాద్.

వేసవిలో మా ఇంటి బంగారం



● సమంత

వేసవిలో 'మా ఇంటి బంగారం' థియేటర్స్‌లోకి రానుంది. 'ఓ... బేబీ' వంటి సక్సెస్‌ఫుల్ మూవీ తర్వాత హీరోయిన్ సమంత, దర్శకురాలు నందినీరెడ్డిల కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. ఈ ఫ్యామిలీ యాక్షన్ డ్రామాలో దిగంత్, గుల్షన్ దేవయ్య, శ్రీముఖి, గౌతమి, ఆనంద్, లక్ష్మి, శ్రీనివాస్ గవిరెడ్డి, మంజుషా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని మే 15న రిలీజ్ చేస్తున్నట్లుగా ప్రకటించి, శనివారం ఓ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''ఈ సినిమా కోసం సమంత సరికొత్తగా మేకోవర్ అయ్యారు. ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్, బలమైన భావోద్వేగాలు, యాక్షన్ వంటి అంశాలను బ్యాలెన్స్ చేస్తూ నందినీ రెడ్డి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: సంతోష్ నారాయణన్.

ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్

హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మికా మందన్నాల వివాహం ఈ నెల 26న రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో జరగనున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తమ వివాహానికి 'వెడ్డింగ్ ఆఫ్ విరోష్' అని పేరు పెట్టినట్లుగా విజయ్ దేవరకొండ, రష్మికా మందన్నా సోషల్ మీడియా వేదికగా ఓ నోట్‌ను షేర్ చేశారు. ''మేం ఏదైనా ప్లాన్ చేయాలనుకున్నా, మా కోసం మేం ఏదైనా ఎంపిక చేసుకోవాలనుకున్నా, మా కంటే ముందే మీరే (అభిమానులను ఉద్దేశిస్తూ..) ఈ పనులను చేసిపెడుతున్నారు. ఎంతో ప్రేమతో మీరు మమ్మల్ని 'విరోష్' అని పిలుస్తున్నారు. అభిమానుల గౌరవార్థం ఈ పేరునే మేము కూడా స్వాగతిస్తున్నాము. మా పెళ్లి వేడుకకు 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్'గా పేరు పెడుతున్నాం. మమ్మల్ని ఇంత ప్రేమాభిమానాలతో ఆదరిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు. మీరెప్పుడూ మాలో భాగమే. ప్రేమాభిమానాలతో...'' అంటూ ఇన్‌స్టా స్టోరీలో విజయ్ దేవరకొండ ఓ పోస్ట్ చేశారు. రష్మికా మందన్నా కూడా ఇదే పోస్ట్‌ను తన ఇన్‌స్టా స్టేటస్‌లో షేర్ చేశారు. ఈ ఇద్దరూ కలిసి ఒకేసారి అధికారికంగా తమ పెళ్లి వార్తను పంచుకోవడం ఇదే తొలిసారి అని చెప్పవచ్చు. ఇక విజయ్ దేవరకొండ–రష్మికా మందన్నా తొలిసారిగా 'గీతగోవిందం' సినిమాలో నటించారు. ఆ తర్వాత 'డియర్ కామ్రేడ్'లో జోడీగా నటించారు. తాజాగా 'రణబాలి' సినిమాలో హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు.

కిల్లర్‌తో నా కల నెరవేరింది

– జ్యోతి పూర్వజ్

● విశాల్ రాజ్, గౌతమ్, జ్యోతి, పూర్వజ్, మనీష్

జ్యోతి పూర్వజ్, సుకు పూర్వజ్ లీడ్ రోల్స్‌లో నటించిన సినిమా 'కిల్లర్'. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పణలో సుకు పూర్వజ్ దర్శకత్వం వహించారు. ఎ. పద్మనాభ రెడ్డి, పూర్వజ్ నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో పూర్వజ్ మాట్లాడుతూ– ''ఉమెన్ సెంట్రిక్ సినిమా ఇది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎమోషనల్ డ్రామా, బ్రదర్ సిస్టర్ బాండింగ్, రివెంజ్... వంటి అంశాలతో సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ సినిమాగా 'కిల్లర్'ను రూపొందించాం. ఇందులో మల్టీలేయర్ స్క్రీన్‌ప్లే ఉన్నప్పటికీ ఈ సినిమా ప్రేక్షకులకు ఈజీగా అర్థం అవుతుంది. 'కిల్లర్'లో ఆర్ అక్షరం రక్తిక అనే పిశాచి, రనియా అనే తీవ్రవాది, రియా అనే గూఢచారి, రై అనే విషపూరిత మహిళ... ఈ క్యారెక్టర్స్‌తో పాటు మరో ఆసక్తికరమైన పాత్రను కూడా ఆడియన్స్ చూస్తారు'' అని చెప్పారు. ''విజయశాంతిగారిలా యాక్షన్ చేయాలన్నది నా డ్రీమ్. ఈ సినిమాతో ఆ చాన్స్ దక్కింది. ఇందులో నేను ఆరేడు క్యారెక్టర్స్ చేశాను. పెళ్లయ్యాక ఎవరైనా వెకేషన్‌కి వెళ్దాం అంటారు. కానీ సినిమా చేద్దామని పూర్వజ్ నాతో అన్నప్పుడు హ్యాపీ ఫీలయ్యాను. మాకున్న పరిధి దాటి ఈ సినిమాను నిర్మించాం'' అని అన్నారు. ఈ కార్యక్రమంలో యాక్టర్స్ శ్రీనివాస్, చందు, కాళీ చరణ్, లైన్ ప్రొడ్యూసర్స్ సీతారామారావు, దశరథ మాధవ్ మాట్లాడారు.

ఆ రిస్క్ తీసుకోలేను – సుదర్శన్

సుహాస్, శివానీ నాగారం హీరో హీరోయిన్లుగా, వీకే నరేష్, సుదర్శన్ కీలక పాత్రల్లో నటించిన సినిమా 'హే బల్‌వంత్'. గోపీ అచ్చర దర్శకత్వంలో బి. నరేంద్రరెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదలైంది. బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ సినిమాను రిలీజ్ చేశారు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో సుదర్శన్ మాట్లాడుతూ– ''నేను నటించిన 'అమెరికాకు దారేది' అనే షార్ట్ ఫిల్మ్‌కు మంచి స్పందన రావడంతో 'రన్ రాజా రన్' చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. అయితే 'దోచెయ్' సినిమాలో యాక్టర్‌గా నేను ఫుల్ లెంగ్త్ రోల్ చేశాను. ఆ తర్వాత 'కుమారి 21ఎఫ్, పటాస్, సామజవరగమన, నారీ నారీ నడుమ మురారి' వంటి సినిమాలు చేశాను. ఇప్పటివరకు దాదాపు 170 చిత్రాల్లో నటించాను. ఇక 'హే బల్‌వంత్' చిత్రంలో నేను చేసిన బంక పాత్రకు ఆడియన్స్ నుంచి పాజటివ్ రెస్పాన్స్ లభించడం చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమాలోని డ్రింకింగ్ సీన్, వెన్నెల కిషోర్‌తో చేసిన ప్రకృతి చికిత్సాలయం వంటి సీన్స్‌ను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. హాస్యనటుడిగా నా కెరీర్ ఇప్పుడే ఊపందుకుంటోంది. ఈ తరుణంలో హీరోగా చేయాలని రిస్క్ తీసుకోలేను. ఒకసారి హీరోగా చేస్తే హాస్యనటుడిగా అవకాశాలు తగ్గిపోయే చాన్స్ కూడా ఉంది. అందుకే ఇప్పట్లో హీరోగా చేయను. చిన్న చిన్న కాన్సెప్ట్‌తో కూడిన ఓటీటీ సినిమాలైతే చేయాలని ఉంది. తమిళం, కన్నడ ఇండస్ట్రీ నుంచి కూడా మంచి ఆఫర్స్ వస్తున్నాయి. త్వరలో విడుదల కానున్న 'మృత్యుంజయ, గోదారి గట్టుపైన..' సినిమాల్లో నటించాను'' అని అన్నారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

గతవారం (16-2-26 నుంచి 20-2-26 వరకు)

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
188	100
82,815	25,571

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	22,877	▲	195
డోజోన్స్	49,611	▲	216
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,686	▲	60
డాక్స్	25,260	▲	217
షాంఘై	4,082	▼	52
నికాయ్	56,825	▼	642

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	90.52	91.54
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	120.86	123.88
€	యూరో	ఎస్‌బీఐ	105.59	108.44
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.98	59.39
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	61.75	65.68
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	69.39	73.14
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.37	24.87
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.88	25.14
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.29	14.12

ఖర్చులకు కళ్లెం వేద్దాం!

ఒకప్పుడు విలాసం అనుకున్నవన్నీ ఇప్పుడు అవసరాలైపోయాయి. స్మార్ట్‌ఫోన్లు, కార్లు, లాప్‌టాప్‌లు, ఏటా ఒకటిరెండు సార్లు వైద్య పరీక్షలు, విహార యాత్రలు... ఇవన్నీ ఇపుడు జీవితంలో భాగమైపోయాయి. ఇక కొంచెం ఆదాయం పెరిగిందంటే వీటన్నిట్లోనూ 'బెటర్‌మెంట్' తప్పదనిపిస్తుంది. మెరుగైన ఫోన్లు, ఆధునిక ల్యాప్‌టాప్‌లు, సురక్షితమైన కార్లు, నాణ్యమైన చదువు, నమ్మకమైన ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ సబ్‌స్క్రిప్షన్లు, విదేశీ విహారాలు ఇవన్నీ అప్‌గ్రేడ్ వెర్షన్లతో అవసరాలుగా మారి మనముందు కూర్చుంటున్నాయి. ఆదాయం పెరిగినప్పుడు సరే!!. కానీ ఆదాయం తక్కువ ఉన్నా కూడా వీటికోసం పరుగులుపెట్టి ఖర్చులు చేస్తేనే సమస్య. ఈ సమస్య ఇపుడు పెరుగుతోంది. పెద్దదవుతోంది. కుటుంబాలను ఒత్తిడిలోకి నెడుతోంది. మరేం చేయాలి? ఇదిగో ఈ వెల్త్ స్టోరీ చూడండి...

- లైఫ్‌స్టయిల్ అప్‌గ్రేడ్ కోసం మిడిల్‌క్లాస్ పరుగులు
- దీంతో ఆదాయానికి మించి పెరిగిపోతున్న ఖర్చులు
- సైలెంట్‌గా ఒత్తిడిలోకి జారుకుంటున్న కుటుంబాలు
- ఆదాయంలో 20 శాతం పొదుపు తప్పనిసరి
- అవసరాలకు 50; లైఫ్‌స్టయిల్‌కు మిగతా 30 శాతం
- ఇలా వర్గీకరిస్తే ఖర్చులను నియంత్రించటం సాధ్యమే

మనకు, మన ఆదాయానికి తగ్గట్లుగా జీవన శైలిని పెంచుకోవటం తప్పు కాదు. కానీ పరిమితులు లేకుండా పెంచుకుంటూ పోతేనే సమస్య. అందుకే లైఫ్‌స్టయిల్‌ను తెలివిగా నియంత్రించుకోవటం తప్పనిసరి. ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవటం... అవసరాలను స్పష్టంగా వర్గీకరించుకోవటం... స్వీయ పరిమితులు విధించుకోవటం ఎలాగో చూద్దాం.

ద్రవ్యోల్బణం.. సైలెంట్ కిల్లర్

ఆదాయం పెరుగుతున్నప్పుడు లైఫ్‌స్టయిల్‌పరమైన ద్రవ్యోల్బణం పెరుగుతుంటుంది. ఖర్చు చేయడమనేది నిశ్శబ్దంగా, చాలా వేగంగా పెరిగిపోతుంది. జీతం పెరగ్గానే ఆటోమేటిక్‌గా పెంచుకునేవి కొన్ని ఉంటాయి. అవేంటంటే..

- మరింత పెద్ద ఇల్లు, మరింత ఎక్కువ అద్దె
- కారును అప్‌గ్రేడ్ చేసుకోవడం లేదా ఈఎంఐలపై గ్యాడ్జెట్లు కొనుగోలు చేయటం.
- మరింత తరచుగా బయట తినటం, ఫుడ్ డెలివరీ సర్వీసులను ఆశ్రయించటం.
- జిమ్‌తో పాటు అనేక ఓటీటీలు, యాప్‌లు సబ్‌స్క్రయిబ్ చెయ్యటం.

వాస్తవానికి వీటిని విడివిడిగా చూస్తే ఒక్కో దానిపై చేసే ఖర్చు సముచితమైనదిగానే అనిపిస్తుంది. కానీ వాటన్నింటినీ కలిపి చూస్తే మాత్రం మనకు తెలియకుండానే పొదుపు సామర్థ్యం తగ్గిపోతున్న విషయం అర్థమవుతుంది. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఎక్కువగానే సంపాదిస్తున్నప్పటికీ చాలా కుటుంబాలు, తక్కువగా పొదుపు చేస్తుండటానికి ప్రధాన కారణం ఇదే.

'అవసర ఖర్చుల' భ్రమ ..

అవసరమనే పేరుతో ఇప్పుడు చేసే చాలా మటుకు ఖర్చులు, నిజంగా అవసరమైనవేనా అంటే సరైన సమాధానం దొరకదు. ఉదాహరణకు స్మార్ట్‌ఫోన్ అనేది అవసరం. కానీ ప్రతి సంవత్సరం వేలకు వేలు పోసి దాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవడం అవసరమేనా? అలాగే అప్పుడప్పుడు బయట హోటళ్లలో తినడం సాధారణమే. కానీ అది ఎంత తరచుగా జరుగుతోందనేది ముఖ్యం. విహారయాత్రలు ముఖ్యమే. కానీ ఎంత తరచుగా వెళ్తున్నాం? ఎంత ఖర్చు పెడుతున్నాం? అనేది అత్యంత ప్రధానం. ఖర్చులనేవి సమస్య కాదు. హద్దులు లేకపోవడమే అసలు సవాలు.

ఏం చేయాలంటే..

జీవన విధానానికి పెద్దగా ఇబ్బంది లేకుండానే ఖర్చులను అదుపు చేసుకునేందుకు కొన్ని మార్గాలు ఉంటాయి. అవేంటంటే..

■ పరిమితి విధించుకోవడం

జీవన వ్యయాలనేవి ఆదాయానికి మించిన వేగంతో పెరగకూడదు. పాటించాల్సిన సింపుల్ రూల్ ఏమిటంటే, ఆదాయం 10 శాతం పెరిగితే, లైఫ్‌స్టయిల్ ఖర్చులు 5–6 శాతానికి మించి పెరగకుండా చూసుకోవాలి.

■ పొదుపును ఆటోమేట్ చేయాలి

ఖర్చు చేయడానికి ముందు పొదుపు చేయాలి. దీనితో లైఫ్‌స్టయిల్ ఖర్చులు ఆటోమేటిక్‌గా దానికి తగ్గట్లు సర్దుకుంటాయి.

■ ఒక్కొక్కటిగా అప్‌గ్రేడ్

ఇల్లు, కారు, గ్యాడ్జెట్లు ఇలాంటి వాటన్నింటినీ ఒకేసారి అప్‌గ్రేడ్ చేయడం పెట్టుకోవద్దు. ఒక్కొక్కటిగా చేసుకుంటే కాస్త వెసులుబాటు లభిస్తుంది.

■ సబ్‌స్క్రిప్షన్లను సరిచూసుకోవాలి..

ఉపయోగించని వాటిని క్యాన్సిల్ చేసేయాలి. దీనివల్ల గణనీయంగా ఆదా అవుతుంది.

మూడు కేటగిరీలు..

వృథా ఎక్కడవుతోందో గ్రహించాలంటే మనం చేసే ఖర్చులను తప్పనిసరైనవి, లైఫ్‌స్టయిల్‌ని బట్టి ఉండేవి, లీకేజీలనే మూడు కేటగిరీల కింద విడగొట్టుకోవాలి. వాటిని ఒకసారి విశ్లేషించి చూసుకుంటే, ఎక్కడ ఖర్చు చేయాలి, ఎక్కడ కట్టడి చేసుకోవాలనే దానిపై అవగాహన వస్తుంది.

తప్పనిసరైన ఖర్చులు

ఇలాంటివి జీవిత నాణ్యతను మెరుగుపరుస్తాయి. వీటి విషయంలో రాజీపడే పరిస్థితి ఉండదు.

- విద్య
- ఆరోగ్య సంరక్షణ
- ప్రాథమిక హౌసింగ్
- బీమా
- నిత్యావసరాలు

లైఫ్‌స్టయిల్‌ని బట్టి సరిదిద్దుకునేవి

కాస్త స్మార్ట్‌గా వ్యవహరిస్తే ఈ కింది వాటిని కొంత కంట్రోల్ చేసుకోవడానికి వీలుంటుంది.

- బయట హోటళ్లలో తినడం
- విహార యాత్రలు
- సబ్‌స్క్రిప్షన్లు
- అప్‌గ్రేడెడ్ గ్యాడ్జెట్లు
- తరచుగా వాహనాలను అప్‌గ్రేడ్ చేసుకుంటూ ఉండటం

లీకేజీలు

అదనంగా ఎలాంటి ప్రయోజనం లభించకుండా చేసే ఖర్చులు ఈ బకెట్ కిందికి వస్తాయి.

- ఉపయోగించని సబ్‌స్క్రిప్షన్లు, అడ్డదిడ్డంగా ఆన్‌లైన్‌లో షాపింగ్
- క్రెడిట్ కార్డ్ బాకీలను రోలోవర్ చేస్తుండటం.
- ఖర్చు చేస్తున్నామని గ్రహించకుండానే కన్వీనియెంట్‌గా చేసే వ్యయాలు

ఇలా ఈ మూడింటిలో మూడో కేటగిరీని కంట్రోల్ చేసుకోవాలి. రెండోదాన్ని కాస్త స్మార్ట్‌గా వాడుకునేలా చూసుకోవాలి. మొదటి దానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలి.

సైలెంటుగా ఖర్చులెలా పెరిగాయంటే..



రియాలిటీ చెక్

లైఫ్‌స్టయిల్‌కి సంబంధించి అప్‌గ్రేడ్స్ చేసుకోవడంలో తప్పేమీ లేదు. కోరుకున్నట్లుగా, బాగా జీవించాలనుకోవడమేమీ తప్పిదం కూడా కాదు. కాకపోతే, అడ్డూ అదుపూ లేకుండా లైఫ్‌స్టయిల్ ఖర్చులను పెంచుకోవడమే తప్పు. రేపటి రోజున వచ్చే ఆదాయాన్ని నేడే ఖర్చు చేసేయకుండా జాగ్రత్తపడితేనే ఆర్థికంగా నిశ్చింతగా ఉంటుంది. ఇందుకోసం ఆదాయంలో ఖర్చులకు చేసే కేటాయింపుల విషయంలో పాటించ తగిన సింపుల్ సూత్రం ఒకటి ఉంది.

- 50%– తప్పనిసరి అవసరాలు
- 30% – లైఫ్‌స్టయిల్, కోరికలు
- 20% – పొదుపు, పెట్టుబడులు.

లైఫ్‌స్టయిల్ ఖర్చులు 40 శాతాన్ని దాటాయంటే, పొదుపు కేటాయింపులు ఆటోమేటిక్‌గా పడిపోతాయి.

ఐడీఎఫ్‌సీ బ్యాంకులో రూ. 590 కోట్ల మోసం

హర్యానా ప్రభుత్వ ఖాతాల నుంచి దారి మళ్లింపు

ముంబై: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో ఉద్యోగుల భారీ మోసం వెలుగుచూసింది. చండీగఢ్‌లోని ఒక శాఖలో హర్యానా ప్రభుత్వానికి చెందిన ఖాతాల నుంచి నిధులను ఉద్యోగులు, మరికొందరు దారి మళ్లించినట్టు బయటపడింది. ప్రాథమిక అంచనా మేరకు ఈ మొత్తం రూ.590 కోట్ల వరకు ఉంటుందని బ్యాంక్ అంచనా. పూర్తి కసరత్తు అనంతరం, వాస్తవ విలువ ఎంతన్నది స్పష్టమవుతుందని బ్యాంక్ పేర్కొంది. ఈ విషయాన్ని ఆర్‌బీఐ దృష్టికి తీసుకెళ్లినట్టు, నలుగురు ఉద్యోగులను సస్పెన్షన్‌లో పెట్టినట్టు ప్రకటించింది. వీరిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. స్టాట్యూటరీ ఆడిటర్లకు తెలియజేసినట్టు, స్వతంత్ర ఏజెన్సీని నియమించి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించనున్నట్టు పేర్కొంది. హర్యానా ప్రభుత్వ శాఖ తన ఖాతాను మూసివేసి, అందులోని బ్యాలన్స్‌ను మరొక బ్యాంక్‌కు బదిలీ చేయాలని కోరడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్టయింది. ఖాతాను మూసివేసే క్రమంలో అందులోని బ్యాలన్స్‌లో అంతరాలున్నట్టు గుర్తించింది. ఇదే మాదిరి అవకతవకలు హర్యానా ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన ఇతర ఖాతాల్లోనూ ఉన్నట్టు బయటపడింది. ఈ వ్యవహారం కేవలం హర్యానా ప్రభుత్వరంగ సంస్థల ఖాతాలకే పరిమితమని, సదరు శాఖలో ఇతర ఖాతాలకు విస్తరించలేదని ఐడీఎఫ్‌సీ ఫస్ట్‌బ్యాంక్ స్పష్టం చేసింది. నిధులను ఇతర బ్యాంక్ ఖాతాలకు మళ్లించినట్టు అనుమానిస్తూ.. వాటిల్లోని బ్యాలన్స్‌ను 'లీన్ మార్క్ బ్యాలన్స్'గా (హక్కులను నిలిపివేయడం) గుర్తించాలని కోరినట్టు తెలిపింది.

స్టాక్స్ వ్యూ

లెమన్ ట్రీ హోటల్స్ | బ్రోకరేజ్: ఎలారా క్యాపిటల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 116 **టార్గెట్: రూ. 157**

ఎందుకంటే: ఆతిథ్య రంగ మధ్యస్థాయి కంపెనీ లెమన్ ట్రీ హోటల్స్ సమీకృత పునర్వ్యవస్థీకరణకు తెరతీసింది. తద్వారా గ్రూప్ రెండు విభాగాలుగా విడిపోనుంది. లెమన్ ట్రీ హోటల్స్ పేరుతో అసెట్ లైట్(ఆస్తులపై తక్కువ పెట్టుబడులు), ఫీ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేయనుంది. ఫ్లేయర్ హోటల్స్ పేరుతో అసెట్ హెవీ(ఆస్తులపై భారీ పెట్టుబడులు) యాజమాన్య ప్లాట్‌ఫామ్‌ను నెలకొల్పనుంది. ఈ లావాదేవీలో భాగంగా పీఈ దిగ్గజం వార్‌బర్గ్ పింకస్ ఫ్లేయర్ హోటల్స్‌లో ఏపీజీకిగల మొత్తం 41 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. ఇందుకు ప్రైమరీ ఈక్విటీ ద్వారా రూ. 960 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. తద్వారా ఫ్లేయర్ వృద్ధికి నిధులు సమకూర్చనుంది. ప్రధానంగా.. పూర్తి అసెట్ లైట్, అసెట్ హెవీ ఆధారిత(ఫ్లేయర్) సంస్థలను విడివిడిగా ఏర్పాటు చేసే లక్ష్యంతో పునర్వ్యవస్థీకరణను చేపడుతోంది. దీని ప్రకారం ఆస్తుల బదిలీ కారణంగా ఆయా సంస్థల ఆదాయాలు వెనకడుగు వేయనున్నాయి. అయితే యాజమాన్య ఫీజు పుంజుకోనుంది. నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు సైతం మెరుగుపడనున్నాయి. మరోపక్క తరుగుదల, వడ్డీ వ్యయాలు తగ్గనున్నాయి. లెమన్ ట్రీ హోటల్స్ వాటా నిర్మాణంలో మాత్రం ఎలాంటి మార్పు ఉండబోదు. ఫ్లేయర్ 12–15 నెలల్లోగా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టుకానున్నట్లు భావిస్తున్నారు. పునర్వ్యవస్థీకరణ ప్రభావంతో అసెట్ లైట్, అసెట్ హెవీ విడి కంపెనీలుగా ఏర్పాటుకానున్నాయి. అంతేకాకుండా ఏపీజీ వాటా విక్రయించేందుకు వెసులుబాటు కలగనుంది. కాగా.. ఈ అంశాలు లెమన్ ట్రీ హోటల్స్ వాటాదారులపై ఎలాంటి ప్రభావాన్ని చూపబోవు. వార్‌బర్గ్ పెట్టుబడులు, ఫ్లేయర్ లిస్టింగ్ తదుపరి ఈ సంస్థలో వాటా కలిగిన కంపెనీగా లెమన్ ట్రీ హోటల్స్‌కు డిస్కౌంటింగ్ లభించనుంది.

కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్ | బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 150 **టార్గెట్: రూ. 180**

ఎందుకంటే: దేశీయంగా జీవిత బీమా రంగంలోని టాప్–10 కంపెనీలలో ఒకటిగా కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ నిలుస్తోంది. డైవర్సిఫైడ్ ప్రొడక్ట్ మిక్స్‌ను కలిగి ఉంది. వీటిలో యులిప్‌తోపాటు సంప్రదాయ పార్, నాన్‌పార్, ప్రొటెక్షన్ విభాగాలున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి అర్ధభాగం (ఏప్రిల్–సెప్టెంబర్) ఫలితాలలో యులిప్ 50 శాతం, నాన్‌పార్ 34 శాతం, పార్ 8 శాతం, ప్రొటెక్షన్ 8 శాతం ఆక్రమించాయి. ప్రధానంగా బ్యాంకెస్యూరెన్స్ చానళ్ల ద్వారా బిజినెస్ లభిస్తోంది. పీఎస్‌యూ దిగ్గజం కెనరా బ్యాంక్ (70 శాతం), గ్లోబల్ దిగ్గజం హెచ్‌ఎస్‌బీసీ(15 శాతం) ఇందుకు దన్నునిస్తున్నాయి. గత దశాబ్ద కాలంలో సంస్థ మొత్తం పరిశ్రమను, ప్రయివేట్ విభాగాన్ని మించుతూ ఏపీఈలో ప్రతీఏటా 22 శాతం వృద్ధిని కొనసాగించింది. దీంతో సంస్థ మార్కెట్ వాటా సైతం పుంజుకుంటూ వచ్చింది. పరిశ్రమ సగటులో 0.9 శాతం, ప్రయివేట్ విభాగంలో 1.1 శాతం అధిక పురోగతిని మార్కెట్ వాటా అంశంలో సాధించింది. దేశీయంగా జీవిత బీమా విస్తృతికి గల అవకాశాల ఆధారంగా భవిష్యత్‌లోనూ ఈ పరిశ్రమ పటిష్ట వృద్ధి పథంలో సాగనుందని భావిస్తున్నాం. ప్రపంచ సగటు 2.9 శాతంకాగా.. దేశీయంగా ఇది 2.8 శాతంకావడం గమనార్హం. జీఎస్‌టీ సవరణల సంస్కరణలు, దేశీయంగా 83 శాతంగా నమోదవుతున్న ప్రొటెక్షన్ గ్యాప్ ఇందుకు సహకరించనున్నాయి. రిస్క్ ఆధారిత సాల్వెన్సీ, కాంపోజిట్ లైసెన్స్ తదితర నియంత్రణలు సైతం పరిశ్రమకు సానుకూలతలు కల్పిస్తున్నాయి. బ్యాంక్ బ్రాంచీల ద్వారా మరింత విస్తరణకు వీలుండటం, బ్రాంచీల యాక్టివేషన్ పుంజుకుంటుండటం, ప్రొడక్ట్ మిక్స్‌లో ఆధునికతలు, పటిష్ట నిర్వహణ సామర్థ్యం ప్రభావంతో నిర్వహణ ఆర్‌వోఈవీలో 17 శాతం వృద్ధిని సాధించగలదని భావిస్తున్నాం.

Canara HSBC LIFE INSURANCE

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

మార్కెట్లకు టఫ్ టెస్ట్

సాక్షి, బిజినెస్ డెస్క్

ఈ వారం దేశీ ఈక్విటీ మార్కెట్లు తీవ్ర ఊగిసలాటకు గురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గురువారం 24 న నెలవారీ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ఎక్స్‌పైరీ, కీలక మాక్రో డేటా విడుదల, గ్లోబల్ ట్రేడ్ పరిణామాలు, క్రూడ్ ఆయిల్ ధరల్లో మార్పులు మార్కెట్ దిశను నిర్ధేశించనున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా టారిఫ్ బాదుడు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బకొట్టింది. ఈవారం మార్కెట్లు అప్రమత్తంగా కదులుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.సమీప కాలంలో మార్కెట్లు రేంజ్ బౌండ్ ట్రేడింగ్‌లోనే కొనసాగే అవకాశముందని, గ్లోబల్ రిస్క్ సెంటిమెంట్, మాక్రో డేటా గణాంకాలు మార్కెట్‌కు ప్రధాన ట్రిగ్గర్లుగా ఉండనున్నాయి. ప్రతి గ్లోబల్ న్యూస్, ఎకనామిక్ డేటాకు మార్కెట్ తక్షణ ప్రతిస్పందన చూపే ''ఈవెంట్రివెన్ ట్రేడింగ్'' జరిగే అవకాశముందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

ఎఫ్‌అండ్‌ఓ ఎక్స్‌పైరీతో పెరిగే ఒడిదుడుకులు

ఫిబ్రవరి నెలవారీ ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ఎక్స్‌పైరీ కారణంగా మార్కెట్లలో షార్ట్‌టర్మ్ వోలాటిలిటీ గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఈ సమయంలో ట్రేడర్లు పొజిషన్ రోల్‌ఓవర్స్, షార్ట్ కవరింగ్, ప్రాఫిట్ బుకింగ్ వంటి చర్యలకు దిగుతారు. దీంతో సూచీలు అకస్మాత్తుగా పెరగడం ,ఊహించని విధంగా పతనం కావడం సాధారణం. ముఖ్యంగా బ్యాంకింగ్, ఐటీ, హెవీ వెయిట్ షేర్లు తీవ్ర ఒడిదుడుకులకు గురయ్యే అవకాశముంది.

మాక్రో డేటాపై పెట్టుబడిదారుల ఫోకస్

ఈవారం విడుదలయ్యే కీలక ఆర్థిక గణాంకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేయనున్నాయి. జీడీపీ గణాంకాలు, విదేశీ మారక నిల్వలు తదితర ప్రభుత్వ ఆర్థిక గణాంకాలు దేశ ఆర్థిక వృద్ధి జోరు, కార్పొరేట్ ఎర్నింగ్స్ ట్రెండ్‌పై స్పష్టత ఇవ్వనున్నాయి. జీడీపీ గణాంకాలు బలంగా ఉంటే మార్కెట్‌కు సపోర్ట్ లభించే అవకాశం ఉంది, బలహీన గణాంకాలు వస్తే షేర్లలో ప్రాఫిట్ బుకింగ్ పెరిగే అవకాశముంది.

ట్రంప్ టారిఫ్ నిర్ణయం గ్లోబల్ మార్కెట్లపై ప్రభావం

అమెరికా తాజా టారిఫ్ నిర్ణయం గ్లోబల్ ట్రేడ్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తోంది. టారిఫ్‌ల పెంపు ట్రేడ్ టెన్షన్‌ను మళ్లీ పెంచే అవకాశముండటంతో ఎమర్జింగ్ మార్కెట్లలో పెట్టుబడులపై ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించే సూచనలు కనిపిస్తున్నాయి. గ్లోబల్ సరఫరా వ్యవస్థ, ఎగుమతులపై దీని ప్రభావం ఉండొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

గత వారమిలా..

గత వారం(16–20) దేశీ స్టాక్ మార్కెట్లు చాలావరకూ సానుకూలంగానే కదిలాయి. దేశీయంగా ఏఐ సదస్సు, యూఎస్‌తో ట్రేడ్ డీల్‌పై అంచనాలు తదితర అంశాలు ఇన్వెస్టర్లకు తొలుత జోష్‌నిచ్చాయి. అయితే ఏఐ కారణంగా దేశీ టెక్నాలజీ రంగంలో పెనుమార్పులకు తెరలేవనున్న అంచనాలు సాఫ్ట్‌వేర్ సేవల రంగ కౌంటర్లలో భారీ అమ్మకాలకు కారణమయ్యాయి. ఇది సెంటిమెంటును దెబ్బతీయగా.. గత గురువారం అన్ని రంగాలలోనూ భారీ అమ్మకాలు చోటు చేసుకున్నాయి. వెరసి గత వారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈ స్వల్ప లాభాలతో నిలిచాయి. సెన్సెక్స్ 188 పాయింట్లు(0.25 శాతం) బలపడి 82,815 వద్ద ముగిసింది. నిఫ్టీ 100 పాయింట్లు(0.4 శాతం) జమ చేసుకుని 25,571 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్ క్యాప్ 0.35 శాతం పుంజుకోగా.. స్మాల్ క్యాప్ 0.3 శాతం నీరసించింది.

టెక్నికల్‌గా చూస్తే.. ఈ వారం

వారాంతాన(27న) దేశ క్యూ3 జీడీపీ, జనవరి మౌలిక రంగ గణాంకాలు వెలువడనున్నాయి. క్యూ2(జూలై–సెప్టెంబర్)లో ఆర్థిక వ్యవస్థ 8.2 శాతం ఎగసింది. ఇక అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో జీడీపీ 7 శాతం పురోగమించనున్నట్లు ఆర్‌బీఐ అంచనా వేయగా.. ఇతర ఫైనాన్షియల్ సంస్థలు 7.4 శాతం వృద్ధిని ఊహిస్తున్నాయి. కాగా.. ఈ వారం యూఎస్ ప్రభుత్వ టారిఫ్‌లను ఆ దేశ సుప్రీం కోర్టు కొట్టివేసినప్పటికీ ప్రెసిడెంట్ ట్రంప్ తిరిగి 15 శాతం టారిఫ్‌లను తాజాగా ప్రకటించడంతో అయోమయం నెలకొన్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. వెరసి ఈ వారం మార్కెట్లు ఆటుపోట్ల మధ్య కన్సాలిడేట్ కావచ్చని తెలియజేశారు.

- గత వారం ఎన్ఎస్ఈ నిఫ్టీ 26,000 పాయింట్ల మైలురాయిని అధిగమించడంలో తడబడింది. అయితే 25,200–24,800 పాయింట్ల వద్ద ఈ వారం మద్దతు కనిపించే వీలుంది. ఈ స్థాయిల నుంచి బలపడి 26,000 పాయింట్లను దాటితే మరింత జోరు చూపే అవకాశముంది. 26,400 వద్ద రెసిస్టెన్స్ ఎదురుకావచ్చు.
- బీఎస్ఈ సెన్సెక్స్ మొదట 82,200–82,000 పాయింట్ల వద్ద సపోర్ట్ తీసుకునే అవకాశముంది. ఇక్కడి నుంచి పురోగమిస్తే 84,000 పాయింట్ల మైలురాయికి చేరుకోవచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే మరింత బలపడేందుకు వీలుంది.

క్రూడ్ ఆయిల్, అమెరికాఇరాన్ పరిణామాలు కీలకం

క్రూడ్ ఆయిల్ ధరల హెచ్చుతగ్గులు భారత మార్కెట్లకు కీలక సూచికగా మారనున్నాయి. అంతర్జాతీయ జియోపాలిటికల్ టెన్షన్స్, ముఖ్యంగా అమెరికాఇరాన్ సంబంధాల పరిణామాలు ఆయిల్ ధరలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఆయిల్ ధరలు పెరిగితే ద్రవ్యోల్బణ ఒత్తిడి పెరిగి మార్కెట్లపై నెగటివ్ ప్రభావం పడే అవకాశముంది.

విదేశీ పెట్టుబడుల ప్రవాహం, గ్లోబల్ లిక్విడిటీపై కన్ను

విదేశీ పెట్టుబడిదారుల కొనుగోళ్లు, అమ్మకాల ధోరణి మార్కెట్ ట్రెండ్‌ను నిర్ణయించే మరో కీలక అంశం. గ్లోబల్ వడ్డీ రేట్ల సంకేతాలు, డాలర్ బలం, రిస్క్ సెంటిమెంట్ ఆధారంగా ఎఫ్ఐఐలు తమ పెట్టుబడి వ్యూహాలను మార్చే అవకాశం ఉంది.

న్యూ ఫండ్ ఆఫర్స్

ఎల్ఐసీ ఎంఎఫ్ టెక్నాలజీ ఫండ్



సంప్రదాయ ఐటీ సర్వీసుల పరిధికి మించి విస్తరిస్తున్న టెక్నాలజీ రంగంలో పెట్టుబడుల అవకాశాలను అందించే దిశగా ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ కొత్తగా టెక్నాలజీ ఫండ్‌ని ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ మార్చి 6తో ముగుస్తుంది. సెమీకండక్టర్ ఆధారిత కంపెనీలు, డేటా సెంటర్ ఆపరేటర్లు, డిజిటల్ కామర్స్ ప్లాట్‌ఫాంలు, ఇంటర్నెట్ బిజినెస్‌లు, వర్ధమాన టెక్నాలజీ సంస్థలు సహా సాంకేతికతతో ముడిపడి ఉన్న వివిధ రంగాల సంస్థల్లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. దీనికి బీఎస్ఈ టెక్ టోటల్ రిటర్న్ ఇండెక్స్ ప్రామాణికంగా ఉంటుంది. కనీసం రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. సిప్ రూపంలోనైతే వ్యవధిని బట్టి రూ.100 నుంచి కట్టొచ్చు. కరణ్ దోషి, జైప్రకాశ్ తోష్నివాల్ దీనికి ఫండ్ మేనేజర్లుగా వ్యవహరిస్తారు.

'బరోడా బీఎన్‌పీ' ఈఎస్‌జీ స్ట్రాటజీ ఫండ్

పర్యావరణహితంగా వ్యాపార కార్యకలాపాల నిర్వహణకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో బరోడా బీఎన్‌పీ పారిబా మ్యూచువల్ ఫండ్ తాజాగా ఈఎస్‌జీ బెస్ట్–ఇన్–క్లాస్ స్ట్రాటెజీ ఫండ్‌ని ఆవిష్కరించింది. దీనికి నిఫ్టీ100 ఈఎస్‌జీ టోటల్ రిటర్న్ ఇండెక్స్ ప్రామాణికంగా ఉంటుంది. సెబీలో నమోదు చేసుకున్న రేటింగ్ కంపెనీలు ఇచ్చే ఈఎస్‌జీ రేటింగ్స్, అలాగే, కంపెనీ అంతర్గతంగా నిర్వహించే ఫండమెంటల్ రీసెర్చ్, అనాలిసిస్ ఆధారంగా ఎంపిక చేసిన సంస్థల్లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. కనీసం రూ. 1,000 నుంచి పెట్టుబడి పెట్టే విధంగా ఈ ఫండ్ ఉంటుంది. గడిచిన పదేళ్లలో ఏడేళ్ల పాటు నిఫ్టీ 100 టీఆర్ఐకి మించి నిఫ్టీ 100 ఈఎస్‌జీ టీఆర్ఐ మెరుగైన పనితీరు కనపర్చిందని సంస్థ సీఈవో సంజయ్ గ్రోవర్ తెలిపారు.

బజాజ్ లైఫ్ బీఎస్ఈ 500 క్వాలిటీ 50 ఇండెక్స్ ఫండ్

జీవిత బీమా సంస్థ బజాజ్ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా బీఎస్ఈ 500 క్వాలిటీ 50 ఇండెక్స్ ఫండ్‌ని ప్రవేశపెట్టింది. ఫిబ్రవరి 15 వరకు ఈ న్యూ ఫండ్ ఆఫర్‌లో (ఎన్ఎఫ్‌వో) ఇన్వెస్ట్ చేయొచ్చు. స్థిరంగా ఆదాయాలు ఆర్జిస్తూ, ఆర్థికంగా పటిష్టంగా ఉన్న దేశీ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఇది అవకాశం కల్పిస్తుంది. కంపెనీకి చెందిన యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పథకాలైన (యులిప్స్) బజాజ్ లైఫ్ స్మార్ట్ వెల్త్ గోల్, బజాజ్ లైఫ్ సుప్రీం, బజాజ్ లైఫ్ గెయిన్‌లతో దీన్ని తీసుకోవచ్చు. ఇటు జీవిత బీమా కవరేజీని పొందుతూనే అటు దీర్ఘకాలంలో సంపదను కూడా పంచుకునేలా ఇది రెండిందాల ప్రయోజనాలు అందిస్తుందని కంపెనీ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు రావూరి తెలిపారు.

వెల్త్ కంపెనీ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్

ఈక్విటీ, డెట్ సాధనాల్లో క్రమశిక్షణతో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో పెట్టుబడిని పెంచుకునే అవకాశం కల్పించేలా ది వెల్త్ కంపెనీ మ్యూచువల్ ఫండ్ ..తాజాగా బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్‌ని ప్రవేశపెట్టింది. ఇది ఫిబ్రవరి 10న ముగుస్తుంది. మార్కెట్ పరిస్థితులు, వేల్యుయేషన్లు, రిస్క్ ఇండికేటర్లను బట్టి ఈక్విటీ, డెట్ సాధనాల మధ్య పెట్టుబడులను సర్దుబాటు చేస్తూ మెరుగైన రాబడులు అందించడంపై ఇది దృష్టి పెడుతుంది. కనీసం 65 శాతం నిధులను ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత సాధనాల్లోనూ, 35 శాతం భాగాన్ని డెట్, మనీ మార్కెట్ సాధనాల్లోను ఇన్వెస్ట్ చేస్తుంది. దీనికి క్రిసిల్ హైబ్రిడ్ 50+50 మోడరేట్ ఇండెక్స్ టోటల్ రిటర్న్ ఇండెక్స్ ప్రామాణికంగా ఉంటుంది.

అభివృద్ధిని కోరుకునేవారు అడుగు ముందుకే వేయాలి. అప్రమత్తత కోసమే వెనకడుగు పడాలి

- అబ్రహం మాస్లో, అమెరికా మానసిక శాస్త్రవేత్త

రిటైర్మెంట్‌కు రెడీనా?

దేశంలో ప్రతి ముగ్గురిలో ఒక్కరిలోనే ప్రణాళిక

- ఇంకా చాలా సమయముందని అనుకునే వారే అధికం
- ముందుగా మొదలుపెడితేనే కాంపౌండింగ్ ప్రయోజనాలు
- ఆలస్యం చేస్తే అవసాన కాలంలోనూ ఆర్థిక ఇబ్బందులు
- 30 ఏళ్ల అవసరాలకు సరిపోయేలా రిటైర్మెంట్ ప్లాన్
- 30 ఏళ్ల ముందే మేల్కొని మొదలుపెట్టడం తప్పనిసరి

రిటైర్మెంట్ అంటే... 60 ఏళ్లకు కదా! అనుకుంటారంతా. ఇంకా చాలా సమయం ఉందని, ఇప్పటి నుంచే దాని గురించి ఆలోచించటమెందుకని రోజులు గడిపేస్తూ ఉంటారు. దాదాపు 70 శాతం మంది వేతన జీవులది ఇదే పరిస్థితి. కాకపోతే ఆ మిగిలిన 30 శాతం మందీ మరోరకంగా ఆలోచిస్తుంటారు. వారి దృష్టిలో రిటైర్మెంట్ అంటే ఉద్యోగానికి గుడ్‌బై చెప్పటం కాదు. తప్పనిసరి పనికి స్వస్తి చెప్పి... నచ్చిన పని చేయగలిగే స్వేచ్ఛను సంపాదించుకోవటం. ఆ స్వేచ్ఛను ఎంత త్వరగా సంపాదించుకోగలిగితే... అంత త్వరగా తప్పనిసరి పనికి గుడ్‌బై కొట్టేయటం. చాలామందికి 60 ఏళ్లు దాటినా కూడా ఈ తరహా స్వేచ్ఛ సాధ్యం కాదు. కొందరు మాత్రం 40లు, 50లలోనే సాధ్యం చేసుకోగలుగుతున్నారు. ఎలా? దీనికి ఏం చేయాలి? ఇదే ఈ వెల్త్ స్టోరీ...

క్యాంపస్‌లోనో, కాలేజీ నుంచి బయటకు వచ్చాకో మంచి జాబ్ కొడితే సెటిలైపోయినట్లేనని భావిస్తారు చాలామంది. ఆదాయాన్ని బట్టి ఖరీదైన ఫోన్లు, కారు, ప్రీమియం హౌస్... ఇలా ఖర్చు చేసుకుంటూ వెళుతుంటారు. భవిష్యత్ ఆదాయాన్ని కూడా ఈఎంఐల రూపంలో ఇప్పుడే ఖర్చు చేసేస్తుంటారు. వారికప్పుడు రిటైర్మెంట్ గుర్తుకే రాదు. కొందరికి గుర్తుకు వచ్చినా ప్రాధాన్యంగా తీసుకోరు. 40 ఏళ్లు దాటాక మెల్లగా ఆలోచించటం మొదలుపెడతారు. అక్కడి నుంచి మరో 15–20 ఏళ్లే ఉండడంతో, ఇక తప్పదులే అనుకుని ఆదాయంలో కొంత పక్కన పెట్టడం ఆరంభిస్తారు. దీర్ఘకాల లక్ష్యాల విషయంలో ఈ వాయిదానే పెద్ద ప్రతికూలమన్నది చాలా మంది తెలుసుకోరు. 20–30ల నుంచి పెట్టుబడి ఆరంభిస్తేనే అది పెద్ద నిధిగా మారుతుంది. వాస్తవానికి రిటైర్మెంట్ ప్రణాళిక ఫెయిలవటానికి ప్రధాన కారణం పెట్టుబడిని ఆలస్యంగా మొదలు పెట్టడమే. త్వరగా మొదలు పెడితే చక్ర వడ్డీ ఫలితంగా (కాంపౌండింగ్) అది పెద్ద మొత్తమవుతుందన్నది గుర్తించకపోవటమే.

అవగాహన లేమి..

- ప్రైవేటు రంగంతోపాటు, అసంఘటిత రంగంలోని వారికి సామాజిక భద్రత తక్కువే. ఉద్యోగుల భవిష్యనిధి లేదా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై రాబడి 7–8 శాతమే. ఇందులో 6 శాతం ద్రవ్యోల్బణం తీసివేస్తే మిగిలేది ఎంత?
- కొంత మంది బీమా పాలసీల్లో (ఎండోమెంట్, యులిప్) ఇన్వెస్ట్ చేస్తుంటారు. ఎండోమెంట్ ప్లాన్లలో దీర్ఘకాల రాబడి 4–5 శాతం మించదు. యూనిట్ లింక్డ్ ప్లాన్లలోనూ (యులిప్) రాబడి 8–9 శాతమే.



- తమకున్న ప్రాపర్టీ ఆదుకుంటుందిలే? అన్నది కూడా అవగాహన లేమే. ఒక్క చిన్న వివాదంతో ప్రాపర్టీ ఏళ్ల కొద్దీ అపరిష్కృతంగా ఉండిపోగలదు.
- వృద్ధాప్యంలో తమ అవసరాలను చూసుకోవడానికి పిల్లలు ఉన్నారుగా? ఇలాంటి ఆలోచనలు.. 60 తర్వాత 20–30 ఏళ్ల ప్రశాంత జీవనానికి సోపానాలు కానే కావు.
- అత్యాధునిక వైద్య విధానాలతో ఆయుర్దాయం (జీవనకాలం) పెరుగుతోంది. వైద్య వ్యయాలు కూడా ఏటేటా రెండంకెల స్థాయిలో పెరుగుతుండడం చూస్తున్నాం. వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలకు పెద్ద మొత్తమే ఖర్చు చేయాల్సి రావొచ్చు. ఒక్కసారి ఆసుపత్రిలో చేరితే రూ.లక్షల పొదుపు కరిగిపోవచ్చు.
- ఇక మనలో కొంత మంది అయితే విశ్రాంత జీవన నిధిని పిల్లల విద్యావసరాలకు ఖర్చు పెట్టేస్తుంటారు. ఇది చేయరాని తప్పు.

ఆలస్యం అమృతం విషం..

- 25 ఏళ్లకు, 30 ఏళ్లకు, 40 ఏళ్లకు మధ్య పెద్ద వ్యత్యాసం లేకపోవచ్చు. కానీ సంపద సమకూర్చుకోవడంలో ఎంతో తేడా వస్తుంది.
- నెలకు రూ.15,000 చొప్పున 25 ఏళ్ల నుంచి మొదలు పెట్టి 60వ ఏట వరకు 10 శాతం వార్షిక రాబడి (సగటు) వచ్చే ఈక్విటీ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేశారనుకుందాం. 35 ఏళ్లలో రూ.5.14 కోట్లు (రూ.514 లక్షలు) సమకూరుతుంది. ఇందులో అసలు పెట్టుబడి రూ.60 లక్షలే.
- ఐదేళ్లు ఆలస్యంగా 30వ ఏట నుంచి మొదలు పెట్టి 60 వరకు 30 ఏళ్ల పాటు ఇంతే మేర పొదుపు చేస్తే సమకూరేది రూ.3.12 కోట్లు. ఐదేళ్ల ఆలస్యం చేయడం వల్ల రూ.2 కోట్ల నిధిని కోల్పోయినట్టు అవుతుంది.
- ఇంకో పదేళ్లు ఆలస్యంగా 40 ఏళ్లలో మొదలు పెడితే.. 20 ఏళ్లలో ఇదే రూ.15,000తో సమకూరేది కోటీ ఎనిమిది లక్షల రూపాయలు.

ఎంత కావాలి..?

ఒక వ్యక్తికి నేడు నెలవారీ రూ.50,000 ఖర్చు అవుతుంటే.. 25 ఏళ్ల తర్వాత అదే మాదిరి జీవన అవసరాలకు నెలకు రూ.2 లక్షలు అవసరమవుతుంది. ఏటా 6 శాతం ద్రవ్యోల్బణం ఆధారంగా వేసిన అంచనా ఇది. నెలకు రూ.2 లక్షల ఆదాయం రూ.4–5 కోట్ల నిధిపైనే సాధ్యం. మరి రూ.5 కోట్ల నిధిని సమకూర్చుకోవడం మధ్య తరగతి వారికి ఐదు, పదేళ్లలో సాధ్యమేనా..?

వాస్తవాలు ఇవీ..

- రిటైర్మెంట్ కోసం తాము మరింత ముందు నుంచే ఎందుకు ఇన్వెస్ట్ చేయలేదు? అని 50 ఏళ్లు దాటిన వారిలో 90 శాతం మంది ఇప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నట్టు ఒక సర్వేలో వెల్లడైంది.
- రిటైర్మెంట్ ప్రణాళిక కలిగిన వారు 2025 నాటికి 37 శాతమే. అంటే ప్రతి ముగ్గురిలో ఇద్దరు ఈ విషయంలో ప్రణాళికలేమితో ఉన్నట్టు తెలుస్తోంది.
- తమ పొదుపు నిధి రిటైర్మెంట్ తర్వాత పట్టుమని పదేళ్లు అయినా చాలుతుందో, లేదోనని 63 శాతం మంది ఆందోళన చెందుతున్నారు.
- పట్టణాల్లో సగం మంది రిటైర్మెంట్ కోసం ముందు నుంచే పెట్టుబడి పెట్టేందుకు ప్రాధాన్యం చూపిస్తున్నారు. కానీ, 40 శాతం మంది విశ్రాంత జీవనం కోసం అసలు పెట్టుబడే మొదలు పెట్టలేదు.
- ప్రణాళిక మొదలు పెట్టిన వారిలోనూ కేవలం 37 శాతమే సమకూర్చుకోవాల్సిన నిధిలో పావు శాతం లక్ష్యానికి చేరారు.
- రిటైర్మెంట్ కోసం పొదుపు చేస్తున్న వారిలో జీవిత బీమానూ పరిగణనలోకి తీసుకుంటున్నవారు 95 శాతంగా ఉన్నారు.
- అత్యంత ముఖ్యమైన నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) పథకం గురించి 64 శాతం మందికి తెలిసినా.. అందులో ఇన్వెస్ట్ చేస్తున్న వారు 16–25 శాతం మించిలేరు.
- ఇక రిటైర్మెంట్ కోసం పక్కన పెడుతున్న వారిలో కూడా జీవించినంత కాలం ఆ నిధి సరిపోతుందన్న నమ్మకంతో ఉన్నవారు 19 శాతం మందే
- ఈ ఫలితాలు విశ్రాంత జీవన అవసరాలకు చాలా ముందుగా సన్నద్ధం కావాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి.

కనీసం ఇంత అవసరం..

- ఆర్జన ఆరంభించిన మొదటి నెల నుంచే 20–25 శాతాన్ని రిటైర్మెంట్ ఫండ్ కోసం ఇన్వెస్ట్ చేయడం మొదలుపెట్టాలి. ఈక్విటీ ఫండ్స్‌లో ప్రతినెలా సిస్టమ్యాటిక్ ప్లాన్ (సిప్) ద్వారా ఈ మొత్తాన్ని పెట్టుబడి పెట్టుకోవచ్చు. ఏటా ఆదాయ వృద్ధికి సమానంగా రిటైర్మెంట్ ఫండ్ పెట్టుబడిని పెంచుకుంటూ వెళ్లాలి.
- ప్రతి నెలా ఇంటి అద్దె, గ్రోసరీ, యుటిలిటీ (బ్రాడ్‌బ్యాండ్, మొబైల్, విద్యుత్) కేటాయింపులు ఎలా తప్పనిసరో.. పిల్లల ఉన్నత విద్య, రిటైర్మెంట్ నిధి కోసం నిర్ణీత మొత్తాన్ని పక్కన పెట్టుకోవడం కూడా అంత అవసరం. లేదంటే ఒక లక్ష్యం కోసం మరో లక్ష్యం విషయంలో రాజీపడాల్సి వస్తుంది.

ప్రస్తుత నెలవారీ ఖర్చు (రూ.లలో)	రిటైర్మెంట్‌కు ఇంకా ఏన్నేళ్లు	కావాల్సిన నిధి (రూ.కోట్లలో)
50,000	25	4-5
75,000	25	6-7
1,00,000	25	8-10

నోట్: 6 శాతం ద్రవ్యోల్బణం, రిటైర్మెంట్ నిధిపై 7-8 శాతం రాబడి ఆధారంగా వేసిన అంచనాలు ఇవి. ఒక వేళ రిటైర్మెంట్ నిధిపై రాబడి 5-6 శాతమే అనుకుంటే మరో 20-30 శాతం అదనపు నిధి అవసరం.

రిటైర్మెంట్ నాటికి సమకూర్చుకున్న నిధిని మూడు భాగాలు చేసుకోవాలి

- స్వల్పకాల అవసరాలు, ఆరోగ్య అత్యవసరాల్లో వెంటనే తీసుకునేందుకు వీలుగా (రెండేళ్ల అవసరాలకు సరిపడా) ఒక భాగం ఏర్పాటు చేసుకోవాలి. దీనికోసం లిక్విడిటీ (వెంటనే నగదుగా మార్చుకునే) ఎక్కువగా ఉండే లిక్విడ్ ఫండ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్, మనీ మార్కెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి.
- 3–10 ఏళ్ల అవసరాల కోసం ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్, హైబ్రిడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి.
- ఇక పదేళ్లకు మించిన అవసరాల కోసం మరో భాగం ఏర్పాటు చేసుకోవాలి. ఈ పెట్టుబడుల విషయంలో కొంత రిస్క్ తీసుకోవచ్చు. ఈక్విటీ ఫండ్స్, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల దీర్ఘకాల నిధి ద్రవ్యోల్బణాన్ని మించి ఎక్కువగా కాంపౌండ్ అవుతుంది.

డైలీ సిప్‌తో పెట్టుబడులు మరింత సులభతరం

- అనిశ్చితిలోనూ సిప్‌లు కొనసాగిస్తే ప్రయోజనకరం
- షేర్.మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్ హెడ్ నాయక్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మొదటిసారి ఇన్వెస్ట్ చేస్తున్నవారికి, చిన్న మొత్తాలతో పెట్టుబడుల ప్రయాణాన్ని ప్రారంభించాలనుకునే వారికి మైక్రో, డైలీ సిప్‌లు అనువైన సాధనాలుగా ఉంటున్నాయని షేర్.మార్కెట్ (ఫోన్‌పే వెల్త్) ఇన్వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్ హెడ్ నీలేష్ డి నాయక్ తెలిపారు. రోజువారీ ప్రాతిపదికన నగదు రూపంలో ఆదాయాలు ఉండేవారికి, స్వయం ఉపాధి పొందే వారికి ఇవి సరిగ్గా సరిపోతాయని చెప్పారు. క్రమంగా వారు పెట్టుబడుల పరిమాణాన్ని పెంచుకుంటూ దీర్ఘకాలికంగా ఇన్వెస్ట్‌మెంట్ వైపు మళ్లేందుకు తోడ్పడుతున్నాయని వివరించారు. ఈక్విటీ ఫండ్స్‌లో సిప్‌లనేవి దీర్ఘకాలిక పెట్టుబడులనే విషయాన్ని ఇన్వెస్టర్లు గుర్తుంచుకోవాలని నాయక్ సూచించారు. మిడ్, స్మాల్ క్యాప్ షేర్లు, మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితి గురించి ఆందోళన చెందరాదన్నారు. తక్కువ ధరకే ఎక్కువ యూనిట్లను కూడబెట్టుకునే అవకాశంగా దీన్ని పరిగణించాలని సూచించారు. స్వల్పకాలిక హెచ్చుతగ్గులపై స్పందించడం కంటే, సిప్‌లను కొనసాగించడం శ్రేయస్కరమన్నారు. వివిధ రకాల కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా ఇన్వెస్టింగ్, ట్రేడింగ్ విభాగాల్లో స్టాక్స్, ఈటీఎఫ్‌లు, ఐపీవోలు, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్, అధునాతన ఫీచర్లు, ఇంటెలిజెంట్ టూల్స్ మొదలైనవి అందిస్తున్నామని నాయక్ చెప్పారు. మైక్రో సిప్‌ల ద్వారా మార్కెట్లోకి అడుగుపెట్టే యూజర్లకు యాప్‌లోని కంటెంట్‌తో పాటు సోషల్ మీడియా సహా పలు టచ్‌పాయింట్ల మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. మార్కెట్లపై నమ్మకాన్ని, పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు ఇవి ఇన్వెస్టర్లకు తోడ్పడుతున్నాయన్నారు.

ఏఐ దన్ను

డిజిటల్ వినియోగం పెరిగే కొద్దీ వెల్త్‌టెక్ ప్లాట్‌ఫామ్‌లు పెట్టుబడులు, ట్రేడింగ్‌ని అన్ని వర్గాల ప్రజలకు మరింతగా అందుబాటులోకి తెచ్చాయని నాయక్ చెప్పారు. పెట్టుబడుల ప్రక్రియను మరింత సులభతరం చేయడంలో కృత్రిమ మేధ, డేటా కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. కస్టమర్ల అవసరాలు, ప్రాధాన్యతలను అర్థం చేసుకోవడంలో తమకు, సజావుగా మార్కెట్ యాక్సెస్ లభించేలా ఇన్వెస్టర్లకు ఏఐ ఉపయోగపడుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఏఐపై మరింతగా ఇన్వెస్ట్ చేస్తున్నామని నాయక్ తెలిపారు. ప్రత్యేకంగా సరళమైన, ఇంటరాక్టివ్ యాప్‌ని కూడా తాము రూపొందించినట్లు చెప్పారు.

నగదు వ్యవహారాలు వద్దే వద్దు ..!

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

నగదు వ్యవహారాలు ఇప్పటికీ చాలామంది చేస్తూనే ఉన్నారు. వ్యవస్థలో నగదు చెలామణి ఈ జనవరిలో రూ. 40 లక్షల కోట్లకు చేరిందని ప్రాథమిక అంచనా. ఇది వార్షికంగా 11.1% చొప్పున పెరుగుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వినియోగం గణనీయంగా పెరిగింది. ఈ పెరుగుదల ఒక చరిత్రను సృష్టిస్తోంది. మరోవైపు డిజిటల్ వ్యవస్థ వృద్ధి చెందుతోంది. దేశవ్యాప్తంగా యూపీఐ వాడే వారి సంఖ్య 400 మిలియన్లు. దానిని మరో 600 మిలియన్లకు పెంచి 'ఒక బిలియన్'కి పెంచాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎంలు 'స్కాన్‌అండ్‌పే' ప్రభంజనాన్ని సృష్టిస్తున్నాయి. భవిష్యత్తు 'డిజిటల్ ప్రపంచమే'. అయినా మనిషి మారడం లేదు. నగదు వదలట్లేదు. రాజకీయ ఎన్నికల్లో నగదు పంపిణీ గురించి వింటాం. సినిమా ఇండస్ట్రీలో అది పరిపాటి. రియల్ ఎస్టేట్‌లో అలవాటు. లంచావతరాలకు దురలవాటు. ఎందుకో ఈ పొరపాటు చేసిన తర్వాత, దొరికిపోయిన తర్వాత గ్రహపాటు అని సరిపెట్టుకోవడం సాధారణమైంది.

భార్యభర్తలు ఇద్దరూ ఉద్యోగం చేసుకుంటూ సక్రమమైన మార్గంలోనే సంపాదిస్తూ చౌక రోజుల్లో ఇళ్లు, ఫ్లాటు కొన్నారు. కాలం కలిసొచ్చింది. వాటిని అమ్మినప్పుడు భారీ లాభాలు వచ్చాయి. అయితే మార్కెట్ ధరని మించిన ప్రతిఫలాన్ని నగదులో తీసుకున్నారు. సక్రమమైన(వైట్) వ్యవహారాన్ని ఆదాయపన్ను వారికి డిక్లేర్ చేసి చేతులు దులుపుకున్నారు. కానీ ఇంట్లో కొండచిలువగా నగదు నిలువ ఉంది. ఏం చేయాలి? ఇదొక పెద్ద ప్రశ్న..!

ఇంతటితో ఆగిపోయిందా? లేదు. జాలి గుండె కలిగిన ఆ ఇల్లాలు స్నేహితుడికి వైద్యం నిమిత్తం రూ.6 లక్షలు నగదు రూపంలో ఇచ్చింది. ఆ స్నేహితుడు తన భార్య అనారోగ్యం కోసం ఖర్చు పెట్టినా భార్య చనిపోయింది. తరువాత ఇన్సూరెన్సు డబ్బు బ్యాంకు ద్వారా వచ్చాయి. 'చేతిలో నగదు లేదు. తను తిరిగి చెల్లించాల్సిన రూ.6 లక్షల మొత్తం చెక్కు ద్వారా ఇస్తాను' అంటున్నాడు. ఇప్పుడు ఆ జాలి గుండె కలిగిన ఆ ఇల్లాలు ఆ మొత్తాన్ని ఎలా చూపించాలన్నది ప్రశ్న. మంచికి పోతే చెడు ఎదురురొచ్చింది..?

తండ్రి బతికున్నప్పుడు జాగాలో సగం రాయించుకున్నాడు పెద్ద కొడుకు. పెద్దలు ఇద్దరూ కాలం చేశారు. అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు మిగిలిన సగం జాగా పెద్దవాడికే అమ్మేశారు. కానీ పెద్దవాడు వ్యాపారంలో బాగా సంపాదించడం వలన తన దగ్గర ఉన్న నగదు కుటుంబ సభ్యులకిచ్చి వ్యవహారం నడిపించాడు. డబ్బు మీద వ్యామోహం వలన అందరూ నగదు వైపే మొగ్గు చూపించారు. ఒక్కొక్కరి చేతిలో పదేసి లక్షల మూట చేరింది. అటు పెద్దకొడుకు తన 'బ్లాక్‌మనీ'ని వదిలించుకొని మిగతా అందరికి నగదు పంచి ఇచ్చాడు. నగదు నాగుపాములా తయారైంది.!

అన్నదమ్ములు ఐక్యంగా ఉన్న కుటుంబంలో అన్న పురోహితుడు, తమ్ముడు క్యాటరింగ్ చేసేవారు. ఇద్దరికి దశ తిరిగింది. బాగా డబ్బులు నగదు రూపంలో వచ్చాయి. భార్యామణుల సలహామేరకు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశారు. కాలక్రమేణా పెద్ద మొత్తాలుగా మారాయి. టీడీయస్.. ఇన్‌కమ్‌టాక్స్.. పన్ను ఎగవేత ఉద్దేశంతో ఇన్‌కమ్ రిటర్నులు వేయడం లేదు. ఇప్పుడేం చేయాలనేది ఎడతెగని ప్రశ్న..?

తను ఒక చిన్న ఇంట్లో ఉంటూ తన పది ఫ్లాట్లు కేవలం నగదుకే అద్దెకిచ్చి, అద్దె వసూలు చేస్తూ జీవితం కులాసాగా గడుపుతున్నాడు గోవిందం. పొరపాటున ఒక కిరాయిదారునికి ఇచ్చిన రశీదు కొంప ముంచింది. ఒకటి నగదు రశీదు. రెండవది పన్ను ఎగవేత.

వీటి విషయం ఏమిటంటే.. నగదు వ్యవహారాలను చేయకండి. అసలు ప్రోత్సహించకండి. నల్లధనం (బ్లాక్ మనీ) వైపు వెళ్లొద్దు. నగదులో అప్పు ఇవ్వడం తప్పు. పుచ్చుకోవడం మరీ తప్పు. ఆ మొత్తాన్ని తిరిగి బ్యాంకు ద్వారా చెల్లిస్తే అది ఆదాయంగా మారి పన్నుకి గురి అవుతుంది. నగదు తీసుకోవడం తప్పని చెప్పాం కదా..! పోనీ దానిని అకౌంటు చేస్తే కనీసం మీ నిజాయితీ తెలుస్తుంది.

గణనీయంగా పెరిగిన నగదు వ్యవహారాలను కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా కనుక్కోవచ్చు. డిపార్ట్‌మెంట్ వారి వద్ద ఇంటెలిజెన్స్, ఫోరెన్సిక్ విభాగాలున్నాయి. మీరు సంపాదించిన 'ధనం' మీ దగ్గర ఉన్నా, వారి దగ్గర 'ఇంధనం' లాంటి సమాచారం ఉంది. ఈ రెండింటిని అనుసంధానం చేసే అవకాశం ఇవ్వకండి. సౌకర్యం కోసం నగదుని ఆశ్రయించకండి. అన్ని విధాల బ్యాంకు దారి సక్రమమైన రహదారి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

మెరుగైన అవకాశాలపై పెట్టుబడి

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బిజినెస్ సైకిల్ ఫండ్

ఈక్విటీలలో థీమ్యాటిక్/సెక్టోరల్ ఫండ్స్ అన్నవి కొంచెం రిస్క్ ఉన్నా సరే, రాబడులు కూడా బలంగా ఉండాలని కోరుకునే వారికి అనుకూలంగా ఉంటాయి. ఇవి తాము ఎంపిక చేసుకున్న రంగాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఈ విభాగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బిజినెస్ సైకిల్ ఫండ్ మాత్రం భిన్నమైన, మెరుగైన పనితీరుతో ఆకర్షిస్తోంది. ఇన్వెస్టర్లు దీర్ఘకాల లక్ష్యాల పెట్టుబడుల్లో కొంత మొత్తాన్ని వైవిధ్యం కోసం కేటాయించుకోవాలని భావించేట్టు అయితే.. ఈ ఫండ్‌ను పరిశీలించొచ్చు.

రాబడులు

ఈ పథకం 2021 జనవరిలో ప్రారంభమై.. ఐదేళ్ల ట్రాక్ రికార్డును పూర్తి చేసింది. ఈ పథకం ఆరంభంలో రూ.లక్ష ఇన్వెస్ట్ చేసి ఉంటే అది రూ.2.51లక్షలుగా మారి ఉండేది. ఐదేళ్లలోనూ ఏటా 20.56 శాతం చొప్పున ప్రతిఫలాన్ని అందించింది. ఇదే కాలంలో నిఫ్టీ 500 టీఆర్ఐ రాబడి 15.47 శాతమే ఉండడం గమనార్హం. ఏడాది కాలంలో పెట్టుబడులపై 18 శాతం రాబడిని అందించింది. ఇక మూడేళ్ల కాలంలో చూస్తే వార్షిక రాబడి 22.82 శాతంగా ఉంది. ఇక ఇదే విభాగంలో ఇతర పథకాలతో పోల్చితే ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బిజినెస్ సైకిల్ ఫండ్ ట్రాక్ రికార్డు పటిష్టంగా ఉంది. ఇన్వెస్టర్లు కనీసం రూ.100 నుంచి సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఆరంభం నుంచి ఈ పథకంలో ప్రతి నెలా రూ.10,000 చొప్పున సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసి ఉంటే రూ.6.10 లక్షలు ఐదేళ్లలో రూ.9.74 లక్షలుగా మారి ఉండేది. అంటే ఏటా 18.47 కాంపౌండెడ్ రాబడి (సీఏజీఆర్)కి సమానం.

పెట్టుబడుల విధానం..

బిజినెస్ సైకిల్స్ అంటే.. కొన్ని వ్యాపారాలకు ఒక్కో సమయంలో డిమాండ్ బలంగా ఉంటుంది. ప్రస్తుతం మెటల్స్‌లో బంగారం, వెండి, అల్యూమినియం, రాగి ధరలు గణనీయంగా పెరగడం, ఈ రంగాల్లోని కంపెనీలు బలంగా లాభాలు ఆర్జించడం చూస్తూనే ఉన్నాం. ఇలాంటి సైకిల్స్‌ను ఈ ఫండ్ ముందే గుర్తించి ఇన్వెస్ట్ చేస్తుంటుంది. స్థూల ఆర్థిక పరిస్థితులకు (ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు, వృద్ధి గమనం, ద్రవ్య పరిస్థితులు, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు) అనుగుణంగా ప్రయోజనం పొందే రంగాలను, థీమ్యాటిక్ అవకాశాలను ముందే గుర్తించి, ఆయా రంగాల్లోని బలమైన కంపెనీల్లో పెట్టుబడులు పెడుతుంది. తద్వారా దీర్ఘకాలంలో ఇన్వెస్టర్ల పెట్టుబడులను వృద్ధి చేయడం ఈ పథకం ఉద్దేశం. పరిస్థితులకు అనుగుణంగా విదేశీ స్టాక్స్‌లోనూ ఇన్వెస్ట్ చేస్తుంది.

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.15,808 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 97.88 శాతం మేర ఈక్విటీలకు కేటాయించగా, డెట్ సాధనాల్లో 0.75 శాతం, నగదు రూపంలో 1.37 శాతం కలిగి ఉంది. ఈక్విటీ పెట్టుబడులను గమనించగా.. లార్జ్‌క్యాప్స్ కంపెనీల్లో 73.54 శాతం, మిడ్‌క్యాప్ కంపెనీల్లో 9.6 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో 5.51 శాతం చొప్పున ఇన్వెస్ట్ చేసింది. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 84 స్టాక్స్ ఉన్నాయి. రంగాల వారీ కేటాయింపులను పరిశీలిస్తే.. అత్యధికంగా 32.28 శాతం మేర బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు కేటాయించింది. ఆ తర్వాత ఇండస్ట్రియల్స్ కంపెనీల్లో 17.52 శాతం, కన్జ్యూమర్ డిస్క్రిషనరీ కంపెనీల్లో 12.90 శాతం చొప్పున ఇన్వెస్ట్ చేసింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	9.56
ఐసీఐసీఐ బ్యాంక్	7.72
ఎల్‌అండ్‌టీ	6.70
యాక్సిస్ బ్యాంక్	4.50
రిలయన్స్ ఇండస్ట్రీస్	4.46
మారుతిసుజుకీ	3.69
ఎన్‌టీపీసీ	3.26
అల్ట్రాటెక్ సిమెంట్	3.20
ఎక్స్‌ట్రాకర్స్ హార్వెస్ట్	3.10
భారతీ ఎయిర్‌టెల్	2.86

భారతీయ సీఏలు గ్లోబల్ లీడర్లు

విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు సీఏ సిలబస్‌లో మార్పులు
సీఏ వృత్తిలోకి వచ్చేలా గ్రామీణ విద్యార్థులకు ప్రోత్సాహం
'సాక్షి'తో ఐసీఏఐ జాతీయ అధ్యక్షుడు ప్రసన్నకుమార్

సాక్షి, విశాఖపట్నం: భారతీయ సీఏలకు అంతర్జాతీయ మార్కెట్‌లో క్రేజ్ పెరుగుతోందని, మన సీఏలు గ్లోబల్ లీడర్లని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) జాతీయ అధ్యక్షుడు డి.ప్రసన్నకుమార్ చెప్పారు. ఐసీఏఐ ఇప్పటికే ఆస్ట్రేలియా, కెనడా, ఇంగ్లండ్, ఐర్లండ్ మొదలైన 8 దేశాలతో మ్యూచువల్ రికగ్నిషన్ అగ్రిమెంట్ (ఎంఆర్‌ఏ) కుదుర్చుకుందని తెలిపారు. ఐసీఏఐ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి విశాఖ నగరానికి వచ్చిన ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. మన సీఏలు ఏదైనా దేశం వెళ్లి రెండు లేదా మూడుపేపర్లు రాసి సులువుగా మెంబర్‌షిప్ పొందుతున్నారని తెలిపారు. దీనివల్ల భారతీయ సీఏలు విదేశాల్లో ఎలాంటి అదనపు పరీక్షలు లేకుండా ప్రాక్టీస్ చేసే లేదా ఉద్యోగాలు పొందే అవకాశం లభిస్తోందని చెప్పారు. ఇది దేశీయ మేధస్సుకు గ్లోబల్ గుర్తింపే కాకుండా విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలోనూ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. 'రాష్ట్రంలో ఐసీఏఐ ఆధ్వర్యంలో రూ.50 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు కానున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రం.. ఆడిటింగ్, అకౌంటింగ్ రంగంలో మైలురాయిగా నిలవనుంది. ఇది కేవలం శిక్షణ కేంద్రంగానే కాకుండా, ఆర్థిక పురోభివృద్ధికి సంబంధించిన పరిశోధనలకు వేదికగా మారుతుంది. స్థానిక నిపుణులకు ప్రపంచస్థాయి నైపుణ్యాలను అందించడం ద్వారా, మరిన్ని ఉద్యోగావకాశాలను సృష్టించడం ఈ కేంద్రం ప్రధాన లక్ష్యం. సాంకేతికత ఆధారంగా పాత, కొత్త చట్టాల్ని మరింత సులభతరం చేసేందుకు ఐసీఏఐ అడుగులు వేస్తోంది' అని ప్రసన్నకుమార్ చెప్పారు.

ప్రాక్టికల్ నాలెడ్జ్‌కి ప్రాధాన్యత

'చాలామంది విద్యార్థుల్లో సీఏ కోర్సు అంటే ఒక రకమైన భయం ఉంటుంది. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ఐసీఏఐ కాలానుగుణంగా సిలబస్‌లో మార్పులు చేస్తోంది. గతంలో పదేళ్లకోసారి సిలబస్ మార్చేవారు. ఇప్పుడు పరిస్థితులకు అనుగుణంగా మారుస్తున్నాం. సిలబస్ తగ్గించలేంగానీ.. మార్పులు జరుగుతున్నాయి. కేవలం థియరీకి పరిమితం కాకుండా, ప్రాక్టికల్ నాలెడ్జ్‌కి ప్రాధాన్యత ఇస్తున్నాం. మారుతున్న టెక్నాలజీ, గ్లోబల్ ఎకానమీకి అనుగుణంగా పాఠ్యాంశాలను సరళీకృతం చేయడం ద్వారా, మరింతమంది గ్రామీణ విద్యార్థులు కూడా ఈ వృత్తిలోకి వచ్చేలా ప్రోత్సహిస్తున్నాం. సీఏపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు కామర్స్ ఎడ్యుకేషన్ సిలబస్ తయారు చేసి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చాం. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే అమలవుతోంది' అని ప్రసన్నకుమార్ పేర్కొన్నారు.

ఆడిటింగ్‌లోనూ ఏఐ, డేటా అనలిటిక్స్ వినియోగం

'ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆడిటింగ్ అంటే కేవలం లెక్కలు చూడటం మాత్రమే కాదు.. వేలకోట్ల డేటాను విశ్లేషించడం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా అనలిటిక్స్ వినియోగం వల్ల ఆడిటింగ్ ప్రక్రియలో వేగం, కచ్చితత్వం పెరిగాయి. గతంలో మ్యాన్యువల్‌గా చేసే పనులను ఇప్పుడు ఏఐ సెకన్లలో పూర్తిచేస్తోంది. ఈ సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఐసీఏఐ తన సభ్యులకు ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. వచ్చే రెండేళ్లలో ఏఐ టూల్స్ వినియోగించని సీఏ ఉండరు. మేం కూడా ఏఐ టూల్స్‌ని అభివృద్ధి చేసి సభ్యులకు ఉచితంగా ఇస్తున్నాం. దీనిపై కమిటీ కూడా ఏర్పాటు చేశాం' అని చెప్పారు. విద్యా సంస్కరణలతో చార్టర్డ్ అకౌంటెంట్లను కేవలం లెక్కల ఆడిటర్లుగా కాకుండా బిజినెస్ సొల్యూషన్ ప్రొవైడర్లుగా మార్చాలన్నదే ఐసీఏఐ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- హాజరు కానున్న 10.57 లక్షల మంది విద్యార్థులు
- ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- విద్యార్థుల కోసం 1800–425–1531 టోల్ ఫ్రీ నంబర్

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు (ఐపీఈ–2026) సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. మంగళవారం రెండో ఏడాది విద్యార్థులకు పరీక్షలు మొదలవుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,537 పరీక్ష కేంద్రాల్లో 10,57,312 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా హాల్లోకి అనుమతించేది లేదని ఇప్పటికే ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఈ క్రమంలో విద్యార్థులు గంట ముందుగానే సెంటర్లకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షలు జరిగే అన్ని గదుల్లోనూ సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. పరీక్షల సందేహాలపై ఇంటర్మీడియెట్ విద్యామండలి కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 1800–425–1531(టోల్ ఫ్రీ) నంబర్‌ను సంప్రదించవచ్చు.

భారత్, ఫ్రాన్స్ నౌకాదళాధికారుల భేటీ

- ఫ్రాన్స్ నేవీ చీఫ్ అడ్మిరల్ వోజౌర్‌తో ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ భల్లా చర్చలు
- వియత్నాం, తైమూర్ నేవీ చీఫ్స్‌తోనూ భేటీ

సాక్షి, విశాఖపట్నం: భారత్, ఫ్రాన్స్ దేశాల మధ్య రక్షణ బంధం మరింత బలోపేతం చేసేందుకు తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ సంజయ్‌భల్లా, ఫ్రాన్స్ నేవీ చీఫ్ అడ్మిరల్ నికోలస్ వోజౌర్ ఆదివారం సమావేశమయ్యారు. విశాఖపట్నం వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ– 2026, మిలాన్–2026లో పాల్గొనేందుకు ఫ్రాన్స్ నౌకాదళం నగరానికి వచ్చింది. ఇందులో భాగంగా నౌకాదళాధిపతులు కీలక భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. సముద్ర భద్రత, కార్యకలాపాల సమన్వయం, వృత్తిపరమైన మార్పిడిపై కీలక చర్చలు జరిపారు. ఇటీవల భారత్ – ఫ్రాన్స్ మధ్య కుదిరిన 'స్పెషల్ గ్లోబల్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్'కు సంబంధించి నౌకాదళ రంగంలో ఆధునిక సాంకేతికత, ఉమ్మడి విన్యాసాల నిర్వహణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతిని పెంపొందించడంపై దృష్టి సారించిన ఫ్రాన్స్‌కు చెందిన 'అట్లాంటిక్ మారీటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్ ఐఎఫ్ఆర్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న క్రియాశీలక భాగస్వామ్యాన్ని చాటిచెప్పిందని నౌకాదళ వర్గాలు వెల్లడించాయి. ఈ చర్చలు భారత్–ఫ్రాన్స్ నౌకాదళాల మధ్య నిరంతర సమన్వయాన్ని, ప్రాంతీయ భద్రతా దృక్పథంతోపాటు ఉమ్మడి సముద్రయాన లక్ష్యాలను ప్రతిబింబించాయని తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ భల్లా స్పష్టం చేశారు. అదేవిధంగా వియత్నాం నేవీ డిప్యూటీ చీఫ్ రియర్ అడ్మిరల్ నగుయెన్ థీన్‌క్వాన్, తూర్పు తైమూర్ నేవీ చీఫ్ కమోడోర్ హిగినో దాస్ నెవెస్‌తోనూ ఈఎన్‌సీ చీఫ్ భేటీ అయ్యారు. ఆయా దేశాలతో ద్వైపాక్షిక విన్యాసాలు, పరస్పర అవగాహన ఒప్పందాలపై చర్చించారు.

ఫ్రాన్స్ నౌకాదళ ఉన్నతాధికారులతో భేటీ అయిన ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ భల్లా

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం 27న ధర్నా

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 27న విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా చేస్తామని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్, కార్యదర్శి ఐ.రాజేష్ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి లోకేశ్ బడ్జెట్‌లో ఉన్నత విద్యకు కేవలం 0.77 శాతం నిధులు కేటాయించడం దుర్మార్గమన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం 27న చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నేతలు

మణిపాల్‌లో గుండె మార్పిడి విజయవంతం

తాడేపల్లి రూరల్: మంగళగిరి మండలం తాడేపల్లి పట్టణ పరిధిలోని మణిపాల్ ఆస్పత్రిలో తొలిసారిగా చేసిన గుండె మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమైందని ఆస్పత్రి డైరెక్టర్ జి.రామాంజనేయరెడ్డి మీడియాకు తెలిపారు. మణిపాల్ ఫౌండేషన్, ముఖ్యమంత్రి సహాయ నిధి సహకారంతో విజయనగరం జిల్లాకు చెందిన కె.సత్యవతికి పునర్జన్మ ప్రసాదించినట్టు చెప్పారు. ఇటువంటి క్లిష్టమైన శస్త్రచికిత్సల కోసం చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కన్సల్టెంట్ సీటీవీఎస్ డాక్టర్ దిలీప్ రత్తి మాట్లాడుతూ.. గుండె మార్పిడి శస్త్రచికిత్సకు వెంట్రిక్యులర్ అసిస్ట్ డివైజెస్ వంటి అత్యాధునికమైన సదుపాయాలు అవసరమని పేర్కొన్నారు. హార్ట్ ఫెయిల్యూర్ దశకు చేరుకున్న ఆమెకు సమగ్ర ట్రాన్స్‌ప్లాంట్ ఈవేల్యూషన్ చేసినట్టు తెలిపారు. జీవన్‌దాన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ కె.రాంబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొన్ని వేల మంది ప్రజలు అవయవాల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రతి ఒక్కరూ చైతన్యం పొంది అవయవదానానికి ముందుకు రావాలని కోరారు. సమావేశంలో డాక్టర్లు వరుణ్ పామిడి, శంకరరావు, అనిల్‌కుమార్, ఏవీఎస్ ఎస్ఎన్ శ్రీధర్, ఎన్.మురళీకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మణిపాల్ వైద్యులు

నా కుమార్తె మృతిపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలి

డాక్టర్ దీపిక తండ్రి బత్తుల కోదండరామిరెడ్డి

తలుపుల (శ్రీసత్యసాయి జిల్లా): విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో తన కుమార్తె డాక్టర్ దీపిక ఈనెల 5వ తేదీ తెల్లవారుజామున డ్యూటీలో ఉండగానే మృతిచెందిందని, ఆమె మృతిపై తమకు అనుమానాలు ఉన్నందున ప్రభుత్వం వెంటనే జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని మృతురాలి తండ్రి, ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల కోదండరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. తన కుమార్తె మృతదేహానికి అదేరోజు సాయంత్రం జీజీహెచ్‌లో నిర్వహించిన పోస్టుమార్టం రిపోర్టు నేటికీ రాకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. విజయవాడ మెడికల్ కాలేజీలో మూడేళ్లుగా ఎండీ అనస్తీషియా కోర్సు చదువుతున్న తన కుమార్తె ఈనెల 4న డ్యూటీకి వెళ్లి అర్ధరాత్రి దాటిన తరువాత అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందడంపై తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, విజయవాడ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తన కుమార్తె మృతిపై నెలకొన్న అనుమానాలను వెంటనే నివృత్తి చేయాలని బత్తుల కోదండరామిరెడ్డి డిమాండ్ చేశారు.

దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా కాంగ్రెస్ వైఖరి

బీజేపీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్

బీచ్‌రోడ్డు (విశాఖ): ఢిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల ముగిసిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026' వేదికగా కాంగ్రెస్ పార్టీ అనుసరించిన తీరుపై బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కూటమి నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ 13 దేశాల ప్రతినిధులు, అంతర్జాతీయ స్థాయి నిపుణులు పాల్గొన్న ప్రతిష్టాత్మక సదస్సులో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనల పేరుతో అల్లరి చేయడం దేశ గౌరవానికి భంగం కలిగించడమేనన్నారు. 'న్యూఢిల్లీ డిక్లరేషన్' వంటి చారిత్రక పత్రాలపై సంతకాలు జరుగుతున్న వేళ, కాంగ్రెస్ రాజకీయ స్వార్థం కోసం అంతర్జాతీయ వేదికను వాడుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.

Finance Partners: TVS CREDIT, SHRIRAM Finance, HINDUJA LEYLAND FINANCE, IDFC FIRST Bank ALWAYS YOU FIRST, L&T Finance

#Ex- showroom price of Andhra Pradesh TVS Radeon All Black variant. Prices are subject to change without any prior notice. **Finance at the sole discretion of the financer. Limited period offer. *T&C apply.

FOR ALL BULK/INSTITUTIONAL REQUIREMENTS PLEASE MAIL: corporate.customersupport@tvsmotor.com VIJAYAWADA + Krishna District CASA TVS VIJAYAWADA: 9100759111, CMR TVS VIJAYAWADA 8345999999, GARAPATI TVS VIJAYAWADA 9160493366, CMR TVS BHAVANIPURAM 9154164863,CMR TVS NUZIVIDU 8019596622, CASA TVS GUDIWADA 9100759444, CASA TVS KANURU 9100759333, CASA TVS MACHILIPATNAM 7995512444, CASA TVS GANAVARAM 9100759555, PRATAP TVS JAGGAIPETA 9133563222, PRATAP TVS KANCHIKACHERLA 9133565222, PRATAPTVS NANDIGAMA 9133564222, RANA VEHICLES PVT. LTD., AVANIGADDA : 9397123457, VAMSI AUTOMOBILES KANKIPADU : 9985125999, RANA VEHICLES PVT LTD CHALLAPALLI : 9397123457, SAI RAM AUTOMOBILES VUYYURU : 9848173749, CMR AUTOMOTIVES PVT. LTD. IBRAHIMPATNAM : 9154170739, CMR AUTOMOTIVES PVT. LTD. ONE TOWN : 9154170743, SRI JAGADABHI RAMA AUTOMOTIVES HANUMAN JUNCTION : 9885226828, BALAJI ENTERPRISES TIRUVURU : 9885122614, TEJA MOTORS MYLAVARAM : 8897524339.Guntur PIONEER TVS GUNTUR 7997970011, PIONEER TVS AMARAVATHI ROAD 7997970012, PIONEER TVS AUTONAGAR 7997970014, PIONEER TVS TENALI 7997970016, PIONEER TVS VIDHYANAGAR 7997970013, PIONEER TVS MANGALGIRI 7997970015, UNITY TVS NARASARAOPET 8712650849, UNITY TVS CHILAKALURIPET 8712650855, UNITY TVS VINUKONDA 8712650825, PAWAN SAI MOTORS PONNUR : 9959039097, SAYED MOTORS BAPATLA : 9701309789, PAVAN AUTOMOTIVES REPALLE : 9885709107, VIJAYA LAKSHMI ENTEPRISES CHERUKUPALLI : 9642922808, PAVAN MOTORS KOLLURU : 9885709107, SAI BALAJI AUTOMOTIVES LLP TADIKONDA : 9505607786, KARTIKEYA MOTORS PRATHIPADU : 9290331115, Nagendra Motors KROSURU : 8099725155, UMA AUTOMOBILES PEDDANANDIPADU : 9908235999, LAKSHMI GANAPATHI AUTOMOTIVES AMARAVATHI : 7095924466, MAHESWARI AUTOMOBILES SATENAPALLI : 9394192329, CHINMAYE AUTOMOTIVES TADEPALLI : 7799958588, GAYATHRI MOTORS PHIRANGIPURAM : 9866373866, HANUMAN MOTORS DACHEPALLI : 9704861423, SAINATH AUTOMOTIVES PIDUGURALLA : 9849652039, AYODHYA MOTORS GURAZALA : 9182096480, SRI VATSASA STORES MACHERLA: 9966755557. Nellore VISHNUPRIYA TVS NELLORE 9392746689, SIVA SHAKTHI TVS NELLORE 8885390555, PIONEER TVS GUDUR 9542297974, AHMAD AUTOMOTIVES, PODALAKUR : 9052255031, SRI VENKATESWARA MOTORS , NAIDUPETA : 8978142655, SRIRAMA AUTOMOBILES , KOTA : 9440745747, NANDI MOTORS , ATMAKUR : 9663868616, SRI POOJITHA AUTOMOBILES , UDAYAGIRI : 8790807905, SRI GANESH MOTORS , KAVALI : 9849442133, VARUN MOTORS , BUCHI REDDYPALEM : 9491923143. West Godavari (Tadepalligudem) GNAPIKA TVS SATRAMPADU ELURU 7095706969, GNAPIKA TVS OLD BUS STAND 7095701818, ESWARA TVS BHIMAVARAM 7997993277, ESWARA TVS PALAKOLU 7997998266, SRI KRISHNA TVS TANUKU: 7702511992, SRI DURGA TVS , NARASAPUR: 7997998256, GNAPIKA TVS, TADEPALLIGUDEM: 7095705454, PAVITHRA TVS , KOYYALAGUDEM: 9059906703, ESWARA TVS , MOGALTUR: 7997993268, VENKAT SRI TVS , JANGAREDDYGUDEM: 9492733338, SUN TVS CHINTALAPUDI: 9908958794. GURU TVS KIKALURU: 9703014102,LAKSHMI TVS PENUGONDA : 8179524234,9398656775. Prakasam(Ongole) ELITE TVS ONGOLE 7095559009: VISHNUPRIYA TVS ONGOLE 7799121619, VISHNU PRIYA TVS CHIRALA 6281023626, SUGUNA AUTOMOTIVES, DARSI: 9536225588, SIVA PRIYA AUTOMOTIVES, ADDANKI: 9985130799, SRI SAI SRINIVASA AUTOMOBILES, GIDDALUR : 9394893246, SUSMITHA MOTORS , MEDARAMETLA : 9632301264, PAVITHRA SAI AUTOMOBILES, MARKAPUR : 9440355913, GAYATHRI MOTORS , INKOLLU : 9573272099, A & A AUTOMOTIVES , MARTURU : 9704663217, RANI MOTORS, SINGARAYAKONDA : 8341785467, JRR AUTOMOTIVES, CUMBUM : 7330996544, TIRUMALA SAI AUTOMOTIVES, DORNALA : 9010800500, SRI BALAJI MOTORS, 9966643264, VASAVI AUTO ENTERPRISES KANIGIRI: 9059723608, SRI VARAHI AUTOMOTIVES KANDUKUR: 9010402532, SRI SIVA RAM TVS PODILI 9003193298.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

ముక్కంటి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విశ్వజిత్ శెట్టి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. – శ్రీకాళహస్తి

అప్పన్న సన్నిధిలో పాట్నా హైకోర్టు న్యాయమూర్తి

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈవో రాధ స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు. – సింహాచలం (విశాఖ)

'ప్రసాద్' పరిధిలోకి కాణిపాకాన్ని తీసుకొస్తా

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

కాణిపాకం: ఆలయాలు, పర్యాటక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రసాద్ పథకం కిందకు కాణిపాకం ఆలయాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌తో కలిసి కాణిపాక వరసిద్ధ వినాయకుడిని దర్శించుకున్నారు. వారి వెంట ఎమ్మెల్యే మురళీమోహన్, చైర్మన్ మణినాయుడు, ఈవో పెంచలకిషోర్ ఉన్నారు.

శ్రీవారి సేవలో కేంద్రమంత్రి

ఆలయం వెలుపల శివరాజ్ సింగ్ చౌహాన్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

కాఫీ పెట్టండి.. సారూ!

హార్సిలీహిల్స్‌పై తోటల పెంపకం పట్ల అటవీశాఖ నిర్లక్ష్యం

- ప్రయోగం సఫలం..ఆచరణ విఫలం
- మంచి దిగుబడి ఉన్నా సేకరణ లేదు
- సాగు విస్తీర్ణం పెంచితే మార్కెటింగ్‌కు పుష్కలంగా అవకాశాలు
- అరకు కాఫీని ఆదర్శంగా తీసుకోవాలంటున్న పరిశీలకులు

బి.కొత్తకోట: మూడున్నర దశాబ్దాల క్రితం అటవీశాఖ చేసిన ఓ మంచి కాఫీ లాంటి ప్రయోగం ఫలించగా, ఆచరణలో విఫలమైంది. సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులో ఉన్న అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని వేసవి విడిది కేంద్రం, ఆంధ్రాఊటీ హార్సిలీహిల్స్ ప్రకృతి ప్రయోగాలకు వేదిక. ఇందులో ఎన్నో ప్రయోగాలు విజయవంతమయ్యాయి. అందులో మొక్కలపై ఎన్నో ప్రయోగాలు చేయగా వాటి ఆనవాళ్లు ఇప్పుడు లేవు. ఇందులో ఒకటి కాఫీ మొక్కల పెంపకం. అరకు లాంటి ప్రాంతాలకే పరిమితమైన కాఫీతోటల పెంపకం 1990లో ప్రయోగాత్మకంగా హార్సిలీహిల్స్‌పై చేపట్టారు.

ప్రయోగం ఫలించింది

మొదటి సారిగా 1990లో ఇక్కడ కాఫీతోటలు సాగు చేయాలన్న ఆలోచన అటవీశాఖకు కలిగింది. దాంతో అప్పటి అధికారులు కాఫీ మొక్కలను నాటి వాటి ఎదుగుదల, దిగుబడి, నాణ్యతను పరిశీలించారు. వాటిని నాటిన తర్వాత అవి మొక్కలై మంచి దిగుబడి ఇవ్వడంతో పాటు ఎలాంటి సమస్యలు ఎదురుకాలేదు. దాంతో సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులో.. వేసవిలో సాధారణ ఉష్ణోగ్రత 32 డిగ్రీలు, శీతాకాలం ఉదయం సమయంలో ఉష్ణోగ్రత 7 డిగ్రీలకు పడిపోతుంది. ఈ స్థాయి ఉష్ణోగ్రతలున్నా కాఫీతోటల పెంపకం విజయవంతమైంది. కొండపైన అటవీప్రాంగణం, ఘాట్ రోడ్డులోని రెండో మలుపు వద్ద కాఫీ తోటలను పెంచారు. ఇవి ఏటా దిగుబడిని ఇస్తున్నాయి. అయితే వీటి నిర్వహణ సక్రమంగా లేకపోయినా దిగుబడి బాగా వస్తోంది. ప్రస్తుతం కాఫీ మొక్కల నిండా గింజలు కనిపిస్తున్నాయి. ఈ మొక్కల భాగాలను కత్తిరించి వేయడంతో ఒక స్థాయి వద్ద ఎదుగుదల ఆగిపోయింది.

సేకరణ వదిలేశారు:

కొండపై రెండుచోట్ల ఉన్న కాఫీతోటల నుంచి మంచి దిగుబడి వస్తోంది. వీటినుంచి మొదట్లో కాఫీ గింజలను సేకరించారు. తర్వాత దీనిపై నిర్లక్ష్యం పెరగడంతో వాటి నిర్వహణ, సస్యరక్షణ చర్యలను పూర్తిగా వదిలేశారు. దీనిఫలితంగా దిగుబడి వస్తున్నా వాటిని ఆదాయంగా మార్చుకునేందుకు అటవీశాఖ ఆసక్తి చూపడం లేదు. ఈ దిగుబడిలో కొంత కోతులు తింటుండగా, మిగిలినవి వృథాగా నేలరాలిపోతున్నాయి. ఆదాయం వచ్చే ఈ కాఫీ గింజలను సేకరించేందుకు అధికారులు ఆసక్తి చూపించడం లేదు.

హార్సిలీహిల్స్‌పై అటవీప్రాంగణంలో కాఫీతోట

ఘాట్‌రోడ్డులో కాఫీతోట (ఇన్‌సెట్లో కాఫీ మొక్కకు కాసిన గింజలు)

విస్తరిస్తే పరిశ్రమ అవుతుంది

తూర్పు కనుమలతో విడిపడిన హార్సిలీహిల్స్ దట్టమైన అడవులతో కూడుకున్నది. జీవవైవిధ్యం పరంగా ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ కొండ అడవి తూర్పున కురబలకోట మండలం, దక్షిణాన కర్ణాటక రాష్ట్రానికి విస్తరించి ఉంటుంది. 8,755 హెక్టార్ల విస్తీర్ణంలో దట్టమైన అటవీప్రాంతం ఉంది. ఇందులో రిజర్వ్‌ఫారెస్ట్ 6,231 హెక్టార్లుందని 1882లోనే 16వ సెక్షన్ కింద ప్రభుత్వం ప్రకటించింది. కాఫీ తోటల పెంపకం విజయవంతమైంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని అటవీశాఖ అడవిలో, ఘాట్‌రోడ్డు సమీపంలోని మైదాన భూమిపై వీటిని పెంపకాన్ని చేపట్టి విస్తరిస్తే ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కలగడంతోపాటు అరకు కాఫీ లాగా హార్సిలీహిల్స్ పేరు బ్రాండ్‌గా మారే అవకాశం లేకపోలేదు. ఈ దిశగా అటవీశాఖ చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలొస్తాయి.

విస్తరణకు పరిశీలన

హార్సిలీ హిల్స్ పై కాఫీ తోటల నిర్వహణ, విస్తరణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అటవీ ప్రాంగణంలో కొత్తగా కాఫీ తోటల పెంపకానికి భూమి లేదు. కొండలో అనువైన ప్రాంతాన్ని గుర్తించి.. దీనిపై నివేదిక ప్రభుత్వాన్ని పంపుతాం. తోటల నుంచి గింజలను సేకరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– జయప్రసాదరావు, మదనపల్లె రేంజర్

చైన్‌స్నాచింగ్‌లు జరుగుతున్నాయని

ఇంట్లో దాచి వెళ్తే..

ఇంటి తాళం పగులగొట్టి 35 తులాల బంగారం చోరీ

- ప్రొద్దుటూరులోని ఓ ఇంట్లో ఘటన

ప్రొద్దుటూరు క్రైం : బంగారం ధర పెరగడంతో బయట చైన్ స్నాచింగ్‌లు జరుగుతున్నాయి.. ఒంటిపై బంగారం ఉండడం మంచిది కాదని భావించి, బంగారు ఆభరణాలను ఇంట్లో భద్రపరచి శుభకార్యానికి వెళ్లిన వారి ఇంటికి చోరులు కన్నం పెట్టారు. ఇంటికి తాళం వేసుకుని అలా వెళ్లారో లేదో కొన్ని గంటల్లోనే వారి ఇంట్లో దొంగలు పడి ఊడ్చేశారు. ప్రొద్దుటూరులోని జమ్మలమడుగు రోడ్డులో ఉన్న తిమ్మయ్యకాలనీలో రాజుల బాలిరెడ్డి ఇంట్లో జరిగిన ఈ చోరీలో సుమారు 35 తులాల బంగారు నగలను దుండగులు అపహరించారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరులోని తిమ్మయ్యకాలనీలో రాజుల బాలిరెడ్డి కుటుంబం రెండున్నర ఏళ్ల క్రితం వచ్చి స్థిరపడింది. అతని స్వగ్రామమైన ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామంలో ఆదివారం బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో శనివారం సాయంత్రమే ఇంటికి తాళం వేసుకుని బాలిరెడ్డి భార్య భారతితో కలిసి వెళ్లారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒంటిపై ఎక్కువ బంగారం ఉండడం మంచిది కాదని భావించిన భారతి ఒక చిన్న హారం మాత్రమే మెడలో వేసుకుని మిగతా బంగారు ఆభరణాలను ఇంట్లోనే భద్రంగా దాచి వెళ్లింది.

ఇంటి తలుపు తెరచి ఉండడంతో..

ఇంటి మెయిన్ గేట్‌కు తాళం వేసి.. లోపల ఇంటి తలుపులు తెరచి ఉండడంతో అనుమానం వచ్చి పక్కింటివాళ్లు విషయాన్ని బాలిరెడ్డికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో బాలిరెడ్డి దంపతులు హుటాహుటిన ప్రొద్దుటూరులోని ఇంటికి వచ్చి చూడగా బీరువా, అల్మారాల్లోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. లాంగ్‌చైన్, కంకణాలు, గాజులు, రాం పరివార్ చైన్లు.. సుమారు 35 తులాల నగలు చోరీకి గురైనట్లు భావించారు. వెంటనే బాలిరెడ్డి దంపతులు పోలీసులకు సమాచారం అందించారు. బంగారు చోరీపై బాలిరెడ్డి భార్య భారతి కన్నీటి పర్యంతమయ్యారు. ప్రొద్దుటూరు ఏఎస్పీ విభూకృష్ణ ఆదివారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం అధికారులు వేలిముద్రలు సేకరించారు. బాలిరెడ్డి ఇంటి సమీపంలో ఉన్న ఓ ఇంటి చుట్టూ పోలీస్ జాగిలం పదేపదే తిరిగింది. దీంతో పోలీసులు ఆ ఇంట్లో ఉన్న వారిని విచారణ చేస్తున్నారు. బాలిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

బాలిరెడ్డి ఇంట్లో తెరచి ఉన్న బీరువాలు, అల్మారాలు

విత్తుకోని ఆశలు

కర్నూలు జిల్లా వర్కూరులో నకిలీ విత్తనాలతో పెరగని మొక్కజొన్న పంట

- ఇష్టారాజ్యంగా విత్తనోత్పత్తి
- మార్గదర్శకాలు పాటించని విత్తన కంపెనీలు
- వ్యవసాయ యంత్రాంగానికి కనీస సమాచారం కరువు
- సీడ్ ప్రొడక్షన్‌పై చూసీ చూడనట్లుగా వ్యవహారం
- దళారీల మాయలో నష్టపోతున్న రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): గిట్టుబాటు ధరలు లభించక, కనీసం మద్దతు ధర కూడా ఊరటనివ్వకపోవడంతో రైతులు విత్తనోత్పత్తి వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే కంపెనీలు కనీస మార్గదర్శకాలు, నిబంధనలు పాటించకపోవడం రైతులకు శాపంగా మారుతోంది. విత్తనోత్పత్తిలో పెట్టుబడి వ్యయం ఎక్కువగా ఉంటుంది. ఉత్పత్తి చేసిన విత్తనాలను సంబంధిత కంపెనీలే రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేస్తాయి. అంతా సవ్యంగా జరిగితే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. విత్తనోత్పత్తిలో నేరుగా విత్తన కంపెనీలు రైతులు ముందుకు రావడం లేదు. సీడ్‌కంపెనీల తరపున ఆర్గనైజర్లు(దళారీలు) రైతులకు, విత్తన కంపెనీలకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారు. వీరి ద్వారానే రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు, సూక్ష్మ పోషకాలు తదితరాలను సరఫరా చేస్తారు. విత్తనోత్పత్తి ఏఏ మండలాల్లో జరుగుతోంది. ఏఏ కంపెనీలు ఏ పంటల్లో సీడ్ ప్రొడక్షన్ చేస్తున్నాయనే కనీస సమాచారం వ్యవసాయ శాఖ వద్దలేదు. నిబంధనల ప్రకారం విత్తన కంపెనీలు వివరాలను విధిగా జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయాల్లో అందించాలి. రైతులతో అగ్రిమెంట్ చేసుకొని, కాపీ రైతులకు ఇవ్వాలి. సరఫరా చేసే విత్తనాలకు బిల్లులు తప్పనిసరి. అయితే విత్తన కంపెనీలు మార్గదర్శకాలను పక్కన పెట్టి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. మండలాల వారీగా దళారీలను ఏర్పాటు చేసుకొని వారి ద్వారానే రైతులను గుర్తించడంతో పాటు రైతులకు విత్తనాలు, ఎరువులు, ఇతర ఇన్‌పుట్స్ ఇస్తున్నారు. ఫలితంగా పంట దెబ్బతిన్నప్పుడు దళారీలు చేతులెత్తేస్తున్నారు. కంపెనీలు మాకు సంబంధం లేదని పత్తుకుంటున్నాయి.

లోపాయికారీ ఒప్పందం

2025 ఖరీఫ్‌లో మొక్కజొన్న విత్తనోత్పత్తి చేపట్టిన రైతులు గతంలో ఎప్పుడూ లేని విధంగా నష్టపోయారు. విత్తనం కారణంగానే పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు తేల్చినప్పటికీ నష్టపోయిన రైతులను పట్టించుకునే దిక్కులేకుండా పోయింది. ఉన్నతాధికారులు ఎలాంటి అగ్రిమెంట్లు లేకుండా విత్తనోత్పత్తి చేశారు, మీదే తప్పని చేతులెత్తేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కంపెనీలకు, వ్యవసాయ శాఖ యంత్రాంగానికి లోపాయికారీ ఒప్పందం ఉండటం వల్లే ఈ పరిస్థితి కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

50వేల ఎకరాల్లో విత్తనోత్పత్తి

విత్తనోత్పత్తిలో ఉమ్మడి కర్నూలు జిల్లా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. వరి, పత్తి, వేరుశనగ, కంది, శనగ, మొక్కజొన్న, జొన్న, మినుము తదితర పంటలతో పాటు కూరగాయల పంటల్లోనూ దశాబ్దాల తరబడి విత్తనోత్పత్తి జరుగుతోంది. అయితే ఇటీవలి కాలంలో విత్తనోత్పత్తి దారితప్పింది. వ్యవసాయ శాఖ చూసీచూడనట్లు పోతుండటంతో విత్తన కంపెనీలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాయి. 50వేల ఎకరాల్లో విత్తనోత్పత్తి జరుగుతున్నా ఏ ఒక్క వ్యవసాయ అధికారి పంటలను పరిశీలించని పరిస్థితి నెలకొంది. వ్యవసాయ అధికారులకు విత్తనోత్పత్తిపై కనీస సమాచారం కూడా లేకపోవడం గమనార్హం.

ఫిర్యాదుల వెల్లువ

- 2024–25లో మొక్కజొన్న విత్తనోత్పత్తికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో 150 వరకు ఫిర్యాదులు వచ్చాయి. 2025–26 సంవత్సరంలో నంద్యాల జిల్లా నందికొట్కూరు సబ్ డివిజన్‌లోనే మొక్కజొన్న విత్తనోత్పత్తికి సంబంధించి 52 ఫిర్యాదులు వచ్చాయి.
- నంద్యాల జిల్లా మొత్తంగా 180 ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం.
- కర్నూలు జిల్లా గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, క్రిష్ణగిరి, మంత్రాలయం, కోడుమూరు, దేవనకొండ, కౌతాళం తదితర మండలాల నుంచి మొక్కజొన్న విత్తనోత్పత్తికి సంబంధించి ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

ఎలాంటి ధృవీకరణ లేకుండానే ప్యాకింగ్

వివిధ కంపెనీలు ఎలాంటి ధృవీకరణ లేకుండానే విత్తనాలు ప్యాకింగ్ చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం విత్తనోత్పత్తి జరిగితే మండల వ్యవసాయ అధికారులు పంటలను తనిఖీ చేసి విత్తనం నాణ్యతను సర్టిఫై చేస్తారు. సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ అధికారులు కూడా విత్తనోత్పత్తి చేసిన పంటలను వివిధ దశల్లో పరిశీలిస్తారు. ఈ వివరాలను వ్యవసాయ శాఖ కమిషనర్‌కు సమర్పించి ప్యాకింగ్‌కు అనుమతి తీసుకుంటారు. అయితే గత రెండేళ్లుగా విత్తనోత్పత్తి నిబంధనలకు విరుద్ధంగా సాగుతోంది. విత్తనోత్పత్తి వివరాలు వ్యవసాయ అధికారులకు ఇవ్వకపోయినా.. సీడ్ సర్టిఫికేషన్ అథారిటీకి అందించాలి. ఇక్కడ కూడా ముడుపులు పుచ్చుకొని గుడ్డిగా సర్టిఫై చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సై.. సై.. శయ్యారే!

పందిరి మంచాలకు పెరుగుతున్న క్రేజ్

చిన్ననాడు అమ్మ పాడిన జోల పాటలు.. మనవడినో, మనవరాలినో నిద్రపుచ్చుతూ పక్కనే పడుకోబెట్టుకుని అమ్మమ్మ, నాన్నమ్మలు చెప్పిన కథలు.. మరెన్నో మరువలేని అనుభూతులు.. మధుర జ్ఞాపకాలకు ప్రత్యక్ష సాక్ష్యం.. పందిరి మంచం. పందిరి మంచం అంటే కేవలం నిద్రపోయేది కాదు.. అది ఒక తరం నుంచి మరో తరానికి జ్ఞాపకాలను అందించే అద్భుతమైన సాధనం! టేకు కర్రతో చేసిన దృఢమైన కోళ్లు.. వాటిని నాలుగు వైపులా కలుపుతూ అమర్చిన బలమైన బద్దీలు.. వాటికి నలుమూలలా నగిషీలు చెక్కి, బిగించిన నాలుగు టేకు స్తంభాలు.. వాటిని కలుపుతూ మళ్లీ నాలుగు బద్దీలు.. వాటికి అందంగా వేలాడదీసిన తెరలు.. వెరసి రాజసం ఉట్టి పడే పాన్పు! అందుకే దీనికున్న ఆదరణ 'చెక్క' చెదరనిది!

- మారిన ట్రెండ్‌తో పూర్వ వైభవం
- తయారీకి పెరిగిన ప్రాధాన్యం

పిఠాపురం: ఇల్లయినా కార్యాలయమైనా ఫర్నిచర్ ఉండాల్సిందే. అలసి సొలసిన దేహానికి కాసింత విశ్రాంతిని అందించేందుకు మంచాలు, కుర్చీలు ఎంతో అవసరం. వీటన్నింటిలోనూ మంచాలకు ఉన్న విలువ ఫర్నిచర్‌లో ఇక దేనికీ ఉండదు. మనిషి జీవితంలో సగభాగం గడిపేది మంచం మీదే అంటే అతిశయోక్తి కాదు. అలాంటి మంచాలకు పూర్వకాలం నుంచీ మంచి గుర్తింపు ఉంది. ట్రెండ్ మారుతున్న కొద్దీ మంచాల్లో అనేక రకాల డిజైన్లు మార్పులు వచ్చినప్పటికీ పందిరి మంచానికి ఉన్న ఆదరణ చెక్కుచెదరనిది. గతంలో పందిరి మంచం లేని ఇల్లు ఉండేది కాదు. రానురానూ మారిన కాలంతో పాటు మంచాలు మారిపోయాయి. పందిరి మంచం పాత కాలపు వస్తువుగా మిగిలిపోయింది. కానీ, ప్రస్తుతం మారిన ట్రెండ్‌తో మళ్లీ పందిరి మంచాలకు పూర్వ వైభవం వస్తోంది. ఇప్పుడు ఎక్కడ చూసినా పందిరి మంచాలకు మంచి ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో, వీటి తయారీ అమ్మకాలు ఊపందుకున్నాయి.

కొన్నాళ్లు కనుమరుగు

మంచానికి పైభాగంలో పందిరి లాగా కర్రతో చేసిన ఫ్రేమ్ నిర్మిస్తే దానిని పందిరి మంచం అంటారు. వీటిని దోమ తెరలు బిగించడానికి లేదా శుభకార్యాల్లో అలంకరించడానికి ఉపయోగిస్తారు. పూర్వం దోమల నుంచి రక్షణకు దోమ తెరలు కట్టుకునే విధంగా దీనిని రూపొందించారు. కేవలం నిద్రించడానికే కాకుండా ఇంటి అలంకరణలో స్టేటస్ సింబల్‌గా ఇది ఉండేది. ఇంటి ముందర వాతావరణం నుంచి రక్షణగా పందిరి ఎలా ఉంటుందో ఇంట్లో సౌకర్యవంతమైన నిద్రకు రక్షణగా ఈ మంచంను డిజైన్ చేయడంతో దీనికి పందిరి మంచం అనే పేరు వచ్చింది. మడత మంచం, నవారు మంచం ఇలా అనేక రకాల మంచాలు ఉన్నప్పటికీ దీనికి ఉండే ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. అలాంటిది రాను రానూ ఇవి వాడుకలో లేకుండా పోయాయి. కొందరు పాత సామాన్ల వారికి అమ్మేసిన సందర్భాలూ ఉన్నాయి. ఎక్కువ జాగా అవసరం కావడంతో ప్రస్తుత కాలంలో అతి తక్కువ జాగాలో ఎక్కువ మంది నివసించే పరిస్థితుల్లో వీటిని ఉపయోగించడం భారంగా భావించి వాడడం మానేశారు.

ట్రెండ్ మారింది

ఇప్పటి వరకు మామూలు మంచాలు మాత్రమే తయారు చేసేవాళ్లం. ఈ మధ్య చాలామంది పందిరి మంచాలు తయారు చేయమని ఆర్డర్లు ఇస్తున్నారు. పూర్వం ఉండే పందిరి మంచాలను పోలి ఉండి కొత్త డిజైన్లలో మంచాలు తయారు చేయమంటున్నారు. వీటి తయారీకి ఎంత ఖర్చు అయినా వెనుకాడడం లేదు. ఒక్కో మంచం తయారు చేయడానికి రూ.1.50 లక్షలు ఖర్చవుతోంది. డిజైన్‌ను బట్టి రేటు పెరుగుతుంది. ఒక్కో మంచం తయారీకి నెల రోజులు పైగా సమయం పడుతోంది. ప్రతీ రోజు ఇద్దరు నుంచి నలుగురు పని చేయాల్సి ఉంటుంది. గతంలో అంతా చేతి పని కాగా ప్రస్తుతం మెషీన్లు అందుబాటులోకి రావడంతో కాస్త పని సులువుగా మారినా మంచం అంతా డిజైన్లతో ఉండడం వల్ల బాగా శ్రమ పడాల్సి ఉంటుంది. పాలిష్‌కు ప్రాధాన్యం ఉండడంతో దానికే రూ.30 వేల వరకు ఖర్చు అవుతుంది.

– పట్నాల సీతాంబరం, వడ్రంగి మేస్త్రి, కొత్తపల్లి

తయారీకి సెప'రేటు'

డబుల్ కాట్ సింగిల్ కాట్ మంచాలు డిజైన్ బట్టి తయారు చేసే కర్రను బట్టి రేట్లు ఉండగా ప్రస్తుతం పందిరి మంచాలకు మాత్రం అధిక ధరలు పలుకుతున్నాయి. టేకు కర్రతో తయారు చేసే పందిరి మంచాలకు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ధర పలుకుతోంది. మామూలు మంచాల కంటే ఎక్కువ కర్ర అవసరం అవుతుంది. పని కూడా పదితంలు ఎక్కువగా ఉండడంతో వీటి తయారీకి సొమ్ము గట్టిగానే ఖర్చవుతోంది. గతంలో నాణ్యమైన కర్రతో చేసిన పందిరి మంచాలు ఎలా ఉన్నాయో అదే రీతిలో ఇప్పుడు తయారు చేయిస్తున్నారు. వీటికితోడు కొత్త సొబగులు అద్దుకొని ఆకర్షణీయంగా తయారవుతున్నాయి. ఇప్పటికే మార్కెట్‌లో పందిరి మంచాల అమ్మకాలు ఊపందుకోగా తయారీదారులు బిజీగా మారిపోయారు.

పట్టు పరుపునకే ప్రాధాన్యం

పందిరి మంచం పట్టు పరుపు ఒక కాంబినేషన్‌గా ఉంటుంది. ఇది పూర్వం నుంచి కొనసాగుతున్న ఒరవడి. అయితే కొంతకాలం నుంచి పరుపుల్లో అనేక రకాలు అందుబాటులోకి రావడంతో పట్టు పరుపులు కనుమరుగయ్యాయి. కేవలం బూరుగు దూదితో తయారు చేసే పట్టు పరుపులు కనిపించకుండా పోయాయి. కాని పందిరి మంచాల రాకతో మళ్లీ వీటికి జీవం వస్తోంది. పందిరి మంచం తయారు చేయించుకునే వారు దూది పరుపుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో మళ్లీ దూది పరుపుల తయారీ ప్రారంభమయ్యింది.

పాత కాలపు పందిరి మంచం

కొత్తపల్లిలో పందిరి మంచం తయారు చేస్తున్న వడ్రంగి మేస్త్రి

క్రమంగా డిమాండ్

ట్రెండ్ మారింది. పాత కాలపు అలవాట్లకు వస్తువులకు ప్రాధాన్యం పెరిగింది. దానిలో భాగంగా కొన్నాళ్లు కనిపించని పందిరి మంచాలకు మళ్లీ పూర్వ వైభవం వచ్చింది. జనం వీటిపై మక్కువ చూపడంతో క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. దీంతో పందిరి మంచాల తయారీ ఊపందుకుంది. ఎక్కువ మంది కొత్తగా పందిరి మంచాలను తయారు చేయిస్తున్నారు.

సూర్య కిరణాలు పర్వతాల మీదుగా పయనిస్తుండగా మంచు కాంతిమంతంగా కనువిందు చేసే చోటు ఏది అని అడిగితే వెంటనే 'స్విస్ ఆల్ప్స్' అని చెప్పేయవచ్చు. సమ్మర్‌లో కూడా యూరప్ అందాలను వీక్షించాలి అనుకునే వారికి ఈ జర్నీ ఒక బ్యూటిఫుల్ ఛాయిస్.. స్విట్జర్లాండ్‌లో ఎండాకాలం కూడా మంచు ఆకర్షణ పర్యాటకులను ఆకట్టుకుంటుంది. ఆకాశం నీలంగా, గడ్డి పర్వతాల మీద పచ్చగా, దూరంగా మంచుపై వెలిగే చంద్రప్రభలా కనిపిస్తుంది. ఎండలో కూడా చల్లని గాలి మనసును మేల్కొలుపుతుంది..

• స్విస్ ఆల్ప్స్

వేసవిలో విరిసే మంచు పరిమళం

సరోవరాల సౌందర్యం

స్విస్‌లో సరస్సులు ఎండాకాలంలో ప్రత్యేక అందాన్ని సంతరించుకుంటాయి. లేక్ జెనీవా తీరం దగ్గర మధ్యాహ్నం నిశ్శబ్దంగా ఉంటుంది. నీళ్లు నీలం రంగులో మెరుస్తూ, పర్వతాల ప్రతిబింబాలను తమలో కలిపేసుకుంటాయి. ఇంటర్లేకన్ అనే ప్రదేశంలో రెండు సరోవరాల మధ్య నిలిచిన ఊరిలో నడవడంతో పాటు, స్థానికంగా ఉన్న గడ్డి మీద కూర్చొని ఆకాశాన్ని చూస్తూ సమయాన్ని గడపాలని అనిపిస్తుంది.

పర్వతాల మధ్య సూర్యోదయం

స్విస్ ఆల్ప్స్‌లో ప్రతీ సూర్యోదయం ఒక గీతంలా మొదలవుతుంది. చర్చి గంటలు దూరంగా వినిపిస్తాయి. పర్వతాల నుంచి దిగే సూర్యోదయం నీలి ఆకాశాన్ని మెల్లిగా బంగారు రంగులో మెరిపిస్తుంది. జెర్మాట్ లాంటి అందమైన గ్రామ వీధుల్లో నడుస్తుంటే, చుట్టూ వుడెన్ హౌసెస్, వరండాల్లో సందడి చేసే పువ్వులు, వెనకాలే మ్యాటర్ హోర్న్ లాంటి శిఖరం చూస్తుంటే జీవితం ఎంత అందమైనదో అనిపిస్తుంది.

లేక్ జెనీవా

సందర్శనీయ స్థలాలు

ఈ ప్రాంతంలో జెర్మాట్ నుంచి మేటర్‌హార్న్‌పర్వత దర్శనం అనేది ఒక నిశ్చలమైన క్షణంలా అనిపిస్తుంది. ఇంటర్లేకన్‌లో సరోవరాల మధ్య సాయంత్రం గడపడం ఒక అందమైన పెయింటింగ్‌లో మనం భాగమైన అనుభూతిని ఇస్తుంది. అలాగే జుంగ్‌ఫ్రౌ ఉండే ప్రదేశంలో మంచు రేఖలు ఎండాకాలంలో కూడా తెలుపు వర్ణంతో జిగేలుమనిపిస్తాయి.

లూసెర్న్ వీధిలో కెపెల్‌బ్రూక్ బ్రిడ్జిపై నడిచే సమయంలో ప్రాచీన కథల్లో కథానాయకులమయ్యాం అనిపిస్తుంది. లేక్ జెనీవా తీరంలో సాయంత్రం ఆకాశం నీలం నుంచి గులాబీ రంగులోకి మారడం ఒక లైఫ్‌టైమ్ మెమరీగా నిలుస్తుంది.

ఎలా వెళ్లాలి?

హైదరాబాద్ నుంచి జూరిచ్ వరకు విమాన ప్రయాణం చేసి యూరోప్ హృదయం లాంటి స్విట్జర్లాండ్‌లోని ఈ అందమైన ప్రదేశానికి చేరుకోవచ్చు. జూరిచ్ నుంచి రైలులో ప్రయాణిస్తూ పర్వతాల అందాలను వీక్షించవచ్చు. ఈ యాత్రలో కనిపించే సీనరీలు యూరోప్ అంటే ఏంటో చూపిస్తాయి.

ఎక్కడ ఉండాలి?

స్విస్ గ్రామాల్లో వుడెన్ చాలెట్స్‌లో బస చేయడం ఒక ప్రత్యేక అనుభవం. బాల్కనీ నుంచి కనిపించే పర్వత శ్రేణులను చూస్తూ ప్రతీ ఉదయాన్ని ఆస్వాదించవచ్చు. చిన్న గెస్ట్ హౌజుల్లో కూడా ఆత్మీయ అనుభవాన్ని పొందవచ్చు.

ఏం చూడాలి?

పర్వతాల వద్ద వాక్ చేయడం, సరస్సుల తీరంలో నిశ్శబ్దంగా కూర్చొని పుస్తకాలు చదవడం, కేబుల్ కార్లలో శిఖరాగ్రానికి చేరడం ఇలా అనేక మరుపురాని ప్రదేశాలను చూస్తూ జీవితాంతం గుర్తుండే మెమోరీస్ సష్టించుకోవచ్చు.

ఏం తినాలి?

స్విస్‌లో బ్రెడ్, చీజ్ పరిమళం, చాక్లెట్ మధురిమలు చల్లని గాలిలో మరింత రుచిగా అనిపించేలా చేస్తాయి. చిన్న కేఫేలో కాఫీ సిప్ చేస్తూ బయట మంచు శిఖరాలను చూడడం ఇవన్నీ ఎంజాయ్ చేయడానికి ఫుడ్ లవర్ అవ్వాల్సిన అవసరం లేదు. జస్ట్ నేచర్‌ను ఆస్వాదించే మనసు ఉంటే చాలు.

చేయాల్సిన పనులు

సూర్యోదయం సమయంలో మార్నింగ్ వాక్ చేయడం, సరస్సుల తీరంలో నడుస్తూ సాయంత్రాన్ని ఎంజాయ్ చేయడం, కేబుల్ కార్‌లో ప్రయాణించడం, స్థానిక గ్రామాల్లో నిశ్శబ్దంగా సంచరించడం, అక్కడి వెరైటీ ఫుడ్‌ను ఆస్వాదించడం ఇలా మీరు ఎన్నో యాక్టివిటీస్ ప్లాన్ చేసుకోవచ్చు.

మంచును ఇష్టపడే మనసుకు.. ప్రశాంతతనిచ్చే మంచి ప్రదేశం. ఎండాకాలం అంటే వేడి అని మాత్రమే అనుకుంటాం. కానీ స్విస్ ఆల్ప్స్‌లో సమ్మర్ అంటే ఒక ఎవర్‌గ్రీన్ కూల్ మెమోరీని సొంతం చేసుకునే సమయం. ఇక్కడ సూర్యుడూ నేచర్‌ను ఎంజాయ్ చేస్తూ కూల్‌గా కనిపిస్తాడు. అందుకే యూరోప్ ఒక ఎవర్‌గ్రీన్ ట్రావెల్ డెస్టినేషన్‌గా నిలిచింది.



- ఎం.జి. కిశోర్,
ప్రయాణికుడు

నార్త్ ఈస్ట్‌లో బెస్ట్ కూల్ సమ్మర్ డెస్టినేషన్

పెల్లింగ్ - సిక్కిమ్

ఎండాకాలంలో నార్త్ ఈస్ట్ అందం ఏ మాత్రం తగ్గదు. మరీ ముఖ్యంగా సెవెన్ సిస్టర్స్‌కు బ్రదర్ లాంటి స్టేట్ అయిన సిక్కింలోని పెల్లింగ్ సమ్మర్‌లో ఇంకా బాగుంటుంది. దేశం మొత్తంలో ఎండలో ఇబ్బంది పడుతున్న సమయంలో పెల్లింగ్ మాత్రం కూల్‌గా, ప్లెజెంట్‌గా ఉంటుంది. పచ్చని పర్వతాలు, తెల్లని మంచుతో కలిసిన మబ్బుల కదలికలు ''సమ్మర్ అంటే ఇలా ఉండాలి'' అనే ఫీలింగ్ కలిగిస్తాయి.సూర్యోదయం సమయంలో పర్వతాల వెనక నుంచి సరికొత్తగా ఉదయించే సూర్యుడు గుడ్ మార్నింగ్ చెబుతున్నట్టుగా అనిపిస్తుంది. మబ్బుల చాటున కనిపించీ కనిపించనట్టు ఉండే చెట్ల అందాలను ఎంత చూసినా తక్కువే అనిపిస్తుంది. ఎండాకాలంలో ఇక్కడ ఉదయాలు చల్లని గాలితో ప్రారంభం అవుతాయి. అందుకే చాలా మంది మార్నింగ్ సమయంలో వాకింగ్ చేస్తూ నేచర్‌ను ఎంజాయ్ చేస్తారు.

నేచర్ వాక్

పెల్లింగ్‌లో సమ్మర్ సీజన్‌లో పచ్చదనం పీక్‌లో ఉంటుంది. పైన్ వక్షాల వనాల్లో నడుస్తూ వెళ్తున్నప్పుడు తాజా గాలి మనసును రిలాక్స్ చేస్తుంది. రంగురంగుల అడవి పుష్పాలు దారిపొడవునా పర్యాటకులను పలకరిస్తూ హాయిని కలిగిస్తాయి. సూర్య కిరణాలు చెట్ల కొమ్మల మధ్య నుంచి పడుతుంటే భూమిపై నీడలతో కొత్త ప్యాటర్న్‌లు, కొత్త డిజైన్లు కనిపిస్తాయి. ఎండాకాలంలో ట్రెక్కింగ్ ట్రైల్స్ కూడా సులభంగా అనిపిస్తాయి. అందుకే చాలా మంది ఈ సమయంలో ట్రెక్కింగ్ ప్లాన్ చేస్తారు.

కాంచన్‌జంగా వ్యూపాయింట్

ఎండాకాలంలో ఆకాశం చాలా క్లియర్‌గా ఉండటంతో ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద పర్వతం అయిన కాంచెన్‌జంగా అత్యంత అందంగా, అద్భుతంగా కనిపిస్తుంది. మబ్బులు తక్కువగా ఉండటం వల్ల ఈ మౌంటెన్‌ను క్లియర్‌గా ఎంజాయ్ చేయవచ్చు.

పెల్లింగ్ ఎలా చేరుకోవాలి?

పెల్లింగ్‌కు దగ్గరలో పాక్యాంగ్, బాగ్డోర్గా విమానాశ్రయాలు ఉన్నాయి. రైల్లో ప్రయాణించే వారు దగ్గరలోని న్యూ జైపైగురి రైల్వే స్టేషన్ వద్ద దిగి అక్కడి నుంచి క్యాబ్ లేదా షేర్డ్ జీప్ ద్వారా పెల్లింగ్ చేరుకోవచ్చు.

ఎండాకాలంలో ఇక్కడి వాతావరణం చల్లగా, కామ్‌గా రిఫ్రెష్ అయ్యే హిమాలయ బ్రేక్‌లా అనిపిస్తుంది. అందుకే ఈ సమ్మర్ ఎక్కడికైనా వెళ్లాలని ఫీలింగ్ వస్తే పెల్లింగ్ స్పెల్లింగ్ గుర్తుంచుకోండి!

పచ్చదనమే పచ్చదనమే!

మున్నార్ - కేరళ

కేరళలోని మున్నార్, సమ్మర్‌లో ఒక ప్రత్యేక ప్రదేశంగా మారిపోతుంది. పర్వత శ్రేణుల మధ్య పచ్చని టీ తోటలు తరంగాలా విస్తరించి ఉంటాయి. ప్రతి ఉదయం మెల్లగా తిరిగే ఫాగ్ కొత్త ఆకారంలో మన ముందుకు వస్తుంది. సూర్య కాంతి టీ ఆకులపై సౌమ్యంగా పడుతూ, పచ్చని రంగులను ప్రాణం పోస్తుంది.

టీ తోటలు

టీ తోటల మధ్య నడిచే మార్గంలో, భూమిపై ఏర్పడిన చిన్న రహదారులు ఒక రిథమ్‌లో ఉన్న మ్యూజికల్ నోట్స్‌లా అనిపిస్తాయి. ఆకుల మధ్య గాలి చిమ్మే సున్నితమైన శబ్దం, ఒక కొత్త అనుభూతిని కలిగిస్తుంది. మధ్యాహ్నం వెలుగు బంగారు వర్ణంతో పరిసరాలను చిత్రకళలా మార్చేస్తుంది. ప్రతి అడుగు ఒక కొత్త దృశ్యాన్ని తెస్తుంది, ప్రతి మూలలో కొత్త సుగంధం కనిపిస్తుంది.

చిన్న గ్రామాల్లో...

మున్నార్ ఇరుకులోని చిన్న గ్రామాల్లో వెళ్తే, అక్కడి సుగంధం మన మనసుకు నిలువరించకుండా చేరుతుంది. చెట్ల మధ్య కనిపించే నివాస గృహాలు, పర్వతాల దృశ్యాలు చూస్తే, ఇక్కడి జీవితం ఎంత ప్రశాంతంగా, సహజంగా ఉందో స్పష్టంగా తెలుస్తుంది. సాయంత్రం విస్తరించే ఫాగ్, ఎండాకాలాన్ని మరచిపోయేలా చేస్తుంది. జీవితాన్ని మరో కోణంలో చూసే, అంతులేని ప్రకృతిలో లీనమయ్యే అవకాశం ఇక్కడ లభిస్తుంది.

లోయలు పర్వతాల మధ్య సమ్మర్ ఎస్కేప్

అరకు వాలీ - ఆంధ్రప్రదేశ్

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అరకు లోయ ఎండాకాలంలో పర్యాటకులకు రిలీఫ్ ఇచ్చే ఒక అందమైన డెస్టినేషన్. బయట ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నా కూడా, అరకులో వాతావరణం తక్కువ ఉష్ణోగ్రతతో చల్లగా, బ్రైట్‌గా ఉంటుంది. మార్నింగ్ సమయంలో మంచు ముసురు లోయ మొత్తం విస్తరించి, పర్వతాల మధ్య నుంచి విరిసే సూర్యకిరణాలను మృదువైన బంగారు వర్ణంలో మార్చేస్తుంది. వేకువజామున పక్షుల కిలకిలారావాలు, చల్లని గాలి కలిసి ఆ ప్రశాంతతకు ఒక ప్రత్యేకమైన మాధుర్యాన్ని అందిస్తాయి.

రైలు యాత్ర అనుభవం

వైజాగ్ నుంచి అరకు వరకు ట్రైన్ యాత్ర ఎంతో ప్రత్యేకమైనది. ఈ మార్గంలో అనేక సొరంగాలు, లోయల దృశ్యాలు కనిపిస్తాయి. ప్రతి టన్నెల్ నుంచి బయటకు వచ్చినప్పుడు ఒక కొత్త దృశ్య ఫ్రేమ్ ఆహ్వానిస్తుంది.

పచ్చని కొండలు, చిన్న జలపాతాలు, మంచు తెరల మధ్య అప్రతిహితంగా ఎదురయ్యే మలుపులు ఇవన్నీ అందమైన జ్ఞాపకాలుగా నిలిచిపోతాయి. విండో సీటులో కూర్చుని ఈ దృశ్యాలను ఆస్వాదిస్తే ప్రయాణమే ఒక అద్భుత అనుభవంగా మారుతుంది. ఎండాకాలంలో ఈ రైలు ప్రయాణం మరింత రిఫ్రెషింగ్‌గా అనిపిస్తుంది.

కాఫీ ఘుమఘుమలు

అరకు కాఫీ తోటలు ఎంతో ప్రసిద్ధిగాంచాయి. తోటల మధ్య నడుస్తూ గాలిలో కలిసిన తాజా కాఫీ సువాసనను ఆస్వాదిస్తే మనసు ప్రశాంతమవుతుంది. స్థానిక గిరిజనుల సంప్రదాయాలు, వారి సరళ జీవనశైలి ఈ లోయ అందాన్ని మరింత ప్రత్యేకంగా నిలబెడతాయి.

సాయంత్రం సూర్యుడు పర్వతాల వెనుకకు వెళ్లే సమయంలో లోయ మొత్తం సువర్ణ వర్ణంలో మెరిసిపోతుంది. అరకులో ఎండాకాలం అంటే కేవలం విహారం కాదు ప్రకృతితో ఏకమై మనసుకు విశ్రాంతి ఇచ్చే ఒక అలౌకిక అనుభవం.

శనివారం వైట్‌హౌస్‌లో గవర్నర్ల విందు భేటీలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, మెలానియా దంపతులు. మెలానియా చాలా రోజుల అనంతరం తన భర్తతో కలిసి ఓ బహిరంగ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం

దలైలామా 86వ పట్టాభిషేక వేడుకల సందర్భంగా ఆదివారం ఉత్తరాఖండ్‌లోని ధర్మశాలలో సరదాగా మొబైల్ వీక్షిస్తున్న బాల లామాలు

నాలుగేళ్ల నరమేధం... తెర పడేదెప్పుడు?

ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి నేటితో నాలుగేళ్లు

- ఇరువైపులా లక్షల మంది సైనికుల దుర్మరణం
- దేశాలన్నింటిపైనా యుద్ధ ప్రతికూల ప్రభావం
- పెద్దగా పురోగతి లేని సయోధ్య యత్నాలు
- చేష్టలుడిగి చోద్యం చూస్తున్న ఐక్యరాజ్యసమితి

కీవ్: ఉక్రెయిన్–రష్యా యుద్ధం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపాలో కొనసాగుతున్న సుదీర్ఘ యుద్ధంగా గత నెలలోనే చెత్త రికార్డును మూటగట్టుకున్న పోరు. ప్రపంచమంతటా ప్రకంపనలు సృష్టిస్తున్న ఈ యుద్ధానికి మంగళవారంతో నాలుగేళ్లు నిండనున్నాయి. ఈ పోరు ఇంకెంతకాలం కొనసాగుతుందోనంటూ ప్రపంచ దేశాలన్నీ నిట్టూర్పు విడుస్తున్నాయి. ఇరువైపులా లక్షలాది మంది సైనికులు సమరంలో సమిధలుగా నేలకూలినా రష్యా అధ్యక్షుడు పుతిన్ దురాక్రమణ దాహం తీరడం లేదంటూ ప్రపంచ దేశాలు ఆగ్రహిస్తున్నాయి. కానీ ఈ పోరును ఆపలేక చేష్టలుడిగి చూస్తున్నాయి. ఈ విషయంలో ఐక్యరాజ్యసమితి విఫలమై చోద్యం చూస్తోంది. ఉక్రెయిన్ రణక్షేత్రంలో రక్తధారాలు ఆగి శాంతి కపోతం ఎగురుతుందా అనే ప్రశ్నకు ప్రస్తుతానికి ఎవరూ బదులు చెప్పలేని పరిస్థితి! ఉక్రెయిన్‌పై తక్షణం యుద్ధం ఆపకపోతే రష్యాపై మరిన్ని అత్యంత కఠినమైన ఆర్థిక ఆంక్షలు విధిస్తానని

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే హెచ్చరించారు. అందుకు జూన్ దాకా గడువు విధించారు. ఆలోపు పుతిన్ వైఖరి మారేనా? యుద్ధానికి తెర దించేందుకు అంగీకరిస్తారా? బదులుగా ఉక్రెయిన్‌లోని కీలక డోన్బాస్ ప్రాంతాన్ని రష్యాకు వదులుకునేందుకు అధ్యక్షుడు జెలెన్‌స్కీ అంగీకరిస్తారా? ఇవి ప్రస్తుతానికి ట్రిలియన్ డాలర్ల ప్రశ్నలుగానే మిగిలాయి.

2022 ఫిబ్రవరి 24న మొదలు...

2014లో ఉక్రెయిన్‌లోని క్రిమియా ద్వీపకల్పాన్ని ఆక్రమించుకున్నాక కూడా రష్యా దురాక్రమణ దాహం తీరలేదు. 2022 ఫిబ్రవరి 24న ఉక్రెయిన్‌పై ఏకపక్షంగా దండెత్తింది. నాటి నుంచీ పోరాడుతున్నా ఉక్రెయిన్ నుంచి 20 శాతం భూభాగాన్ని మాత్రం ఆక్రమించుకోగలిగింది. ఈ క్రమంలో ఇరువైపులా ఏకంగా 20 లక్షల మంది సైనికులు చనిపోయారని వార్తలొచ్చాయి! అయితే 3,25,000 మంది రష్యా సైనికులు చనిపోయారని, మొత్తంగా 12 లక్షల మంది గాయపడ్డారని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ సంస్థ ప్రకటించింది. ఉక్రెయిన్ వైపు 140,000 మంది సైనికులు చనిపోయారని, 6 లక్షల మంది గాయపడ్డారని తెలిపింది. రష్యా ఆక్రమణ వేగం నత్త కన్నా మెల్లగా ఉందని నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రుట్టే ఎద్దేవా చేశారు. ఐరోపా దేశాల ఆయుధ, ఆర్థికబలంతో రష్యాపై ఉక్రెయిన్ భీకరంగా పోరాడుతోంది. అందుకే నాలుగేళ్లలో డోనెట్స్క్ ప్రాంతంలో రష్యా కేవలం 50 కిలోమీటర్లు మాత్రమే ముందుకు రాగలిగిందని అంతర్జాతీయ కథనాలు వెలువడ్డాయి. ఇటీవల తాము ఆక్రమించిన నాలుగు ప్రాంతాలపై ఉక్రెయిన్ హక్కులు వదులుకోవాలని, ముఖ్యంగా కీలక డోన్బాస్ ప్రాంతాన్ని తమకు అప్పగించాలని రష్యా డిమాండ్ చేస్తోంది. అందుకు జెలెన్‌స్కీ ససేమిరా అంటున్నారు.

డ్రోన్లదే కీలక పాత్ర

గతంలో ఏ యుద్ధంలోనూ వాడనంతగా ఈ యుద్ధంలో డ్రోన్లను ఇరుదేశాలూ విచ్చలవిడిగా వాడుతున్నాయి. రష్యా యుద్ధ ట్యాంక్‌లను ఉక్రెయిన్ డ్రోన్లు విజయవంతంగా పేల్చేశాయి. జామర్‌లకు దొరక్కుండా రష్యా ఆప్టికల్ ఫైబర్ డ్రోన్లను రంగంలోకి దింపింది. దీంతో ప్రత్యక్ష దాడి పరిధి ఏకంగా 50 కిలోమీటర్లకు పెరిగింది. దీంతో ఇరువైపులా ప్రాణనష్టం అధికంగా ఉంది. డ్రోన్ల సాయంతో ఉక్రెయిన్ విద్యుత్ వ్యవస్థలను రష్యా ధ్వంసంచేసింది. దీంతో చలికాలంలో గట్టకట్టే చలిలో ఉక్రేనియన్లు హీటింగ్ వ్యవస్థలు విఫలమై తీవ్ర అవస్థలు పడ్డారు. దీనికి ప్రతిగా చమురు నిల్వ కేంద్రాలపై ఉక్రెయిన్ గురిపెట్టి కొంతమేర సఫలమైంది. దీంతో ఆయిల్ రిఫైనరీలు తగలబడి రష్యా ఆదాయానికి భారీగా గండిపడింది. నల్లసముద్రంలో పెద్ద సంఖ్యలో రష్యా యుద్ధనౌకలను ఉక్రెయిన్ సముద్ర డ్రోన్లు పేల్చేసి జలసమాధి చేశాయి. స్పైడర్‌వెబ్ కోడ్‌నేమ్‌తో రష్యా వైమానిక స్థావరాల సమీపానికి డ్రోన్ల దండును పంపి మెరుపుదాడి చేసి యుద్ధ విమానాలను ఉక్రెయిన్ నాశనంచేసింది.

ఒత్తిడి పెంచుతున్న ట్రంప్

ఎన్నో యుద్ధాలను ఒంటి చేత్తో ఆపానని గొప్పలు చెప్పుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఉక్రెయిన్ యుద్ధం కొరకరాని కొయ్యగా తయారైంది. పట్టువదలని విక్రమార్కుడిలా పుతిన్, జెలెన్‌స్కీల వెంటబడుతూ సయోధ్యకు కృషిచేస్తున్నారు. సరిహద్దు వెంట కాల్పుల విరమణకు జెలెన్‌స్కీ పట్టుబడుతుండా సమగ్ర శాంతి ఒప్పందం కుదరాలని పుతిన్ వాదిస్తున్నారు. నాటోలో చేరకుండా తటస్థ దేశంగా ఉక్రెయిన్ ఉండిపోవాలని పుతిన్ డిమాండ్‌చేస్తున్నారు. అలాస్కా సదస్సులో పుతిన్, ట్రంప్ మధ్య శిఖరాగ్ర చర్చలు జరిగినా ఎలాంటి ఫలితాలు ఇవ్వలేదు. మరోవైపు జూన్‌లోపు యుద్ధాన్ని ఆపి ఆ ఘనతను తన ఖాతాలో వేసుకుని అమెరికాలో మధ్యంతర ఎన్నికల్లో విజయం సాధించాలని ట్రంప్ ఆశపడుతున్నాడు. ట్రంప్ ఆశ ఫలిస్తుందో, పుతిన్ దురాక్రమణ స్వప్నం నెరవేరుతుందో, నాటో కూటమి సాయంతో జెలెన్‌స్కీ సేనలు విజయం సాధిస్తాయో తెలియాలంటే ఇంకొన్ని నెలలు వేచి ఉండక తప్పదేమో.

ఎస్ఐఆర్‌లో 1.7 కోట్ల పేర్లు తొలగింపు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) దాదాపు పూర్తయ్యింది. తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రచురించింది. ఈ ప్రక్రియలో భాగంగా 1.7 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించినట్లు స్పష్టమవుతోంది. గుజరాత్, పుదుచ్చేరి, లక్షద్వీప్, రాజస్తాన్, చత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్ దీవులు, గోవా, కేరళ తదితర రాష్ట్రాల్లో చీఫ్ ఎలక్టోరల్ అధికారులు ఓటర్ల జాబితాలను శనివారం విడుదల చేశారు. గత ఏడాది అక్టోబర్ 27వ తేదీ నాటికి ఆయా రాష్ట్రాల్లో మొత్తం 21.45 కోట్ల మంది ఓటర్లు ఉండేవారు. తుది ఓటర్ల జాబితాలో మొత్తం 19.75 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అంటే 1.7 కోట్ల పేర్లు తొలగించినట్లు తేటతెల్లమవుతోంది. మరోవైపు 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ కొనసాగుతోంది.

రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లతో 24న ఈసీ భేటీ

- ఢిల్లీలో 27 ఏళ్ల తర్వాత తొలిసారిగా సమావేశం
- రాష్ట్రాలతో మరింత సమన్వయం, సాంకేతిక అంశాలపై చర్చలు

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల నిర్వహణలో మరింత సమన్వయం పెంచే దిశగా అన్ని రాష్ట్రాల ఎన్నికల కమిషనర్(ఎస్ఈసీ)లతో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనుంది. చివరగా 1999 ఏడాదిలో ఇలాంటి భేటీ జరగ్గా 27 ఏళ్ల విరామం అనంతరం ఈ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 24న ఢిల్లీలోని భారతమండపంలో నిర్వహించనుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎన్నికల కమిషనర్‌లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధూ, డాక్టర్ వివేక్ జోషి పాల్గొననున్నారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల కమిషనర్లు, వారి న్యాయ–సాంకేతిక నిపుణులు, అన్ని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఈ సమావేశం ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం. ఎన్నికల ప్రక్రియలు, సాంకేతిక వనరుల వినియోగంలో చర్చించనున్నారు. సహకార సమాఖ్య స్ఫూర్తిని మరింత బలపరచాలని ఈసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సమావేశంలో ఈవీఎంల భద్రత, ఓటర్ల జాబితా తయారీలో చట్టపరమైన మార్గదర్శకాలు, రాష్ట్రాల వారీగా ఓటరు అర్హతలపై తులనాత్మక సమీక్ష, ఈసీఐనెట్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లపై చర్చించనున్నారు. దేశవ్యాప్తంగా ఎన్నికల వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థంగా తీర్చిదిద్దే దిశగా ఈ సమావేశం కీలకంగా మారనుంది.

విదేశాలకు సేవ చేసేందుకే పనికొస్తున్నారు

- భారతీయులకు సొంతంగా ఆపరేటింగ్ సిస్టమ్ లేదు
- కాంగ్రెస్ నేత శ్యామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు

వాషింగ్టన్: కాంగ్రెస్ పార్టీ విదేశీ విభాగ చీఫ్ శ్యామ్ పిట్రోడా మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలుచేశారు. భారతీయులు కేవలం విదేశాలకు సేవ చేసే ముడి సరుకులుగా మారిపోయారని, స్వదేశం కోసం సొంత ఆపరేటింగ్ సిస్టమ్ కూడా తయారుచేయలేదని పిట్రోడా వ్యాఖ్యానించారు. ఒక యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పిట్రోడా మాట్లాడారు. ''ఇతర దేశాలకు సేవ చేసేందుకే భారత్ యువతను ముడి సరకులుగా తయారుచేస్తోంది. దేశీయంగా నూతన ఆవిష్కరణల కోసం వాళ్లను భారత్ సద్వినియోగం చేసుకోవట్లేదు. మనం పెద్దసంఖ్యలో యువ నైపుణ్యాన్ని వృద్ధిచేస్తున్నాంకానీ అదంతా ముడిపదార్థంగా ఉండిపోతోంది. ఇది అంతిమంగా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలకు ఉపయోగపడుతోంది. మన యువతను వాళ్లు కంప్యూటర్ ప్రోగ్రామింగ్, బ్యాంకింగ్, లీగల్ సర్వీసులు, పరిశ్రమలు, తయారీరంగాలు, రవాణా వ్యవస్థల్లో విరివిగా వాడుకుంటున్నారు. భారత్ దేశీయంగా ఉపయోగించుకునేందుకు వీలుగా అంతర్జాతీయ స్థాయి సాంకేతికతను ఒక్కదానిని కూడా అభివృద్ధిచేసుకోలేకపోయింది'' అని అన్నారు. పిట్రోడా వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. ఈ మేరకు బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టారు. ''లష్కరే తోయిబా మాదిరిగా 'లష్కరే కాంగ్రెస్'కు పిట్రోడా ప్రధాన సలహాదారుగా తయారయ్యారు. మరోసారి భారత్‌కు అబద్ధాల బురద పూయాలని చూస్తున్నారు. మొబైళ్ల కోసం కనీసం ఆపరేటింగ్ సిస్టమ్(ఓస్)ను భారతీయులు సృష్టించలేదని ఆయన అంటున్నాడు. ఆయన కనీసం బాస్ లైనక్స్, మాయా ఓఎస్, ప్రైమ్ ఓఎస్, భార్ ఓఎస్, ఇండస్ ఓఎస్, ఎస్ఎక్స్‌టీక్వాంటమ్ ఓఎస్ పేర్లు వినలేదేమో. ఇవన్నీ భారతీయులు తయారుచేసిన ఓఎస్‌లే'' అని అన్నారు.

మెట్రో పిల్లర్‌పై మార్జాలం

కష్టపడి కాపాడిన రెస్క్యూ బృందం

కొచ్చి: కేరళలోని కొచ్చి నగరంలో మెట్రో రైల్వే పిల్లర్లపై ఒక చిన్న పిల్లి చిక్కుకుపోయింది. కొద్ది రోజుల క్రితం తొలిసారిగా ఒక ఆటో డ్రైవర్ దీనిని చూసి విషయం అధికారులకు చేరవేశాడు. అంతెత్తున్న పిల్లర్ నుంచి కిందకు రాలేక, ఆకలికి అక్కడే ఉండలేక అవస్థలు పడుతున్న పిల్లిని వెంటనే కాపాడాలని కోరారు. విషయం రంగంలోకి దిగిన కొచ్చి అగ్నిమాపిక సిబ్బంది పలు మార్లు విఫలయత్నం చేసి ఎట్టకేలకు శనివారం అర్ధరాత్రి పిల్లిని పట్టుకుని పిల్లర్ నుంచి కిందకు దింపారు. దీంతో రెస్క్యూ ఆపరేషన్ చూసేందుకు గుమిగూడిన జనం ఆనందంతో కేరింతలు కొట్టారు. సంబంధిత ఫొటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

పిల్లిని పట్టుకున్నారిలా..

కొచ్చిలోని కలూర్ ప్రాంతంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం మెట్రో స్టేషన్ పిల్లర్ల మీద పిల్లి ఎటుపోవాలో తెలీక అటూ ఇటూ తిరుగుతోందని ఒక రిక్షా డ్రైవర్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో గురువారం అధికారులు తొలిసారిగా రెస్క్యూ ఆపరేషన్‌కు ప్రయత్నించి విఫలమయ్యారు. అయితే ఎలాగైనా సరే పిల్లిని కాపాడాలని జంతువులపై క్రూరత్వ నిరోధక సంఘం(ఎస్‌పీసీఏ) శనివారం మరోమారు అధికారులకు మొరపెట్టుకుంది. దీంతో మళ్లీ అగ్నిమాపక సిబ్బంది మరోమారు ప్రయత్నించగా భయంతో పిల్లి గిర్డార్ మధ్యలోని సందులోకి వెళ్లి దాక్కుంది. దీంతో అక్కడిదాకా హైడ్రాలిక్ క్రేన్ వెళ్లలేకపోవడంతో రెస్క్యూ ఆపరేషన్ మరోసారి విఫలమైంది. అడ్డుగా మెట్రో హైటెన్షన్ విద్యుత్ తీగలు ఉన్నాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిపివేయాలని కొచ్చి మెట్రో రైల్ లిమిటెడ్(కేఎంఆర్ఎల్)ను విజ్ఞప్తిచేశారు. వీళ్ల మొర కేఎంఆర్ఎల్ ఆలకించి ఒక 15 నిమిషాలపాటు మెట్రో సేవలను ఆపేసి విద్యుత్ సరఫరాను స్తంభింపజేసింది. అయితే ఆ సమయంలో పిల్లి ఎటుపోయిందో ఎవరికీ కనిపించలేదు. దీంతో ఈసారి వాళ్లు విఫలమయ్యారు. కొద్దిరోజులుగా తినడానికి తిండిలేక అది నీరసంగా కన్పించింది. దీంతో దానికి ఆహారంగా కొన్ని ఫుడ్ ప్యాకెట్లను అధికారులు పిల్లర్ల మీదకు చేర్చారు. ఇటీవల కేరళలో ఘన విజయం సాధించిన మంజుమ్మల్ బాయ్స్ సినిమాలో తమిళనాడులోని గుణ గుహల్లో చిక్కుకుపోయిన సుభాష్ అనే పాత్రధారి పేరును ఆటో డ్రైవర్లు ఈ పిల్లికి పెట్టారు. దీంతో సుభాష్‌ను ఎలాగైనా కాపాడాలనే డిమాండ్లు ఊపందుకున్నాయి. దీంతో ఎలాగైనాసరే ఈసారి పిల్లిని పట్టుకోవాలని అగ్నిమాపక సిబ్బంది కంకణం కట్టుకుని మరీ పిల్లర్ల మీదకు చేరారు. శనివారం అర్ధరాత్రి దాటాక ఒంటి గంట ప్రాంతంలో రెస్క్యూ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టారు. పట్టుకున్నాక పెట్టడానికి ఒక బాక్స్, పట్టుకోవడానికి ఒక వలతో అన్వేషణ మొదలెట్టారు. వాళ్ల శ్రమ ఫలించి పిల్లి కన్పించింది. వెంటనే దానిని జాగ్రత్తగా పట్టుకుని కిందకు తీసుకొచ్చారు. ఇదంతా ఉత్కంఠభరితంగా చూసిన స్థానికులు, జంతు ప్రేమికులు ఆనందంతో అధికారుల అనుకూల నినాదాలు చేశారు. వాళ్ల కృషిని మెచ్చుకున్నారు. నగరంలో ఇలా మెట్రో పిల్లర్‌పై పిల్లిని కాపాడటం ఇది మూడోసారి అని గాంధీనగర్ స్టేషన్‌లో ఫైర్ అండ్ రెస్క్యూ సర్వీస్ అధికారి చెప్పారు. ''మెట్రోస్టేషన్ నుంచి అది పొరపాటున పిల్లర్‌పై పడి ఉంటుంది. మెట్రో రైల్ అధికారుల సహకారంతోనే విజయం సాధించాం''అని అధికారి చెప్పారు.

'వాట్సాప్' కేసులో నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: వాట్సాప్ మాతృసంస్థ మెటా గోప్యతా విధాన పాలసీ కేసును సుప్రీం నేడు విచారించనుంది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మాల్యా బాగ్చీ, విపుల్ ఎం పంచోలిల ధర్మాసనం ఈ విషయాన్ని విచారించే అవకాశం ఉంది. తన గోప్యతా విధానంపై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రూ.213.14 కోట్ల జరిమానా విధించిన నేపథ్యంలో మెటా–వాట్సాప్ పిటిషన్లు దాఖలు చేసింది. దేశంలోని లక్షలాది మంది వినియోగదారుల రహస్య డేటాను పంచుకుంటూ వ్యక్తిగత గోప్యతా హక్కులను ఉల్లంఘిస్తోందని సీసీఐ ఆరోపణలను మెటా సవాలు చేసింది. అయితే మెటా తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ అనారోగ్య దృష్ట్యా కేసు విచారణను నేటికి వాయిదా వేశారు. కాగా, అంతకుముందు మెటా వేదికలు ఇంక్, వాట్సాప్‌లపై ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. డేటా షేరింగ్ పేరుతో పౌరుల గోప్యతా హక్కుతో ఆటలాడుకోవద్దని హెచ్చరించింది. పౌరుల హక్కులను దెబ్బతీయడానికి తాము అనుమతించబోమని స్పష్టం చేసింది.

ప్రైవేట్ స్కూల్లో మైనర్‌పై అత్యాచారం

ఐదుగురు కీచక టీచర్ల అరెస్టు

కేంద్రపారా: ఒరిస్సాలోని కేంద్రపార జిల్లాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయులే రాక్షసులుగా మారారు. ఏడో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక తల్లికి చెప్పడం, తల్లిదండ్రులు బాలల సంరక్షణ కమిటీ(సీడబ్ల్యూసీ)ని ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఘటన రాజ్‌కనిక పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఏడో తరగతి బాలికపై ఉపాధ్యాయులు ఏడాదికాలం పాటు అత్యాచారానికి పాల్పడ్డారు. విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. బాలిక కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. దీంతో ఏడాదికాలంగా తనపై జరుగుతున్న ఘోరాన్ని తల్లికి బాలిక వివరించింది. తల్లిదండ్రులు ఫిబ్రవరి 18న సీడబ్ల్యూసీని ఆశ్రయించారు. బాలికను విచారించిన కమిటీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రత్యేక విచారణ చేపట్టాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించింది. ప్రాథమిక విచారణ ప్రకారం రాజ్‌కనిక్ పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ ఘోరం తెలిసి, అడ్డుకోవాల్సింది పోయి, విషయం బయటికి రాకుండా నిందితులకు సాయం చేశారన్న ఆరోపణతో మరో మహిళా ఉపాధ్యాయురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనపై ప్రతిపక్ష బీజేడీ స్పందించింది. నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేసింది.

అవినీతి కేసులో బీజేపీ ఎమ్మెల్యేకు కస్టడీ

బెంగళూరు: కాంట్రాక్టర్ లంచం తీసుకుంటూ పట్టుబడిన కర్నాటక బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ చంద్రు లమానికి కోర్టు మార్చి 3 వరకు రిమాండ్ విధించింది. ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో ఆయన్ను జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. గదగ్ జిల్లాలోని చించాలిలో రోడ్డు వెంబడి రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, నీటి పారుదల శాఖకు సంబంధించిన పనుల అనుమతి కోసం క్లాస్–1 కాంట్రాక్టర్ విజయ్ పూజార్ నుంచి ఎమ్మెల్యే రూ.11 లక్షలు లంచం డిమాండ్ చేశారు. అనుమతులు రావాలంటే డబ్బు చెల్లించాల్సిందేనన్నారు. దాంతో కాంట్రాక్టర్ అవినీతి నిరోధక విభాగమైన లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు వల పన్నిన లోకాయుక్త అధికారులు రూ.5 లక్షలు లంచం తీసుకుంటుండగా ఎమ్మెల్యేను పట్టుకున్నారు. అతని వ్యక్తిగత సహాయకులు మంజునాథ్ వాల్మీకి, గురు నాయక్‌లనూ అరెస్టు చేశారు.

కీవ్ శివార్లపై విరుచుకుపడిన రష్యా

క్షిపణులు, డ్రోన్లతో దాడిలో ఒకరి మృతి

కీవ్: ఉక్రెయిన్ శివారు ప్రాంతాలపై రష్యా ఆదివారం విరుచుకుపడింది. క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసింది. ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. శివారు ప్రాంతాల్లోని ఐదు జిల్లాలకు భారీ నష్టం జరిగింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ధ్వంసమైన భవనాల శిథిలాల కింద చిక్కుకుపోయిన ప్రజలను రక్షించారు. దేశ ఇంధన గ్రిడ్‌ను లక్ష్యంగా చేసుకుని రష్యా దాడులను వేగవంతం చేసింది. శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున 50 క్షిపణులు, 297 డ్రోనుతో దాడి చేసింది. వాటిలో 274 డ్రోన్లు, 33 క్షిపణులను కూల్చి వేసినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం ఆదివారం తెలిపింది. 14 క్షిపణులు, 23 డ్రోన్లు 14 ప్రదేశాలను తాకాయి. లివివ్‌లో జరిగిన పేలుడులో ఒకరు మృతి చెందగా, 25 మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఒకరిని అరెస్టు చేశారని, రష్యా వైమానిక దాడికి దీనికి సంబంధం లేదని ఆయన టెలిగ్రామ్ పోస్ట్‌లో పేర్కొన్నారు. 86 ఉక్రెయిన్ డ్రోన్లను రష్యా వైమానిక దళం ధ్వంసం చేసింది. రష్యా ఆక్రమిత ఉక్రెయిన్ నగరం లుహాన్స్క్‌లోని చమురు డిపోను రెండు ఉక్రేనియన్ డ్రోన్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒక భద్రతా గార్డు గాయపడ్డారు.

మాస్కోలో విమానాశ్రయాల మూత: రష్యా రాజధాని మాస్కోపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడికి దిగింది. దాంతో భద్రతా కారణాల రీత్యా ఆదివారం నగరంలోని నాలుగు అంతర్జాతీయ విమానాశ్రయాలనూ మూసేశారు. గంటలోపే 11 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చేసినట్టు అధికారులు తెలిపారు.

ఇరాన్ బోట్‌ను పట్టుకున్న కోస్ట్ గార్డ్

రూ.5 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లు స్వాధీనం

అహ్మదాబాద్: భారత కోస్టు గార్డ్(ఐసీజీ) రూ.5 కోట్ల విలువైన సిగరెట్లను తరలిస్తున్న ఇరాన్ బోటును అడ్డుకుంది. ఆ బోటులో ఉన్న నలుగురు ఇరాన్ పౌరులను అదుపులోకి తీసుకుంది. ఫిబ్రవరి 21న గుజరాత్ తీరంలోని అరేబియా సముద్రంలో ఈ సంఘటన జరిగినట్లు కోస్ట్ గార్డ్ తెలిపింది. 'ద్వారకాకు పశ్చిమాన సుమారు 115 నాటికల్ మైళ్ల దూరంలో అనుమానాస్పద విదేశీ పడవ అల్ ముఖ్తార్‌ను గుర్తించాం. పడవతోపాటు నలుగురు ఇరానియన్ సిబ్బందిని అదుపులోకి తీసుకున్నాం. పోరుబందర్‌కు తరలించి ఆ పడవలో సుమారు రూ.5 కోట్ల విలువైన విదేశీ బ్రాండ్ సిగరెట్లు 200 కార్టన్లను గుర్తించాం. లక్ష ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నాం' అని ఈసీజీ ఒక ప్రకటనలో తెలిపింది. ఐసీజీ, గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ సంయుక్తంగా ఫిబ్రవరి 16న గుజరాత్ తీరంలో జరిపిన మరో ఆపరేషన్‌లో 200 కిలోలకు పైగా అనుమానాస్పద మాదక్రద్రవ్యాలతో పాటు ఇద్దరు ఇరానియన్లను పట్టుకున్నారు.

బీజేపీ పాలనలో అవినీతిమయంగా యూపీ

దుయ్యబట్టిన సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్

లక్నో: బీజేపీ పాలనలో ఉత్తరప్రదేశ్ అవినీతిమయంగా మారిందని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ దుయ్యబట్టారు. ఎస్పీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ అభివృద్ధి వాదనలను కొట్టిపారేశారు. ''రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో భారీ అక్రమాలు జరిగాయి. నాణ్యత లేక పైపులైన్లు, నీటి ట్యాంకులు పగిలిపోతున్నాయి'' అని అన్నారు. ''ఈ నెల చివర్లో జపాన్‌లో పర్యటించనున్న సీఎం యోగి ఆదిత్యనాథ్ క్యోటోకు వెళ్లడం లేదని తెలిసింది. అక్కడికి వెళ్తే ఈ పదేళ్లలో యూపీలో ఆయన ఏమేం చేయలేకపోయారో అర్థమయ్యేది'' అంటూ ఎద్దేవా చేశారు. వారణాసిని క్యోటో తరహా నగరంగా మారుస్తామని 2014లో యూపీలో అధికారంలోకి రాగానే బీజేపీ ప్రకటించిన విషయాన్ని అఖిలేశ్ గుర్తు చేశారు. సోషల్ మీడియాలో నకిలీ వీడియోల ప్రచారం చేయడం ద్వారా బీజేపీ విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని, మత ఉద్రిక్తతలను రెచ్చగొడుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి స్టార్టప్ నినాదాలు కట్టిపెట్టి ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎస్పీ పాలనలో నోయిడాలో ప్రారంభించిన పారిశ్రామిక విధానాలనే యోగి ప్రభుత్వం రీ బ్రాండింగ్ చేస్తోందని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో తాజా పెట్టుబడులేవీ కనిపించడం లేదని విమర్శించారు.

జయలలితకు మోదీ నివాళులు

న్యూఢిల్లీ: తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలితకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాళులర్పించారు. మరో రెండు రోజుల్లో జయలలిత జయంతి నేపథ్యంలో ఆదివారం 'మన్ కీ బాత్'లో ప్రధాని ఆమెను స్మరించుకున్నారు. తమిళనాడు మహిళల సంక్షేమం, రాష్ట్రంలో శాంతిభద్రతలకోసం జయలలిత ఎంతగానో కృషి చేశారంటూ ప్రశంసించారు. దేశ సంక్షేమం కోసం పని చేసిన నేతలు ఎప్పుడూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ''జయలలిత అలాంటి ప్రజాదరణ పొందిన నాయకురాలు. నేను తమిళనాడును సందర్శించినప్పుడల్లా అక్కడి ప్రజలకు ఆమె పట్ల ఉన్న ప్రేమ ప్రత్యక్షంగా అనుభవంలోకి వస్తుంది'' అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 2002, 2012ల్లో తన ప్రమాణస్వీకారానికి జయలలిత హాజరయ్యారని ప్రధాని గుర్తు చేసుకున్నారు. ''పొంగల్ సందర్భంగా ఒకసారి ఆమె నన్ను భోజనానికి చెన్నై ఆహ్వానించారు. ఆమె ఆప్యాయత మరపురానిది'' అంటూ కొనియాడారు.

మళ్లీ ఆస్పత్రిలో శరద్ పవార్

పుణె: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ పవార్ మళ్లీ స్వల్ప అనారోగ్యానికి గురయ్యారు. డీహైడ్రేషన్‌తో ఆయన ఆదివారం పుణేలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. 85 ఏళ్ల పవార్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. 'ఆయన స్వల్ప డీహైడ్రేషన్ కారణంగా ఆయన ఆస్పత్రిలో చేరారు. అవసరమైన ఇంట్రావీనస్ ఫ్లూయిడ్స్ ఇస్తున్నాం. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉంది. మరో రెండు రోజులు ఆయన ఆసుపత్రిలోనే ఉంటారు' అని రూబీ హాల్ క్లినిక్ చీఫ్ కార్డియాలజిస్ట్, ఆసుపత్రి చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పర్వేజ్ గ్రాంట్ ప్రకటనలో తెలిపారు. అంతకుముందు ఫిబ్రవరి 9న ఛాతీ ఇన్ఫెక్షన్ కారణంగా ఆయన అదే ఆస్పత్రిలో చేరారు. ఫిబ్రవరి 14న డిశ్చార్జ్ అయ్యారు.

రాష్ట్రకూట వంశానికి చెందిన వారే కాకతీయులు!

కాకతీయులు రాష్ట్రకూట వంశానికి చెందినవారు. కర్ణాటక నుంచి తెలంగాణకు వచ్చి, ఆ తర్వాత ఆంధ్ర ప్రాంతమంతటా విస్తరించారు. మొదట రాష్ట్రకూట, కల్యాణీ (పశ్చిమ) చాళుక్య రాజులకు సైన్యాధ్యక్షులు, మాండలికులు, సామంతులుగా ఉండి తర్వాత స్వాతంత్య్రం ప్రకటించుకున్నారు. ప్రత్యర్థులుగా ఉన్న ముదిగొండ చాళుక్యులను, వేములవాడ చాళుక్యులను, కందూరు చోడులను, పొలవాస రాజులను, నగునూరు రాజులను ఓడించి తెలంగాణ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నారు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

తొలి కాకతీయులు

తొలి కాకతీయులు (కాకతీయ వంశంలోని ఆదిపురుషులు) రాష్ట్రకూటుల సేనానులుగా తెలంగాణకు వచ్చారని పీవీ పరబ్రహ్మశాస్త్రి నిరూపించారు. వీరు తమ పేరు చివరన రాష్ట్రకూట నామాన్ని (గుండియ రాష్ట్రకూట, ఎర్రయ రాష్ట్రకూట) ధరించేవారు. రాష్ట్రకూటుల రాజ చిహ్నమైన 'గరుడ'(గరుడబేతయ)ను తమ పతాకాలపై ఉంచుకునేవారు. రాష్ట్రకూటుల ఆస్థాన మతమైన జైనాన్ని అవలంభించడం, వారి వృష్ణి వంశాన్నే తమ వంశంగా చెప్పుకోవడం లాంటి కారణాల వల్ల కాకతీయులు రాష్ట్రకూట వంశస్థులేనని స్పష్టమవుతోంది. స్థానిక (తెలంగాణ) బోయ, పుళింద జాతులవారు జైనమతం ద్వారా సాంఘికోన్నతి సాధించి రాష్ట్రకూటుల వద్ద సైనికోద్యోగులుగా చేరి క్రమంగా సామంతులయ్యారనే అభిప్రాయమూ ఉంది. ఈ వంశానికి ఆద్యుడైన వెన్నరాజు (క్రీ.శ. 750–768) రాష్ట్రకూట సేనాని, సామంతుడు. ఆదిలాబాద్ పశ్చిమప్రాంతం, బాసర, ముథోల్, కుబేరు(కుబీర్), భైంసా(మహిషా) ప్రాంతాలు ఇతని రాజ్యంలో ఉండేవి. ఇతడి తర్వాత మొదటి గుండరాజు (క్రీ.శ.768–824), రెండో గుండరాజు (క్రీ.శ.824–870), మూడో గుండరాజు (క్రీ.శ.870 – 895) రాష్ట్రకూటుల సేనానులుగా, సామంతులుగా పనిచేశారు. వీరి కాలం తదితర విషయాల్లో చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి.

ఎర్రయరాజు (895-940)

ఈ వంశంలో మొదటి నలుగురి తర్వాత ఎర్రయరాజు (క్రీ.శ.895–940) కూడా రాష్ట్రకూటుల సేనానిగా కురవాడి సీమను పాలించాడు. వేంగి చాళుక్యులకు లోబడి ముదిగొండ చాళుక్యులు పాలించిన నేటి ఖమ్మం, వరంగల్ జిల్లాలోని కొరవి ప్రాంతమే కురవాడి సీమ. ముదిగొండ చాళుక్యులను తరిమేసి రాష్ట్రకూటులు ఎర్రయరాజును ఈ ప్రాంతానికి సామంతుడిగా నియమించారు. అయితే క్రీ.శ.934లో ముదిగొండ చాళుక్యులు ఆ ప్రాంతాన్ని తిరిగి ఆక్రమించారు. ఎర్రయ కొడుకు బేతియకు పెద్ద ప్రాధాన్యం లేదు. తర్వాత బేతియ కొడుకు నాలుగో గుండరాజు(క్రీ.శ.955–990) రాష్ట్రకూటుల సేనానిగా నియమితుడై కొరవిసీమను తిరిగి ఆక్రమించాడు. తూర్పు చాళుక్యులైన రెండో అమ్మరాజు, దానార్ణవుడి మధ్య కుటుంబ కలహాలు తలెత్తాయి. నాలుగో గుండరాజు దానార్ణవుడి పక్షం వహించి కొరవిసీమను పొందాడు.

క్రీ.శ.973లో కల్యాణీ చాళుక్య రెండో తైలపుడు రాష్ట్రకూట రాజ్యాన్ని ఆక్రమించాడు. దీంతో తైలపుణ్ని ఆశ్రయించిన ముదిగొండ చాళుక్య బొట్టు బేతరాజు.. విరియాల ఎర్రసేనాని ద్వారా తిరిగి కొరవిసీమను పొందగలిగాడు. దీంతో కాకతీయులు గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొన్నారు. కానీ తన భార్య విరియాల కామసాని వినతి మేరకు ఎర్రసేనాని కల్యాణీ చాళుక్య చక్రవర్తిని ఒప్పించి మొదటి బేతరాజు(క్రీ.శ.992–1052)ను అనుమకొండ విషయపాలకుడిగా నియమించాడు. కామసాని మొదటి బేతరాజు (గరుడ బేతరాజు) మేనత్త, గుండరాజు సోదరి.

మొదటి ప్రోలరాజు

బేతరాజు కల్యాణీ చాళుక్య సామంతుడిగా స్థిరపడ్డాడు. ఇతడి రాజ్యం కొరివిసీమ సరిహద్దు నుంచి కరీంనగర్ మండలంలో ఉన్న శనిగరం వరకు వ్యాపించింది. బేతరాజు తర్వాత అతడి కొడుకు మొదటి ప్రోలరాజు (క్రీ.శ.1052–1076) రాజ్యానికొచ్చాడు. ఇతడు వేములవాడ చాళుక్యరాజు భద్రగుణ్ణి (మూడో బద్దెగుడు) ఓడించి సబ్బిసాయర మండలం(కరీంనగర్ ప్రాంతం)లోని కొన్ని ప్రాంతాలను జయించాడు. అనుమకొండ విషయాన్ని మొదటి బేతరాజు తొలుత పొందినప్పటికీ శాశ్వత మాన్యంగా పొందింది మాత్రం ప్రోలరాజే. ప్రోలుడు చిత్రకూటలో అరాచకత్వాన్ని అణచివేయడం, బద్దెగుణ్ని జయించడం,కొంకణంపై విజయం సాధించడం వల్ల అతడి శౌర్యప్రతాపాలకు గుర్తింపుగా చక్రవర్తి అనుమకొండను శాశ్వతమాన్యంగా ఇచ్చాడు.

రెండో బేతరాజు

ఒకటో సోమేశ్వరుడు క్రీ.శ.1068లో మరణించాడు. తర్వాత చక్రవర్తిగా వచ్చిన రెండో సోమేశ్వరుణ్ని తొలగించి అధికారంలోకి రావాలని ఆరో విక్రమాదిత్యుడు వీలైనంత మంది మాండలికులను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేశాడు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రోలుడు, అతడి కుమారుడు రెండో బేతరాజు.. ఆరో విక్రమాదిత్యుడికి అండగా నిలిచారు. అది ప్రోలుడి తర్వాత రాజైన రెండో బేతరాజు (క్రీ.శ.1076–1108)కు ఉపయోగపడింది. పారమార జగద్దేవుడు స్వాతంత్ర్యం ప్రకటించుకోవడమూ దీనికి దోహదం చేసింది. జగద్దేవుడి నుంచి సబ్బి సహస్రం మొత్తాన్ని విక్రమాదిత్యుడు బేతరాజుకు ఇచ్చినట్లు పద్మాక్షి ఆలయ శాసనం ద్వారా తెలుస్తోంది. శనిగరం ప్రాంతంతోపాటు సబ్బి సహస్రం కాకతీయ రాజ్యంలో చేరాయి. ముదిగొండ చాళుక్యుల రాజ్యంలోని కొన్ని భాగాలు కూడా ఇతడి రాజ్యంలో చేరాయి. ఇతడు అనుమకొండలో బేతేశ్వరాలయాన్ని, తన తండ్రి పేరుతో ప్రోలేశ్వరాలయాన్ని నిర్మించాడు.

రెండో ప్రోలరాజు

బేతరాజు తర్వాత ఇతడి పెద్ద కొడుకు దుర్గరాజు (క్రీ.శ.1108–క్రీ.శ.1116) రాజయ్యాడు. పదవీచ్యుతుడైన కొలనుపాక రాజు జగద్దేవుని ప్రోత్సాహంతో పొలవాస పాలకుడు మేడరాజు స్వాతంత్ర్యం పొందడానికి ప్రయత్నించాడు. ఈ సమయంలో పారమార జగద్దేవుని స్థానంలో కుమార సోమేశ్వరుడు(క్రీ.శ.1108–1125) కొలనుపాక రాజప్రతినిధిగా నియమితుడయ్యాడు. ఈ తిరుగుబాట్లను అణచడానికి కుమార సోమేశ్వరుడికి అండగా నిలిచిన రెండో ప్రోలరాజు(క్రీ.శ.1116–1157) జగద్దేవుడిని పారదోలి సోదరుడు దుర్గరాజును పదవీచ్యుతుణ్ని చేసి సింహాసనం అధిష్ఠించాడు. చాళుక్య చక్రవర్తుల నుంచి స్వాతంత్ర్యం పొందడానికి ప్రయత్నించిన సామంతులందరితో యుద్ధం చేసి ఓడించాడు. ఈ రకంగా తెలంగాణ మొత్తాన్ని జయించి కల్యాణీ చాళుక్య ప్రతాపచక్రవర్తి రెండో జగద్దేకమల్లుడు (క్రీ.శ.1138 –1150)కి విధేయుడిగా ఉన్నాడు.

రెండో ప్రోలరాజు విజయాలు

కొలనుపాక రాజప్రతినిధిగా నియమితుడైన కుమార సోమేశ్వరుడు తన తండ్రి విక్రమాదిత్యుడి అనంతరం క్రీ.శ.1126లో మూడో సోమేశ్వరుడిగా రాజ్యానికొచ్చాడు. అంతకుముందు నుంచే కందూరునాడును పాలిస్తున్న యువరాజు కుమార తైలపుడు (క్రీ.శ.1110–1137) తన సోదరుడు మూడో సోమేశ్వరుడికి వ్యతిరేకంగా దక్షిణ తెలంగాణలో స్వాతంత్ర్యం పొందడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఈ ప్రయత్నంలోనే మూడో సోమేశ్వరుడికి అనుకూలుడైన కందూరి చోడ మొదటి గోకర్ణుడిని చంపించి కందూరునాడును శ్రీదేవి తొండయ, గోవింద దండేశులకు పంచి సామంతులుగా చేసుకున్నాడు. దీంతో మొదటి గోకర్ణుడి కుమారుడు రెండో ఉదయచోడుడు మూడో సోమేశ్వరుణ్ని ఆశ్రయించాడు. సోమేశ్వరుడి ఆదేశంతో రెండో ప్రోలుడు శ్రీదేవి తొండయ, గోవింద దండేశులను ఓడించి ఉదయ చోడుడికి (క్రీ.శ.1131–36) పట్టం కట్టాడు. ఈ రకంగా దక్షిణ తెలంగాణ మీద ప్రోలుడు ఆధిక్యం సాధించాడు.

తన అనుయాయుల ఓటమిని జీర్ణించుకోలేని తైలపుడు కాకతీయుల ఉత్తర సరిహద్దులో ఉన్న పొలవాస రాజైన మేడరాజును, అతడి తమ్ముడు గుండరాజును ప్రేరేపించాడు. అప్పటికే వీరు చాళుక్య చక్రవర్తుల పట్ల అవిధేయులుగా ఉన్నారు. రెండో జగద్దేకమల్లుడి(క్రీ.శ.1138–1150) పక్షాన నిలబడి ప్రోలరాజు గుండనను సంహరించాడు. గుండన కుటుంబానికి చెందిన ఏడో రాజును పారదోలాడు.

ఈ విజయంతో ప్రోలరాజు ఉత్తర తెలంగాణ మీద ఆధిక్యత సాధించాడు. చక్రవర్తి పక్షాన కుమార తైలపుడిని ఓడించాడు. ఈ విజయోత్సాహంతో కృష్ణానది దాటి శ్రీశైలంలో విజయస్తంభం నాటించాడు. తెలంగాణపై ఆధిక్యం సాధించాక తీరాంధ్రను జయించే ప్రయత్నంలో మరణించాడు. ఓరుగల్లు కోట నిర్మాణాన్ని ఇతడే ప్రారంభించాడు. నతవాడి దుర్గరాజు సోదరి ముప్పమాంబ ప్రోలరాజు భార్య. వీరి కుమారులు.. రుద్రదేవుడు, మహాదేవుడు, హరిహరుడు, గణపతి, రేపొల్ల దుర్గరాజు. తండ్రి మరణానంతరం పెద్దకుమారుడైన రుద్రదేవుడు(క్రీ.శ.1158–క్రీ.శ.1195)రాజ్యాని కొచ్చాడు.

మూడు సామంత రాజ్యాలు

కాకతీయ రాజ్య పరిసరాల్లో మూడు సామంత రాజ్యాలు ఉండేవి. తూర్పున ముదిగొండ చాళుక్యులు, వాయవ్యంగా కరీంనగర్ జిల్లాలో పొలవాస నాయకులు, దక్షిణాన కందూరు చోడులు ఉండేవారు. అనుమకొండ విషయానికి పశ్చిమాన ఉన్న ప్రాంతం రాజు ప్రత్యక్ష ఆధీనంలో ఉండేది. అనుమకొండకు నైరుతి దిశగా కొలనుపాక కేంద్రంగా రాజప్రతినిధులు ఈ ప్రాంతాన్ని పాలించేవారు. ప్రోలరాజు వీరిపై ఆధిక్యత సాధించిన సందర్భంలో రుద్రదేవుడు సింహాసనం అధిష్ఠించాడు.

రుద్రదేవుడు

తైలపుడు తన సోదరుడు జగదేక మల్లుని పదవీచ్యుతుణ్ని చేసి అధికారంలోకి వచ్చాడు. కాబట్టి పరబ్రహ్మ శాస్త్రి పేర్కొన్న తైలపుడు ఈ మూడో తైలపుడు కావడానికే ఎక్కువ అవకాశం ఉంది. పదవీభ్రష్టులైన కల్యాణి చాళుక్య రాజులు తమ పూర్వవైభవాన్ని తిరిగి సంతరించుకోలేరని నిర్ణయించుకున్న రుద్రదేవుడు క్రీ.శ.1162/3లో సార్వభౌమత్వాన్ని ప్రకటించుకున్నాడు. తెలంగాణలో తిరుగులేని ప్రభువుగా మారిన తర్వాత తీరాంధ్రపై దృష్టి పెట్టాడు.

వేయి స్తంభాల గుడి

రుద్రదేవుడు(క్రీ.శ.1158–క్రీ.శ.1195) తన తండ్రిని చంపిన వెలనాటి రాజుపై మొదట విజృంభించాడు. పల్నాటి యుద్ధంలో నలగామరాజుకు సహాయపడ్డాడు. ధాన్యకటకాన్ని స్వాధీనం చేసుకున్నాడు. దుర్జయులను ఓడించి త్రిపురాంతకాన్ని జయించాడు. క్రీ.శ.1186 నాటికి తీరాంధ్రను గెలిచాడు. ఈ రకంగా రుద్రదేవుడు కాకతీయ సామ్రాజ్యానికి గట్టి పునాదులు వేశాడు. ఈ విజయాల్లో సహాయం చేసిన రేచర్ల బేతిరెడ్డికి నల్లగొండ జిల్లాలోని ఆమనగల్లును, చెరకు రెడ్లకు జమ్ములూరును ఇచ్చాడు. ఇతడి రాజ్యం ఉత్తరాన గోదావరి, పశ్చిమాన బీదరు, దక్షిణాన శ్రీశైలం, తూర్పున సముద్రం వరకు విస్తరించిందని వేయి స్తంభాల గుడి శాసనం ద్వారా తెలుస్తోంది. రుద్రదేవుడు ఓరుగల్లు కోట నిర్మాణాన్ని కొంతమేర పూర్తిచేశాడు. రుద్రేశ్వర దేవాలయాన్ని కట్టించాడు.ఇదే వేయి స్తంభాల గుడి.

మహాదేవుడు

రుద్రదేవుడికి కుమారులు లేకపోవడం వల్ల తమ్ముడు మహాదేవుడు(క్రీ.శ.1195–1198) రాజ్యానికి వచ్చాడు. ఇతడు జైతుగి (క్రీ.శ.1192–1200) కాలంలో యాదవరాజ్యం మీద చేసిన యుద్ధంలో మరణించాడు. మహాదేవుని భార్య రాణి బయ్యాంబ. గణపతిదేవుడు, మైలాంబ, కుందమాంబ వీరి సంతానం. యాదవరాజులు గణపతిని బంధించారు. ఇదే అదనుగా ముదిగొండ చాళుక్యులు, వెలనాటి చోళులు, చోళరాజులు కాకతీయ సామ్రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించారు. కానీ సామంతసేనానైన రేచర్ల రుద్రారెడ్డి(రుద్రసేనాని) మిగతా సేనానులు, సామంతులైన విరియాల, మాల్యాల సహాయంతో వీరిని ఓడించినట్లు పాలంపేట శాసనం ద్వారా తెలుస్తోంది. రుద్రసేనాని గణపతిదేవుడిని విడిపించి క్రీ.శ.1199లో కాకతీయ రాజ్య పట్టాభిషిక్తుడిని చేశాడు.

మాదిరి ప్రశ్నలు

1. కాకతీయ వంశానికి ఆద్యుడు?
   1) గణపతిదేవుడు 2) మొదటి గుండన
   3) వెన్నరాజు 4) మొదటి బేతరాజు
2. ఓరుగల్లు కోట నిర్మాణానికి పునాదులు వేసినవాడు?
   1) మొదటి ప్రోలరాజు
   2) రెండో ప్రోలరాజు
   3) గణపతిదేవుడు 4) రుద్రదేవుడు
3. నతవాడి దుర్గరాజు సోదరి ముప్పమాంబ ఎవరి భార్య?
   1) మొదటి ప్రోలరాజు
   2) గణపతిదేవుడు 3) మొదటి బేతరాజు
   4) రెండో ప్రోలరాజు
4. తొలి కాకతీయులు ఎవరికి సామంతులుగా ఉన్నారు?
   1) శాతవాహనులు 2) రాష్ట్రకూటులు
   3) బాదామి చాళుక్యులు 4) ఇక్ష్వాకులు
5. మలి కాకతీయులు ఎవరి సామంతులు?
   1) రాష్ట్రకూటులు 2) కల్యాణి చాళుక్యులు
   3) బాదామి చాళుక్యులు
   4) కందూరి చాళుక్యులు
6. రుద్రదేవుడు ఏ కాలంనాటికి తీరాంధ్రను జయించాడు?
   1) క్రీ.శ. 1186 2) క్రీ.శ. 1180
   3) క్రీ.శ. 1176 4) క్రీ.శ. 1190
7. పల్నాటి యుద్ధంలో నలగామ రాజుకు సహాయ పడ్డ కాకతీయ రాజు?
   1) గణపతిదేవుడు 2) ప్రతాపరుద్రుడు
   3) రుద్రదేవుడు 4) రెండోబేతరాజు
8. రుద్రదేవుడు యుద్ధాల్లో తనకు సహాయం చేసిన ఏ రాజును ఆమనగల్లు సామంతునిగా నియమించాడు?
   1) రేచర్ల నామిరెడ్డి 2) రేచర్ల చెవిరెడ్డి
   3) రేచర్ల లోకిరెడ్డి 4) రేచర్ల బేతిరెడ్డి
9. వేయి స్తంభాల గుడి (రుద్రేశ్వరాలయం) ని కట్టించినవారు?
   1) రుద్రదేవుడు 2) గణపతిదేవుడు
   3) రుద్రమదేవి 4) ప్రతాపరుద్రుడు

సమాధానాలు

1) 3 2) 2 3) 4 4) 2 5) 2
6) 1 7) 3 8) 4 9) 1

సారవంత మైదానాలను ఏర్పరిచే సంక్లిష్ట ప్రక్రియ

ఉపరితలంపై ప్రవహించే నదులు, హిమనీ నదాలు,పవనాలు, వేలా తరంగాల లాంటి బాహ్య బలాల ప్రభావం వల్ల భూపటల శిలలు శైథిల్యమవడాన్నే 'క్రమక్షయం'గా వ్యవహరిస్తారు. ప్రస్తుతం భూగోళం కవోష్ణ యుగంలో ఉండటం వల్ల నదులు ప్రధాన క్రమక్షయ కారకాలు. ఎత్తైన పర్వతాలు, పీఠభూములు నదుల క్రమక్షయ ప్రక్రియ వల్ల క్రమంగా శిథిలమై వివిధ రకాల భూస్వరూపాలు రూపాంతరం చెందుతున్నాయి.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భూగోళశాస్త్రం

నదులు - క్రమక్షయం

నదులు శైథిల్య శిలా పదార్థాన్ని రవాణా చేసి లోతట్టు హరివాణాలు లేదా సముద్ర భూతలంపై నిక్షిప్తం చేస్తాయి. అందువల్ల వివిధ రకాల క్రమక్షయ, నిక్షేపణా భూ స్వరూపాలు ఏర్పడతాయి. గంగా–సింధు మైదానం, నైలు నదీ లోయ, మిసిసిప్పీ – మిస్సోరి మైదానం తదితరాలను ప్రపంచంలోని ప్రధాన నదీ హరివాణాలు, నదీ భూ దృశ్యాలకు (Fluvial landscape) ఉదాహరణగా పేర్కొనవచ్చు. నదులు క్రమక్షయ శక్తి వల్ల అవి ప్రవహించే లోయలను కోతకు గురి చేస్తాయి. ఈ కోత క్షితిజ లంబ దిశలో (అథో క్రమక్షయం) లేదా క్షితిజ సమాంతర దిశలో (పార్శ్వ క్రమక్షయం) ఉండవచ్చు. శైథిల్య శిలా పదార్థాన్ని నదులు తమతో పాటు ద్రావణం రూపంలో, చోదక రూపంలో లేదా తేలియాడటం ద్వారా రవాణా చేస్తాయి. నదీ భారం బాగా అధికమైనప్పుడు, నదీ వేగం క్షీణించినప్పుడు శిలా పదార్థం అనువైన ప్రదేశాల్లో నిక్షిప్తమవుతుంది. శిలా పదార్థాన్ని కణాల పరిమాణం ఆధారంగా వేరు చేసిన తర్వాతే నది నిక్షేపిస్తుంది. అందువల్ల నదీ హరివాణం ఎగువ భాగంలో స్థూల రేణువులతో కూడిన ఇసుక, మధ్య భాగంలో సిల్ట్, చివరగా నదీ ముఖద్వారాల వద్ద సూక్ష్మ రేణు నిర్మితమైన బంకమన్ను ఉంటుంది.

క్రమక్షయ దశలు

నదులు.. అవి ఆవిర్భవించిన ఎత్తైన పర్వతాలు, పీఠభూముల ప్రాంతాల్లో వేగంగా ప్రవహిస్తూ అధిక క్రమక్షయ శక్తి కలిగి ఉంటాయి. అందువల్ల ఈ ప్రాంతాల్లో నదులు కేవలం క్రమక్షయాన్ని.. ముఖ్యంగా అథో క్రమక్షయాన్ని మాత్రమే కలిగిస్తాయి. పర్వతాలు, పీఠభూముల ద్వారా మైదానాలను చేరిన తర్వాత నదుల క్రమక్షయ శక్తి బాగా క్షీణిస్తుంది. ఈ సమయంలో అవి పార్శ్వ క్రమక్షయం మాత్రమే చేస్తాయి. క్రమంగా ఇది స్వల్ప పరిమాణంలో నిక్షేపణ చేసే దశకు చేరుకుంటుంది. సముద్రాల్లో కలిసే దశలో నదులు అధిక నదీ భారం వల్ల పెద్ద మొత్తాల్లో నిక్షేపణ చేస్తాయి. క్రమక్షయం పూర్తిగా స్తంభించిపోతుంది.

భూ స్వరూపాలు

నదీ హరివాణంలో ఆవిర్భావ ప్రాంతం నుంచి నదీ ముఖ ద్వారం మధ్య అనేక రకాల భూ స్వరూపాలను గమనించవచ్చు. ఆవిర్భావ ప్రాంతాల్లో క్రమక్షయ భూ స్వరూపాలు, మధ్య భాగంలో క్రమక్షయ,నిక్షేపణా భూ స్వరూపాల మిశ్రమం, ముఖద్వారాల వద్ద నిక్షేపణ భూ స్వరూపాలు స్పష్టంగా కనిపిస్తాయి. నది ఎగువ భాగాల్లో కింద పేర్కొన్న క్రమక్షయ భూ స్వరూపాలు ఏర్పడతాయి

- 'V' ఆకారపు లోయలు, గార్జ్‌లు, కానియన్‌లు
- నదీ గ్రహణం, ప్లంజ్ పూల్స్
- జలపాతాలు, రాపిడ్స్, కాస్కేడ్స్

క్షితిజ లంబదిశలో అథో క్రమక్షయం వల్ల నదుల్లో లోతైన 'V' ఆకారం సంతరించుకుంటుంది. కొన్ని సందర్భాల్లో ఇవి చాలా లోతుగా ఉండి నిటారు వాలులు ఏర్పడినప్పుడు గార్జ్‌లు, కానియన్లుగా పిలుస్తారు. ఉదాహరణకు హిమాలయ నదులు శివాలిక్ కొండలు దాటేటప్పుడు లోతైన గార్జ్‌ల ద్వారా ప్రవహిస్తాయి.బ్రహ్మపుత్రా నది భారతదేశంలోకి అరుణాచల్ ప్రదేశ్‌లోని 'సయాడియా' గార్జ్ నుంచి ప్రవేశిస్తుంది. యూఎస్ఏలోని కొలరాడో నది ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'గ్రాండ్ కానియన్' నుంచి ప్రవహిస్తుంది.

ఎత్తైన పర్వత ప్రాంతాల్లో అనేక నదులు వేగంగా ప్రవహిస్తూ భారీ జలపాతాలను ఏర్పరుస్తాయి. సహ్యాద్రి కొండల్లోని శరావతి నది మన దేశంలోకెల్లా ఎత్తైన 'జోగ్' జలపాతాన్ని ఏర్పరుస్తుంది. నయాగరా, లివింగ్ స్టోన్, ఏంజల్ లాంటి ప్రపంచ ప్రసిద్ధ జలపాతాలు నదుల క్రమక్షయం వల్లే ఏర్పడ్డాయి. కావేరి నది ఎత్తైన కర్ణాటక పీఠభూమిని వదిలి తమిళనాడు పీఠభూమిని చేరేటప్పుడు శివసముద్రం, హోగెంకల్ జలపాతాలు ఏర్పడ్డాయి. ఆవిర్భావ ప్రాంతాల్లో వేగంగా ప్రవహించే నదులు సమాంతరంగా ప్రవహించే చిన్న నదులను క్రమంగా తమలో కలుపుకుంటాయి. ఈ ప్రక్రియనే 'నదీ గ్రహణం'గా పిలుస్తారు. భగీరథీ నది సమీపంలోని అలక్‌నందా నదిని కలుపుకోవడం ద్వారా గంగానది ఆవిర్భవిస్తుంది. సమాంతర నదులను వేరుచేసే ఎత్తైన ప్రాంతాన్ని వేగంగా ప్రవహించే నది శిథిలం చేయడంతో నదీ గ్రహణం సంభవిస్తుంది. ప్రవాహ దిశ మరలించిన చిన్న నది లోయ ఎండిపోతుంది.

గిరిపద మైదానాలు

నదులు పర్వతాలను వీడి మైదానాలను చేరినప్పుడు అకస్మాత్తుగా తమ గతిశక్తిని కోల్పోవడంతో పర్వతపాదాల వద్ద కొంత శిథిల శిలా పదార్థాన్ని నిక్షేపిస్తాయి. ఈ రకంగా ఏర్పడిన మైదానాలనే 'గిరిపద మైదానాలు' (Peidmont plains)గా పిలుస్తారు. శివాలిక్ కొండలు –గంగా మైదానానికి సంధి ప్రాంతంలో హిమాలయ నదీ నిక్షేపణం వల్ల ఏర్పడిన గిరిపద మైదానాన్ని భాబర్, టెరాయి మండలాలుగా విభజిస్తారు. భాబర్ మండలం గులకరాళ్లు, ఇసుకతో కూడి ఉంటుంది. అధిక సచ్ఛిద్రత వల్ల భాబర్ మండలంలో హిమాలయ నదుల నీరు ఇంకిపోయి లోయలు ఎండిపోతాయి. టెరాయి మండలంలో ఇంకిన నీరు పైకి ఉబికి వచ్చి చిత్తడి నేలలు ఏర్పడతాయి. టెరాయి మండలంలో దట్టమైన అరణ్యాలు విస్తరించి ఉన్నాయి.

మైదాన ప్రాంతాల్లో పార్శ్వ క్రమక్షయం వల్ల విశాలమైన 'U' ఆకారపు లోయల నుంచి నదులు ప్రవహిస్తాయి. కఠిన శిలా ప్రాంతాలను క్రమక్షయం చేసే శక్తి లేకపోవడంతో నదులు వంకలు తిరిగి ప్రవహిస్తాయి. ఈ నదీ మార్గాలను 'నది వక్రతలు'గా పిలుస్తారు. 'U' ఆకారపు లోయలతో కూడిన వక్రతల ద్వారా ప్రవహించేటప్పుడు అంతర్ వక్రతల తలాల వెంట శిలా పదార్థం నిక్షేపితమై ఇసుక దిబ్బలుగా ఏర్పడతాయి. ఈ ఇసుక దిబ్బలనే 'స్పర్స్' అంటారు. నదుల్లోకి వరదలు వస్తే లోయను వీడిన నది ఇరువైపులా ఉన్న లోతట్టు ప్రాంతాలను ముంచేస్తుంది. ఈ వరద నీటిలో ఉన్న శిలా పదార్థం నదీ లోయకు ఇరువైపులా నిక్షిప్తమవుతుంది. దీనివల్ల ఏర్పడే మైదానాలను 'వరద మైదానాలు' అంటారు. ఇవి చాలా సారవంతమైనవి. గంగా–సింధు–బ్రహ్మపుత్ర మైదానం అనేక వరద మైదానాలతో కూడి ఉంది. గంగా మైదానంలోని వరద మైదానాన్ని 'ఖాదర్', భంగర్ అనే రెండు భాగాలుగా విభజిస్తారు. వరద మైదానంలో నదీ లోయకు సమీపంలోని లోతట్టు ప్రాంతాన్ని ఖాదర్ మైదానంగా పిలుస్తారు. ఇది తరచుగా వరద ముంపునకు గురవడం వల్ల నవీన ఒండ్రుమట్టితో నిండి ఉంటుంది. వరద మైదానంలో లోయకు దూరంగా ఉన్న ఎత్తైన ప్రాంతాలను 'భంగర్ మైదానం'గా పిలుస్తారు. ఈ మండలం పురాతన ఒండ్రుమట్టితో నిండి ఉంటుంది. ఈ ప్రాంతంలో వరద ముంపు తక్కువ. వరద మైదానంలో అర్ధ చంద్రాకృతిలో ఉండే ఆక్స్‌బో సరస్సులు కూడా ఏర్పడతాయి. నదీ లోయలకు ఇరువైపులా ఒండ్రుమట్టి నిక్షేపణం వల్ల ఏర్పడే ఎత్తైన ఇసుకదిబ్బలను సహజ లెవీలుగా పిలుస్తారు. ఇవి వరద మైదానాన్ని భవిష్యత్‌లో సంభవించే వరదల నుంచి కాపాడతాయి. కొన్ని సందర్భాల్లో ఈ లెవీలు, ఉప నదుల సంగమాన్ని నిరోధిస్తాయి. ఉప నదులు సహజ లెవీలకు సమాంతరంగా ప్రవహించి చాలా దూరం తర్వాత ప్రధాన నదిలో కలుస్తాయి. ఈ రకమైన సంగమ ప్రాంతాలను 'యాజూ సంగమాలు'గా పిలుస్తారు.

నదీ ముఖద్వారాలు

నదులు.. సముద్రాల్లో కలిసే ప్రాంతాల (నదీ ముఖద్వారాలు) వద్ద ఒండ్రుమట్టిని లోయల్లోనే నిక్షేపించడంతో శాఖోపశాఖలుగా చీలిపోతాయి. ఈ శాఖల మధ్య ఒండ్రుమట్టి నిక్షేపణం వల్ల ఏర్పడే మైదానాలను 'డెల్టాలు' అంటారు. ఇవి చాలా సారవంతమైనవి. అనాదిగా డెల్టా ప్రాంతాల్లో సాంద్ర వ్యవసాయం అభివృద్ధి చెందింది. గోదావరి నది రాజమండ్రికి దిగువ మూడు ప్రధాన పాయలుగా చీలిపోతుంది. ఈ పాయల మధ్య గోదావరి డెల్టా ఏర్పడింది. గంగా–హుగ్లీ–బ్రహ్మపుత్ర డెల్టా పక్షిపాద ఆకారంలో ఉంటుంది. కృష్ణా డెల్టా డిజిటేట్ తరగతికి, గోదావరి డెల్టా లోబేట్ రకానికి చెందింది. నర్మద, తపతి నదులు వాటి ముఖద్వారాల వద్ద కాకుండా శైథిల్య శిలా పదార్థాన్ని సముద్ర భూతలంపై నిక్షేపిస్తాయి. అందువల్ల అవి డెల్టాలను ఏర్పరచవు. వీటి ముఖద్వారాలను 'ఎస్చ్యురీలు'గా పిలుస్తారు.

హిమనీనదాలతో క్రమక్షయం..

కదిలే హిమ భాగాలనే హిమనీనదాలుగా పిలుస్తారు. ఇవి వేగంగా ప్రవహించే పర్వతీయ (లోయ) లేదా నెమ్మదిగా కదిలే విశాలమైన ఖండాంతర హిమనీనదాల రూపంలో ఉండవచ్చు. హిమనీనదాలు ఉత్పాతనం, అపఘర్షణ లేదా ఫ్రాస్ట్ వెడ్జింగ్ ప్రక్రియల ద్వారా పటల శిలలను శైథిల్యం చేస్తాయి. గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్, అంటార్కిటికా లాంటి ధ్రువ ప్రాంతాలు, ఆల్ప్స్–హిమాలయాల లాంటి ఎత్తైన పర్వత శిఖరాల ప్రాంతాల్లో హిమనీనద క్రమక్షయం ఉంది. ఉత్తర అమెరికాలోని మహా సరస్సుల ప్రాంతం, ఐరోపా, సైబీరియా హిమనీనద భూదృశ్యాలకు మంచి ఉదాహరణలు. శైథిల్య శిలా పదార్థాన్ని హిమనీనదాలు పరిమాణాన్ని అనుసరించి వేరు చేయకుండా నిక్షేపిస్తాయి. అంటే ఈ నిక్షేపాల్లో స్థూల, సూక్ష్మ రేణువులు గుట్టగా ఉంటాయి.

పర్వత వాలులపై ప్రవహించే హిమనీనదాలు లోతు తక్కువ ఉన్న విశాలమైన 'U' ఆకారపు లోయల ద్వారా ప్రవహిస్తాయి. వీటి క్రమక్షయ ప్రభావంతో పర్వత వాలుల వెంట పడక కుర్చీ ఆకారంలో ఉండే లోతైన గుంటలు ఏర్పడతాయి. వీటిని 'సర్క్' (Cirque) అంటారు. పర్వతం లేదా కొండ వివిధ వాలులపై వేర్వేరు హిమనీనదాలు ప్రవహిస్తూ సర్క్‌లను ఏర్పాటు చేస్తుంటాయి. వివిధ తలాలపై ఏర్పడిన సర్క్‌లు విశాలమై, క్రమంగా కొండను పదునైన అంచుతో కూడిన పిరమిడ్‌గా మారుస్తాయి. వీటిని ఏరెట్‌లు అంటారు. ఏరెట్‌లు మరింత క్రమక్షయం చెంది శృంగాకారంలోకి మారతాయి. వీటిని 'హార్న్'గా వ్యవహరిస్తారు. ఉదాహరణకు ఆల్ప్స్ పర్వతాల్లోని 'మాటర్ హార్న్' శృంగాలు మరింత హిమనీనద క్రమక్షయానికి లోనవడంతో కొండ దాదాపుగా అదృశ్యమై 'కనుమ'గా రూపొందుతుంది. హిమాలయాల్లోని కారంకోరం, షిప్కిలా, జోజిలా, బనిహాల్ కనుమలు ఈ కోవకు చెందినవే. ఖండ భాగాల్లో ప్రవహించే హిమనీనదాలు వాటి ప్రవాహ మార్గంలోని పెద్ద పెద్ద శిలలను క్రమక్షయం చేయడం వల్ల క్రాగ్ అండ్ టెయిల్, రోచె మౌంటేన్ లాంటి భూ స్వరూపాలు ఏర్పడతాయి. క్రాగ్ అండ్ టెయిల్‌లో కఠిన శిలా భాగం క్రమక్షయాన్ని నిరోధించడంతో నిట్రాలుగా ఏర్పడగా, మృదువైన శిలా భాగంలో తిన్నని వాలుగా ఏర్పడుతుంది. హిమనీ నది ప్రవాహ దిశలో శిలల తలాలపై అపఘర్షణ వల్ల అవి మృదువుగా తయారవుతాయి. పరాన్ముఖ దిశలో ఉత్పాతన వల్ల గరుకైన తలాలు ఏర్పడతాయి. ఈ రకంగా ఒకవైపు మృదు, ఇంకోవైపు గరుకైన తలాలతో కూడిన శిలలనే 'రోచెమౌంటేన్'గా పిలుస్తారు.

మొరైన్‌లు

హిమనీనదాలు శిలా పదార్థాన్ని తీసుకొచ్చి అనువైన ప్రాంతాల్లో నిక్షేపించడం వల్ల వివిధ రకాల భూ స్వరూపాలు ఏర్పడతాయి. రేఖీయంగా ఎత్తు తక్కువలో ఉండే దిబ్బల లాంటి హిమనీనద నిక్షేపాలను 'మొరైన్'లుగా పిలుస్తారు. ఇవి పొరలతో కాకుండా వివిధ పరిమాణాల రేణువులతో కూడి ఉంటాయి. కోడిగుడ్డు ఆకారంలో ఉండే నిక్షేపణా భూ స్వరూపాలను 'డ్రమ్లిన్లు' అంటారు. ఉత్తర ఐర్లాండ్ ప్రాంతంలో కొన్ని వేల సంఖ్యలో డ్రమ్లిన్‌లు వరసగా అమరి ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని 'ఎగ్ బాస్కెట్ కంట్రీ' అంటారు.

హిమనీనదాల అంత్య దశలో మంచు క్రమంగా కరిగి నీరుగా మారడం ప్రారంభమవుతుంది. అందువల్ల అంత్య దశలో హిమనీనదాల్లో మంచుతో పాటు నీరు కూడా ప్రవహిస్తుంది. దీంతో హిమనీనద క్రమక్షయానికి నదీ క్రమక్షయం కూడా తోడవుతుంది. నీటి ప్రక్రియ వల్ల హిమనీనదాల అంత్య దశలో రేఖీయంగా ఉండే పొడవైన దిబ్బల మాదిరిగా మెత్తని ఇసుక నిక్షిప్తమవుతుంది. ఈ ఇసుక దిబ్బలను 'ఎస్కర్లు'గా పిలుస్తారు. ఇవి కొన్ని కిలోమీటర్ల దూరం వ్యాపించి ఉంటాయి. ఇవి హిమనీనద లోయలకు సమాంతరంగా ఏర్పడతాయి. వీటిలో కేవలం సూక్ష్మ ఇసుక రేణువులు మాత్రమే ఉంటాయి.

ఎర్రాటిక్స్

తిన్నని వాలులతో కూడిన శంఖు ఆకారపు ఒండ్రుమట్టి దిబ్బలు కూడా హిమనీనద నిక్షేపణ వల్ల అంత్య దశలో ఏర్పడతాయి. వీటిని 'కేమ్స్'గా పిలుస్తారు. ఇవి సాధారణంగా హిమనీనద ముఖద్వారం వద్ద ఏర్పడతాయి. హిమనీనదాలు తమతో పాటు పెద్ద బండరాళ్లను చాలా దూరం తీసుకొచ్చి అంత్య దశలో నిక్షేపం చేస్తాయి. ఈ బండరాళ్లకు, స్థానిక శిలలకు పోలికలుండవు. వీటిని 'ఎర్రాటిక్స్' అంటారు. 'ఎర్రాటిక్స్' హిమనీనదాల ప్రయాణ దిశను సూచిస్తాయి. అంత్యదశలో మెత్తని గులకరాళ్లు, ఒండ్రుమట్టి నిక్షేపణం వల్ల ఏర్పడే సమతల మైదానాలను 'అవుట్ వాష్ మైదానాలు' అంటారు. వీటి ఏర్పాటులో నీరు కూడా ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ మైదానంలో హిమనీనదం అనేక చిన్న పాయలుగా చీలిపోతుంది. ఈ మైదానంలో ఉండే చిన్నచిన్న గుంటల లాంటి హరివాణాలను 'కెటిల్ రంధ్రాలు' అంటారు.

ఆల్ఫా, బీటా-ఇంటర్ ఫెరాన్‌లను ఉత్పత్తి చేసేవి ఏవి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో పోలియో వ్యాధి లక్షణం ఏది?
1) తలనొప్పి 2) జలుబు
3) ఒళ్లునొప్పులు 4) కండరాల పక్షవాతం
2. కింది వాటిలో వైరస్ ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులేవి?
1) పోలియో, తట్టు
2) గవదబిళ్లలు, జలుబు
3) కలరా, టైఫాయిడ్ 4) 1, 2
3. పెన్సిలిన్ అనేది ఒక:
1) సూక్ష్మ జీవి నాశకం 2) కీటక నాశకం
3) బయోఫెర్టిలైజర్ 4) పైవేవీకావు
4. మానవుడిలో ఆల్కహాల్ దేనిపై ప్రభావం చూపుతుంది?
1) హృదయం 2) కండరాలు
3) చర్మం 4) నాడీ మండలం
5. అయోడిన్ ఎక్కువ మొత్తంలో దేనిలో లభిస్తుంది?
1) పాలు 2) మాంసం
3) సముద్ర చేపలు 4) కూరగాయలు
6. సెల్యులోజ్‌కు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
1) ఆహారానికి బరువునిస్తుంది
2) ఖనిజ లవణం
3) ఆహార నాళంలో ఆహారం సులువుగా కదలడానికి తోడ్పడుతుంది
4) ఆహారంలో సెల్యులోజ్ లేకపోతే పూర్తిగా జీర్ణం కాదు
7. ఆహార వాహికలోని కండరాలు..?
1) నియంత్రిత కండరాలు
2) అనియంత్రిత కండరాలు
3) హృదయ కండరాలు
4) నియంత్రిత - అనియంత్రిత కండరాలు
8. కింది వాటిలో ఇనుము, ఇతర ఖనిజ మూలకాలు అధికంగా కలిగి ఉండేవి ఏవి?
1) పప్పు ధాన్యాలు 2) ఆకుకూరలు
3) మాంసం 4) బంగాళాదుంప
9. శ్వాసక్రియ కింది వాటిలో దేని సమక్షంలో జరుగుతుంది?
1) కాంతి 2) పత్రహరితం
3) సరైన ఉష్ణోగ్రత 4) తేమ
10. మానవుడి దేహంలో ఉండే కేంద్రక రహిత సజీవకణాలు ఏవి?
1) ఎర్ర రక్తకణాలు 2) తెల్ల రక్త కణాలు
3) నాడీకణాలు 4) కండర కణాలు
11. ఊపిరితిత్తులకు ఆమ్లజని రహిత రక్తాన్ని తీసుకుని వెళ్లే రక్తనాళం?
1) పుపుససిర 2) పుపుస ధమని
3) పూర్వ మహాసిర 4) దైహిక ధమని
12. దేనిలో అడ్డంకి ఏర్పడినప్పుడు గుండెపోటు సంభవిస్తుంది?
1) పుపుస ధమని
2) హృదయ/కరోనరీ ధమని
3) హృదయ సిర 4) పుపుస సిర
13. కింది వాటిలో సరికానిది ఏది?
1) రక్తం గడ్డకట్టకుండా ప్లాస్మా సేకరించవచ్చు
2) రక్తం గడ్డకట్టిన తరువాత సీరమ్‌ను సేకరిస్తారు
3) ప్లాస్మాలో ఉండే కొన్ని ప్రోటీన్లు సీరమ్‌లో ఉండవు
4) ప్లాస్మా నీలం రంగులో ఉండే ద్రవం
14. రక్త వర్గాలు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
1) రక్త వర్గాలను మొదట గుర్తించిన శాస్త్రవేత్త - కార్ల్ లాండ్ స్టీనర్
2) ఆర్బీసీలపై ఉండే ప్రతిజనకాలు ఎ, బి ఆధారంగా ఎ, బి, ఎబి, ఒ అనే నాలుగు రకాల వర్గాలను గుర్తించారు
3) ప్రతిజనకాలు లేని రక్త వర్గం - 'ఒ', ప్రతి రక్షకాలు లేని వర్గం - 'ఎబి'
4) పైవన్నీ సరైనవే
15. కింది వాటిలో కొంత మంది శిశువులు పుట్టిన వెంటనే మరణించడానికి కారణం ఏది?
1) ఆర్‌హెచ్ కారకానికి ప్రతిరక్షకాలు ఏర్పడడం
2) ఆర్‌హెచ్ కారకానికి ప్రతి జనకాలు ఏర్పడడం
3) పైరెండూ
4) ఏదీకాదు
16. డయాలసిస్ యంత్రం ఒక:
1) కృత్రిమ గుండె
2) కృత్రిమ ఊపిరితిత్తులు
3) కృత్రిమ కాలేయం
4) కృత్రిమ మూత్రపిండం
17. శరీరంలో 'యూరియా' ఏ భాగంలో ఉత్పత్తి అవుతుంది?
1) మూత్రపిండాలు 2) ఊపిరితిత్తులు
3) కాలేయం 4) పెద్దపేగు
18. హృదయ కండరం ఏ ప్రత్యేక లక్షణాన్ని కలిగి ఉంటుంది?
1) గ్లాని 2) లయ బద్ధత
3) సార్కొలెమ్మా 4) ఆకారం
19. అరేఖిత (నునుపు) కండరాలు ఏ భాగంలో ఉంటాయి?
1) మెడ 2) కాళ్లు-చేతులు
3) జీర్ణాశయం-మూత్రాశయం 4) వేళ్లు
20. వరి నారు మొక్కల్లో 'తెలివి తక్కువ మొలక' (Foolish Seedling Disease) వ్యాధికి కారణమయ్యేది?
1) వైరస్ 2) బ్యాక్టీరియా
3) శైవలం 4) శిలీంధ్రం
21. ఆల్ఫా, బీటా-ఇంటర్ ఫెరాన్‌లను ఉత్పత్తి చేసేవి ఏవి?
1) వైరల్ సాంక్రమిక కణాలు
2) మైక్రోఫేజ్‌లు
3) వైరస్లు
4) టి-కణాలు
22. పారిశ్రామికంగా ఇథనాల్‌ను ఉత్పత్తి చేయ డానికి ఉపయోగించే పదార్థాలు?
1) కార్బోహైడ్రేట్స్, మొలాసిస్
2) షుగర్ బీట్లు, దుంపలు
3) ద్రాక్ష 4) పైవన్నీ
23. చమురు కాలుష్యాన్ని నివారించడానికి ఉపయోగించే బ్యాక్టీరియా?
1) ట్రైకోమోనాస్ 2) సుడోమోనాస్
3) డైనోసోరాస్ 4) జాంతోమోనాస్
24. కింది వాటిలో సరికాని జత?
1) గ్లియోబ్లాస్టోమా - మెదడు
2) ఏంజియోసార్కోమా - రక్తం
3) లింఫోమా - ప్లీహం
4) ఎడినో సార్కోమా - గ్రంధి కణజాలం
25. ప్రకృతి వరణాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించిన వారెవరు?
1) డార్విన్
2) వీజ్‌మన్
3) హెచ్.బి. కెటిల్‌వెల్ 4) సింప్సన్
26. మొక్కలలో సంశ్లేషణ చేయని విటమిన్?
1) బి$_{12}$ 2) బి$_{6}$ 3) బి$_{1}$ 4) ఇ
27. కింది వాటిలో అత్యధిక జీవ వైవిధ్యాన్ని ప్రదర్శించే ఆవాసం ఏది?
1) ఎడారులు
2) సమశీతోష్ణ అడవులు
3) ఉష్ణమండల వర్షారణ్యాలు
4) గడ్డి మైదానాలు
28. జీవ అనుఘటకాలు అంటే..?
1) వినియోగదారులు మాత్రమే
2) వినియోగదారులు, ఉత్పత్తిదారులు, విచ్ఛిత్తికారులు
3) ఉత్పత్తి, వినియోగదారులు
4) ఉత్పత్తి దారులు మాత్రమే
29. 'జీవుల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం -కణం' అని పేర్కొన్న శాస్త్రవేత్త?
1) అరిస్టాటిల్ 2) రాబర్ట్ హుక్
3) ష్లైడెన్-ష్వాన్ 4) జార్జ్ మెండల్
30. కేంద్రక పూర్వ జీవుల కణంలో లోపించిన కణాంగాలు ఏవి?
1) క్రోమోజోమ్స్ 2) మైటోకాండ్రియా
3) ప్లాస్మాపొరంబ్రేన్ 4) రైబోజోమ్స్
31. 'అల్లం' మనం ఆహారంగా ఉపయోగించే భూగర్భకాండ రూపాంతరం. దీన్ని శాస్త్రీయంగా ఏమని పిలుస్తారు?
1) రైజోమ్ 2) కందం
3) దుంప 4) లశునం
32. జలగల పోషణ విధానం ఏది?
1) హెర్బివోరస్ 2) ఇనసెక్టివోరస్
3) కార్నివోరస్ 4) సాంగ్వివోరస్
33. లివర్ సిరోసిస్‌కి కారణం?
1) కొకైన్ 2) ఎల్ఎస్‌డీ
3) ఆల్కహాల్ 4) మార్ఫిన్
34. జన్యు ఇంజనీరింగ్ ప్రయోగాల్లో వాహ కాలుగా ఎక్కువగా ఉపయోగించే రెండు బ్యాక్టీరియాలు?
1) నైట్రోసోమోనాస్, క్లెబ్సియెల్లా
2) ఎశ్చరీషియా, అగ్రోబాక్టీరియమ్
3) నైట్రోబాక్టర్, అజటో బ్యాక్టర్
4) రైజోబియం, డిప్లోకోకస్
35. జతపరచండి.

శాస్త్రవేత్త	సిద్ధాంతం
i) డార్విన్	a) ఉపయుక్త- నిరుప యుక్త సూత్రం
ii) లామార్క్	b) జాతుల ఉత్పత్తి
iii) హ్యూగోడీవ్రీస్	c) జీవం ఆవిర్భావం
iv) ఎ.ఐ. ఒపారిన్	d) ఉత్పరివర్తన సిద్ధాంతం

1) i-a, ii-b, iii-c, iv-d
2) i-c, ii-a, iii-b, iv-d
3) i-b, ii-a, iii-d, iv-c
4) i-d, ii-c, iii-b, iv-a
36. కింది వాటిలో సరైంది?
ఎ) అధిక కిరణజన్య సంయోగక్రియ సామర్థ్యం ఉండటం వల్ల క్లోరెల్లా శైవ లాన్ని వ్యోమగాములు ఆక్సిజన్ కోసం అంతరిక్షానికి తీసుకెళ్తారు
బి) రైజోపస్ స్వయం పోషకాలే కానీ, సిపాల్పురాస్ పరాన్న జీవి శైవలం
సి) కణజాల వర్ధనంలో పోషక యానకాన్ని అర్ధ-ఘనస్థితికి మార్చడానికి ఉపయోగించే అగార్-అగార్ శైవలాల నుంచి సంగ్రహిస్తారు
1) ఎ, సి 2) బి, సి
3) ఎ, బి 4) ఎ, బి, సి
37. మిగతా జీవులతో పోల్చినప్పుడు మానవ మెదడులో ఏ భాగం బాగా అభివృద్ధి చెందింది?
1) మెదుల్లా అబ్లాంగేటా
2) అనుమస్తిష్కం
3) మస్తిష్కం
4) ధృష్టి లంబికలు
38. శ్వాసక్రియ, హృదయ స్పందన, పెరిస్టాలిక్ చలనం మెదడులో ఏ భాగం అధీనంలో ఉంటుంది?
1) మెదుల్లా అబ్లాంగేటా
2) మెదుల్లా అబ్లాంగేటా, మస్తిష్కం
3) మెదుల్లా అబ్లాంగేటా, అనుమస్తిష్కం
4) అనుమస్తిష్కం
39. సాధారణంగా వార్షిక వలయాలను లెక్కించి వృక్షాల వయసు చెప్పవచ్చు. కానీ, కింది ఏ వృక్షాల్లో వార్షిక వలయాలు ఏర్పడకపోవడం వల్ల వయసు లెక్కించలేం?
1) సమశీతోష్ణ ఆకురాల్చు అడవులు
2) సమశీతోష్ణ సతత హరిత అడవులు
3) ఉష్ణమండల ఆకురాల్చు అడవులు
4) ఉష్ణమండల సతత హరిత అడవులు
40. అసురక్షిత లైంగిక సంపర్కం వల్ల సంక్రమించే వ్యాధులు ఏవి?
1) సిఫిలిస్, గనేరియా
2) హెర్పిస్, ఎయిడ్స్
3) వైజైనైటిస్, ట్రైకోమోనియాసిస్
4) పైవన్నీ
41. కింది వాటిలో తెల్ల రక్త కణాలు కానివి?
1) న్యూట్రోఫిల్ 2) బేసోఫిల్
3) థ్రాంబోసైట్ 4) ఇసినోఫిల్
42. నిష్పత్త రక్త ప్రసరణ వ్యవస్థ దేనిలో ఉంటుంది?
1) చేప 2) బొద్దింక
3) ఆక్టోపస్ 4) నాటిలస్
43. విచ్ఛిత్తికరణ బ్యాక్టీరియా ఏది?
1) రైజోబియం 2) అనబీనా
3) నాస్టాక్ 4) సూడోమోనాస్
44. జతపరచండి.

కల్చర్	
i) ఆగ్రోఫ్లోరికల్చర్	ii) టిష్యూకల్చర్
iii) పోమీకల్చర్	iv) ఒలెరికల్చర్

వివిధ రకాల మొక్కల పెంపకం
a) కూరగాయలు
b) కలపనిచ్చే మొక్కలు
d) ఉద్యానవన మొక్కలు
c) ఫలాలిచ్చే మొక్కలు
e) పరీక్ష నాళికలో మొక్కలు
1) i-b, ii-e, iii-c, iv-a
2) i-b, ii-e, iii-a, iv-c
3) i-e, ii-b, iii-a, iv-c
4) i-a, ii-b, iii-c, iv-d
45. గ్లూకోజ్‌ను ఏమని పిలుస్తారు?
1) గ్రేప్ షుగర్ 2) ఫ్రూట్ షుగర్
3) లెవ్యులోజ్ 4) ఫ్రక్టోజ్
46. ద్విదార దంత విన్యాసం, థీకోడాంట్, విషమ దంతత్వ సాధారణంగా ఏ జీవుల్లో ఉంటుంది?
1) చేపలు 2) సరీసృపాలు
3) ఉభయచరాలు 4) క్షీరదాలు
47. శరీర జీవ క్రియారేటును నియంత్రించే ముఖ్యమైన అంతస్రావ గ్రంథి ఏది?
1) పీనియల్ గ్రంథి
2) థైరాయిడ్ గ్రంథి
3) పిట్యూటరీ గ్రంథి
4) ఎడ్రినల్ గ్రంథి
48. ప్రొకారియోట్ జీవుల్లో ఉండే 70S రైబోసోమ్‌ల ఉపప్రమాణాలు?
1) 40S - 40S 2) 60S - 40S
3) 50S - 30S 4) 50S - 50S
49. అవయవదానం చేసే సమయంలో గ్రహీతకు ఇచ్చే సైక్లోస్పోరిన్ ఔషధాన్ని దేని నుంచి తయారు చేస్తారు?
1) బ్యాక్టీరియా 2) ఫంగస్
3) వైరస్ 4) మొక్కలు
50. కింది గృహ సంబంధ కాలుష్య కారకాల్లో ఎక్కువ రసాయన కాలుష్యాన్ని కలుగజేసేది ఏది?
1) బొగ్గును మండించడం
2) వంటగ్యాస్ మండించడం
3) మస్కిటోకాయిల్స్‌ను మండించడం
4) రూమ్ స్ప్రేలు
51. ప్రధానవ్యాప్తంగా ధ్వని కాలుష్యానికి అతి ముఖ్యమైన కారణం?
1) సంగీత పరికరాలు
2) రవాణా వ్యవస్థ
3) రేడియో, వస్త్రాలు, పేపర్ మిల్లులు
4) నూనె శుద్ధి కర్మాగారాలు, థర్మల్ పవర్ ప్లాంట్స్
52. సిగరెట్ పొగలోని పాలిసైక్లిక్ అరోమాటిక్ హైడ్రోకార్బన్లు ఎలాంటి ప్రభావం చూపిస్తాయి?
1) ఆక్సిజన్ రవాణాను తగ్గిస్తాయి
2) రక్తపీడనం పెంచుతాయి
3) క్యాన్సర్‌కు కారకమవుతాయి
4) పెండం పెరుగుదల తగ్గిస్తాయి
53. 'వాతావరణ కాలుష్య సూచికలు' అని వేటిని పిలుస్తారు?
1) లైకెన్లు, మాస్ మొక్కలు
2) డాఫ్నియా
3) ఖైరోనోమస్ లార్వా
4) పైవన్నీ
54. ఆహారంగా ఉపయోగపడే మొక్కలోని భాగాలకు సంబంధించి కింది వాటిలో సరైన జత ఏది?
ఎ) క్యారెట్ - భూగర్భకాండం
బి) అల్లం - ఫలం
సి) కాఫీ - పుష్పవృంతం
డి) కాస్ట్రాన్ (కుంకుమ పువ్వు)- కీలాగ్రం
1) ఎ, డి 2) ఎ, బి
3) సి, డి 4) ఎ, బి, సి, డి
55. కింది వాటిలో సరికాని జత?

ఎముక పేరు	ఉండే భాగం
ఎ) హ్యూమరస్	- భుజాస్థి
బి) రేడియస్ అల్నా	- మోకాలు
సి) పాటెల్లా	- కపాలం
డి) ఫీమర్	- తొడ ఎముక

1) ఎ, బి, సి, డి 2) ఎ, బి
3) బి, డి 4) బి, సి
56. కింది వాటిలో సరైన జత ఏది?
ఎ) పేలినాలజీ - పరాగ రేణువుల అధ్యయన శాస్త్రం
బి) పేలియోంటాలజీ - శిలాజాల అధ్యయన శాస్త్రం
సి) డెండ్రాలజీ - వృక్షాల అధ్యయన శాస్త్రం
డి) డెండ్రోకొనాలజీ - వృక్షాల వయసు నిర్ధారించే శాస్త్రం
1) ఎ, డి 2) బి, సి
3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

సమాధానాలు

1) 4	2) 4	3) 1	4) 4	5) 3
6) 2	7) 4	8) 2	9) 3	10) 1
11) 2	12) 2	13) 4	14) 4	15) 1
16) 4	17) 3	18) 2	19) 3	20) 4
21) 1	22) 4	23) 2	24) 4	25) 3
26) 1	27) 3	28) 2	29) 3	30) 2
31) 1	32) 4	33) 3	34) 2	35) 3
36) 4	37) 3	38) 1	39) 4	40) 4
41) 3	42) 2	43) 4	44) 1	45) 1
46) 4	47) 2	48) 3	49) 2	50) 1
51) 2	52) 3	53) 4	54) 3	55) 4
56) 4				

At least some pens are books

BANK EXAMS

REASONING

Model Questions

Directions (Q. No. 1-10): In each question below are given two statements followed by two conclusions numbered I and II. You have to take the given statements to be true even if they seem to be at variance with commonly known facts. Read the following statements and then decide which of the given conclusions logically follows from the given statements, disregarding commonly known facts.

Give answer
1) If only conclusion I follows.
2) If only conclusion II follows.
3) If either conclusion I or II follows.
4) If neither conclusion I nor II follows.
5) If both conclusions I and II follow.

1. **Statements:** No bird is a crow. Some crows are black.
Conclusions:
I) At least some birds are black.
II) Some black which are crows are definitely not birds.
2. **Statements:** No pastry is a cake. No cake is tasty.
Conclusions:
I) All pastries are tasty.
II) Some pastries being tasty is a possibility.
3. **Statements:** All towns are cities. Some cities are urban.
Conclusions:
I) At least some towns are urban.
II) No town is urban.
4. **Statements:** All cars are black. All blacks are beautiful.
Conclusions:
I) All cars are beautiful.
II) At least some beautiful things are black.
5. **Statements:** Some parrots are green. Some birds are parrots.
Conclusions:
I) At least some birds are green.
II) All parrots being bird is a possibility.
6. **Statements:** Some cats are dogs. All dogs are foxes.
Conclusions:
I) At least some cats are foxes.
II) All foxes being cats is a possibility.
7. **Statements:** All books are pens. No pen is a pencil.
Conclusions:
I) Some books being pencils is a possibility.
II) At least some pens are books.
8. **Statements:** All students are teachers. All teachers are readers.
Conclusions:
I) All readers may be teachers.
II) Some readers can never be teachers.
9. **Statements:** No cup is a plate. No plate is a coin.
Conclusions:
I) No cup is a coin.
II) Some coins are cups.
10. **Statements:** Some boys are honest. Some intelligent are boys.
Conclusions:
I) All honest being intelligent is a possibility.
II) All boys are not intelligent.
11. If 'R' denotes '–'; 'Q' denotes '×'; 'W' denotes '+'; and 'A' denotes '+', then
42 W 7 R 8 A 6 Q 4 = ?
1) –22 2) –168 3) 22
4) 28 5) None of these
12. Mohan walked 30 metres towards South, took a left turn and walked 15 metres. He then took a right turn and walked 20 metres. He again took a right turn and walked 15 metres. How far is he from the starting point?
1) 95 metres 2) 50 metres
3) 70 metres
4) Cannot be determined
5) None of these
13. What should come next in the following letter series based on English alphabet?
CEA IKG OQM ?
1) STW 2) WUS 3) SWU
4) UWS 5) None of these
14. The positions of how many digits in the number 59164823 will remain unchanged after the digits are rearranged in descending order within the number?
1) None 2) One 3) Two
4) Three 5) More than three
15. What should come next in the following letter series?
P Q R S T A B C D E P Q R S A B C D E P Q R S A B C D P Q
1) R 2) T 3) A
4) B 5) None of these
16. In a certain code language, 'how can you go' is written as 'ja da ka pa', 'can you come here' is written as 'na ka sa ja' and 'come and go' is written as 'ra pa sa'. How is 'here' written in that code language?
1) ja 2) na 3) pa
4) Data inadequate
5) None of these
17. How many such pairs of letters are there in the word TRIBUNAL each of which has as many letters between them in the word as in the English alphabet?
1) None 2) One 3) Two
4) Three
5) More than three
18. In a certain code DOWN is written as '5@9#' and NAME is written as '#6%3'. How is MODE written in that code?
1) %653 2) %@63
3) %5@3 4) %@53
5) None of these
19. How many meaningful English words can be formed with the letters 'LGEU' using each letter only once in each word?
1) None 2) One 3) Two
4) Three
5) More than three
20. In a certain code THRIVES is written as SIUHRDU. How is SOULFUL written in that code?
1) VPTKKTE 2) VPTKETK
3) TPVKKTE 4) TNRKMVG
5) None of these

Explanation

1. 2;


Only II follows.

2. 2; Possible Venn-diagram is


Thus only II follows.

3. 3; Possible Venn-diagrams are


Thus, either I or II follows.

4. 5;


Thus, both I and II follow.

5. 2; Possible Venn-diagram are


Thus, only II follows.

6. 5; A possible venn-diagram is


Both I and II follow.

7. 2; A possible venn-diagram is


Only II follows.

8. 1; A possible venn-diagram is


Thus, only I follows.

9. 3;


Thus, either I or II follows.

10. 1; A possible Venn-diagram is


Thus, I follows.

11. 3; 42+7–8+6×4 = 6–8+24 = 22
12. 2;
13. 4; Move six letters forward respectively.
14. 3; digits 4 and 2
The number: 5 9 1 6 4 8 2 3
In descending Order: 9 8 6 5 4 3 2 1
15. 1; PQRST/ABCDE/PQRS/ ABCDE/PQRS /ABCD/PQR
16. 2; how can you go = ja da ka pa ... (i)
can you come here = na ka sa ja ... (ii)
come and go = ra pa sa ... (iii)
From (i) and (ii), can you = ja ka .... (iv)
From (ii) and (iii), come = sa ... (v)
Using (iv) and (v) in (ii), we get here = na.
17. 5;
T R I B U N A L
18. 4;
D O W N A M E
5 @ 9 # 6 % 3
∖ MODE ⊳ % @ 5 3
19. 2; GLUE
20. 1;